

Presented to

By

On the occasion of

# *Ateendriya kathalu*

(A collection of translated short stories, originally appeared in *Vipula, Nadi, Chitra* monthlies; *Andhra Bhoomi, Saakshi* Sunday Supplements and *Nadi Vaaram Vaaram* weekly)

**Translator**

**Malladi Venkata Krishna Murthy**

1-1-729, Gandhi Nagar

Hyderabad - 500 080

**First edition**

**September 2016**

**Published by**

Lipi Publications

Gandhi Nagar, Hyderabad - 500 080

E-mail:- tamaswini@gmail.com

**Mobile: 98490 22344**

(Subject to Hyderabad jurisdiction only)

**Price**
Rs.145

**Cover design**

Pixelbazaar.in, Hyderabad

**Printers**

Sri Sarada Printers, Hyderabad

# అతీంద్రియ కథలు

(అనువాద కథలు)

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

లిపి పబ్లికేషన్స్

గాంధీనగర్, హైద్రాబాద్ 500 080

# అతీంద్రియ కథా క్రమం


1. గ్రహాంతర అతిథులు 5
2. మృత్యు స్వప్నం 11
3. నువ్వెవరు? 25
4, సేల్స్‌మేన్ 33
5. అద్భుతం 44
6. ఫొటో 49
7. చాటు ప్రదేశం 56
8. నాలుగు వరాలు 62
9. హంతకుడు ఎవరు? 70
10. సహాయకారి 81
11. ఎక్స్-20 89
12. చావుకళ 93
13. అదృష్టదేవత 100
14. అమ్మ చేసిన బొమ్మలు 109
15. వెంటనే రా 113
16. పీడ కల 119
17. ఎవరది? 122
17. మిస్టర్ డెత్ 124
18. అవసరమైనవి అమ్మబడును 129
19. దిద్దుబాటు 135



పుస్తక ప్రియులు మల్లాది వెంకట కృష్ణమూర్తి
రచనలని ఈ కింది లిపి పబ్లికేషన్స్ నంబర్‌కి
ఫోన్ చేసి/వాట్స్‌యాప్ ద్వారా ఆర్డర్ చేయచ్చు.

98490 22344

# అతీంద్రియ కథలు

## గ్రహాంతర అతిథులు

**-డేమన్ నైట్**

యుద్ధం, క్షామం లేని భూగోళం సాధ్యమా?

**యునైటెడ్ నేషన్స్** భవంతి పైన తిరిగే ఫ్లయింగ్ సాసర్‌ని అప్పటికే చాలామంది చూసారు. ఆ ఫ్లయింగ్ సాసర్ నించి సమాచారం అందుకున్న యు.ఎన్.ఓ సెక్రటరీ జనరల్ అత్యవసర సమావేశానికి తమ సభ్యత్వ దేశాల ప్రతినిధులని ఆహ్వానించాడు. ఆ హాల్లోని వారు అది దేని గురించి అని ఒకరితో మరొకరు గుసగుసలాడుకుంటున్నారు. టి.వి కెమేరామెన్, అంతర్జాతీయ పత్రికా విలేకరులు ఆ సందర్భాన్ని కవర్ చేస్తున్నారు. అంతరిక్షం నించి భూమి మీదకి వచ్చిన జీవుల గురించిన ప్రకటన వెలువడవచ్చని చాలామంది ఊహించారు.

సభ ఆరంభం కాగానే సెక్రటరీ జనరల్ వారితో ఇలా చెప్పాడు.

"ఈ ఉదయం పదకొండు గంటలకి తమని 'కానమిట్స్'గా పిలుచుకునే గ్రహాంతరవాసులు భూమి మీదకి దిగారు. న్యూజెర్సీ లోని నెవార్క్‌లో ఈస్టన్ స్టాండర్డ్

టైం ఉదయం పదకొండు ఇరవై నిమిషాలకి వారిని కనుగొన్నాము. నార్వే, సోవియెట్ యూనియన్, ఫ్రాన్స్ దక్షిణ తీరం. రియో డి జనిరో శివార్లు, ఇంకా ఇలా అనేక చోట్ల వీరు దిగారు. ఈ సమయంలో కానమిట్స్ మనకి శత్రువులని నేను చెప్పలేను. ఇందువల్ల ప్రపంచ ప్రజలంతా శాంతిగా ఉండాలని ప్రార్ధన. అన్ని దేశాల ప్రభుత్వాలకి జరిగేది ఎప్పటికప్పుడు తెలియచేసే ఏర్పాటు చేసాం."

"వాళ్ళు ఎలా ఉంటారు?" స్పెయిన్ సభ్యుడు ప్రశ్నించాడు.

"ఇందాకే వారు ఈ భవంతి మీదకి దిగారు. వారి ప్రతినిధి ఒకరు ఇప్పుడు ఇక్కడికి రాబోతున్నారు."

దుబాసీలు అక్కడ మాట్లాడేది అన్ని అంతర్జాతీయ భాషల్లోకి అనువదిస్తున్నారు. ప్రతీ దేశం వారు దాన్ని శ్రద్ధగా వింటున్నారు.

కొద్ది నిమిషాల తర్వాత తలుపు తెరచుకుని వచ్చిన గ్రహాంతరవాసిని అంతా ఆసక్తిగా చూసారు. తొమ్మిది అడుగుల పొడవు, దాదాపు నూట ఎనభై కిలోల బరువు గల అతని మొహం కోలగా, పొడుగ్గా ఉంది. గుండు. బంగారం రంగు మెరిసే వస్త్రాలని ధరించాడు. అతను చేతిలోని కాగితాన్ని చూస్తూ చదివాడు.

"లేడీస్ అండ్ జెంటిల్‌మెన్. మీ అందరికీ శాంతి, స్నేహపూర్వక అభినందనలు. మేము ఈ పాలపుంతకి అవతల గల పాలపుంత నించి మీ మిత్రులుగా వచ్చాము. నా పెదవులు కదలకపోవడం మీరు గమనించచ్చు. మేము కంఠం ద్వారా కాక ఆలోచనా తరంగాల ద్వారా సంభాషిస్తూంటాం. మీ భాష మాకు క్షుణ్ణంగా తెలుసు. నేను యంత్ర సహాయంతో దీన్ని మీ భాషలో వినిపిస్తున్నాను. మీ దగ్గరకి రావడానికి గల మా ఉద్దేశాలు గౌరవప్రదమైనవి. భూమి మీద ఓ ఎంబసీని స్థాపించాలని, భవిష్యత్‌లో మీ గ్రహానికి మా రాకపోకలు సాగాలని మా కోరిక."

ప్రపంచవ్యాప్తంగా రేడియో, టి,విలలో ప్రసారం అయ్యే ఆ ఉపన్యాసాన్ని కోట్ల మంది వింటున్నారు. చూస్తున్నారు.

"మీ భూ వాసులు రాక్షసుల్లా ప్రవర్తించడం చూస్తున్నాం. మాది స్నేహం, శాంతి భాష. మాలో మేము ఎన్నడూ యుద్ధాలు చేసుకుని ఒకర్ని మరొకరు చంపుకోలేదు. నేను చెప్పాల్సింది ముగిసింది. మీరు ఇక ప్రశ్నలు అడగచ్చు."

అర్జెంటీనా ప్రతినిధి లేచి అడిగాడు.

"సెనార్! మీరు మా గ్రహాన్నే ఎందుకు ఎన్నుకున్నారు?"

"ఒక్క భూగోళంలోనే సహజమైన, అసహజమైన వినాశనాలు జరుగుతున్నాయి. వీటిలో చాలా భాగం తప్పించ గలిగినవే. మీకా విషయంలో సహాయం చేయడానికి ఇక్కడికి వచ్చాం."

తర్వాత ఫ్రాన్స్ సభ్యుడు ప్రశ్నించాడు.

"మాన్సూర్. మీరు ఏ విధమైన సహాయం చేస్తారు?"

"మేము ఏ విషయంలో మిమ్మల్ని బలవంతం పెట్టం. మీకు ఏది ఆసక్తి ఉంటే అదే తీసుకోవచ్చు. ఉదాహరణకి రేపు కేవలం కొన్ని డాలర్ల ఖర్చుతోనే ఈ దేశం మొత్తానికి వైర్లు లేకుండా ఎలక్ట్రిసిటీని ఎలా అందించచ్చో ప్రదర్శిస్తాము."

తర్వాతి ప్రశ్న సోవియట్ యూనియన్ ప్రతినిధి అడిగాడు.

"భూగోళం మీద మాకు చెప్పకుండా దాచిన ఆసక్తి మీకు లేదని ఎలా నమ్మడం?"

"త్వరలోనే మీరు నేను చెప్పింది నిజమని గ్రహిస్తారు. ఉదాహరణకి ఓ ప్రత్యేక నైట్రేట్‌ని భూమిలో కలిపి భూమి మీద క్షామం లేకుండా చేయగలం. కంటికి కనపడని గోడని నిర్మించి, బాంబులు కాని, తుపాకీ గుళ్ళు కాని దాన్ని దాటకుండా చేయగలం."

అతని చేతిలోని పుస్తకం మీది లిపి అతి కొత్తది. చాలా కెమేరాలు దాన్ని ఫొటో తీసాయి.

* * *

మర్నాడు ఉదయం ప్రపంచంలోని అన్ని దిన పత్రికల్లో ఇదే వార్త చోటుచేసుకుంది. ది డైలీ క్రానికల్‌లో 'కానమిట్స్ కొత్త యుగానికి మాట ఇచ్చారు' అని, ప్రెస్ హెరాల్డ్‌లో 'కానమిట్స్ శాంతిని, అభివృద్ధిని అందించబోతున్నారు' అని... ఇలా అన్ని దినపత్రికల్లో మొదటి పేజీల్లో వీరి గురించిన వార్తలు వచ్చాయి.

ప్రపంచ ప్రజలంతా ఆనందపడే ఆ సమయంలో అమెరికా గూఢచారి సంస్థ సిఐఏ హెడ్‌క్వార్టర్స్‌లోని క్రిప్టోగ్రాఫర్స్ (డీకోడ్ నిపుణులు) మాత్రం ఆందోళనగా ఉన్నారు. కానమిట్స్ వెళ్ళిపోయేప్పుడు వదిలి వెళ్ళిన ఓ కొత్త లిపి గల పుస్తకం ఆ విభాగానికి చేరింది. డీ కోడింగ్ నిపుణుడు ఛాంబర్స్‌ని ఓ కల్నల్ అడిగాడు.

"ఏం తెలుసుకున్నారు."

"ఇది కళ్ళనొప్పిని, తల నొప్పిని ఇస్తుందని తెలుసుకున్నాను." అతను నవ్వుతూ జవాబు చెప్పాడు.

"వారి భాషని కనుక్కోలేమా?"

"ఎనిమిది గంటల్లో కనుక్కోలేక పోయాం. జపనీస్ కోడ్‌ని కనుక్కోడానికి మాకు సంవత్సరం పట్టింది. ఇది గ్రహాంతర వాసుల భాష. ఇది బహుశ మనకన్నా ఐదున్నర రెట్ల మేథస్సుతో ఏర్పడ్డ భాషై ఉండచ్చు. మేమంతా మిగతాదంతా పక్కన పెట్టి దీన్ని కనుక్కోడానికే ప్రయత్నం చేస్తున్నాం.క్రిప్టోగ్రఫీలో మాకు తెలిసిన అన్ని పద్ధతుల ద్వారా పరీక్షించాం. మేము డీకోడింగ్‌కి దగ్గరగా వచ్చామో లేక పది లక్షల మైళ్ళ దూరంలో ఉన్నామో మాకు తెలీదు."

"అంటే ఇది మీ వల్ల కాదా?" కల్నల్ నిరుత్సాహంగా అడిగాడు.

"ప్రతీ కోడ్‌ని ఛేదించేదాకా మేము దాన్ని ఛేదించగలమో లేదో తెలీదు. రివర్సల్ మెథడ్, రేండమ్ మెథడ్, స్టాండర్డ్, డైరెక్ట్, సిస్టమేటికల్లీ మిక్స్‌డ్, కీ వర్డ్ మిక్స్, రెసిప్రోకల్, కాంజుగేట్... ఇలా కోడ్‌లో అనేక పద్ధతులు ఉంటాయి. అవన్నీ ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇది కష్టమైంది అనిపిస్తోంది."

సరిగ్గా ఆ సమయంలో పక్క గదిలోంచి పేటీ ఓ కాగితాన్ని తెచ్చిచ్చి ఆనందంగా చెప్పింది.

"పుస్తకం పేరుని కనుక్కోగలిగాను. ఎలా డీకోడ్ చేయాలో ఓ దారి దొరికింది."

"వెరీ గుడ్. మనం మళ్ళీ మాట్లాడదాం." ఛాంబర్స్ చెప్పాడు.

ఆ కాగితం మీద ఇంగ్లీష్‌లో 'టు సర్వ్ మేన్' అని రాసి ఉంది.

* * *

మర్నాడు ఆ గ్రహాంతర వాసికి లై డిటెక్టర్ టెస్ట్ చేసి, అతను చెప్పేది నిజమే అని శాస్త్రజ్ఞులు నిర్ణయించారు.

* * *

కొన్ని నెలలు గడిచాయి. అరబ్ ఎడారులన్నీ పంటపొలాలుగా మారాయి. ప్రతీ దేశం మిలటరీని తొలగించేసింది. గ్రహాంతరవాసులు చెప్పిన మాటలు నిజం అయ్యాయి. భూగోళం లోని ప్రజలంతా ఆనందంగా ఆరోగ్యంగా ఉన్నారు. గ్రహాంతర వాసులకి అన్ని దేశాల ప్రతినిధుల నించి వారి భాషల్లో కృతజ్ఞతలని తెలియ చేసే లేఖలు అందచేయబడ్డాయి. కానమిట్స్ తమ గ్రహానికి రాకపోకల ఏర్పాట్లని చేబట్టారు.

* * *

కానమిట్స్ అధ్వర్యంలో న్యూయార్క్‌లో ఓ ప్రత్యేక రన్‌వేని నిర్మించారు. తమ గ్రహానికి పర్యాటకులుగా వచ్చే వారికి వీసాలని కూడా మంజూరు చేసారు. అందుకు

కనీస శారీరక బరువే అర్హత. అక్కడికి వెళ్ళడానికి చేంతాడంత క్యూ రిజిస్టర్ అయింది. పదమూడు వందల మంది ప్రయాణించడానికి అనువైన ప్రత్యేక వాహనం వారి గ్రహం నించి వచ్చి సిద్ధంగా ఉంది.

ఆ రోజు మొదటి సారిగా పర్యాటకులతో వాహనం బయలు దేర బోతోంది. దాన్ని పత్రికా విలేకరులు, టి.వి కెమేరామెన్ కవర్ చేస్తున్నారు. ప్రయాణీకులు ఒకొక్కరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అందరి మొహాల్లో ఆనందం కనిపిస్తోంది.

"ఆ గ్రహంలో వాతావరణం సదా ఇరవై ఐదు డిగ్రీల సెల్సియస్ ఉంటుందిట." ఒకామె తోటి ప్రయాణీకుడితో చెప్పింది.

"సూర్యుడు ఎప్పుడూ అస్థమించడట." అతను చెప్పాడు.

"వారి దుస్తులు కూడా ఏదో లోహంతో చేసినవి. అందంగా ఉండటమే కాక ఉతకాల్సిన అవసరం కూడా లేదట." మరొకావిడ చెప్పింది.

"బంగారం కన్నా వెలిగిపోతున్నాయి."

"మనం అక్కడికి చేరుకున్నాక వారి దుకాణాలకి కండక్టెడ్ టూర్‌లో తీసుకు వెళ్తారట. బరువు సమస్య లేకుండా భూగోళానికి ఎంతైనా తీసుకు రావచ్చుట."

ఇలా ప్రయాణీకులంతా తాము విన్న సంగతులని ఒకరితో మరొకరు ఉత్సాహంగా ముచ్చటించుకుంటున్నారు.

"కోట్ల కొలదీ మైళ్ళ దూరం ప్రయాణించడానికి కొన్ని రోజులే పడుతుందిట. అసలు ప్రయాణిస్తున్నట్లుగానే అనిపించదట. మన విమానంలోలా కాక లోపల కుదుపులు ఉండవు. నిశ్శబ్దంట."

"నాకు అక్కడ బావుంటే తిరిగి రాను."

గేట్ తెరవగానే ఒకొక్కరు వాహనంలోకి వెళ్ళే ముందు ఓ గ్రహాంతర వాసి వారి బరువుని చూసి లోపలకి వదులుతున్నాడు.

* * *

అక్కడికి సమీపంలోని సిఐఏ ఆఫీస్‌లోని క్రిప్టోగ్రఫీ విభాగంలోని ఛాంబర్స్ పేటీ గదిలోకి వచ్చి చెప్పాడు.

"ఇంకొద్ది నిమిషాల్లో నేను కూడా వారి గ్రహానికి బయలుదేరుతున్నాను. తిరిగి వచ్చాక బహుశ మనం దీన్ని డీకోడ్ చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు. అక్కడ వారి భాషని త్వరగా నేర్చుకుంటాను."

“ఈ గ్రహాంతర అతిథుల దయ వల్ల ఇక మీదట భూమి మీద సైన్యం, క్షామం, న్యూక్లియర్ బాంబ్ లాంటివి ఉండవు కాబట్టి నాకు హాయిగా నిద్ర పడుతుంది.” పేటీ చెప్పింది.

“నాకోటి వింతగా ఉంది. భూగోళం మీది ప్రజలందరికీ తమ గోళాన్ని చూపించాలని అనుకుంటున్నారు. ఎంతమంది ప్రయాణ ఖర్చులని భరించగలరు? అంతరిక్షంలో పది వేల కోట్ల మైళ్ళ దూరంలోని ఆ గ్రహానికి వెళ్ళడానికి సంవత్సరం తర్వాత ఇంకా డిమాండ్ పెరిగేలా ఉంది.” ఛాంబర్స్ లేచి కోడ్ మెషెన్ స్విచ్‌లని ఆఫ్ చేసాడు.

“మీరు తిరిగి వచ్చే దాకా నేనింకా దీన్ని డీకోడ్ చేసే ప్రయత్నం చేస్తూనే ఉంటాను.” పేటీ చెప్పింది.

“సరే. నేను బయలు దేరుతాను.” ఛాంబర్స్ చెప్పాడు.

* * *

“ఇది ఫ్లైట్ నంబర్ 914. భూమి నించి మా గ్రహానికి ఇది మూడు నిమిషాల్లో బయలు దేర బోతోంది.” డిపార్చర్ లాంజ్‌లోని లౌడ్ స్పీకర్ లోంచి ప్రకటన వినిపించింది.

ఆఖరి ప్రయాణీకుడిగా ఛాంబర్స్ ఆ విమానం మెట్ల మీంచి పైకి ఎక్కుతున్నాడు. పేటీ హడావిడిగా డిపార్చర్ లాంజ్ లోపలకి వచ్చి పిలిచింది.

“మిస్టర్ ఛాంబర్స్.”

అతను వెనక్కి తిరిగి ఆమెని చూసి వీడ్కోలుగా చేతిని ఊపాడు.

“ఆ విమానం లోకి ఎక్కకండి.” అరిచింది.

“ఎందుకని?” ఛాంబర్స్ ప్రశ్నించాడు.

“టు సర్వ్ మేన్ అంటే... అది నరమాంస భక్షకుల వంటల పుస్తకం.”

ఛాంబర్స్ వెంటనే వెనక్కి తిరిగాడు. కాని ఆ మాటలు విన్న కింద ఉన్న గ్రహాంతరవాసి బలవంతంగా అతన్ని వాహనంలోకి నెట్టాడు. తర్వాత ఆ తొమ్మిది అడుగుల వ్యక్తి పేటీని కూడా పట్టుకుని లోపలకి లాక్కెళ్ళాడు.

మెట్లు లోపలకి మూసుకోగానే ఆ గుండ్రటి స్పేస్ షిప్ ఆకాశంలోకి ఎగిరిపోయింది.

# మృత్యు స్వప్నం

**–స్టెఫానీ కే బెండెల్**

**మంచు పడే కాలంలో గులాబులు పూస్తాయా?**

**అపరాధ పరిశోధకుడిగా** నేను ఎన్నటికీ మర్చిపోలేని కేస్ హెలెన్ లాసన్‌ది. ఆ రోజు నా సెక్రటరీ నాతో ఇంటర్‌కంలో చెప్పింది.

“మిస్టర్ ఫైన్. మిమ్మల్ని కలవాలని ఒకామె వచ్చింది. మీతో ఆమెకి ఇప్పుడు అపాయింట్‌మెంట్ లేదు. కాని చాలా బాధలో ఉన్నట్లుంది. మీరామెని కలిస్తే మంచిది.”

“అలాగే.” ఒప్పుకున్నాను.

హెలెన్ లాసన్ వయసు నలభై అయిదు ఉండచ్చు. కొద్దిగా లావుగా ఉన్నా అది ఆకర్షణీయమైన లావు. ఆమె దుస్తులు ఖరీదైనవి.

“మిస్టర్ ఫైన్. నా భర్త నన్ను చంపబోతున్నాడు.” ఆమె మృదువుగా చెప్పింది.

“మీ భర్త మిమ్మల్ని చంపే ప్రయత్నం చేస్తున్నాడా?” అడిగాను.

“లేదు. చంపబోతున్నాడు.”

“ఎప్పుడు? మీరు పూర్తి వివరాలు చెప్తే బావుంటుంది.” సూచించాను.

“మీరు జరగబోయేవి కలల్లో కన్పించడాన్ని నమ్ముతారా?”

“మీ భర్త మిమ్మల్ని చంపబోతున్నాడనే కల మీకు వచ్చిందా?”

“నాకీ కల గత రెండు నెలలుగా వారానికి ఓసారి వస్తోంది. నా భర్త ఛార్లెస్ నాకు ఇష్టం లేదని తెలిసినా నాతో బలవంతంగా ఆరెంజ్ జూస్‌ని తాగిస్తున్నాడు. నేను తాగనంటే అతని మొహం కోపంతో ఎర్రబడుతుంది. బలవంతంగా తాగిస్తాడు.”

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తన హేండ్ బేగ్‌ని తెరచి అందులోంచి ఖరీదైన ఆడవాళ్ళ చేతి రుమాలుని తీసి కన్నీటిని తుడుచుకుంది. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదా? అనే అనుమానం నాలో కలిగింది.

“మీకు వచ్చే కల సాధారణ కల ఎందుకు కాకూడదు?” ప్రశ్నించాను.

“నా ఎనిమిదో ఏట నించి నాకు జరగబోయేవి కలల్లో కనిపిస్తున్నాయి. నా ఎనిమిదో ఏట మొదటిసారిగా నా రెండో మేనమామ కారు ఏక్సిడెంట్‌లో మరణించినట్లుగా నాకో కల వచ్చింది. రెండు వారాల తర్వాత ఆయన నిజంగా కారు ఏక్సిడెంట్‌లో

మరణించాడు. ఆ తర్వాత నాకు ఇలా చాలా సార్లు కలల్లో వచ్చినవి జరిగాయి. నాకు సాధారణ కలలు కూడా వస్తూంటాయి  కాని నిజమయ్యే కలలన్నీ సీరియస్‌వి అయి ఉంటాయి. జబ్బు పడటం, మరణాలు, ప్రమాదాలు. ఒకదానికి మరొకటి సంబంధం లేని కలలు కావవి. ఉదాహరణకి మొన్న రాత్రి నాకు వచ్చిన కలలో నేను ఓ తోటలో ఉన్నాను. నా పాదాల దగ్గర పింక్ రంగు గులాబులు ఉన్నాయి. ఐతే చలి కాలంలో గులాబులు రావు. నా భర్త నేనక్కడున్నా నన్ను చూడలేకపోయాడు. ఆ కలలో నాకు ఆనందంగా అనిపించింది. నిజానికి బాగా ఆనందంగా అనిపించింది. ఎందుకంటే ఆయన నన్ను బాగా ప్రేమించారని తెలుసు. ఇది వినడానికి మీకు సాధారణంగా ఉండచ్చు. కాని అది జరగబోయే కల అని మెళకువ రాగానే నాకు అనిపించింది. జరగబోయే కల అని కొన్ని కలలకే నాకు మెళకువ రాగానే అనిపిస్తుంది. బహుశ అది నిజం అయ్యే కల కాకపోవచ్చు. మంచు పడే కాలంలో గులాబులు పూయవు.”

తర్వాత ఆమె చెప్పింది నాకు విస్మయాన్ని కలిగించింది.

“నిన్న మిమ్మల్ని నేను నా కలలో చూసాను.”

“కాని ఇదివరకెన్నడు మీరు నన్ను చూడలేదు కదా?”

“అది నిజమే. ఐనా మీరు నా కలలోకి వచ్చారు.”

ఆమె పిచ్చిదైనా అయి ఉండాలి. లేదా కావాలని ఈ నాటకం ఆడుతూండాలి అని అనిపించింది. దాని వెనక గల కారణం మాత్రం నాకు బోధపడలేదు.

“ఇప్పుడు నేను చూసిన గదిలానే ఉందా కల్లోని గది. మీ తలుపు బయట ఉన్న ‘సి. డి. ఫైన్ – కాన్ఫిడెన్షియల్ ఇన్‌వెస్టిగేషన్స్’ అనే బోర్డ్‌ని కూడా ఆ కలలో నేను చూసాను. దాంతో టెలిఫోన్ డైరెక్టరీలో మీ ఫోన్ నంబర్ని వెదికి, మీ చిరునామా తెలుసుకుని వచ్చాను. ఛార్లెస్ నన్ను చంపబోతున్నాడని ఆ కలలో మీకు నేను చెప్పాను. ఆ కలలో మీ బల్ల మీద నల్ల రంగు స్టేప్లర్‌ని కూడా గుర్తించాను. కాని అదిప్పుడు లేదు.”

నేను మరోసారి నివ్వెరపోయాను. నా టేబిల్ మీద ఆ రంగు స్టేప్లర్ ఎప్పుడూ ఉంటుంది. కాకపోతే అది ప్రస్తుతం డ్రాయర్‌లో ఉంది. టేబిల్ మీద లేదు.

“నాదో సందేహం. మీరు నా దగ్గరకి కల రాబట్టి వచ్చారు. మీరా కల్లో ఇప్పుడు మీ ఒంటి మీది దుస్తులు వేసుకున్నారు కాబట్టి అవే ధరించి వచ్చారు. అవునా?” కొద్దిగా వెటకారంగా అడిగాను.

“అవును.” ఒప్పుకుంది.

"మీరు ఇలా కల్లో కనపడ్డ విధంగా జీవిస్తూ అవి నిజం అవుతున్నాయని అనుకుంటున్నారేమో?"

"మీరు గోధుమ రంగు సూట్‌లో కనపడ్డారు. నేనా సంగతి మీకు చెప్పలేదు కదా? గదిలోకి వస్తే మీరు అదే రంగు సూట్‌లో ఉన్నారు. నిజమే. కల్లో నేను వేసుకున్న దుస్తులనే కావాలని ధరించి వచ్చాను. ఎందుకంటే విధితో పోరాడి ప్రయోజనం లేదని నాకు అనుభవ పూర్వకంగా తెలుసు. ఆ కలలో నేను మీతో మాట్లాడుతూండగా మీ ఫోన్ మోగింది. మీరు ఫోన్‌లో మాట్లాడి మీ డ్రాయర్ సొరుగు లోంచి ఏదో తీస్తూంటే మీ కోటు చేతి చివర గల బటన్ తెగి కింద పడింది."

నేను డ్రాయర్‌ని తెరిచి ఏదీ బయటకి తీయదలచుకోలేదు. ఆమె కల నిజం కాలేదని ఆమె బయటకి వెళ్ళేప్పుడు తేలాక, ఆమెని నా సైకాలజిస్ట్ మిత్రుడు ఏండీని ఓసారి కలవమని, ఆమెకి నా అవసరం కన్నా సైకియాట్రిస్ట్ అవసరం అధికంగా ఉంది అని చెప్పాలని నిశ్చయించుకున్నాను.

తక్షణం నా బల్ల మీది ఫోన్ మోగింది. నేను దాని వంక ఆశ్చర్యంగా చూసాను. నా దగ్గర ఓ క్లయింట్ ఉండగా నా సెక్రటరి మేరీ ఎన్నడూ నాకు వచ్చే ఫోన్ కాల్స్‌ని నాకు కనెక్ట్ చేయదు!

"చూసారా? నా కల నిజమవుతోంది." ఆమె నవ్వి చెప్పింది.

నేను రిసీవర్ని ఎత్తి 'హలో' అనగానే మేరీ చెప్పింది.

"సారీ మిస్టర్ ఫైన్. బెయిలీ ఇది జీవన్మరణ సమస్య అనడంతో మిమ్మల్ని డిస్టర్బ్ చేసాను."

"ఏమిటి బెయిలీ?" అడిగాను.

"సర్. టర్నోబెల్ కేస్‌లోని సాక్షి పీటర్ శాన్‌ఫ్రాన్సిస్కోకి పారిపోయాడు. మీరు అతని భార్య చిరునామా ఇస్తే నేను అతన్ని పట్టుకోగలను."

నేను మనసులో తిట్టుకుంటూ టేబిల్ డ్రాయర్‌లోని అడ్రస్ బుక్‌ని తెరిచి చూస్తే అది దొరికింది. సాక్షిగా పీటర్ నాకు చాలా ముఖ్యం. నేను ఆ పుస్తకాన్ని నా చేతిలోకి తీసుకుంటూంటే, డ్రాయర్ అంచుకి నా కుడి చేతి కోట్ బటన్ రాసుకుని తెగి కింద పడింది. నివ్వెరపోయాను అన్నది సరైన పదం కాదు. నేను నిర్ఘాంతపోతూ ఆమె వంక చూసాను.

అలా జరుగుతుందని తనకి తెలుసు అన్నట్లుగా హెలెన్ నవ్వుతూ తల ఊపింది.

"బాస్. ఆ అడ్రస్ వెంటనే ఇవ్వండి. విమానం సిద్ధంగా ఉంది. బోర్డింగ్ లాస్ట్ కాల్ కూడా పిలిచారు." బెయిలీ కోరాడు.

నేను అతనికి ఆ చిరునామా చెప్పాక మిసెస్ లాసన్ నవ్వుతూ చెప్పింది.

"అదిగో. నేను కలలో చూసిన నల్ల రంగు స్టేప్లర్ అక్కడుంది."

చూస్తే అడ్రస్ బుక్‌లోని పేజీలు మడత పడకుండా నల్లటి స్టేప్లర్ ఉంది. అనాలోచితంగా దాన్ని నేను డ్రాయర్ లోంచి తీసి తెరచి ఉన్న అడ్రస్ బుక్‌లో పెట్టానని తెలుసుకున్నాను.

"విధితో మనం పోరాడి గెలవలేం మిస్టర్ ఫైన్. రాసి పెట్టినట్లే ఏదైనా జరుగుతుంది. లేకపోతే కలల ద్వారా ముందు జరగబోయేది నాకు ఎలా తెలుస్తుంది?"

నా తల తిరుగుతోంది. ఆమె ఇదంతా ముందుగా ఏర్పాటు చేసే సమస్యే లేదు. బెయిలీ చేత డబ్బిచ్చి ఫోన్ చేయిద్దామని హెలెన్ ప్రయత్నిస్తే అతను నాకా సంగతి చెప్తాడు తప్ప డబ్బుకి కక్కుర్తి పడడు. ఒకవేళ అతను అందుకు ఒప్పుకున్నా స్టేప్లర్, కోట్ బటన్‌ల మాటేమిటి? అది ముందుగా ఏర్పాటు చేసుకునే విషయం కాదు.

"సరే. ముందు జరగబోయేవి మీకల్లో కనిపించటం నిజం అనుకుందాం. మీ భర్త మిమ్మల్ని చంపబోతున్నాడు అని నమ్ముతాను. అది విధి కాబట్టి దాన్ని తప్పించలేం అని కూడా నమ్ముతున్నాను. మరి నాతో మీకు ఇక ఏం పని ఉండి వచ్చారు?"

మళ్ళీ ఆమె నీలి కళ్ళల్లోంచి కన్నీళ్ళు కారాయి.

"నేను కొద్ది కాలంలో నా భర్త వల్ల మరణించడం ఖాయం. నాకు కావాల్సిందల్లా ఆయన నన్ను ఎందుకు చంపాలనుకుంటున్నాడు అన్నది. మీరు ఆ కారణం కనుక్కోవాలి."

నేను అంగీకారంగా తల ఊపాను.

"మా ఇరవై ఏళ్ళ వైవాహిక జీవితం ఆనందకరంగా సాగుతోంది. మా మధ్య ఇంతదాకా ఎలాంటి సీరియస్ పోట్లాట జరగలేదు. నా వల్ల తను అసంతృప్తిగా ఉన్నాడనే విధంగా ఛార్లెస్ ఎన్నడూ నా ముందు ప్రవర్తించలేదు. నేను కూడా అతని వల్ల అసంతృప్తిగా లేను. మరి ఛార్లెస్ నన్ను ఎందుకు చంపాలని అనుకుంటున్నాడు?"

ఆ కేసుని నేను తీసుకోక పోవడం ఉత్తమం అని మనసులో గట్టిగా అనిపించినా, దాన్ని పక్కన పెట్టి చెప్పాను.

"అందుకు నాకు మీ నించి కొంత సమాచారం కావాలి. మీ మరణం వల్ల మీ భర్తకి వచ్చే లాభం ఎంత?"

"ఆర్థికంగానా? ఏం లేదు. ఆయన స్వయంకృషితో కోటీశ్వరుడు అయ్యాడు. ఆ డబ్బంతా ఆయన పేరు మీదే ఉంది."

"ఇతర ఆడవాళ్ళు?"

"ఛార్లెస్ అలాంటివాడు కాదు. అతనికి రోటీన్ ఇష్టం తప్ప వెరైటీ, ఎక్సయిట్‌మెంట్లు ఇష్టం లేదు. జాగ్రత్త మనిషి. ఇతర స్త్రీల నించి రోగాలు వస్తాయనే భయం కూడా అతనిలో ఉంది."

నాలో ఆమె మీద అసహనం కలిగింది.

"మిమ్మల్ని చంపాలనుకోవడం మినహాయిస్తే మీ భర్త అన్నిటా మంచివాడన్న మాట?" వ్యంగ్యంగా అడిగాను.

"ఆయన తప్పులు చేయరని నేనడం లేదు. కాని అవి చాలా చిన్నవి."

"ఉదాహరణకి?"

"అతను నన్ను చిన్న పిల్లలా భావించి అధిక రక్షణ ఇవ్వాలని అనుకుంటాడు. ఇది నాకు నచ్చదు. 'హెలెన్. స్వెట్టర్ వేసుకో, బయట చలిగా ఉంది' లేదా 'హెలెన్. కాసేపు పడుకో. నీ మొహంలో అలసట తెలుస్తోంది.' ... ఒకోసారి అవి నాకు కోపాన్ని తెప్పిస్తాయి. అతను నన్ను ఎందుకు చంపాలనుకుంటున్నాడో మాత్రం నాకు అర్థం కావడం లేదు. అతను ఇచ్చే ఆరెంజ్ జూస్ తాగాక నా కడుపులో బాధ మొదలవుతుంది."

"ఎలాంటి బాధ?"

"ఎవరో లోపల చేతిని ఉంచి నొక్కుతున్నట్లుగా ఊపిరాడదు."

"మీకు సంపూర్ణ ఆరోగ్యం లేదా?"

"మూడు వారాల క్రితం నాకు ఛార్లెస్ సంపూర్ణ ఆరోగ్య పరీక్ష చేయించాడు. డాక్టర్లు నాకు ఎలాంటి వైద్య సమస్య లేదని చెప్పారు. నా బ్లడ్ ప్రెషర్ మాత్రం కొద్దిగా అధికంగా ఉంది. దాన్ని తగ్గించడానికి డాక్టర్ ఓ మందు రాసిస్తే వేసుకుంటున్నాను. నేను కొంత బరువు తగ్గాలని డాక్టర్ సూచించాడు. చాలా ఏళ్ళుగా బరువు తగ్గాలని ప్రయతిస్తున్నాను. కాని సాధ్యం కావడం లేదు."

"ఆ మందు మీ వెంట తెచ్చారా?"

హెలెన్ పర్స్ లోంచి ఓ టేబ్లెట్ తీసిచ్చి చెప్పింది.

"మీరు కలలో దీన్ని అడిగారు. కాబట్టి తెచ్చాను."

"రోజుకి ఎన్ని వేసుకుంటున్నారు?"

"ఇదీ కలలో అడిగారు. రోజూ ఉదయం ఒకటి."

"దీన్ని నాతో వదిలి వెళ్ళగలరా?  ఇదీ కలలో అడిగానా?"

"అవును... అవును. కాని నాకు విషం మాత్ర ఇవ్వడం ఛార్లెస్‌కి కష్టం కాదు."

ఆమెకి సీరియస్ ఆరోగ్య సమస్య ఉండచ్చు. అది జీర్ణం చేసుకోలేక ఆమె భర్త తనని చంపదలచుకున్నాడని భావిస్తోందేమో అనిపించింది నాకు.

"మీ భర్త మిమ్మల్ని చంపే కలల్లో ఈ మాత్రల గురించేం రాలేదా?"

"లేదు. కలలోని కొంత భాగం నాకు స్పష్టంగా లేదు. బహుశా నేను మెళకువ వచ్చాక ఆ భాగం మర్చిపోయి ఉండచ్చు. నేను చావడం ఖాయం అని, నా భర్త నా చేత బలవంతంగా తాగించే ఆరెంజ్ జూస్ వల్లనే నేను మరణిస్తానని నాకు అనిపిస్తోంది."

ఆమె వెళ్ళాక ఆలోచిస్తే, ఆమె చెప్పేది అబద్ధం అనిపించినా అందులో కొంత నిజం కూడా లేకపోలేదని అనిపించింది. నా మిత్రుడైన ఓ సైకాలజిస్టుకి ఫోన్ చేసి ఆమె గురించి వివరించాను.

"నువ్వు చెప్పిందాన్ని బట్టి ఆమెది *అబ్సెసివ్- కంపల్సివ్ బిహేవియర్.* లేదా స్వల్పంగా పేరొనాయిడ్ అయి ఉండచ్చు. ఆమెని స్వయంగా పరీక్షిస్తే కాని ఓ నిర్ణయానికి రాలేను." అతను చెప్పాడు.

"ఆమె కలల గురించి చెప్పిన దాంట్లో నిజం ఉండే అవకాశం ఉందా? కలల ద్వారా జరగబోయేది తెలుస్తుందా?"

"ఇతర గ్రహాంతర వాసులు భూమి మీదకి రావడం ఎంత నిజమో ఇదీ అంతే నిజం. ఈ రెంటి గురించి చాలా కాలంగా వింటున్నాం కాని తగిన ఋజువు ఇంత దాకా మనకి లభించలేదు."

ఆమెకి నేను కల్లో కనపడటం, నల్ల స్టేపిల్, కోటు గుండీ ఊడటం గురించి ఇక అతనికి చెప్పడం వృథా అనిపించింది. నమ్మడు. తర్వాత స్థానిక యూనివర్శిటీలో ఫిజిక్స్‌ని బోధించే నా మిత్రుడైన ప్రొఫెసర్ అలెగ్జాండర్ చిల్టోన్‌కి ఫోన్ చేసాను. నాకు కేసుల పరిశోధనలో అనేక సార్లు ఆయన సాయం చేసాడు.

"నాకు కలల గురించి పెద్దగా తెలీదు. జరగబోయేది కలల్లో రావడం గురించి నేను ఏం చెప్పలేను. సైన్స్‌లో సగం కూడా మనకి ఇంకా అవగాహనలోకి రాలేదు. కాని అలాంటివి అరుదుగా రష్యాలో జరిగాయని ఇటీవల ఓ ఆర్టికల్‌లో చదివాను. నమ్మదగ్గ శాస్త్రజ్ఞుడు ఆ పేపర్స్‌ని ప్రచురించాడు." ఆయన నా ప్రశ్నకి జవాబు చెప్పాడు.

* * *

రెండు రోజుల తర్వాత హిల్లర్ అనే నా సహాయకుడు హెలెన్ భర్త ఛార్లెస్ లాసన్ మీద నాకో రిపోర్ట్‌ని ఇచ్చాడు. ఛార్లెస్ మీద అనుమానం కలిగే విషయాలేం అతని పరిశోధనలో రాలేదు. క్లీన్ రిపోర్ట్. డబ్బు సమస్యలు లేవు. టేక్స్‌లని సక్రమంగా చెల్లిస్తున్నాడు. పరాయి స్త్రీలు ఎవరూ అతని జీవితంలో లేరు. శతృవులు కూడా లేరు. భార్యంటే ప్రేమ.

నేను హెలెన్ ఇచ్చిన మాత్రని పరీక్షకి పంపిన కెమిస్ట్ ఫోన్ చేసాడు.

"అది హైడ్రోక్లోరోథియాజైడ్ అనే మందు." చెప్పాడు.

"అది ప్రమాదకరమైన మందా?"

"ఏస్ప్రిన్‌తో సహా దేన్నయినా అధికంగా తీసుకుంటే ప్రమాదకరం అవుతుంది." నవ్వాడు.

"ఇది అసాధారణ పొటెన్సి కలిగి, హాని చేసే మందు కాదు కదా?"

"కాదు. రోజూ లక్షల మంది దీన్ని వాడుతున్నారు."

"దాన్ని దేనికి వాడతారు?"

"సాధారణంగా హైపర్ టెన్షన్‌కి."

"అంటే బ్లడ్ ప్రెషర్‌కా?"

"అవును."

"ఆ రోగం ప్రాణాంతకమైందా?"

"ఊహు. ఈ మందు తక్కువ బి.పి ఉన్న వారికి ఇస్తారు. ప్రాణాంతకమైన సీరియస్ కేసుల్లో వేరే మందు ఇస్తారు."

"ఓకే. ఓ డాక్టర్ బి.పి రోగం ఉన్న ఓ మహిళకి ఈ మందు ప్రిస్క్రైబ్ చేసాడు. ఈ రోగం తగ్గడానికి బరువుని కూడా తగ్గమంటాడా?"

"అదనపు బరువు ఉంటే తగ్గమని చెప్తారు. బి.పి రోగులు అదనపు బరువుని కలిగి ఉండకూడదు. బరువు సాధారణ పరిమితికి తగ్గాక ఇక బి.పి మందు వాడటం మానేస్తారు." అతను చెప్పాడు.

* * *

త్వరలోనే హెలెన్ మళ్ళీ నా ఆఫీస్‌కి వచ్చింది. ఆమె పూర్వం కన్నా పాలిపోయి, కొద్దిగా అలసటగా కనిపించింది.

"ఏమైంది?" ఆమె కూర్చున్నాక అడిగాను.

"ఇవాళ మా వార్ని నేను ఆరెంజ్ జూస్ ఎందుకు తాగాలని నిలదీసాను. బి.పి మందు వేసుకునే వారు దాన్ని తప్పనిసరిగా తాగాలని చెప్పాడు. ఆ ఆరెంజ్ జూస్ తాగకపోతే నేను జీవిస్తానని నాకు అనిపిస్తోంది." దుఃఖంగా చెప్పింది.

టేబిల్ మీద నల్ల స్టేప్లర్ కనపడగానే నేను ఎలా ఫీలయ్యానో నాకు గుర్తుంది. కలల ద్వారా భవిష్యత్ ముందే తెలియడం మంచిది కాదని నాకు అనిపించింది.

నేను వెంటనే ఆమె ముందే నా కెమిస్ట్ మిత్రుడికి ఫోన్ చేసి అడిగాను.

"మనం మొన్న ఓ మందు గురించి చర్చించాం. దాంతో పాటుగా రోగి ఆరెంజ్ జూస్ తీసుకోవాలనే నిబంధన ఉందా?"

"అవును. అది స్టాండర్డ్ ప్రొసీజర్."

"ఎందుని?"

"ఆ మందులోని హైడ్రోక్లోరోథియోడైజ్ అధిక మూత్రాన్ని కలిగిస్తుంది. శరీరంలోని సోడియం అందువల్ల అధికంగా పోతుంది. దాంతో బి.పిని  కలిగించే సోడియం పోయి రోగం కంట్రోల్‌లో ఉంటుంది. దురదృష్టవశాత్తూ దాంతో పాటుగా పొటాషియం కూడా పోతుంది. పొటాషియం పోవడం మంచిది కాదు. ఓ గ్లాసు ఆరెంజ్ జూస్‌లో రోజులో ఎంత పోతుందో అంత పొటాషియం ఉంటుంది."

"పొటాషియం కోసం ఆరెంజ్ బదులు ఇంకేదైనా తీసుకోవచ్చా?"

"కొందరు అరటి పళ్ళు తీసుకుంటారు. అందులో కూడా పొటాషియం అధికంగా ఉంటుంది."

"పొటాషియం తగ్గితే ఏమవుతుంది?"

"కండరాలల్లో వణుకు రావచ్చు. తల తేలిపోతున్నట్లు అనిపించచ్చు. ఒకోసారి శరీరానికి నడక లాంటి ఎక్సర్‌సైజు వల్ల స్పృహ కూడా తప్పచ్చు."

"రోజూ ఆరెంజ్ జూస్ తాగితే ఈ సమస్యని అధిగమించచ్చా?"

"అవును. ఆరెంజ్ జూస్ గ్లాసులని  నిత్యం అమెరికాలో లక్షలాది మంది బిపి రోగులే తాగుతూంటారు."

"కాని ఆమె భర్త తప్ప ఈ సంగతి ఆమె డాక్టర్ వివరించలేదు."

"భర్తకి చెప్పి ఉంటాడా డాక్టర్. నిజానికి రోగికే చెప్పాలి. వృత్తిలో నిర్లక్ష్యం రోజు రోజుకీ అధికం అవుతోంది."

నేను రిసీవర్ పెట్టేసి హెలెన్‌తో చెప్పాను.

"మీ ఆయన మీకు ఆరెంజ్ జూస్ ఇవ్వడం సబబే. లేదా రోజుకో అరటి పండు తినండి."

"చిన్నప్పటి నించి నాకు అరటి పండు అలర్జీ. అది తింటే ఒంటి మీద దద్దుర్లు వస్తాయి."

"అలాంటప్పుడు మీరు ఆ జూస్‌ని తప్పక తాగాలి."

"అలాగే. తప్పని సరి అయిన దాని ముందు తల వంచడం తప్ప మనం ఏం చేయలేం. ఐనప్పటికీ ఎదిరించకుండా ఎవరూ తమ తలని తీసుకెళ్ళి ఉరి తాడులో ఉంచరు కదా మిస్టర్ ఫైన్."

నేనేం మాట్లాడలేదు.

"ఇక నించి నేను కేన్డ్ ఆరెంజ్ జూస్ తాగుతాను. అందులో మా వారు ఏమీ కలపలేరు. నా అంతట నేనే దాన్ని తెరచి తాగుతాను."

"ఇది మంచి ఆలోచన. మరి అందుకు మీ వారు అంగీకరిస్తారు?"

"తప్పకుండా. నేనేం చేసినా ఆయన అభ్యంతరం చెప్పరు."

"నాకు మీ వార్ని ఓసారి కలవాలని ఉంది. డిటెక్టివ్‌గా కాక నన్ను మరో విధంగా ఆయనకి పరిచయం చేయగలరా?" అడిగాను.

* * *

రెండు రోజుల తర్వాత నాకు హెలెన్ ఫోన్ చేసి చెప్పింది.

"నేను మా ఇంటిని డెకొరేట్ చేయాలని అనుకుంటున్నాను. మీరు ఇంటీరియర్ డెకొరేటర్‌గా నటించగలిగితే మా ఇంట్లో ఒకటి, రెండు రోజులు ఉండచ్చు. డెకొరేటర్ తన మొత్తం దృష్టిని మా ఇంటి మీదే కేంద్రీకరిస్తే దాన్ని బాగా డెకొరేట్ చేయగలడని నేను మా వారితో చెప్పాను. ఆయన అందుకు అంగీకరించారు. ఈ శని ఆదివారాల్లో మీరు మా ఇంటికి వచ్చి అలా నటించగలరా?"

"ఇది మంచి ఆలోచన." చెప్పాను.

* * *

నేను ఛార్లెస్ లాసన్‌ని వ్యతిరేక దృష్టితో చూస్తూండటంతో అతనంటే అయిష్టం కలిగింది. లావుగా, పొట్టిగా ఉండి, ముప్పాతిక వంతు బట్టతల, తెల్లటి గుబురు మీసం గల అతన్ని చూడగానే మంచి వాడనే అభిప్రాయం కలిగింది. ఎవరైనా అతన్ని ఇష్టపడేలా ఉందతని ప్రవర్తన. అతను నాతో తన వ్యాపారం గురించి గంట దాకా మాట్లాడాడు.

అతని స్వభావం తన భార్యని కాని, అసలు ఎవర్ని కాని చంపేది కాదని నాకు అనిపించింది.

హెలెన్ ఆయనకి వ్యతిరేకంగా అనిపించింది. కళ్ళ కింద నల్లటి వలయాలు. మొహంలో రోగ గ్రస్థ లక్షణాలు. చేతులు కూడా స్వల్పంగా వణకడం గమనించాను. పొటాషియం తగ్గా? ఒంటరిగా దొరికినప్పుడు ఆమెని రహస్యంగా అడిగాను.

"ఉదయం ఆరెంజ్ జూస్ తీసుకున్నారా?"

"మీరు కూడా అదే ప్రశ్నా?" కోపంగా అరిచింది.

ఆమె నీలి కళ్ళ నిండా ద్వేషం. తమాయించుకుని సిగ్గు పడుతూ చెప్పింది.

"సారీ. ఛార్లెస్ మీరడిగిన ప్రశ్న అడిగినప్పుడల్లా నాకు కోపం వస్తుంది. నేను ప్రతీ ఉదయం ఓ పూర్తి గ్లాసు ఆరెంజ్ జూస్ తాగుతాను. ఇవాళ కూడా తాగాను. నేను దాన్ని తాగని రోజు కోసం ఎదురు చూస్తున్నాను."

ఎవరైనా నా మీద విష ప్రయోగం చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిస్తే ఆమెలా నేనూ స్పందిస్తానని నాకు అనిపించింది. ఆమెని నేను చూసినప్పటి రోజు కన్నా ఆరోగ్యం జారడం నన్ను బాధించింది.

"మీరు ఈ రాత్రి భోజనం సరిగ్గా చేయలేదు." చెప్పాను.

"నేను బరువు తగ్గే ప్రయత్నం చేస్తున్నాను. పదిహేను పౌన్ల బరువు తగ్గితే నా బి.పి కంట్రోల్‌లో ఉంటుంది. అప్పుడు నేనే మందు, ఆరెంజ్ జూస్ మానేయచ్చు."

"మీరు బరువేమైనా తగ్గారా?"

"మూడు పౌన్లే తగ్గాను. కాని బి.పి మందు ఇదివరికటిలా పని చేయడంలేదు. నా బి.పి పెరుగుతోంది. నా బిపిని నేనే చెక్ చేసుకోడానికి స్పిగ్మోని కొనిచ్చారు."

"మీకున్న వత్తిడి వల్ల మీ బి.పి పెరగడం సహజమే."

ఛార్లెస్‌కి ఇంటీరియర్ డెకొరేషన్ మీద అవగాహన లేదు. 'న్యూట్రల్ టోన్, ఏంబియెన్స్, ఫంక్షనల్ పీసెస్, మోనో క్రొమోటిక్ స్కీమ్స్, ఎకెటిక్ గ్రూపింగ్స్' లాంటివి నా సంభాషణలో వాడి నేను ఇంటీరియర్ డెకరేటర్ని అనే నమ్మకం అతనిలో కలిగించాను.

* * *

ఆదివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ టేబిల్ దగ్గర ఆమె ప్రవర్తనలో నా పట్ల ఆకస్మిక మార్పుని గుర్తించాను. ఆమె ఛార్లెస్ వంక కోపంగా చూస్తూ ఓ గ్లాసు ఆరెంజ్ జూస్‌ని తాగింది. మధ్యమధ్యలో నా వైపు అదే కోపంతో చూసింది.

"ఏమైంది?" ఆమె నాకు ఒంటరిగా తారసపడగానే అడిగాను.

"నా కల నాకు నిన్న రాత్రి స్పష్టమైంది. నా కలలో కొంత భాగం అస్పష్టంగా ఉండేదని మీకు చెప్పాను. గుర్తుందా?"

"అవును. ఏం స్పష్టమైంది?"

"నా కలలో నన్ను చంపడంలో మీరు ఛార్లెస్‌కి సహాయం చేసారు."

"ఏమిటి!?!" అదిరిపడ్డాను.

"అవును. ఛార్లెస్ నన్ను ఆరెంజ్ జ్యూస్ తాగమని కోప్పడుతూ అరిచాడు. కోపంతో అతని మొహం ఎర్రబడింది. మెడ మీద రక్తనాళాలు పొంగాయి. బలవంతంగా గ్లాసుని నా నోట్లో ఉంచి తాగిస్తూంటే ఉమ్మేయసాగాను. మీరు నన్ను కదలకుండా పట్టుకున్నారు. 'మీరిది తాగాలి హెలెన్. అప్పుడు అంతా సర్దుకుంటుంది." అన్నారు."

ఆమె నా వైపు అగ్నిని కురిపించే కళ్ళతో చూస్తూ చెప్పింది.

అంతలోనే ఆమెలోని కోపం మాయమై బాధ ప్రవేశించింది.

"మిస్టర్ ఫైన్. మీకు నా మీద ఎలాంటి కోపం లేదు. ఐనా ఎందుకా పని చేసారు?"

ఆమె కలలో జరిగింది నిజంగా నేను చేసినట్లుగా భావించి ఆమె నన్ను నిందిస్తే నా దగ్గర జవాబు లేకపోయింది. నేను ఓ గుటక వేసాను. ఆమె ఓ సైకలాజికల్ కేసని, సైకియాట్రిస్ట్ తప్ప నేనామెకి సహాయం చేయలేనని, నా స్టేప్లర్, కోటు గుండీ కేవలం కాకతాళీయ సంఘటనలని నేను నిర్ణయించుకున్నాను.

"మిసెస్ లాసన్. నేను వెంటనే మీ ఇల్లు విడిచి వెళ్ళి పోతున్నాను. ఇంకెన్నడూ నేను మిమ్మల్ని కలవను. మీరు అంగీకరిస్తే మీకో చక్కటి సైక్రియాటిస్ట్‌ని పరిచయం చేస్తాను." చెప్పాను.

ఆమె నా వంక చూసిన చూపులో బాధ కనిపించింది. తడిసిన ఆమె కళ్ళల్లోని విషాదం చూసి నాకు ఆమె మీద సానుభూతి కలిగింది.

"నేను మీకు నా కలలోని విషయాలు చెప్పినందుకు సారీ. నా లానే మీరు కూడా విధి బాధితులు. మీరిక్కడ నించి పారిపోయి భవిష్యత్ నించి తప్పించుకోలేరు. మనలో ఎవరికీ అది సాధ్యం కాదు." ఆమె దిగులుగా నవ్వుతూ చెప్పింది.

"కాని నేను మీలా కాదు. ప్రయత్నించగలను. గుడ్ బై."

ఆమె నా వంక నిర్లిప్తంగా చూసింది. నేను ఛార్లెస్ లాసన్ దగ్గరకి వెళ్ళి చెప్పాను.

"సారీ. ఓ ఫోన్ కాల్ వచ్చింది. నేను అర్జెంట్‌గా వేరే చోటికి వెళ్ళాలి."

అతను నిరాశ చెందినట్లుగా నా వంక చూసాడు.

"మీరుంటే హెలన్ కొంత తెరిపిగా ఉండటం గమనించాను. మీరిక్కడ ఉండటం నాకు, హెలెన్‌కి ఇష్టమే. కనీసం ఈ రాత్రి భోజనం చేసి వెళ్ళండి." కోరాడు.

"సారీ! కాని నేను వెళ్ళాలి."

అతని మొహంలో నీలి తెరలు కమ్ముకున్నాయి.

"నా భార్య గురించి నాకెంతో ఆదుర్దాగా ఉంది. ఆమె ఆరోగ్యం బాగా లేదు. ఇంకా ఎక్కువ స్థాయి బి.పి గలవారు ఇంకా ఎక్కువ సంవత్సరాలుగా జీవిస్తున్నారని డాక్టర్ నాకు ధైర్యం చెప్పారు."

నేను నా సామాను సద్దుకుని మెట్ల మీద నించి కిందకి నా సూట్ కేస్‌తో వచ్చేసరికి ఛార్లెస్ సోఫాలో పడుకున్న హెలెన్ మీదకి ఒంగి చూస్తున్నాడు. ఆమె ఒంటి నిండా చెమటలు పట్టి ఉన్నాయి.

'ఛార్లెస్' అని బలహీనంగా అనడం విన్నాను.

"మిస్టర్ ఫైన్. త్వరగా రండి. సహాయం చేయండి." అతను అరిచాడు.

నేను నా సూట్ కేస్‌ని నేల మీద ఉంచి వాళ్ళ దగ్గరకి పెద్ద అంగలతో చేరుకున్నాను. ఆమె పల్స్‌ని చూసిన ఛార్లెస్ చెప్పాడు.

"డాక్టర్‌కి ఫోన్ చేయండి. హెలెన్ షాక్‌లో ఉంది."

నేను డాక్టర్‌కి ఫోన్ చేసి జరిగింది చెప్పాను. వెంటనే డాక్టర్ చెప్పాడు.

"బి.పి మందు వాడేప్పుడు డైట్ పిల్స్ వాడకూడదని చెప్పాను. నా మాట వినకుండా ఆమె బరువు తగ్గడానికి డైట్ పిల్స్‌ని వాడుతోంది. దాంతో బి.పి పెరుగుతుంది. హైపోకలేమియం వల్ల అలా జరిగి ఉంటుంది. నేను వెంటనే వస్తున్నాను. వెంటనే ఆమె చేత ఓ గ్లాసు ఆరెంజ్ జూస్ తాగించండి."

నేనా సంగతి ఛార్లెస్‌కి చెప్పాను.

"కాని ఇవాళ ఉదయం ఆమె మన ముందే ఆరెంజ్ జూస్ తాగింది కదా?"

"డాక్టర్ అది సరిపోయి ఉండదు అన్నారు."

"హైపోకలేమియం అంటే పొటాషియం డెఫిసెన్సీ. వెంటనే వంట గదిలోకి వెళ్ళి ఆరెంజ్ జూస్ తీసుకు రండి."

"కాని..."

"డాక్టర్ వచ్చే లోగా ఆయన చెప్పినట్లు చేయడం మన విధి." ఛార్లెస్ అర్థిస్తున్నట్లుగా చెప్పాడు.

నేను సందేహించాను. కాని చివరికి డాక్టర్ చెప్పినట్లు నడుచుకోవడం నా ధర్మం అనుకుని వంటగదిలోకి వెళ్ళి, ఫ్రిజ్ తెరచి ఆరెంజ్ కేన్ లోంచి ఆరెంజ్ జూస్‌ని గ్లాసులో నింపి తెచ్చి ఛార్లెస్ చేతికి ఇచ్చాను.

"హెలెన్! కళ్ళు తెరు! ఇది తాగు." అతను హెలెన్ చెంపల మీద తడుతూ పిలిచాడు.

హెలెన్‌లో స్పందన లేదు. అకస్మాత్తుగా ఆమె శరీరం మొత్తం వణకసాగింది. హెలెన్ కళ్ళు తెరిచి ఛార్లెస్ చేతిలోని ఆరెంజ్ జూస్ గ్లాసుని చూసి బలహీనంగా చెప్పింది.

"ఒద్దు. ఒద్దు. ఒద్దు."

"తాగితే కాని నీకు బాగవదు."

ఛార్లెస్ మొహం కోపంతో ఎర్రబడి, అతని మెడ నరాలు ఉబ్బాయి.

"చూస్తారేం? ఆమె చేతులని కదలకుండా పట్టుకోండి." ఛార్లెస్ నాతో కోపంగా చెప్పాడు.

ఆమె గ్లాసుని తోసేయకుండా నేను అనాలోచితంగా హెలెన్ రెండు చేతులని బలంగా పట్టుకుంటే ఛార్లెస్ ఆమె చేత ఆరెంజ్ జూస్‌ని తాగించసాగాడు.

"మీరిది తాగాలి హెలెన్. అప్పుడు అంతా సర్దుకుంటుంది." చెప్పాను.

"విధి....నే చెప్పానా...విధి."

హెలెన్ ఆఖరి మాటలవి. అవి నన్ను ఉద్దేశించే మాట్లాడిందని నాకు ఇప్పటికీ అనిపిస్తుంటుంది. ఆ సమయంలో ఆమె మొహంలోని భయం నేను ఎన్నటికీ మర్చిపోలేను.

డాక్టర్ వచ్చి పరీక్షించి చెప్పాడు.

"మాసివ్ హార్ట్ అటాక్."

"ఎలా జరిగింది?" ప్రశ్నించాను.

"కండరాలన్నీ వణకడం పొటాషియం డెఫీషియాన్సీ లక్షణం. గుండె కూడా ఓ కండరమే." ఆయన చెప్పాడు.

* * *

ఆ కేసులో ఓ వింత విషయాన్ని నేను హెలెన్ కర్మకాండ సమయంలో గమనించాను. గ్రీన్‌వ్యూ గార్డెన్స్ సెమెట్రీలో ఆమె శవాన్ని ఖననం చేసే కార్యక్రమానికి

నేనూ హాజరయ్యాను. ఆ రోజు మంచు కురవడంతో భూమంతా తెల్లగా ఉంది. ఫ్యూనరల్ అటెండెంట్స్ శవపేటిక తెచ్చిన బండి మీద నించి పూలని తీసి శవపేటిక మీద అమర్చారు. వాటిలో చాలా పింక్ రంగు గులాబులు ఉన్నాయి.

మంచులో పింక్ గులాబులు!

మేం కలిసిన మొదటి రోజు ఆమె వర్ణించిన ఇంకో కల నాకు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది. మంచులో ఓ తోటలో ఛార్లెస్ ఆమె దగ్గర ఉండి కూడా ఆమెని చూడలేకపోవడం. ఇంకేం చెప్పింది?

"నాకు ఆనందంగా ఉంది. బాగా ఆనందంగా ఉంది. ఎందుకంటే ఆయన నన్ను బాగా ప్రేమించారని తెలుసు."

నేను వెనక్కి తిరిగి నా కారు దగ్గరకి నడిచాను. హెలెన్ ఎక్కడ ఉన్నా సరే, ఆమె ఆనందంగా ఉందని, తనని తన భర్త ప్రేమిస్తున్నాడని తెలుసుకుందని నేను నమ్ముతాను.

అది నాకు ఊరటని ఇస్తుంది.



# నువ్వెవరు?

**-ఛార్లెస్ డ్యూమాంట్**

**కొన్నిటికి వివరణ చిక్కదు.**

**అది దొరికినా కూడా.**

**డేవిడ్‌కి మెలకువ** వచ్చింది. చేతి గడియారం వంక చూసుకుంటే టైం తొమ్మిదీ పదిహేడు. తను తొమ్మిదికల్లా ఆఫీస్‌లో ఉండాలని గుర్తొచ్చిన అతను తనని తిట్టుకున్నాడు. పక్కనే నిద్రించే భార్యని చూస్తూ కోపంగా గొణిగాడు.

"ఏం భార్య? నేను సంపాదిస్తే పడి తింటుంది తప్ప బాధ్యత లేదు."

రాత్రి పార్టీలో తనకి ఎక్కువైంది అనుకున్నాడు. తన వంటి మీది సూట్‌ని, కాళ్ళకి బూట్లని చూసి అంతే కోపంతో చెప్పాడు.

"రాత్రి కనీసం బూట్లయినా విప్పలేదా?"

బాత్ రూంలోకి వెళ్ళి మళ్ళీ బయటికి వచ్చి భార్యని లేపుతూ అడిగాడు.

"విల్మా. నా రేజర్ ఎక్కడ పెట్టావు? లే. లేచి చూపించు."

విల్మా లేచి డేవిడ్ మొహం వంక చూసి గట్టిగా వెర్రి కేక పెట్టింది.

"ఏమైంది? నీకు ఒంట్లో బాలేదా?" డేవిడ్ అడిగాడు.

"నువ్వెవరు?" విల్మా ప్రశ్నించింది.

"ఏమిటి?"

"నువ్వెవరు? నా పడక గదిలోకి ఎలా వచ్చావు?"

"హనీ. హాస్యాలు కట్టిపెట్టి నా రేజర్ ఇవ్వు. ఇప్పటికే నేను ఆఫీస్‌కి లేటయ్యాను." కోపంగా చెప్పాడు.

"తక్షణం బయటికి నడు." విల్మా అరిచింది.

"జోక్స్‌కి నాకు మూడ్ లేదు విల్మా."

"నీకు నా పేరెలా తెలుసు?"

"మన మేరేజ్ సర్టిఫికెట్ ఇప్పుడే చూసాను." ఎకసెక్కంగా చెప్పాడు.

"మిస్టర్! నువ్వు ఇబ్బందుల్లో పడకుండా ఉండాలంటే బయటికి నడు. లేదా పోలీసుల్ని పిలుస్తాను." విల్మా హెచ్చరించింది.

"సరే. పోలీసుల్ని పిలు. ఫైర్ డిపార్ట్‌మెంట్‌ని పిలు. బేడీలు తీసుకురమ్మని కూడా చెప్పు." డేవిడ్ ఎకసెక్కంగా చెప్పాడు.

"నేను జోక్ చేయడం లేదు. ఐదు లెక్క పెట్టేలోగా నువ్వు బయటికి వెళ్ళకపోతే పోలీసులకి నిజంగా ఫోన్ చేస్తాను." ఆమె ఫోన్ దగ్గరికి వెళ్ళి గట్టిగా అరిచింది.

ఆమె డయల్ చేస్తూంటే వెళ్ళి రిసీవర్ తీసుకుని క్రేడిల్ మీద పెట్టి అడిగాడు.

"ఇవాళ నీకేమైంది?"

"నన్ను ముట్టుకోకు." చెప్తూ దూరంగా జరిగింది.

"నీ నటన బావుంది. రాత్రి రెండు మార్టినీలు ఎక్కువైతే చాలు. పొద్దున గొడవ పెట్టుకుంటావు."

డ్రాయర్ తెరిచి చూసి అడిగాడు.

"నా సాక్స్ ఎక్కడ?... నా బట్టలేవి?"

ఆమె బయటికి పారిపోతూంటే, పట్టుకుని ఆపి చెప్పాడు.

"నువ్విలా ఎందుకు ప్రవర్తిస్తున్నావో నాకు తెలీదు. కానీ నేను బేంక్ నించి తిరిగి వచ్చేసరికి అన్నీ యథాస్థానంలో ఉండాలి. అర్థమైందా?... నో... నో. థాంక్స్. నాకు బ్రేక్‌ఫాస్ట్ తినే మూడ్ లేదు." చెప్పి బయటికి వెళ్ళి తలుపు మూసాడు.

* * *

బేంక్ ముందు కారు ఆపి దిగి డేవిడ్ లోపలికి నడిచాడు.

"గుడ్ మార్నింగ్ జేమ్స్." సెక్యూరిటీ ఆఫీసర్ని విష్ చేసాడు.

అతను ఎప్పటిలా బదులుగా విష్ చేయలేదు.

"హలో జాక్." లోపలకి వెళ్ళాక ఇంకో కొలీగ్‌ని పలకరించాడు.

అతను కూడా జవాబు చెప్పలేదు.

తన సీట్ దగ్గరికి వెళ్తే, అక్కడ ఓ కొత్త వ్యక్తి కూర్చుని ఉండటం చూసాడు.

"ఎస్ సర్. నేను మీకేం సహాయం చేయగలను?" జార్జ్ అడిగాడు.

"జార్జ్! అతనెవరు?" డేవిడ్ ప్రశ్నించాడు.

"అతను కూపర్." జార్జ్ జవాబు చెప్పాడు.

"నా సీట్లో కూర్చుని మిస్టర్ కూపర్ ఏం చేస్తున్నాడో చెప్తావా?" డేవిడ్ ఇబ్బందిగా చూస్తూ అడిగాడు.

"బెగ్ యువర్ పార్డన్?" జార్జ్ ప్రశ్నించాడు.

"ఎవరు నువ్వు?" డేవిడ్ కూపర్ దగ్గరికి వెళ్ళి అడిగాడు.

"ఎస్ సర్?" అతను ప్రశ్నించాడు.

"నువ్వెవరు? నా సీట్లో ఏం చేస్తున్నావు?" డేవిడ్ గట్టిగా అడిగాడు.

"మీ సీటా?"

"అవును. ఇది నా సీట్. ఇవాళ చాలా అలసిపోయాను. వెంటనే లే. లేదా నిన్ను బయటికి విసిరేస్తాను."

కూపర్ భయపడుతూ లేచి అలారం బటన్‌ని నొక్కాడు.

"ఈ చెత్తని తీసుకెళ్ళు." డేవిడ్ బల్ల మీది అతని ఫేమిలీ ఫోటోని తీసిస్తూ చెప్పాడు.

యూనిఫాంలోని జేమ్స్ వారి దగ్గరికి వచ్చాడు.

"జేమ్స్! ఈ జోక్ చాలా దూరం వెళ్తోంది. ఇతను ఇది తన సీట్ అంటున్నాడు." కూపర్ ఫిర్యాదు చేసాడు.

"సర్! మనం బయటికి వెళ్ళి సెటిల్ చేద్దాం." జేమ్స్ డేవిడ్‌ని అభ్యర్థించాడు.

"నా నేమ్ ప్లేట్, ఫేమిలీ ఫోటో ఇస్తే అంతా సెటిల్ అయినట్లే." డేవిడ్ చెప్పాడు.

"మీరు బయటికి వచ్చి తీరాలి." జేమ్స్ కోరాడు.

"రాను. జేమ్స్! నువ్వు నా మీద చేతులు తీయకపోతే నిన్ను డిస్మిస్ చేస్తాను." డేవిడ్ కోపంగా హెచ్చరించాడు.

"బయటికి." జేమ్స్ చెప్పగానే డేవిడ్ లేచి అతన్ని దూరంగా తోసాడు.

జేమ్స్ వెంటనే తన సర్వీస్ రివాల్వర్‌ని బయటికి తీసి డేవిడ్‌కి గురి పెట్టి చెప్పాడు.

"చేతులు పైకెత్తు మిస్టర్."

"దేనికి?" డేవిడ్ నివ్వెరపోయాడు.

తమ వంక చూస్తున్న అందర్నీ చూసి డేవిడ్ నిర్ఘాంతపోతూ అడిగాడు.

"మీ అందరికీ పిచ్చెక్కిందా?"

"ఎదురు తిరక్కుండా చేతులు పైకెత్తి బయటికి రా. లేదా కాల్చడానికి నేను వెనుకాడను." జేమ్స్ చెప్పాడు.

డేవిడ్ చేతులు పైకెత్తి తలుపు వైపు నడుస్తూ అడిగాడు.

"జార్జ్! ఏమిటిది?"

అంతా బయటికి వచ్చారు. అక్కడ నిలబడి ఉన్న తన భార్య విల్మాని చూసి డేవిడ్ కోరాడు.

"విల్మా! నేను ఎవరో వీళ్ళకి చెప్పు."

ఆమె మాట్లాడకపోవడంతో అక్కడికి వచ్చిన పోలీస్ ఆఫీసర్ డేవిడ్ని అడిగాడు.

"నీ పేరేమిటి?"

"ఆమెని అడుగు."

"ఆమెకి తెలీదు."

"పదకొండేళ్ళ వైవాహిక జీవితం అనంతరం ఆమెకి తెలీదా? లేడీ. నన్ను నేను పరిచయం చేసుకోడానికి అనుమతి ఇవ్వు. నేను నీ భర్త డేవిడ్ గర్నీని." డేవిడ్ ఎకసక్కెంగా చెప్పాడు.

ఆమె మౌనంగా ఉండడంతో మళ్ళీ చెప్పాడు.

"నేనిక్కడ మీతో నాలుగేళ్ళుగా పని చేస్తున్నాను. జిమ్, జార్జ్, ఫ్రెడ్, జేమ్స్. నేనెవరో వీళ్ళకి చెప్పండి." గొంతు చించుకుని అరిచాడు.

వాళ్ళు ఒకరి మొహాలు మరొకరు చూసుకోవడంతో జేబు లోంచి పర్స్ తీసి చూసి విల్మాని అడిగాడు.

"నా డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్ కార్డులని ఏం చేసావు? ఆగండి... నేను డేవిడ్ గర్నీని... డేవిడ్ గర్నీని."

అరుస్తున్న అతన్ని అక్కడికి వచ్చిన పోలీసులు నిర్బంధించి తీసుకెళ్ళారు.

* * *

"నీ పేరేమిటి?" పోలీస్ డాక్టర్ అడిగాడు.

"డేవిడ్ గర్నీ. నువ్వూ నమ్మవా?"

"ఎందుకంత ఎక్సైట్ అవుతున్నావు?" డాక్టర్ ప్రశ్నించాడు.

"నాకు ఎక్సైటింగ్‌గా ఉండదా? నేను డేవిడ్‌నని నాకు తెలుసు. అంతా కాదు అంటున్నారు. అందుకుని నన్ను రిలాక్స్ అవమంటావా?"

"ఇది మీకు షాకింగ్‌గా ఉందని నాకు అర్థమైంది. మీకు నేను సహాయం చేయాలని అనుకుంటున్నాను. మీరు నిజాలని గుర్తించాలి. మీరు ఎవరు అనుకుంటున్నారో అతను- డేవిడ్ గర్నీ అనే వ్యక్తే లేడు. ఒక్క మీ మనసులో తప్ప. అతన్ని మీరే సృష్టించుకున్నారు." డాక్టర్ సానుభూతిగా చెప్పాడు.

"మీరు అబద్ధమాడుతున్నారు." డేవిడ్ ఆరోపించాడు.

"అది ఎలా చెప్పగలరు?"

"ముప్ఫై ఐదేళ్ళుగా నేను డేవిడ్ గర్నీని అని నాకు తెలుసు. నా క్రెడిట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ పోయినంత మాత్రాన..."

"కారణం అది కాదు. మీరు పెళ్ళి చేసుకున్నానని అనుకుంటున్న ఆమె మిసెస్ బేరన్‌సన్...."

"కాదు. మిసెస్ గర్నీ. నన్ను గుర్తు పట్టేవారు ఉన్నారు. ఫోన్ దగ్గరకి తీసుకెళ్ళండి."

గుమ్మం దగ్గర ఆగి నిశ్చలంగా కూర్చున్న ఓ వ్యక్తి వంక చూపిస్తూ డాక్టర్ చెప్పాడు.

"మీ ఈ సహరోగిని మీరు కలవలేదు కదా. ఇతను విన్‌స్టన్ చర్చిల్. ఇతను అలా భావిస్తున్నాడు. పాపం ఇతనెవరో ఎవరికీ తెలీదు."

ఇద్దరూ గదిలోంచి టెలీఫోన్ దగ్గరకి బయటికి వెళ్ళారు. డాక్టర్ రిసీవర్ అందుకుని డేవిడ్‌ని నంబర్ అడిగి డయల్ చేసి ఇచ్చాడు.

"హలో ఫ్రాంక్! నేను డేవిడ్ గర్నీని... నీ మిత్రుడ్ని..." రిసీవర్ పెట్టేస్తూ డాక్టర్‌తో కోపంగా చెప్పాడు.

"ఇతను నా బెస్ట్ ఫ్రెండ్. ఇద్దరం కలిసి ఒకే స్కూల్లో చదివాం. కాని కాదంటున్నాడు."

"ఇంకెవరైనా ఉన్నారా?"

"ఉన్నారు." ఇంకో నంబర్ చెప్పాడు.

డాక్టర్ డయల్ చేయగానే 'మిసెస్ థాంసన్ గర్నీ కోసం అడగండి' అని డేవిడ్ సూచించాడు. ఆవిడ లైన్‌లోకి వచ్చాక రిసీవర్ తీసుకున్న డేవిడ్ చెప్పాడు.

"హలో అమ్మా! నేను దేవ్‌ని... దేవ్‌ని అమ్మా. అదేమిటి? నా గొంతు గుర్తు పట్టలేకపోతున్నావా? నీ కొడుకుని. అమ్మా... ఆపు. నాకిలా చేయకు..."

డాక్టర్ రిసీవర్ అందుకుని 'క్షమించండి. రాంగ్ నంబర్' అని చెప్పి రిసీవర్ పెట్టేసాడు.

"సరే. మీరు డేవిడ్ ఏండ్రూ గర్నీ. 2457 మేపుల్ అవెన్యూ మీ చిరునామానా?"

"అవును."

"ష్యూర్?"

"ష్యూర్."

"మీకు ఫోన్ ఉందా?"

"ఉంది."

"టెలిఫోన్ డైరెక్టరీలో మీ పేరు, నంబర్ ఉంటాయిగా?" డాక్టర్ ప్రశ్నించాడు.

"ఉంటాయి."

డాక్టర్ ఓ టెలిఫోన్ డైరెక్టరీ తీసి డేవిడ్‌కి ఇచ్చి చెప్పాడు.

"ఇది కొత్తది."

డేవిడ్ అందులో గబగబ వెదికాడు. కానీ తన పేరు, ఫోన్ నంబర్ అందులో కనపడలేదు!

"ఇప్పుడు నేను చెప్పింది నమ్ముతారా?" డాక్టర్ అడిగాడు.

"సరే. నేను డేవిడ్ గర్నీ కాకపోతే మరెవర్ని?" డేవిడ్ నిస్పృహగా ప్రశ్నించాడు.

"మనం అది తెలుసుకునే ప్రయత్నమే చేస్తున్నాం."

"తను చర్చిల్ అనుకునే రోగిలాగా నేనూ పిచ్చివాడినా డాక్టర్?"

"తీవ్ర మానసిక అశాంతితో నిన్న రాత్రి ఏదో సమయంలో మీరు మీరు ఎవరన్న విషయం పూర్తిగా మర్చిపోయారు. మిసెస్ బేరన్‌సన్ ఇంట్లోకి ప్రవేశించారు..."

"లేదు. నేనలా నమ్మాలని మీరు అనుకుంటున్నారు. కానీ అది నిజం కాదు. మీరు ఎన్ని చెప్పినా నేనెవరో నాకు తెలుసు. నాకు పిచ్చయినా ఎక్కుండాలి. లేదా ఎవరో కావాలని ఇవన్నీ చేస్తూండాలి."

"కావాలని ఎందుకు చేస్తారు?"

"నాకేం తెలుసు? ఏ కారణం వల్లో వాళ్ళు ఫోన్ పుస్తకాలు మార్చచ్చు. కానీ నా మనసులోని నా జ్ఞాపకాలని తుడిపేయలేరు కదా? వాళ్ళు ఏదైనా మర్చిపోయి ఉండచ్చు. కొన్ని లక్షల ఋజువుల్లో వాళ్ళు ఒకటి, రెండు మర్చిపోయి ఉండచ్చు. నేను నా భార్యకి కూడా చెప్పకుండా చేసిన ఒకటి రెండు పనులు ఉన్నాయి."

"మీరు మీ గదిలోకి వెళ్ళి వాటి గురించి ఆలోచిద్దురు గాని."

"లేదు. ఇప్పుడే." చెప్పి కిటికీ పగల కొట్టుకుని డేవిడ్ డాక్టర్ అరుస్తున్నా బయటికి పరిగెత్తాడు.

* * *

ఓ బార్లోకి ప్రవేశించిన డేవిడ్ కౌంటర్ వెనక నిలబడ్డ బార్ టెండర్‌తో చెప్పాడు.

"నాకో డ్రింక్ ఇవ్వు."

"ఏ డ్రింక్?"

"ఎప్పుడూ తాగేదే."

"అంటే?"

"విస్కీ."

అతను ఇచ్చిన విస్కీ మొత్తం ఒక్క గుక్కలో తాగి డేవిడ్ చెప్పాడు.

"శామ్. నా వంక చూడు."

"సరే. చూస్తున్నాను."

"నేనెవర్ని?"

"ఇక్కడికి వచ్చే ఎంత మంది పేర్లు నేను గుర్తుంచుకోగలను?"

"గత మూడేళ్ళుగా ప్రతీ శుక్రవారం రాత్రి నేను ఇక్కడికి వచ్చి తాగుతున్నాను."

"ఇంకో డ్రింక్ కావాలా?"

అది కూడా తాగి డేవిడ్ అడిగాడు.

"శామ్! అకస్మాత్తుగా నిన్ను నీ భార్య, మిత్రులు ఎవరూ కూడా గుర్తు పట్టకపోతే నీకెలా ఉంటుంది? శామ్‌బేకర్ అనే మనిషే లేడని అంతా అంటే నీకు ఎలా అనిపిస్తుంది?"

"నా మెదడు మార్చారని అంటాను."

"ఇంకో విస్కీ ఇవ్వు."

"మీరు చాలా తాగారు. మీకు నా పేరెలా తెలుసు?" శామ్ ప్రశ్నించాడు.

"మనం మిత్రులం. నీ భార్య పేరు పెర్ల్. నీ కూతురి పేరు లిండా. నీ కొడుకు అలెక్స్. నువ్వు కుస్తీ పోటీల్లో పాల్గొనేవాడివి."

కౌంటర్ మీద డాలర్ నోటుని ఉంచి డేవిడ్ చెప్పాడు.

"ఆగు... నేనెవరో గుర్తు చేసుకోడానికి నాకు ఇంతదాకా గుర్తు రానిది ఒకటి గుర్తొచ్చింది." హడావిడిగా బయటికి వెళ్ళిపోయాడు.

* * *

"నంబర్ ఏమిటి?" ఫొటో స్టుడియోలోని ఆమె అడిగింది.

"8017." డేవిడ్ చెప్పాడు.

ఆమె జూలో డేవిడ్‌కి అతని భార్యకి కలిపి తీసిన ఫోటోని ఓ కవర్ లోంచి తీసిచ్చి అడిగింది.

"ఇదేనా?"

"ఇదే." భార్య పక్కన నిలబడ్డ తన ఫొటోని చూసి దీర్ఘంగా నిట్టూర్చి చెప్పాడు.

"ఒక డాలర్ పది సెంట్లు." వేగంగా బయటికి వెళ్ళే డేవిడ్‌తో ఆమె చెప్పింది.

తలుపు తెరిచిన డేవిడ్‌కి ఎదురుగా డాక్టర్, పోలీస్ ఆఫీసర్ కనిపించారు.

"మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు?" డేవిడ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"నేనూ అదే ప్రశ్న అడుగుతున్నాను."

"ఇతను నాకు డబ్బివ్వాలి." ఆమె పోలీస్‌కి చెప్పింది.

"ఒక డాలర్ పది సెంట్లు. నేను పిచ్చివాడ్ని కాదని ఋజువు చేసే ఫోటో ఖరీదు ఇది. నేను చెప్పాగా, ఈ డ్రామా ఆడేవాళ్ళు అన్నీ మార్చలేరని. నేను ఎవరో తెలీదని చెప్పిన వ్యక్తి చేతులు పట్టుకున్న ఫోటో ఎలా వస్తుంది? చూడండి." డాక్టర్‌కి ఇవ్వబోతూ ఆ ఫోటో వంక చూస్తే, అందులో భార్య ఫోటో మాయమైంది!

"ఇందాక నేను నా భార్య ఫోటో చూసాను. మేము కలిసి తీయించుకున్నాం..." బాధగా చెప్పాడు.

* * *

"డేవ్! ఏమిటి కలిసి తీయించుకుంది... ఏమిటి కలవరిస్తున్నావు?" అన్న ఆడకంఠం బాత్ రూం లోంచి విని డేవిడ్ కళ్ళు తెరిచాడు.

"పీడకల వచ్చిందా?" ఆ కంఠం అడిగింది.

"అవును."

"ఏం పీడకల?"

"చెప్పాలంటేనే భయంగా ఉంది."

"ఆ పీడకల నువ్వు ఎక్కువ మార్టినీలు తాగకూడదనే పాఠం చెప్పిందా?" మొహానికి రాసుకున్న ఫేస్ మాస్క్‌ని కడుక్కుంటూ నవ్వుతూ అడిగింది.

మొహం తుడుచుకుంటూ వచ్చిన భార్య టవల్‌ని తీయగానే డేవిడ్ ఆమె వంక నివ్వెరపోతూ చూసాడు.

"డేవ్! ఏమైంది? నా వంక ఎందుకలా చూస్తున్నావు?" ఆమె అతని వైపు నడుస్తూ అడిగింది.

"నువ్వెవరు?" డేవిడ్ ఆమె వంక భయంగా చూస్తూ అడిగాడు.

# సేల్స్ మేన్

**-రాడ్ సెర్లింగ్**

**మృత్యుదేవతతో బేరం ఆడగలమా?**

**"లేడీస్ అండ్** జెంటిల్మన్. జూలై మాసాంతపు క్లియరెన్స్ సేల్స్. అన్నీ మీకు ఉపయోగించేవే. కేలమైన్ లోషన్. ఎండలో అది మంచిది. బైనాక్యులర్స్, పిల్లల ఆటవస్తువులు..."

అరవయ్యవ పడిలో పడిన లూయిస్ జె బుక్‌మేన్ న్యూయార్క్‌లో పేవ్‌మెంట్ మీద ఆ వేసవి సాయంత్రం వాటిని అమ్ముతున్నాడు.

ప్రతీ వేసవిలో జూలై నెలలో అతను ఆ రోడ్ మీద ఓ చిన్న భాగంగా ఇమిడి పోతూంటాడు. అతని జీవన సమరం ఎప్పుడూ పేవ్‌మెంట్స్ మీదే.

బుక్‌మేన్‌కి కొద్ది దూరంలో నల్ల సూట్‌లో నిలబడ్డ ఓ ముప్ఫై ఏళ్ళ వ్యక్తి అతన్ని చూస్తూ నోట్ బుక్‌లో ఏదో రాసుకుంటున్నాడు. ఆ రోజు మూడు గంటలకి అతన్ని తను కలవాల్సిన అవసరం ఉందని ఆ వ్యక్తికి తెలుసు.

రెండున్నరకి బుక్‌మేన్ అన్నీ పెట్టెలో సర్దుకుని హేండిల్‌ని పట్టుకుని అక్కడి నించి బయలుదేరాడు.

అతని ఇంటి మెట్ల దగ్గర ఆడుతున్న ఇద్దరు పిల్లలు అతన్ని ఆనందంగా పలకరించారు.

"అన్నీ అమ్మావా లూ?"

"లేదు."

మెట్ల మీద కూర్చుని మేగీ, రికీ అనే ఆ పిల్లలకి చాక్లెట్స్ ఇచ్చి చెప్పాడు.

"రాత్రి భోజనం అయ్యాక ఐస్‌క్రీం సమయం అని మర్చిపోకండి. గుడ్ బై."

తలుపు తెరుచుకుని లోపలికి వచ్చి ఆ పెట్టెని ఓ చోట ఉంచాడు. కెటిల్‌లో నీళ్ళని నింపి, ఇంట్లోని మొక్కల్లో నీళ్ళు పోస్తూ కుర్చీలో కూర్చున్న వ్యక్తిని చూసి తుళ్ళిపడ్డాడు.

"ఇందాక పేవ్‌మెంట్ మీద మిమ్మల్ని చూసాను. మీరు పుస్తకంలో ఏదో రాస్తున్నారు." బుక్‌మేన్ చెప్పాడు.

"మీ పేరు లూయిస్ జి బుక్‌మేన్ కదా?" అతను అడిగాడు.

"అవును. మీకేమైనా చూపించనా? టై?"

"నో మిస్టర్ బుక్‌మేన్. నేనేమీ కొనడానికి రాలేదు. లూయిస్ జె బుక్‌మేన్. నీ వయసు అరవై తొమ్మిది. అవునా?" అతను ప్రశ్నించాడు.

"అవును. వచ్చే సెప్టెంబర్‌కి డెబ్బై వస్తుంది."

"వృత్తి రోడ్డు పక్కన అమ్మడం. అవునా?"

"అవును. మీరు జనాభా లెక్కల వాళ్ళా?" బుక్‌మేన్ ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నకి జవాబు చెప్పకుండా మళ్ళీ అతను ప్రశ్నించాడు.

"న్యూయార్క్ సిటీలో 1890లో పుట్టారు కదా? తండ్రి పేరు జాకబ్ బుక్‌మేన్. తల్లి పేరు ఫ్లోరా బుక్‌మేన్. తండ్రి జన్మస్థలం డెట్రాయిట్, మిషిగన్. తల్లి జన్మస్థలం సిరాక్యూస్, న్యూయార్క్. అవునా?"

"అవును. అదంతా మీ పుస్తకంలో ఉందా?"

"అవును. మేము సమర్ధవంతంగా పని చేయాలంటే ఈ వివరాలన్నీ తెలుసుకోవాలి. ఈ రోజు జూలై పంతొమ్మిది. మీ ప్రయాణం ఈ అర్ధరాత్రి."

"నా ప్రయాణం?" బుక్‌మేన్ అర్థం కాక అడిగాడు.

సరిగ్గా ఆ సమయంలో తలుపు మీద ఎవరో కొట్టిన చప్పుడు వినిపించింది.

"ఎక్స్‌క్యూజ్ మీ." చెప్పి బుక్‌మేన్ వెళ్ళి తలుపు తెరిస్తే ఎదురుగా మేగీ నిలబడి ఉంది.

"ఎస్‌క్యూజ్ మీ మిస్టర్ బుక్‌మేన్. ఈ బొమ్మ పని చేయడం లేదు." చెప్పింది.

ఆమెని లోపలికి రమ్మని దాన్ని అందుకుని చూసి చెప్పాడు.

"కీ ఇచ్చేప్పుడు... చూసావా? ఇలా బలంగా ఇవ్వాలి."

కీ ఇస్తే అది టేబుల్ మీద నడిచింది.

"ఈ పాప మేగీ... మీ పేరు?" బుక్‌మేన్ ఆ నల్ల దుస్తుల్లోని వ్యక్తికి మేగీని పరిచయం చేసి అడిగాడు.

"అవసరం లేదు."

"ఇతను నన్ను చాలా ప్రశ్నలు అడగడానికి వచ్చాడు." మేగీకి చెప్పాడు.

"ఎవరు?" మేగీ అడిగింది.

"అతను." కుర్చీ వైపు చూస్తూ చెప్పాడు.

"ఎవరు?" మేగీ మళ్ళీ అడిగింది.

"మిస్టర్ బుక్‌మేన్. ఆమె నన్ను చూడలేదు. నా మాటలు వినలేదు." నల్ల సూట్‌లోని వ్యక్తి చెప్పాడు.

"ఎందుకని?" బుక్‌మేన్ ప్రశ్నించాడు.

"ఏమిటి ఎందుకని?" మేగీ అడిగింది.

"అతను నీకు ఎందుకు కనపడడం లేదు? ఎందుకు వినపడడం లేదు మేగీ?"

"ఎవరు లూ?" మేగీ ఎదురు ప్రశ్న వేసింది.

బుక్‌మేన్‌కి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

"థాంక్స్ లూ. బొమ్మ బాగా పని చేస్తోంది. రాత్రి ఐస్‌క్రీం అవర్లో కలుద్దాం." చెప్పి మేగీ వెళ్ళిపోయింది.

"మర్యాద. మర్యాద ఏది? గుడ్ బై చెప్పవా?" బుక్‌మేన్ అడిగాడు.

"గుడ్ బై లూ."

"నాక్కాదు. ఆ పెద్దమనిషికి."

"ఓ! ఇది ఆటా? అదృశ్య వ్యక్తీ! నీకు గుడ్ బై. ఐస్‌క్రీం టైంలో కలుస్తాను." చెప్పి మేగీ వెళ్ళిపోయింది.

"నేను చూడగలను. కాని ఆ పాప ఎందుకు నిన్ను చూడలేదు?" బుక్‌మేన్ ఆశ్చర్యంగా అడిగాడు.

"నాతో వచ్చే వాళ్ళకే నేను కనపడతాను."

ఆ వ్యక్తి కూర్చున్న కుర్చీ అకస్మాత్తుగా ఖాళీగా ఉన్నా, ఆ మాటలు వినపడడంతో బుక్‌మేన్ అటు ఇటు చూసాడు.

తల వెనక్కి తిప్పి చూస్తే ఇప్పుడు ఇంకో కుర్చీలో కూర్చుని ఉన్న ఆ వ్యక్తి మళ్ళీ చెప్పాడు.

"నాతో వచ్చే వారికే కనపడతాను. కాబట్టి మీ ఏర్పాట్లు మొదలుపెట్టండి."

"దేనికి ఏర్పాట్లు?"

"మీ ప్రయాణానికి."

"ఎక్కడికి ప్రయాణం?"

"మీ మనుషుల్ని నేను అర్థం చేసుకోలేను. మీరు భూమి మీద శాశ్వతంగా జీవిస్తాం అనుకుంటారు. కాని అది సాధ్యం కాదు. ప్రతీ వాళ్ళు ఏదో ఓ రోజు వెళ్ళాల్సిందే."

"అంటే?!?" బుక్‌మేన్ ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. నువ్వు అదృష్టవంతుడివి. ఎంతోమంది హింసాత్మకంగా పోతారు. నువ్వు నిద్రలో ప్రశాంతంగా పోతావు. మేము ఇలా ఎవర్నీ ముందుగా హెచ్చరించకూడదు."

"మీరేం చెప్తున్నారో నాకు అర్థం కావట్లేదు." బుక్‌మేన్ చెప్పాడు.

"మీరు మీ అండర్‌టేకర్‌కి ఫోన్ చేసి మీ అంత్యక్రియల ఏర్పాట్లు చేయండి. ఇంకా మీకు నేనెవరో అర్థం కాకపోతే..." పక్కనే ఉన్న ఇండోర్ ప్లాంట్‌కి ఉన్న తెల్లటి పువ్వుని చూసాడు.

అతను ఓ సారి దాన్ని ఎడమ చేత్తో తడమగానే ఆ కొమ్మ ముందుకి వాలి పోయి తక్షణం పూరేకులన్నీ రాలిపోయాయి.

"మీరు మృత్యుదేవతా?" బుక్‌మేన్ నివ్వెరపోతూ అడిగాడు.

"అవును మిస్టర్ బుక్‌మేన్. మీ ప్రయాణం ఈ అర్థరాత్రి. నిద్రలో బాధ లేకుండా ప్రాణం పోవడం మీకు ఇష్టమే అనుకుంటాను."

"ఓ క్షణం ఆగండి. నాకు చావాలని లేదు." బుక్‌మేన్ గొంతు పెగుల్చుకుని చెప్పాడు.

"ఎవరికీ చావాలని ఉండదు." మృత్యుదేవత విసుగ్గా చెప్పాడు.

"నేను చావడానికి కారణం లేదు. చాలా ఆరోగ్యంగా ఉన్నాను. క్రితం చలి కాలంలో జలుబు చేయడం, వేలిలో గుచ్చుకున్న ముల్లు తప్ప గత ఇరవై ఏళ్ళల్లో నేనెప్పుడూ అనారోగ్యం పాలు కాలేదు."

"కావచ్చు. కానీ మీ ప్రయాణ సమయం ఈ అర్థరాత్రి నిర్ణయించబడింది."

"ఈ విషయంలో నేను చెప్పేదేమీ వినరా?" బుక్‌మేన్ కోపంగా అడిగాడు.

"మేము వేడుకోళ్ళని వింటాం. కానీ అందుకు మూడు కొలబద్దలు ఉన్నాయి. ఒకటి కష్టం. మీరు మరణిస్తే ఆర్థికంగా బాధ పడేవాళ్ళు ఉన్నారా? మీకు భార్య కానీ, కుటుంబ సభ్యులు కానీ ఉన్నారా?"

"లేరు."

"రెండో కొలబద్ద మేలు చేసే వారై ఉండడం. అంటే ఏదైనా కనిపెట్టే దశలో ఉన్న శాస్త్రజ్ఞులు, రాజకీయవేత్తలు... మీరు పెద్ద శాస్త్రీయ పరిశోధన చేస్తున్న శాస్త్రజ్ఞుడని నేను అనుకోను."

"లేదు. మూడో కొలబద్ద ఏమిటి?" బుక్‌మేన్ అడిగాడు

"మీరు దానికి కూడా అర్హులు కారనుకుంటాను. పూర్తి కాని ఏదైనా ముఖ్యమైన పని మీకు లేదనుకుంటాను?"

"ఉంది. నిజంగా ఉంది. నాకు పూర్తి కాని ఓ ముఖ్యమైన పని ఉంది. ఓ ముఖ్యమైన పని." బుక్‌మేన్ ఆలోచించాడు.

అతనికి టేబుల్ మీది హెలికాప్టర్ బొమ్మ కనిపించింది.

"నేను ఇంతదాకా ఎన్నడూ హెలికాప్టర్‌లో ఎగరలేదు." తల తిప్పి చూస్తే మృత్యుదేవత మళ్ళీ ఆ కుర్చీలో లేడు.

"అది సరిపడే కారణం కాదు. ఇంకేదైనా ఉందా?" మాటలు వినపడ్డాయి.

బుక్‌మేన్‌కి మృత్యుదేవత ఇంకో కుర్చీలో కనిపించాడు.

"దయచేసి మీరు కదలకుండా ఒకే చోట ఉంటారా? నేనింతదాకా జూలూ వార్ డేన్స్‌ని చూడలేదు. నాకు ఒకటి రెండు నెలలు టైమిస్తే దాన్ని చూస్తాను."

"మిస్టర్ బుక్‌మేన్. తీవ్రమైన వాంఛ గల పెద్ద విషయమై ఉండాలది."

"అలాంటిది ఒకటుంది."

"ఏమిటది?"

"నేను అన్ని వస్తువులని అమ్మి ఉత్త చేతులతో ఇంటికి రావాలని ఉంది. కానీ వ్యాపారం మొదలు పెట్టినప్పటి నించి ఇంత దాకా అలా జరగలేదు. ఆకాశంలోని దేవతలందరూ దిగి వచ్చి అన్నీ కొనాలి. నా పెట్టె విశాలమైన ఆకాశంలా ఖాళీ అవాలి. ఇది మీకు తీవ్ర వాంఛలానే అనిపించక పోవచ్చు. కానీ నాకు అనిపిస్తోంది. అలా జరిగితే అది నా జీవితంలో మొదటి విజయం అవుతుంది. పిల్లలు ఆనందపడతారు."

"పిల్లలు?"

"అవును. నాకు పిల్లలంటే ఇష్టం. నేను ఇంటికి రాగానే వాళ్ళు అడిగే ప్రశ్న, 'అన్నీ అమ్మావా లూ?' అని."

"అవును. అదంతా ఇక్కడ నా పుస్తకంలో ఉంది. ఇక్కడ సమస్య ఏమిటంటే మిస్టర్ బుక్‌మేన్, దేవతలు అన్నీ కొనే రోజు దాకా ఆగాలి."

"అవును. దేవతలు వచ్చి అన్నీ కొనే దాకా ఆగుదాం." బుక్‌మేన్ నవ్వుతూ చెప్పాడు.

"ఐయాం టెరిబ్లీ సారీ బుక్‌మేన్. కానీ నో. ఈ కొలబద్దలు చాలా స్పష్టమైనవి..."

అతను చేతులు కట్టుకుని సోఫాలో విచారంగా కూర్చున్న బుక్‌మేన్‌ని చూసాడు.

"దురదృష్టవశాత్తూ తన వృత్తిలో విజయాన్ని సాధించడం అన్నది తీవ్రమైన వాంఛే అవుతుంది. అది నిజంగా మీ తీవ్ర వాంఛా?" మృత్యుదేవత అడిగాడు.

"అవును. తీవ్ర వాంఛ."

"సరే. మిస్టర్ బుక్‌మేన్ నా అధికారాన్ని ఉపయోగించి మీ ప్రయాణాన్ని వాయిదా వేస్తాను."

"ఎప్పటి దాకా?" బుక్‌మేన్ ఆనందంగా నవ్వుతూ అడిగాడు.

"మీరు కోరుకున్న రీతిలో అమ్మకాలు జరిగే దాకా."

"అంతదాకా నేను జీవించే ఉంటానా?"

"అదే కదా మన ఒప్పందం?" తన పుస్తకంలో ఏదో రాసుకుంటూ మృత్యుదేవత చెప్పాడు.

"ఇది మంచి బేరం. మీ పేరేమిటి?" అడుగుతూ తలుపు తెరిచాడు.

నల్ల సూట్‌లోని ఆ వ్యక్తి బయటికి వెళ్తూ చెప్పాడు.

"బుక్‌మేన్. ఈ అమ్మకం గురించి... ఇది ఎప్పుడు జరగచ్చు?"

"ఎప్పడా? త్వరలో. వారంలో, నెలలో... ఓ సంవత్సరంలో కాకపోవచ్చు. ఒకటి రెండేళ్ళు కూడా పట్టచ్చు."

"మీరు నన్ను మూర్ఖుడ్ని చేస్తున్నారనే భావన నాలో కలుగుతోంది." మృత్యుదేవత చెప్పాడు.

"కలిగిందా? మీకు నా సానుభూతి. నేను చేసింది అదే." చెప్పి బుక్‌మేన్ తలుపు మూసాడు.

"ఇంక నేను అమ్మనే అమ్మను. ఇక నించి నేను నోరే తెరవను." బయటకి చెప్పాడు.

"నిజంగానా మిస్టర్ బుక్‌మేన్? మీరు ఊహించిన దాని కంటే ఇది చాలా సీరియస్." కుర్చీలో ప్రత్యక్షమైన మృత్యుదేవత చెప్పాడు.

వెంటనే బుక్‌మేన్ టోపీ అందుకుని, తల మీద పెట్టుకుని తలుపు తెరిచి బయటికి వెళ్ళి తలుపుకి తాళం వేసి మెట్లు దిగుతూంటే మెట్ల రైలింగ్ మీద కూర్చుని కనపడ్డ మృత్యుదేవత మళ్ళీ చెప్పాడు.

"ఇది మీరు అనుకున్నదాని కన్నా కష్టమైంది."

బుక్‌మేన్ నోరు తెరవకుండా మెట్లు దిగాడు.

"నేను చేసిన సహాయానికి ఇదా మీ ప్రత్యుపకారం?" కింది అంతస్థులో గోడకి ఆనుకుని నిలబడ్డ మృత్యుదేవత మళ్ళీ అడిగాడు.

జవాబు చెప్పకుండా బుక్‌మేన్ కిందికి దిగి రోడ్డు మీదకి వెళ్ళే తలుపు తెరవగానే ప్రత్యక్షమైన మృత్యుదేవత చెప్పాడు.

"మిస్టర్ బుక్‌మేన్! ఇది మీరు అనుకున్నట్లుగా జరగదు. దీనికి తగిన ఫలితం అనుభవిస్తారు."

"మనిద్దరం ఓ అంగీకారానికి వచ్చాం. నేను నా వస్తువులు మొత్తం అమ్మే దాకా మీరు వేచి ఉండాల్సిందే. అందుకు మీరు చాలా కాలం వేచి ఉండాల్సి ఉంటుందని మాత్రం చెప్పగలను."

"ఐతే మీరు ఈ అర్ధరాత్రి నాతో రారు. కాబట్టి, నేను ఇంకొకర్ని తీసుకెళ్ళాల్సి ఉంటుంది." మృత్యుదేవత చెప్పాడు.

తక్షణం బయట నించి కారు సడన్ బ్రేక్ వేసిన చప్పుడు, ఓ మహిళ అరుపులు వినిపించాయి. బుక్‌మేన్ చూస్తే, ఆగి ఉన్న ఓ కారు ముందు రోడ్డు మీద మేగీ పడి ఉంది. తక్షణం బుక్‌మేన్ పరిగెత్తుకెళ్ళి మేగీ పక్కన మోకాళ్ళ మీద కూర్చున్నాడు.

"అకస్మాత్తుగా పేవ్‌మెంట్ మీంచి పరిగెత్తుకొచ్చింది. నేను ఆపే సమయం లేకపోయింది. ఒట్టేసి చెప్తున్నా. ఆపలేకపోయాను." ఆ కారు డ్రైవర్ కంగారుగా చెప్పాడు.

"ఎవరైనా డాక్టర్‌కి, అంబులెన్స్‌కి ఫోన్ చేయండి." బుక్‌మేన్ ఆదుర్దాగా చెప్పాడు.

తన కోటు విప్పి మేగీ తల కింద దిండులా ఉంచి ఆ పాపని ముద్దు పెట్టుకున్నాడు. కళ్ళు తెరిచి అతన్ని చూసిన మేగీ చెప్పింది.

"హలో లూ."

"హలో మేగీ. నీకేం కాదు." ధైర్యం చెప్పాడు.

అకస్మాత్తుగా ఆమె మొహం కళావిహీనమైంది.

"లూ. ఆ మనిషి ఎవరు?" అడిగింది.

తల తిప్పి చూస్తే బుక్‌మేన్‌కి తన పుస్తకంలో ఏదో రాసుకుంటున్న మృత్యుదేవత కనిపించాడు.

"నీకు అతను కనిపిస్తున్నాడా?" బుక్‌మేన్ తృళ్ళిపడి అడిగాడు.

"అవును."

వెంటనే బుక్‌మేన్ లేచి అతని దగ్గరకెళ్ళి చెప్పాడు.

"మీరు ఆ పాపని తీసుకెళ్ళకూడదు. ఆగండి. నేనే వస్తాను. అమ్మకాలు జరిగే దాకా ఆగకుండా వెంటనే వస్తాను. మేగీని తీసుకెళ్ళద్దు."

మృత్యుదేవత మాయమయ్యాడు.

* * *

ఆ రాత్రి మేగీని పరీక్షించి బయటికి వస్తున్న డాక్టర్ని బుక్‌మేన్ అడిగాడు.

"డాక్టర్! మేగీకి ఎలా ఉంది?"

"ఇప్పుడే ఏం చెప్పలేను. ఈ అర్ధరాత్రి గడిస్తే కాని ఏం చెప్పలేను."

"అర్ధరాత్రా?"

"అవును. అప్పటికి ఆటో ఇటో తేలుతుంది."

'అతన్ని నేను లోపలికి వెళ్ళనివ్వను.' బుక్‌మేన్ మృత్యుదేవత గురించి మనసులో అనుకున్నాడు.

* * *

రాత్రి పదకొండు నలభై అయింది. మేగీ ఇంటి కింది మెట్టు మీద కూర్చున్న బుక్‌మేన్ దగ్గరికి మృత్యుదేవత వచ్చి పలకరించాడు.

"హలో బుక్‌మేన్."

"మీకు లోపల పనుందా?" బుక్‌మేన్ మేగీ ఇంటి తలుపు వైపు చూపిస్తూ అడిగాడు.

"ఉంది. ఇంకో పావుగంటలో పన్నెండింటికి అర్ధరాత్రి నాకు అపాయింట్‌మెంట్ ఉంది." చెప్పి అతను బుక్‌మేన్ పక్కన కూర్చున్నాడు.

"చూడండి. ఆ చిన్న పిల్ల వయసు ఎనిమిదేళ్ళే. ఆమెని వదిలి నన్ను తీసుకెళ్ళండి. నేను ఇప్పుడు మీతో రావడానికి సిద్ధంగా ఉన్నాను."

"ఐ యాం సారీ. నేను ఇతర ఏర్పాట్లు చేసుకోవాల్సి వచ్చింది. వాటిని ఇప్పుడు మార్చుకోవడం అసాధ్యం. ఆమె ఈ అర్ధరాత్రి నాతో వచ్చి తీరాలి. కాబట్టి నేనా సమయంలో అక్కడ ఉండాలి."

"ఒకవేళ మీరు ఉండకపోతే?" బుక్‌మేన్ ప్రశ్నించాడు.

"అలాంటిది ఇంతదాకా జరగలేదు. సరిగ్గా అర్ధరాత్రి నేనక్కడికి వెళ్ళకపోతే, మొత్తం టైమ్ టేబుల్ చిన్నాభిన్నం అవుతుంది."

బుక్‌మేన్ జడ్ ఆకారంలోని బల్ల కాళ్ళని పైకి లేపి పెట్టె మూతని తెరిచాడు.

"ఏమిటి?" మృత్యుదేవత అడిగాడు.

"ఏం లేదు. అమ్మకం మొదలు పెట్టబోతున్నాను. అంతే."

"ఇంత రాత్రా?"

"నేను అనేకసార్లు ఈ సమయంలో అమ్మాను."

"ఇక్కడ ఎవరూ కస్టమర్స్ లేరుగా?"

"వస్తారు... మీరున్నారుగా."

"నిజమే. కానీ నేను కస్టమర్‌ని కాదు."

"మీకెలా తెలుసు? ఎప్పుడైనా నేను అమ్మేవి చూసారా?" ఓ టైని బయటకి తీసి చూపిస్తూ అడిగాడు.

"ఈ అందమైన టైని చూడండి. ఇది మీకు ఎలా కనిపిస్తోంది?"

"టై లాగా."

"ముట్టుకుని చూడండి." అతను ముట్టుకుని 'ఐతే?' అని అడిగాడు.

"లేడీస్ అండ్ జెంటిల్మన్! ఆటమిక్ ఎనర్జీ టైం నించి ఇంతదాకా తయారైన వాటిలో మీ కళ్ళకి విందు చేసే ఈ టైని చూడండి. ఇది ఎంత గొప్పగా అల్లబడిందంటే, ప్రాచీన చైనీస్ పట్టు తయారీదారులు కూడా నివ్వెరపోతారు. వారే నమ్మలేనంత మృదువుగా దీన్ని అల్లారు..."

బుక్‌మేన్ ఒక్కో వస్తువు తీసి చూపించి చెప్పుకుపోతున్నాడు.

"...ఈ దారం చూడండి. ఎంత బలమైందంటే సాగదు."

మృత్యుదేవతకి అందిస్తే అతను లాగాడు. కాని అది సాగలేదు. అప్పటికే అతను కొన్న టైలు అతని ఎడమ చేతి మీద వేలాడుతున్నాయి.

"ఉక్కులా బలమైంది. అదే సమయంలో చైనాలోని శాన్‌టాన్ బట్టంత మృదువైంది. మూడు వందల ఏళ్ళ పాటు కష్టించి పరిశోధించి ఈ అద్వితీయమైన దారాన్ని అభివృద్ధి చేసారు. ఈ ఆశ్చర్యకరమైన, నమ్మలేని, కుట్టు పనిలో ఉపయోగించే దారానికి ఎంతిస్తారు? ముప్ఫై డాలర్లిస్తారా? ఈ దారబ్బంతి? పాతిక? ఇరవై? పది?"

పదికి మృత్యుదేవత తల ఊపగానే బుక్‌మేన్ ఇంకో దారం ఉండ చూపించి చెప్పాడు.

"దీన్ని మీరు షాప్‌లో కొనాలనుకుంటే ఇది మీకక్కడ దొరకదు. సముద్రయానం మీద శిక్షణ ఇవ్వబడ్డ ఎనిమిది వందల ముప్ఫై రెండు ఆసియా పక్షులు కలిసి ఒక్క దారాన్ని తీసుకువచ్చాయి. ఈ జూలై నెల వేడి వేసవి రాత్రి అమ్మకంలో ఈ విలువైన

దారపు ఉండని ఇరవై డాలర్స్‌కి, కాదు పదికి కాదు. ఐదుకి కూడా కాదు. అత్యంత తక్కువ ధరైన పాతిక సెంట్లకే మీకు అమ్ముతున్నాను."

అతను చెప్పే దాంట్లో నిమగ్నుడైన మృత్యుదేవత వెంటనే చెప్పాడు.

"నీదగ్గర ఉన్నవన్నీ కొంటాను."

సమయం ఐదు నిముషాల తక్కువ పన్నెండైంది.

"సూదులు. దారం. నిజమైన ప్లాస్టిక్ షూ లేస్‌లు. ఏ రేడియోలో అయినా పట్టే బేటరీలు. సన్‌టేన్ ఆయిల్. ఎగ్జిమా పౌడర్. రేజర్. కాశ్మీర్ సాక్స్..."

"సరే. సరే. అవన్నీ నేను తీసుకుంటాను." మృత్యుదేవత చెప్పాడు.

బుక్‌మేన్ గోధుమరంగు కాగితం సంచీలో తన పెట్టెలోనివన్నీ పడేస్తూంటే, అతను జేబులోంచి పర్స్ తీసాడు.

అర్ధరాత్రికి ఇంకా అర నిమిషం ఉంది.

"తప్పక వ్యామోహం చెందే అసలైన వస్తువు ఇప్పుడు బయటికి తీస్తున్నాను. ఇంతదాకా దీన్ని ఈ దేశంలో కానీ, మరే దేశంలో కానీ నేను అమ్మకానికి పెట్టలేదు. ఒక విధేయత గల జీవించి ఉన్న మానవ మగ పనివాడు."

"ఏమిటి?"

"నేను కోరేది మీరు ఇస్తే మీరు సమర్ధత, చక్కటి విధేయత గల, కుడి చేతిని ఉపయోగించే ఎలాంటి అవకరం లేని మగాడిని కొనచ్చు. మీరు అతన్ని ఎలా కావాలంటే అలా ఉపయోగించుకోవచ్చు."

"ఎవరది?"

"నేను. లూయిస్ జె బుక్‌మేన్‌ని. ఇది మొదటి మోడల్. శరీరభాగాలు నాలుగేళ్ళ పాటు మార్చాల్సిన అవసరం లేకుండా పని చేస్తాయనే సర్టిఫికెట్‌తో ఇది మీకు అందుతుంది. అతను తక్కువ తింటాడు. తక్కువ నిద్రపోతాడు. ఎప్పుడైనా విశ్రాంతి తీసుకుంటాడు. అతను మీ మోచేతి దగ్గరే ఉండి, మీరెప్పుడు పిలిస్తే అప్పుడు పలుకుతాడు."

"మిస్టర్ బుక్‌మేన్. మీరు గొప్ప సేల్స్‌మేన్. నేను ఏదైనా షాప్‌ని కానీ, హోల్‌సేల్ దుకాణాన్ని కానీ, పరిశ్రమని కాని స్థాపించినా మీలా అమ్మలేనని మీకు ఇప్పుడు హామీ ఇస్తున్నాను. ఎందుకంటే, నేను మీకు..."

దూరంగా చర్చిలో ఆఖరి గంట వినిపించింది. మృత్యుదేవత అకస్మాత్తుగా మెట్ల మీంచి లేస్తూ కంగారుగా చెప్పాడు.

"అర్థరాత్రి అయింది. నేను నా అపాయింట్‌మెంట్‌ని మిస్ అయ్యాను."

మేగీ కళ్ళు తెరిచి చూసింది.

"మిసెస్ పోలాన్‌స్కీ. ప్రమాదం తప్పింది. మేగీకి ప్రతీ మూడు గంటలకీ ఓసారి ఆ మాత్రలు ఇస్తూండండి. విశ్రాంతి కావాలి." చెప్పి డాక్టర్ ఇంట్లోంచి బయటకి వచ్చి మెట్లు దిగి బుక్‌మేన్ వంక చూసి చెప్పాడు.

"ప్రమాదం తప్పింది."

పన్నెండు దాటి ఒక్క నిమిషమైంది.

"బుక్‌మేన్! మీరు నా అపాయింట్‌మెంట్‌ని మిస్ చేసారు." మృత్యుదేవత చెప్పాడు.

"థాంక్ గాడ్! ఇందాక గొప్ప అమ్మకం జరిగింది మిస్టర్! అద్భుతమైన అమ్మకం. అవును. మీకు సమయమే తెలియనివ్వని అమ్మకం. ఇంతదాకా నేనెన్నడూ ఇంత లీనమై అమ్మలేదు. ఇలా అమ్మాలనే నా తీవ్ర వాంఛ. ఎలాంటి అమ్మకం అంటే, విశాలమైన ఆకాశం లోంచి..."

"దేవతలు దిగి వచ్చి కొనేంత." మృత్యుదేవత పూర్తి చేసాడు.

"అవును. దేవతలే వ్యామోహం చెందే అమ్మకం జరిగింది. ఓ మృత్యుదేవతా! మన ఒప్పందం ప్రకారం నేను సిద్ధంగా ఉన్నాను." బుక్‌మేన్ టై ముడి సర్దుకుంటూ చెప్పాడు.

"ముందు మీరు నడవండి మిస్టర్ బుక్‌మేన్."

పేవ్‌మెంట్ మీద బుక్‌మేన్ నాలుగడుగులు వేస్తే మృత్యుదేవత అతన్ని అనుసరించాడు. బుక్‌మేన్ ఆగి వెనక్కి తిరిగి వెళ్ళి తన పెట్టె అందుకుని హేండిల్ పట్టుకుని నడుస్తూ అడిగాడు.

"పైన ఎవర్ని కలుస్తానో నాకు తెలీదు. పైకే కదా?"

"పైకే మిస్టర్ బుక్‌మేన్. పైకే." మృత్యు దేవత చెప్పాడు.

# అద్భుతం

**-జార్జ్ లాంజెలాన్**

**కొన్ని విశ్వాసాలు స్వానుభవం అయే దాకా మూఢనమ్మకాలే..**

**మేరియా హాస్పిటల్** ముందు కారు దిగి లోపలికి వెళ్ళింది. అక్కడి విశాలమైన హాల్‌లో రైలు ప్రమాదంలో చిక్కుకున్న క్షతగాత్రులు కొందరు మంచాల మీద, కొందరు నేల మీద పడుకుని ఉన్నారు. ఆమె అందర్నీ పరిశీలించి చూసి, నేల మీద పడుకుని ఉన్న తన భర్త సెగ్వేరా దగ్గరకి పరిగెత్తుకెళ్ళి అతన్ని కౌగిలించుకుని ఆనందంగా చెప్పింది.

"థాంక్ గాడ్! మీరు జీవించే ఉన్నారు. థాంక్ గాడ్!"

"నేను నాస్తికుడ్ని. గాడ్ లేడు." సెగ్వేరా విసుగ్గా చెప్పాడు.

మేరియా అతని కాళ్ళ వంక చూసింది.

"మీ మీద బరువైన ఇనప చక్రం పడిందని, మీ వెన్నులో ఓ నరానికి ఏదో అయిందని డాక్టర్ చెప్పారు. కాళ్ళని కొంచెం కూడా కదపలేరా?" మేరియా అడిగింది.

"ఊహూ. కాని నాకు ఎక్కడా నొప్పి లేదు. ఒకటి, రెండు వారాల్లో నేను సంపూర్ణ ఆరోగ్యవంతుడిని అవుతాను. మనింట్లో నడుస్తాను." చెప్పాడు.

* * *

మేరియా పియానో వాయిస్తోంది. పేకముక్కలతో పేషెన్స్ ఆడుతున్న సెగ్వేరా తన చక్రాల కుర్చీని మేరియా వైపు తోసుకువచ్చి ఆమె చేతిని అందుకుని ముద్దు పెట్టుకున్నాడు.

"డార్లింగ్. నేను అలసిపోయాను." అనాసక్తిగా చెప్పి ఆమె లేచి మెట్లెక్కి తన పడక గదిలోకి వెళ్ళిపోయింది.

"మనకి నష్టపరిహారం రాగానే ఓ కారుని కొందాం. నువ్వు అందులో నన్ను అన్ని చోట్లకీ తీసుకువెళ్ళచ్చు. ఈ ఇంటిని కూడా కొనగలం." మెట్లెక్కే మేరియాతో అతను గట్టిగా చెప్పాడు.

మంచం మీద నిస్సారంగా పడుకున్న మేరియాకి పడక కుదర్లేదు. శబ్దానికి తల తిప్పి చూస్తే ఎదురుగా తలుపు తెరచుకుని నిలబడ్డ భర్త కనిపించాడు.

"అదేమిటి? మీరు నడవగలరా?" నివ్వెర పోతూ లేచి కూర్చుని అడిగింది.

"లేదు. నాకు ఎప్పటికీ బాగవదు. అర్థమైందా? స్పెషలిస్ట్ డాక్టర్ నన్ను పరీక్షించి చెప్పిన మాట ఇది. నేను జీవితకాలం సంపాదిస్తే ఎంత వస్తుందో అంత నాకు నష్టపరిహారంగా చెల్లించబోతున్నారు."

"మరి మీకు ఎలా నయమైంది?" అర్థం కాని మేరియా అడిగింది.

"నాకు ఇక బాగవదు. పూర్తి నష్టపరిహారం వచ్చేదాకా నేను ఇలాగే ఉంటాను. వాళ్ళు చాలా డబ్బిస్తారు. నేను వాళ్ళని మూర్ఖుల్ని చేసాను. మనం ఓపిక పడితే డబ్బు దానంతట అదే వస్తుంది." అతను బస్కీలు తీసి చూపిస్తూ చెప్పాడు.

"కానీ అది మోసం చేయడం కాదా?" మేరియా అడిగింది.

"కాని అందువల్ల మనకి జీవితాంతం సరిపడే డబ్బు వస్తుంది."

"వాళ్ళు ఈ సంగతి కనుక్కోలేరా?" ఆమె ఆలోచనగా అడిగింది.

"ఉహూ. మనం జాగ్రత్తగా ఉంటే చాలు." సెగ్వేరా ధైర్యం చెప్పాడు.

* * *

రెండు వారాల తర్వాత సెగ్వేరా పాస్‌బుక్ తీసి అందులోని బేలన్స్ మొత్తాన్ని చూపించి చెప్పాడు.

"ఈ అంకె ఎంత అందంగా ఉందో చూడు. కాని నాకు ఈ చక్రాల కుర్చీ అంటే అసహ్యం. అంతా నన్నే చూస్తారు." దాంట్లో కూర్చుంటూ చెప్పాడు.

"నాకూ అసహ్యమే. రోజూ నిన్ను చల్ల గాలికి బయటికి తీసుకెళ్తుంటే అంతా నా వంకే సానుభూతిగా చూస్తున్నారు. అది నేను భరించలేను."

అతని కాళ్ళ మీద దుప్పటి కప్పి ఆమె ఆ కుర్చీని బయటికి తోసుకెళ్ళింది. భార్యాభర్తలు ఇద్దరూ గొర్రె నడిపే ఓ చిన్న బండి మీద కూర్చున్న పన్నెండేళ్ళ పిల్లని చూసారు. ఆ పిల్ల ఫాదర్ని చూసి బండి ఆపింది.

"ఎవరామె?" సెగ్వేరా అడిగాడు.

"ప్రతీ వారం మార్కెట్‌కి వస్తూంటుంది. పేరు కెరోలిన్." మేరియా చెప్పింది

ఫాదర్ తమని పిలుస్తూండడంతో మేరియా చక్రాల కుర్చీని అటు వైపు తీసుకువెళ్ళింది.

"కెరోలిన్‌కి కూడా మీలాంటి ఇబ్బందే వచ్చింది. కాళ్ళకి పక్షవాతం." ఫాదర్ చెప్పాడు.

కెరోలిన్ కూడా కాళ్ళ నించి దుప్పటి కప్పుకుని ఉంది.

"ఏం చేస్తాం? మనం దేవుడి చేతుల్లో ఉన్నాం." సెగ్వేరా దీనంగా చెప్పాడు.

"కెరోలిన్ ఏటా నొవాలెస్‌కి తీర్థయాత్రకి వెళ్తూంటుంది." ఫాదర్ చెప్పాడు.

"అవును. నేను ఓ అద్భుతం కోసం ప్రార్థించడానికి వెళ్తూంటాను." కెరోలిన్ ఉత్సాహంగా చెప్పింది.

"ఈ ఏడు కూడా వెళ్తున్నావా?" మేరియా ప్రశ్నించింది.

"లేదు. ఈ ఏడాది అందుకు సరిపడే డబ్బు కెరోలిన్ దగ్గర లేదు." ఫాదర్ విచారంగా చెప్పాడు.

"కానీ నాకు వెళ్తానని, నా కాళ్ళు బాగవుతాయనే ఆశ ఉంది." కెరోలిన్ చెప్పింది.

"ఫాదర్! మీరు నాకో దారి చూపించారు. కెరోలిన్ లాగా ఈ ఏడు నేను నోవాలిస్‌కి వెళ్తాను. నా కాళ్ళు తిరిగి వచ్చేలా చేయమని ప్రార్థిస్తాను." సెగ్వేరా చెప్పాడు.

* * *

"కరోలిన్‌కి ఉన్నది మూఢనమ్మకం కాదు. ఇలాంటివి నేను నమ్ముతాను." ఆ సంగతి విన్న ఇన్సూరెన్స్ ఏజెంట్ చెప్పాడు.

తర్వాత అతను ఓ చెక్‌ని, రసీదుని ఇచ్చి చెప్పాడు.

"మిస్టర్ సెగ్వేరా! ఇది మీ ఆఖరి చెక్. సంతకం చేయాల్సిన కాగితం ఇది. నొవాలిస్‌కి వెళ్ళి అంగవైకల్యం పోగొట్టుకున్న అద్భుతాలు కొన్ని నాకు తెలుసు."

"అంటే ఆ నీళ్ళు కుంటివాళ్ళకి కాళ్ళు తెప్పిస్తాయంటారా? నాలాంటి వాళ్ళు ఎవరైనా వెళ్ళచ్చా?" సెగ్వేరా అడిగాడు.

"అందుకు గాఢమైన విశ్వాసం ఉండాలి. నొవాలెస్‌లో ఓ కాన్వెంట్ ఉంది. దాని మధ్యలో ఓ నీళ్ళ ఫౌంటెన్, పైన వర్జిన్ మేరీ విగ్రహం ఉన్నాయి. ఆ నీళ్ళలో అద్భుత శక్తి ఉందని నమ్మకం. కుంటివాళ్ళకి అక్కడ మేలు జరుగుతుంది."

సెగ్వేరా సంతకం చేసి ఇచ్చిన కాగితం అందుకుని అతనికి చెక్ ఇచ్చి ఏజెంట్ వెళ్ళిపోయాడు. మేరియా తలుపు మూసింది.

వెంటనే రెండు కాళ్ళని ఎత్తి టేబుల్ మీద పెట్టి సెగ్వేరా భార్యతో చెప్పాడు.

"ఇరుగుపొరుగుతో మనం నొవాలెస్‌కి వెళ్తున్నాం అన్న సంగతి చెప్పు. అక్కడ అద్భుతం జరిగి నాకు కాళ్ళొస్తాయి. ఆ అద్భుతాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. ఆ తర్వాత మన జీవితం ఆ రైలు ప్రమాదం మునుపటిలానే సాగుతుంది."

* * *

సెగ్వేరాకి నొవాలెస్‌లో చాలామంది చక్రాల కుర్చీల్లో కనిపించారు. కుంటివాళ్ళు మోకాళ్ళ మీద దేకుతూ ఫౌంటెన్ దగ్గరికి వెళ్తున్నారు. ఒకరిద్దరు బెలూన్స్ అమ్ముతున్నారు. అంతా కోలాహలంగా ఉంది.

"నాకు సహాయం చేయకు. నేనే ఆ నీళ్ళ దగ్గరికి వెళ్తాను." సెగ్వేరా మేరియాకి చెప్పాడు.

"అలాగే. ఆ నన్ మనల్నే చూస్తోంది." తల మీద బట్టని కప్పుకుని మేరియా చెప్పింది.

సెగ్వేరా మోకాళ్ళ మీద దుప్పటిని తీసి భార్యకి ఇచ్చి కుర్చీ లోంచి నేల మీదకి దిగాడు. రెండు చేతులనీ నేలకి ఆనించి, ఫౌంటెన్ వైపు నడుం కింద భాగాన్ని లాక్కుంటూ దేకసాగాడు.

అక్కడ ఉన్న చాలామంది అతన్ని చూసారు. అతను ఫౌంటెన్ అంచు దగ్గర ఆగి మేరీ మాత విగ్రహం వంక కొద్ది సేపు చూసి ఎడం చేత్తో ఫౌంటెన్ లోని నీటిని అందుకుని తన రెండు మోకాళ్ళకి రాసుకున్నాడు. అదే సమయంలో చర్చి గడియారం గట్టిగా ఐదు గంటలు కొట్టింది. సెగ్వేరా నెమ్మదిగా ఫౌంటెన్ అంచుని పట్టుకుని లేచి నిలబడ్డాడు. భార్య వైపు చూస్తూ తడబడుతూ నాలుగు అడుగులు ముందుకి వేసాడు. తర్వాత గట్టిగా అరిచి చెప్పాడు.

"నేను నడవగలుగుతున్నాను."

"అద్భుతం జరిగింది!" మేరియా కూడా గట్టిగా అరిచింది.

అంతా అతని వంక ఆరాధనగా, ఆశ్చర్యంగా చూసారు. అకస్మాత్తుగా సెగ్వేరా నేల కూలాడు. లేవడానికి విఫల ప్రయత్నం చేసి భయంగా భార్యతో చెప్పాడు.

"నా కాళ్ళు... నా కాళ్ళని నేను కదపలేకపోతున్నాను."

"పాపం! ఇతనికి అద్భుతం జరగలేదు." ఒకరిద్దరు అనుకున్నారు.

* * *

మార్కెట్‌లో గొర్రె బండిని తోలే కెరోలిన్ ఫాదర్ని చూసి బండి ఆపి చెప్పింది.

"మీకో సంగతి చెప్పాలి ఫాదర్."

"ఏమిటది?" ఆయన దయగా చూస్తూ అడిగాడు.

"బహుశా మీరు నమ్మరు."

"లేదు. నమ్ముతాను. చెప్పు."

"నిన్న సాయంత్రం సరిగ్గా ఐదుకి నేను నా గదిలో ఉండగా మేరీ మాత విగ్రహం అకస్మాత్తుగా కాంతివంతం అయింది. తర్వాత మేరీ మాత దర్శనం ఇచ్చింది."

"ఒద్దు కెరోలిన్. నువ్వు కట్టుకథలు చెప్పకూడదు." ఫాదర్ వారించాడు.

"నిజమే చెప్తున్నా ఫాదర్. ఆమె నాతో చెప్పింది. 'కెరోలిన్! నేను ఓ మోసగాడి నించి ఉపయోగం లేని రెండు కాళ్ళని తీసుకుని నీకు ఇస్తున్నాను' ఆమె నా వంక నవ్వుతూ చూసి 'నించో, నించుని నడు' అన్నది."

"నీకు కల వచ్చింది."

"కల కాదు ఫాదర్. చూడండి."

కెరోలిన్ కాళ్ళ మీది దుప్పటిని తీసి బండి దిగి నవ్వుతూ నడిచి చూపించింది.



# ఫొటో

**-జఫ్రీ సోమర్స్**

**అనుమతి లేకుండా మనతో ఫొటో తీసుకోగలిగేది ఎవరు?**

**ఫిలిప్ కె మార్క్స్** తన కళ్ళజోడుని ముక్కు మీదకి తోసుకుని, ఆ ఫోటోని చూస్తూ తలెత్తి అడిగాడు.

"ఏమిటిది?"

"ఓ ఫోటో మిస్టర్ మార్క్స్. క్రితం సంవత్సరం నేను సెలవులో ఉన్నప్పుడు దీన్ని తీయమని ఒకర్ని అడిగాను." రిచర్డ్ హేరోస్ జవాబు చెప్పాడు.

"సరే. దీన్ని చూడమని నాకెందుకు ఇచ్చారు?" మార్క్స్ అడిగాడు.

"ఆ ఫోటోలోని నా వెనక వ్యక్తిని చూడమని." రిచర్డ్ కోరాడు.

మార్క్స్ అప్పటికే ఫోటోలో, రిచర్డ్‌కి దూరంగా ఓ రైలింగ్‌కి ఆనుకుని నిలబడ్డ పొడుగ్గా ఉన్న ఓ సన్నటి వ్యక్తిని చూసాడు. అతను నల్లటి సూట్, తెల్లటి షర్ట్ ధరించాడు. రిచర్డ్ భుజం వెనక నించి చూస్తూ నించున్నాడు.

"ఇతను మీకు తెలుసా?" మార్క్స్ అడిగాడు.

"తెలీదు. ఎప్పుడూ చూడలేదు."

"మరి అతను మీ వంకే ఎందుకు చూస్తున్నాడు?"

"అదే సమస్య. అతను నేను ఫోటో తీసే సమయంలో అక్కడ లేడు. నిజానికి నేను ఫోటోలు తీసుకున్నప్పుడు ఎప్పుడూ అతను అక్కడ లేడు. ఐనా అతను ఫోటోల్లో కనిపిస్తున్నాడు!"

"నాకు అర్థం కాలేదు." మార్క్స్ చెప్పాడు.

"మీరు చూసిన ఫోటో మొదటిది. అది సంవత్సరం క్రితం తీయబడింది. ఈ సంవత్సరంలో తీసిన ఈ ఫోటోలని చూడండి."

మార్క్స్ వాటిని పరిశీలిస్తే వివిధ సమయాల్లో, వివిధ ప్రాంతాల్లో వివిధ ఋతువుల్లో తీసిన ఫోటోల్లో ఆ నల్ల సూట్‌లోని వ్యక్తి వెనుక నించి రిచర్డ్ వంక చూస్తూ కనిపించాడు.

"మీరు ఇతన్ని నిజంగా చూడలేదా?"

రిచర్డ్ తల అడ్డంగా ఊపుతూ చెప్పాడు.

"ఒట్టు. ఇతను నాకు తెలీదు. ఇతను నా ఫోటోల్లోకి వస్తున్నాడని గ్రహించాక ఫోటో తీసుకునే ముందు ఇతను ఉన్నాడా అని జాగ్రత్తగా చుట్టూ చూస్తాను. ఎప్పుడూ నాకు కనపడలేదు. ఫోటోలని నేనే డెవలప్ చేస్తున్నాను. కాబట్టి స్టుడియోలో ఎలాంటి మోసం జరిగే వీల్లేదు."

"ఇతను మిమ్మల్ని అనుసరించడం ఒక ఎత్తయితే, మీరు ఫోటోలు ఎప్పుడు తీసుకుంటారో తెలిసి, మీ వెనక నిలబడడం ఇంకో ఎత్తు." మార్క్స్ చెప్పాడు.

"మిస్టర్ మార్క్స్. మీరు పారానార్మల్ విషయాల్లో ప్రసిద్ధి చెందారు. కాబట్టి మీ సహాయం కోరి వచ్చాను."

"నేను ఇలాంటివి డబ్బు తీసుకోకుండా చూడనని కూడా మీరు విని ఉండాలి." మార్క్స్ నవ్వాడు.

"విన్నాను. మీకు దీంట్లో ఆసక్తి ఉంటుందని మీ దగ్గరికి వచ్చాను. ఈ ఫోటోలని అవి తీసిన క్రమంలో అమర్చాను. ఫొటోల్లో అతను నాకు క్రమంగా దగ్గర అవుతున్నాడు అని మీరు గ్రహించి ఉంటారు."

అప్పటికే మార్క్స్ ఆ పదిహేను-ఇరవై ఫోటోల్లో ఆ సంగతి గ్రహించాడు. అంతే కాదు. అన్ని ఫొటోల్లో ఎంతమంది ఉన్నా అతను రిచర్డ్ వంకే చూస్తున్నాడు.

రిచర్డ్ జేబులోంచి ఓ కవర్ తీసి, అందులోని ఫోటోని చూపిస్తూ చెప్పాడు.

"దీన్ని రెండు రోజుల క్రితం మా నాన్నగారింట్లో ఫేమిలీ రీయూనియన్‌లో తీసారు."

అందులో పది పదిహేను మంది దాకా ఉన్నారు. ఆ ఫోటోలోని రిచర్డ్ తండ్రిని, రిచర్డ్ పోలికలు గల ఇద్దరు ముగ్గురు సోదరులు, కజిన్స్‌ని మార్క్స్ గుర్తు పట్టాడు. ఆ ఫోటోలో కూడా కిటికీ బయట నించి తెరని పక్కకి జరిపి తొంగి చూస్తున్న ఆ వ్యక్తి కనిపించాడు.

"వీటిని నేను నా దగ్గర ఉంచుకోనా?" మార్క్స్ అడిగాడు.

"ఇతనెవరో తెలుసుకుంటారా?" రిచర్డ్ ఆశగా అడిగాడు.

"మరి నా ఫీజ్ గురించి చెప్పనా? చెల్లిస్తారా?" మార్క్స్ నవ్వుతూ ప్రశ్నించాడు.

* * *

మార్క్స్ వయసు ముప్పై ఎనిమిది. చిన్న గడ్డం. అతను పారానార్మల్ విషయాల మీదే ఆధారపడి జీవిస్తున్నాడు. పాత క్లయింట్స్ ఇతరులతో చెప్పడం ద్వారా తప్ప ప్రకటనల

వల్ల అతనికి కొత్త క్లయింట్స్ రారు. అతను వెంటనే తన మిత్రుడు రాల్ఫ్ ఫోటో స్టూడియోకి వెళ్ళి ఆ ఫోటోలని ఇచ్చి కోరాడు.

"ఇవి నిజం ఫోటోలా? లేక మార్పు చేయబడ్డ నకిలీవా? కనుక్కోగలవా?"

"తప్పకుండా." ఫోటోగ్రఫీ నిపుణుడైన రాల్ఫ్ అంగీకరించాడు.

గంటన్నర తర్వాత చెప్పాడు.

"వీటిని అనేక చుక్కలుగా విభజించి పరిశోధించాను. ఇవన్నీ నిజమైన ఫోటోలు. మార్పు చేయలేదు. ఇవి చవక కెమెరాతో తీయబడ్డాయి."

"అందులోని నల్ల సూట్‌లోని వ్యక్తిని చూసావా?" మార్క్స్ ప్రశ్నించాడు.

"చూసాను."

"అతను ప్రతీ ఫోటోలోకి ఎలా వచ్చాడో అర్థం కావడం లేదు."

తన క్లైంట్ చెప్పింది వివరించాడు.

"నిన్ను ఏడిపించడానికి అతను అలా అబద్ధం చెప్పాడేమో?"

"నా ఫీజ్ చెల్లించి ఈ అబద్ధం ఆడాల్సిన అవసరం అతనికి లేదు." మార్క్స్ చెప్పాడు.

* * *

"మీరు ఎప్పుడైనా పారానార్మల్ విషయాల్లో ప్రయోగాలు చేసారా?" మార్క్స్ తన క్లైంట్ రిచర్డ్‌ని ప్రశ్నించాడు.

"లేదు. అన్ని ఫోటోల్లో ఇతను ఉండడం గమనించే దాకా నాకు ఇలాంటి వాటిలో నమ్మకం కూడా లేదు. పాత ఫోటోల్లో ఇతను దూరంగా ఉంటే నేను పట్టించుకోలేదు. కానీ కొత్త ఫోటోల్లో అతను మరీ దగ్గరవుతూండడంతో గమనించాను."

"ఇతను మీకు గుర్తొచ్చాడా?"

"చాలా ఆలోచించాను. దెయ్యమై ఉంటాడు. ఎందుకనో నా వెంట పడుతున్నాడు. నా పాత ఫోటోలన్నీ చూసాను. ఏడాది క్రితం నించే ఇతను నా ఫోటోల్లో కనిపిస్తున్నాడు."

"మీరెప్పుడైనా ఫోటోలు తీసుకునేప్పుడు తల తిప్పి ఇతని కోసం చూసారా?"

"చాలా సార్లు. కాని నాకు కనపడలేదు. క్లిక్ చేసాక ఫోటోల్లోకి వస్తున్నాడు."

"మీరు అక్కడ నిలబడండి. మీరు ఇంత దాకా తీసుకున్న ఏ ఫోటోలో మీ వెనక గోడ లేదు."

"నిజమే. మీరు చెప్పేదాకా నాకది తట్టలేదు."

"ఇప్పుడు గోడ బేక్‌గ్రౌండ్‌తో మీ ఫోటో తీస్తాను. మీరు శాంతంగా ఎలాంటి ఆందోళన లేకుండా నిలబడండి మిస్టర్ రిచర్డ్."

మార్క్స్ అతనికి ఫోటో తీసాడు. కొద్ది క్షణాల్లో ఆ పోలరాయిడ్ ప్రింట్ కెమెరా లోంచి బయటికి వచ్చింది.

"ఈ కేస్ విషయంలో మనకి ఓ నిజం తెలిసింది." మార్క్స్ చెప్పాడు.

"ఏమిటది?"

ఆ ఫోటోని రిచర్డ్‌కి చూపిస్తూ మార్క్స్ చెప్పాడు.

"అతను మీకు ఇంకా దగ్గరగా వచ్చాడు. ఈ సారి అతని తల మాత్రమే మీ భుజం మీంచి కనిపిస్తోంది."

రిచర్డ్ వెళ్ళాక, మార్క్స్ అతను ఎవరై ఉంటాడా అని ఆలోచించాడు.

"నువ్వు ఇక్కడే ఉన్నావా? నాతో మాట్లాడతావా? ఉంటే కనపడు." చుట్టూ చూస్తూ అడిగాడు.

తర్వాత కెమెరాతో గోడని ఫోటో తీసాడు. కొద్ది క్షణాల తర్వాత ఫొటో బయటికి వచ్చింది. ఫొటోలోని ఆ సన్నపాటి నల్ల సూట్ వ్యక్తి మొహంలో చిరునవ్వు. అతని చేతిలో ఓ చదరపు తెల్లటి వస్తువు కనిపించింది.

మార్క్స్ తక్షణం రిసీవర్ ఎత్తి రాల్ఫ్‌కి ఫోన్ చేసి అడిగాడు.

"నువ్వు నాకు ఇంకో సహాయం చేయాలి."

* * *

"దీన్ని బ్లోఅప్ చేసి అతని చేతిలో ఏముందో దయచేసి చెప్పగలవా?"

"ఫోటో తీయబోయే ముందు అతన్నే అడగచ్చుగా?" రాల్ఫ్ దాన్ని చూస్తూ ప్రశ్నించాడు.

మార్క్స్ మౌనంగా ఉండిపోయాడు. రాల్ఫ్ దాన్ని కంప్యూటర్‌లోకి ఎక్కించి అనేక కమాండ్‌లు ఇచ్చాక అతని చేతిలోని ఆ తెల్ల వస్తువు మాత్రం తెర మీద కనిపించింది. ఆ తెల్ల కార్డ్ మీద ఇలా ముద్రించి ఉంది.

"నేను మృత్యువుని."

"మార్క్స్! నువ్వు ఈ వింత వృత్తిని ఎన్నుకున్నప్పటి నించి నాకు చాలా ఫోటోలు చూపించావు. కానీ ఇది భయపెట్టినట్లుగా నన్ను ఇంకేదీ భయపెట్టలేదు. ఇది నిన్ను ఉద్దేశించి రాసిందే." రాల్ఫ్ చెప్పాడు.

"నా కోసం అని ఎందుకు అనిపించింది?"

"మృత్యువే అతని ద్వారా ఆ ఫొటోలని నీ దగ్గరికి పంపించి ఉండచ్చుగా?"

మార్క్స్ కొద్ది క్షణాలు ఆలోచించి రాల్ఫ్‌తో చెప్పాడు.

"ఐతే నాకు ఫోటో తీయి."

రాల్ఫ్ వెంటనే కెమెరాని అందుకుని మార్క్స్‌కి ఫోటో తీసాడు. ఫోటోలో అతని పక్కన ఆ నల్ల సూట్ వ్యక్తి దగ్గరగా కనిపించాడు. అతని చేతిలోని తెల్ల కాగితం మీద పెద్ద అక్షరాల్లో ఇలా రాసి ఉంది.

"నువ్వంటే నాకు ఎక్కువ ఇష్టం."

* * *

"ఎవరది?" తలుపు చప్పుడు విని రిచర్డ్ అడిగాడు.

"మార్క్స్."

"ఏమిటిలా వచ్చారు? అతను ఎవరో తెలిసిందా?" రిచర్డ్ తలుపు తెరిచి అడిగాడు.

"మీరు నాకు రెండు సహాయాలు చేయాలి." మార్క్స్ కోరాడు.

"ఏమిటవి?"

"ముందుగా నాకు కొంత విస్కీ ఇవ్వండి."

ఓల్డ్ స్మగ్లర్ విస్కీని బాటిల్ లోంచి గ్లాస్‌లోకి వంచి రిచర్డ్ అతనికి ఇచ్చాడు. మార్క్స్ దాన్ని మొత్తం గటగటా తాగాడు.

"మీరు రెండు సహాయాలు అడిగారు?" రిచర్డ్ ప్రశ్నించాడు.

"నేను మీ ఫోటోని ఇంకోసారి తీస్తాను."

"అలాగే. కానీ ఎందుకు?"

"నాకు కలిగిన ఓ దురదృష్టపు అనుమానాన్ని రూఢీ చేసుకోడానికి. బహుశా నేను కొద్ది క్షణాల్లో మీకో శుభవార్త చెప్పగలుగుతాను."

మార్క్స్ జేబులోంచి కెమెరా తీసి రిచర్డ్‌ని ఫోటో తీసాడు. పోలరాయిడ్ ఫోటో బయటికి వచ్చే దాకా ఇద్దరూ వేచి చూసారు. దాన్ని చూసాక రిచర్డ్ ఆశ్చర్యంగా చెప్పాడు.

"అతను ఫొటోలో లేడు!"

"అవును. వెళ్ళిపోయాడు. ఇక మీ జోలికి రాడు."

"థాంక్ యూ మిస్టర్ మార్క్స్."

"అవసరమైతే నా నంబర్ మీ దగ్గర ఉంది." చెప్పి మార్క్స్ బయటికి నడిచాడు.

* * *

ఆ రాత్రంతా మార్క్స్ లండన్‌లోని అనేక బార్లలోకి వెళ్ళి ఒకో చోట ఒకో పెగ్ విస్కీ తాగాడు. అతను వంటరిగా తాగుతున్న కస్టమర్స్‌ని 'నవ్వు' అని చెప్పి ఫోటో తీయసాగాడు. కెమెరాలోని మోటార్ పని చేసే శబ్దం ఆగిపోయాక పోలరాయిడ్ ప్రింట్ బయటికి రాసాగింది. దాన్ని చూసి 'థాంక్స్' చెప్పి దాన్ని ఆ కస్టమర్ చేతిలోనే ఉంచి భయంగా మరో బార్‌కి వెళ్ళసాగాడు. మార్క్స్ బార్లలోనే కాక, వీధుల్లో వెళ్ళే వాళ్ళని కోరసాగాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ. నేను మీ ఫోటో తీసుకోవచ్చా? ఇది సమాజ సేవ. ఉచితం. కొద్ది క్షణాలు. కావాలంటే ఫోటో మీరు తీసుకోవచ్చు. నవ్వుతూ చూడండి."

చాలామంది తమ ఫోటో తీసుకోడానికి అంగీకరించి నవ్వుతూ చూడసాగారు. మార్క్స్ తక్షణం వారి ఫోటో తీసి అది బయటికి వచ్చాక దాన్ని చూసి మౌనంగా వాళ్ళకి ఇవ్వసాగాడు.

ఆ రాత్రి చాలా ఫిల్మ్ పెట్టెలని కొని మార్క్స్ వీధుల్లో వందల మంది ఫోటోలని తీసాడు. మాట్లాడి, మాట్లాడి కొన్ని గంటల తర్వాత అతని కంఠంలో కొద్దిగా జీర కూడా వచ్చింది. కొందరు అతను డబ్బు గుంజే మోసగాడని నిందించారు. కొందరు తమ ప్రైవసీకి భంగం కలిగించద్దని మందలించారు.

తెల్లవారుఝామున నాలుగుకి నిశ్శబ్దంగా ఉన్న రోడ్ల మీద మనుషుల సందడి బాగా తగ్గింది. చివరికి మార్క్స్ పార్క్ చేసిన ఓ కారుకి ఆనుకుని సేద తీరసాగాడు.

"ఇక్కడేం చేస్తున్నావు.? కదులు." అన్న కఠినమైన మాటలు విని మార్క్స్ వెనక్కి తిరిగి చూసాడు.

యూనిఫాంలో నిలబడ్డ పోలీస్ కాన్‌స్టేబుల్ తన చేతిలోని లాఠీని మార్క్స్ ఛాతీ వైపు చూపిస్తున్నాడు.

"ఏమిటి?" అడిగాడు.

"రాత్రంతా బాగా తాగావని నిన్ను చూస్తే తెలుస్తోంది. ఇంటికెళ్ళి పడుకో."

మార్క్స్ వెంటనే చేతిలోని కెమెరాని సర్దుకుని నవ్వుతూ చెప్పాడు.

"నేను వెళ్ళే ముందు దయచేసి ఒక ఫోటో."

మార్క్స్ కెమెరా బటన్‌ని నొక్కినప్పుడు కూడా ఆ కాన్‌స్టేబుల్ కోపంగా చూస్తున్నాడు.

"ఇది నా హాబీ. మీకు మీ ఫోటో ఇచ్చి వెళ్తాను."

ఫోటో బయటికి రాగానే దాని వంక ఆత్రంగా చూసాడు. తర్వాత కళ్ళు మూసుకుని కొద్దిగా కిందకి జారాడు. వెంటనే కాన్‌స్టేబుల్ ముందుకి అడుగేసి పట్టుకుంటూ అడిగాడు.

"నువ్వు ఓకేనా?"

మార్క్స్ కళ్ళు తెరిచి ఇబ్బందిగా, ఆనందంగా నవ్వాడు.

"నేను బానే ఉన్నాను. గుడ్ నైట్."

మార్క్స్ అతని చేతిలో ఫోటోని పెట్టి విజిల్ వేసుకుంటూ ఆనందంగా నడవసాగాడు.

కాన్‌స్టేబుల్ ఫోటో చూసి, ఓ సారి తను నిలబడ్డ వైపు ఎవరి కోసమో చూసాడు.



# చాటు ప్రదేశం

**-డొరీన్ డగ్ డేల్**

**ఓ దొంగ. ఓ ముసలావిడ. ఓ అతీంద్రియ శక్తి. ఈ మూడూ ఒకే సారి ఒకే చోట కలిస్తే?**

**ఓ కంచె** వెనక దాగున్న ఆ కాటేజ్‌ని, తోటలో పని చేసే ఓ ముసలావిడని స్వీనీ చూసాడు. ఆ కాటేజీ దాదాపు శిథిలావస్థకి చేరుకుంది. ఆ ముసలావిడ నడుం వంచి చెట్ల పండుటాకులని తెంపి బుట్టలో వేస్తోంది. ఆమె రెడ్ ఇండియన్ సంతతికి చెందిందని ఆవిడ ముఖకవళికలని బట్టి స్వీనీకి అనిపించింది.

స్వీనీ అనుకోకుండా ఆ కాటేజీ దగ్గరకి చేరుకున్నాడు. ఒంపులు తిరిగే ఆ కాలిబాటలో పొరపాటున తప్పు మలుపు తిరిగి అక్కడికి చేరుకున్నాడు. అతను దొంగిలించిన కారులో పెట్రోల్ అయిపోవడంతో దాన్ని ఎవరికీ కనపడకుండా రోడ్డు పక్కకి తోసి, తన సూట్ కేస్‌ని అందుకుని కాలి నడకన సమీపంలోని గ్రామానికి వెళ్ళబోయి దారి తప్పి అక్కడికి చేరుకున్నాడు. ఆ కాటేజ్ దగ్గరకి చేరుకునే దాకా దారిలో అతనికి ఎవరూ కనిపించలేదు.

ఆ ముసలావిడ తన పని ముగించుకుని ఇంట్లోకి వెళ్ళింది. గుమ్మం దగ్గర ఓ నల్ల పిల్లిని స్వీనీ చూసాడు. ఆవిడ ఒక్కత్తే ఆ కాటేజ్‌లో ఉండి ఉంటుందని స్వీనీ ఆశించాడు. ఒలిచిన ఆరెంజ్ తొక్కల వాసనని వెంటనే పసికట్టినట్లుగా స్వీనీ ఆ వాతావరణంలో ఒంటరితనాన్ని, రక్షణ రాహిత్యాన్ని పసికట్టాడు.

ఐనా స్వీనీ జాగ్రత్తగా ఓసారి దూరం నించి ఆ కాటేజీ చుట్టూ తిరిగి చూసాడు. అతని కాళ్ళ దగ్గర గల ఎముకలని అతను చూడలేదు. వాటిలో కొన్ని జంతువులవి. ఆ కాటేజీ వెనక కోళ్ళు, గొర్రెలు కనిపించాయి. తనకి అది రక్షణ ఇస్తుందని స్వీనీ ఆశించాడు.

తన కోసం వెదికేవాళ్ళు తను ఇక్కడ ఉంటాడని ఊహించరు. హై వేలో షికాగో వైపు వెళ్తూంటాడని భావిస్తారు. వారి వలలోంచి తను తప్పించుకుని వెళ్ళిపోయి ఉంటాడని ఒకటి, రెండు రోజుల తర్వాత వారు గ్రహిస్తారు అని కూడా అనుకున్నాడు. ఓ రెండు వారాల తర్వాత ఇక తన గురించి వెదికేవారు ఉండరు. అంతదాకా తల దాచుకోడానికి ఈ కాటేజీ సౌకర్యంగా ఉంటుందని భావించాడు.

స్వీనీ అంతా పరీక్షించి తృప్తి పడ్డాక ఆ కాటేజీ తలుపు వైపు నడిచాడు. తలుపు పైన గల ఓ మానవ కపాలాన్ని చూసి అది ప్లాస్టిక్‌ది అయి ఉండచ్చు అనుకున్నాడు. 'ఇదేం అలంకరణ?' అని కూడా అనుకున్నాడు.

బయటికి వచ్చిన పిల్లి అతన్ని దాటుకుని తోటలోకి నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది. లోపలికి వెళ్ళిన స్వీనీకి సుగంధ పరిమళం సోకింది. అది పుదీనా, తులసి, ఇతర మూలికలకి చెందిన వాసన. ఆకులు గల కొమ్మలు దండేనికి ఆరబెట్టి ఉన్నాయి. ముందు గదిలో కేవలం ఓ మనిషికి అవసరం అయిన సామాను మాత్రమే ఉంది.

ఓ బల్ల ముందు కూర్చుని ఉన్న ఆ ముసలావిడ స్వీనీని చూసి విగ్రహంలా అయిపోయింది. తను అనుకున్న దాని కన్నా ఆవిడ వృద్ధురాలు అని స్వీనీ గ్రహించాడు. ఎముకలకి చర్మం తొడిగినట్లుగా ఉందావిడ. ఆవిడ రెండు చేతులూ వణుకుతున్నాయి. ఆవిడ కళ్ళు మాత్రం మెరుస్తున్నాయి.

"గుడ్ ఆఫ్టర్‌నూన్. మీ ఫోన్‌ని నేను ఉపయోగించుకోవచ్చా?"

"ఇక్కడ ఫోన్ లేదు." ఆవిడ కంఠం కరుకుగా ఉంది.

"మీ ఆయన కాని, కొడుకు కాని నా కారుని మళ్ళీ రోడ్డు మీదకి తోయడానికి సహాయం చేయగలరా?" సూట్ కేస్ పక్కన పెట్టి అడిగాడు.

"ఇక్కడ నేను తప్ప ఇంకెవరూ లేరు."

స్వీనీ వెంటనే ఆ కాటేజీ తలుపు మూసాడు.

"నీకు ఏం కావాలి?" ఆవిడ అడిగింది.

"కొద్ది రోజులు భోజనం, గూడు. మీకు స్పేర్ మంచం లేకపోతే ఆ పాత సోఫా చాలు నాకు."

ఆవిడ స్వీనీ మొహంలోని పశుత్వాన్ని, క్రూరత్వాన్ని గ్రహించగలిగింది.

"ఎవరి నించైనా దాక్కోవాలనుకుంటే తప్ప ఇక్కడ ఎవరూ ఉండాలనుకోరు." మళ్ళీ తను చేసే పనిని కొనసాగిస్తూ చెప్పింది.

"అది నిజమే." స్వీనీ అంగీకరించాడు.

ఆ గదిలోని డ్రాయర్లని, అలమర తలుపులని తెరిచి చూడసాగాడు. వాటిలో గవ్వలు, పాత బట్టల పీలికలతో చేసిన బొమ్మలు లాంటి పనికి రాని చెత్త అతనికి కనిపించింది. ఇంకో వ్యక్తి అక్కడ నివసిస్తున్న ఋజువులు అతనికి ఎక్కడా కనిపించక పోవడంతో ఆవిడ నిజమే చెప్పిందని నిర్ధారించుకున్నాడు.

"నీ కోసం పోలీసులు వెదుకుతున్నారా?" ఆవిడ ప్రశ్నించింది.

"అవును. నా మిత్రులు కూడా. పోలీసుల కన్నా నా మిత్రుల వల్లే నాకు ఎక్కువ ప్రమాదం. వారు నన్ను చూస్తే మాత్రం... నన్నెవరూ కనుక్కోకూడదు. అందుకు ఇది చక్కటి చాటు ప్రదేశం."

అతను ఆవిడ దగ్గరికి వెళ్ళి భుజాలని పట్టుకుని కుదుపుతూ అడిగాడు.

"ఇక్కడికి సందర్శకులు వస్తూంటారా? నిజం చెప్పు. లేదా తర్వాత విచారిస్తావు."

ఆవిడ పెద్దగా నవ్వి జవాబు చెప్పింది.

"సందర్శకులు? ఈ ముసలిదాన్ని చూడటానికి ఎవరు వస్తారు? ఈ చుట్టుపక్కల పది మైళ్ళ దాకా మానవమాత్రుడే లేడు."

"అనుకున్నాను. నువ్వు ఒక్క దానివే ఇక్కడ ఎందుకు ఉంటున్నావు?"

"నేను పుట్టింది ఇందులోనే. అక్కడక్కడ ఇలాంటి కాటేజీలు అనేకం ఉన్నాయి. కాని కాలం మారింది కదా. వాటిలో ఇప్పుడు ఎవరూ లేరు. నేను, బ్లాకీ మాత్రమే ఇక్కడ ఉన్నాం."

స్వీనీ ఫైర్ సైడ్ పక్కన గల కుర్చీలో కూర్చున్నాడు. డబ్బుతో నిండిన సూట్ కేస్‌ని తన పక్కన జాగ్రత్తగా ఉంచాడు. తర్వాత జేబులోంచి ఎంతో మామూలుగా ఓ రివాల్వర్‌ని తీసి, దాన్ని సూట్ కేస్ మీద ఉంచాడు. దాన్ని చూసిన ఆ ముసలావిడ కళ్ళల్లో భయం కదలాడింది.

"నాకు భోజనం, నిద్రించడానికి తగిన సౌకర్యం కావాలి. నేను చెప్పినట్లు చేస్తున్నంత కాలం నీకు ఎలాంటి హాని జరగదు. మోసం చేస్తే మాత్రం... అర్థం అయిందా?" ఆ రివాల్వర్ వంక వేలితో చూపించాడు.

ఆవిడ అర్థం అయిందన్నట్లుగా తల ఊపి తిరిగి ఎండిన కొమ్మల నించి ఆకులని విడదీసి ఒకో రకం ఆకులని ఒకో గాజు సీసాలో వేయసాగింది.

"టి వి ఉందా?" కాసేపాగి అడిగాడు.

"రేడియో కూడా లేదు. ఇక్కడ కాలక్షేపానికి ఎలాంటి సౌకర్యం లేదు."

వెంటనే కోపంగా లేచి ఆవిడని కొట్టడానికి చేతిని ఎత్తి చివరి క్షణంలో తమాయించుకుని ఆగాడు.

"నిన్ను కొడితే పైకి పోయేలా ఉన్నావు. మళ్ళీ గొయ్యి తీసి పాతడం శ్రమ. పైగా నేనే వండుకోవాలి."

"నేను వండినంత రుచిగా ఎవరూ వండలేరు." ఆవిడ చెప్పింది.

"త్వరగా ఆ పని చెయ్." ఆజ్ఞాపించాడు.

* * *

తాజా కోడిగుడ్లతో, అనేక మూలికలు కలిపి ఆవిడ వండిన ఆ ఆమ్లెట్ ఎంతో రుచిగా ఉంది. ఇంట్లో చేసిన బ్రెడ్, ఛీజ్ కూడా అంతే రుచిగా ఉన్నాయి. ఆ రుచి కేవలం ప్రకృతి నించి తాజాగా లభ్యమైన పదార్థాల వల్లే కాక నిప్పుల కుంపటి మీద వండడం వల్ల కూడా వచ్చిందని స్వీనీ అనుకున్నాడు.

"రెండు వారాల పాటు ఈ ఇంట్లో నాకు కాలం గడవడం ఎలా?" పళ్ళు కుట్టుకుంటూ బద్ధకంగా అడిగాడు.

ఆవిడ జవాబు చెప్పలేదు.

"నీ వంట రుచిగా ఉంది. నీకు పెళ్ళయిందా?"

"లేదు. ఓ కప్పని ఎలా పెళ్ళి చేసుకోను?"

"నువ్వు కప్పని ప్రేమించావా? అవున్లే. ప్రకృతిలో జీవించే నువ్వు బొద్దింకల్ని, కప్పల్ని ప్రేమించడంలో నాకు ఆశ్చర్యం లేదు." నవ్వాడు.

ఆవిడ తన పని పూర్తి చేసాక లేచి ఒకో సీసాని తీసి ఓ అలమరలో ఉంచింది. స్వీనీ ఆసక్తిగా లేచి వెళ్ళి ఆ అలమరలో చూసాడు. కొన్ని సీసాల్లోని ఎండిన తేళ్ళని, జెర్రులని, పేర్లు తెలీని పురుగులని చూసి అతని ఒళ్ళు జలదరించింది.

"ఆమ్లెట్‌కి ఆ రుచి రావడానికి ఇవేనా కారణం?"

ఆవిడ జవాబు చెప్పలేదు.

"ఈ ఎముకలేమిటి? మనిషివా?" ఓ సీసాలోని ఎముకలని చూసి అడిగాడు.

"కోతులవి. ఒకటి, రెండు మనిషి ఎముకలు కూడా ఉన్నాయేమో? నాకు జ్ఞాపకం లేదు."

స్వీనీ ఆవిడని పడక గదిలోకి తీసుకెళ్ళి చెప్పాడు.

"నిద్రలో నాకు చీమ చిటుక్కుమన్నా మెలకువ వస్తుంది. తక్షణం లేచి రివాల్వర్‌తో ఎవరు కనపడితే వారిని కాల్చేస్తాను. కాబట్టి నేను పిలిచే దాకా ఈ గదిలోకి రాక. లేదా నీ ఒంట్లోకి రెండు రివాల్వర్ గుళ్ళు దిగుతాయి. నేను అబద్ధం చెప్పడం లేదు."

తలుపు మూసి బయట గడియ పెట్టాడు. సోఫాలో పడుకుని కళ్ళు మూసుకున్నాడు.

* * *

ఆ రాత్రి స్వీనీకి వంటగదిలోంచి చాలా కమ్మటి వాసన వేసింది. వెళ్ళి చూస్తే ఆవిడ ఓ పురాతన పుస్తకాన్ని చదువుతూ ఆ వంట చేయడం గమనించాడు. దాన్ని తీసుకుని చూసాడు. అది ఎవరో చేత్తో రాసిన వంటల పుస్తకం.

"ఇది మా అమ్మమ్మది. చాలా సంవత్సరాల తర్వాత నీ కోసం బయటికి తీసాను." ఆవిడ చెప్పింది.

"ఓ! దీన్ని అచ్చు వేస్తే చాలా డబ్బు వస్తుంది తెలుసా? ఇంత ప్రాచీన వంటకాల పుస్తకం మార్కెట్లో లేదు."

"నాకు డబ్బు మీద ఆశ లేదు."

"నాకుంది. వెళ్ళేప్పుడు దీన్ని నేను తీసుకెళ్తాను. తాగడానికి మద్యం ఏదైనా ఉందా?"

చిన్నగా నవ్వి ఆవిడ ఓ అలమర తలుపు తెరిచింది. లోపల ఎల్డర్ బెరి, బీట్‌రూట్, డేండిలియన్ లాంటి పేర్లు రాసి అతికించిన సీసాలు ఉన్నాయి.

"ప్రొహిబిషన్ రోజుల్లో మా అమ్మ నాటు సారాని చేసి అమ్మేది. ఆవిడ నించి ఈ మద్యాన్ని చేయడం నేర్చుకున్నాను."

"ఇవాళ బీట్‌రూట్ మద్యం రుచి చూస్తాను."

ఓ గ్లాసు అందుకుని దాన్ని వంచుకుని రుచి చూసి చెప్పాడు.

"బాగా ఘాటుగా ఉంది."

ఆవిడ సూప్‌ని ఓ బౌల్‌లో పోసి అతని ముందు ఉంచి చెప్పింది.

"ఇది నీ కోసం ప్రత్యేకంగా చేసాను."

ఆ వేడి వేడి సూప్ రుచికి అతనికి ఆశ్చర్యం వేసింది. పూర్తి చేసాక ఇంకాస్త అని మొత్తం తాగాడు.

అకస్మాత్తుగా ఆవిడ గుర్తు తెలియని భాషలో ఏదో బయటికి చదవసాగింది.

"నోర్మూయ్." అరిచాడు.

ఆవిడ పట్టించుకోకుండా ఓ మంత్రాన్ని పదేపదే ఉచ్ఛరించసాగింది. ముడుచుకుని పడుకున్న నల్లపిల్లి అకస్మాత్తుగా లేచి నిలబడింది. దాని రోమాలు నిక్కబొడుచుకున్నాయి. దాని కళ్ళు స్వీనీ మీద నిలిచిపోయాయి. అకస్మాత్తుగా స్వీనీకి మత్తు ఆవరించుకుంటున్న భావన కలిగింది. దాంతో పాటు ఒళ్ళంతా తిమ్మిరులు ఎక్కసాగాయి. నరాలని మెలి పెడుతున్నంత నొప్పి.

స్వీనీ చేతిని చాపి రివాల్వర్‌ని అందుకోవాలనుకున్నాడు. కుదరక పోవడంతో లేవాలని అనుకున్నాడు. వెంటనే తన కాళ్ళు, చేతులు తన ఆధీనం తప్పాయని గ్రహించాడు. అతనికి కళ్ళ ముందు అనేక రంగులు కనిపించసాగాయి.

ఐదు నిమిషాల తర్వాత ఆ వృద్ధురాలు మంత్రాన్ని ఆపి లేచి స్వీనీ కూర్చున్న కుర్చీ దగ్గరకి నడిచింది. ఇప్పుడు అందులో ఓ ఆకు పచ్చ రంగు కప్ప ఉంది. ఆవిడ దాన్ని అందుకుని 'పద' అని తీసుకెళ్ళి ఇంటి బయట మెట్ల మీద ఉంచింది. దాని కళ్ళు బాధగా ఆ వృద్ధురాలి వంక కాసేపు చూసాయి. తర్వాత అది గెంతుతూ చెట్లలోకి వెళ్ళిపోయింది.

"నీ కోరిక తీరింది. ఇంక నిన్నెవరూ కనుక్కోలేరు." చెప్పి ఆ ముసలావిడ తలుపు మూసేసింది.



# నాలుగు వరాలు

**-డేవిడ్ డార్లో**

**పురాతన భూతం నడిపిన ఆధునిక కథ.**

**పురాతన వస్తువుల** దుకాణం యజమాని ఆర్థర్ తన ఎదురుగా ఉన్న బిల్లులని చూసి, తన భార్య ఎడ్నాని అడిగాడు.

"ఇవి ఎన్ని నెలల బిల్స్? ఇంకా చెల్లించలేదు?"

"అందుకు మన దగ్గర డబ్బుంటేగా?" మెట్లెక్కి పైకి వెళ్ళే ఎడ్నా చెప్పింది.

కొన్ని క్షణాల తర్వాత తలుపు తెరచుకుని ఓ ముసలావిడ లోపలికి వచ్చింది. ఆమెని చూసి కూడా ఆర్థర్ చూడనట్టుగా నటించాడు. ఆమె తనతో తెచ్చిన ఓ పాత వైన్ బాటిల్‌ని టేబుల్ మీద పెట్టి కోరింది.

"దీనికో డాలర్ ఇస్తారా? ఇది మాకు వంశపారంపర్యంగా వచ్చింది."

"మిసెస్ గ్రామ్స్! ఇది సాధారణమైన వైన్ బాటిల్. దీనికి విలువ లేదు. దీనికేం రాదు." ఆర్థర్ చెప్పాడు.

"ఓ డాలర్ ఇస్తారా?" బతిమాలుతున్నట్లుగా అడిగింది.

"మిసెస్ గ్రామ్స్! దీని విలువ డాలర్ అయితే ఇచ్చేవాడిని. నేనే అప్పుల్లో ఉన్నాను."

ఆవిడ ఏడుస్తూండడంతో జాలి కలిగి అతను ఆమెకి ఓ డాలర్ ఇచ్చాడు.

"మిస్టర్ ఆర్థర్. నేను అబద్ధం చెప్పాను. ఆ సీసా వంశపారంపర్యంగా వచ్చింది కాదు. చెత్త బుట్టలో కనపడితే తెచ్చి మీకు అమ్మాను." మిసెస్ గ్రామ్స్ బయటికి వెళ్ళబోతూ నిజం చెప్పి వెళ్ళిపోయింది.

కేష్ బాక్స్ తెరిచి మూసిన చప్పుడు విని ఎడ్నా మెట్ల మీంచి కిందకి వచ్చింది.

"చాలా బావుంది." బల్ల మీది వైన్ బాటిల్ చూసి ఎకసెక్కెంగా చెప్పింది.

ఆర్థర్ మాట్లాడలేదు.

"ఆర్థర్. మనం దివాలా తీయడానికి చాలా దగ్గరలో ఉన్నామని నీకు తెలుసు. ఏ అల్లావుద్దీన్ అద్భుత దీపమో మనకి దొరికితే తప్ప ఇందులోంచి బయటపడలేం. ఆ సీసా నాకివ్వు. చెత్త బుట్టలో పడేస్తాను." ఎడ్నా కోరింది.

"వద్దొద్దు. దీన్ని ఒకటి రెండు సెంట్లకి అమ్మచ్చు." ఆర్థర్ నిరాకరించాడు.

"నువ్వు ఎవరికీ దానం చేయనని మాటిచ్చావు కదా? ఇది కొనుగోలు కాదు. దానమే."

"సంపాదనలో విఫలమైనంత మాత్రాన దయాగుణాన్ని చంపేసుకోలేను."

"ఆర్థర్! నువ్వు విఫలం అయ్యావు. వీటన్నిటినీ చూడు. వందల ఏళ్ళ క్రితంవి."

"అవును. మా తాత ఈ దుకాణాన్ని ఆరంభించాడు. మా నాన్న కూడా దీన్ని నడిపాడు. కానీ నేడు వాటిని కొనేవాళ్ళు లేరు. ఇది మనుషుల ఆశకి స్మశానంలా నాకు తోస్తోంది." ఆర్థర్ బాధగా చెప్పాడు.

ఆర్థర్ చెయ్యి తగిలి ఆ వైన్ బాటిల్ నేల మీద పడి దాని బిరడా తెరచుకుంది. అందులోంచి పొగ రావడం భార్యాభర్తలిద్దరూ గమనించారు. కొద్ది క్షణాల్లో పొగ మాయమై అక్కడ సూట్‌లోని ఓ ఏభై ఏళ్ళ వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు.

"ఎలా ఉన్నారు?" ప్రశ్నించాడు.

"నువ్వెవరు? ఎక్కడి నించి వచ్చావు?" ఆర్థర్ ప్రశ్నించాడు.

"సీసా లోంచి. మీ సేవకే వచ్చాను. నా గురించిన పూర్తి వివరాలు చెప్పే కంటే నేనో మాంత్రికుడ్ని అని చెప్తే చాలు."

"అది నన్ను నమ్మమంటావా? అవి పిల్లల కథలకే పరిమితం." ఆర్థర్ నిరసనగా చెప్పాడు.

"నమ్మాలి. నేను జీవించి ఉన్న ఉదాహరణని."

"నువ్విక్కడికి ఏం మోసం చేయడానికి వచ్చావు?" ఆర్థర్ అడిగాడు.

"మోసం కాదు. మీకు నాలుగు వరాలు ఇవ్వడానికి వచ్చాను." అతను చెప్పాడు.

"పప్పులో కాలేసావు. నేను చదివిన ప్రతీ పుస్తకంలో మూడు వరాలే ఇస్తారు."

"అది ఒకప్పటి మాటై ఉండచ్చు. నేడు నాలుగు వరాలిస్తున్నాం. ఇది జీవిత కాలంలో ఒకే సారి వచ్చే అవకాశం. సద్వినియోగం చేసుకో."

"ఆర్థర్! నాకు అర్థం కావడం లేదు. ఇక్కడ ఏం జరుగుతోంది?" ఎడ్నా అయోమయంగా చూస్తూ అడిగింది.

"ఇతను మోసగాడైనా అయుండాలి. లేదా హిప్నటిస్ట్ అయినా అయుండాలి. టివిలో ఏనుగుల్ని మాయం చేసిన మెజీషియన్ లాంటివాడై ఉండచ్చు."

"అది చిన్న పిల్లల ఆట. మీకు నాలుగు వరాలు ఇచ్చాక సీసాలోకి వెళ్తాను. మళ్ళీ వందేళ్ళ దాకా బయటికి రాను." అతను చెప్పాడు.

"వందేళ్ళా?"

"ప్లస్ ఒక్క రోజు. మళ్ళీ ఎవరైనా ఆ రోజు దీని మూతని తెరుస్తారు. మీరు చాలా అదృష్టవంతులు. ఒక్కో సారి నేను కొన్ని వందల ఏళ్ళ దాకా బయటికి రాను. ఇక్కడ ఉన్న వస్తువులన్నీ నేను పూర్వం చూసినవే. ఇవి నకిలీవి. నేను చూసింది అసలు వస్తువులు. ఈ సిగరెట్ కేసు విక్టోరియా రాణిదా? ఇది నిజం కాదు. సరే. నాలుగు కోరికలు కోరుకో. ఓసారి కోరాక వెనక్కి తీసుకోలేవు. దాన్ని వెనక్కి తీసుకోవాలంటే ఇంకో సారి కోరాలి. ప్రతీ కోరిక ఫలితానికి నువ్వే బాధ్యుడివి. అర్థమైందా మిస్టర్ ఆర్థర్?"

"నేను పోలీసుల్ని పిలుస్తాను." ఆర్థర్ చెప్పాడు.

"మీ ఇష్టం. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ మనుషుల్ని రప్పించనా? లేదా స్కాట్లాండ్ యార్డ్ వారిని పిలవనా? లండన్‌లోని స్పెషల్ పోలీస్‌ని రప్పించనా? నీ కోరిక పోలీసులని పిలవడమా?" ఆ మాంత్రికుడు అడిగాడు.

ఆర్థర్ దృష్టి షోకేస్ రెక్కకి ఉన్న పగిలిన అద్దం మీద పడింది. డబ్బు సమకూరితే దాన్ని రిపేర్ చేయించాలని అనుకుంటున్నాడు.

"కాదు. ఆ పగిలిన అద్దాన్ని సరి చెయ్." కోరాడు.

"అది నీ మొదటి కోరికా?" మాంత్రికుడు అడిగాడు.

"ఆర్థర్! నీకు పిచ్చెక్కిందా? అతన్ని నమ్ముతున్నావా?" ఎడ్నా ప్రశ్నించింది.

"ఈ కోరికతో అతని రంగు బయట పడుతుంది. కమాన్. దాన్ని బాగు చెయ్. తుడుస్తూంటే నా బూజు కర్ర కొట్టుకుని అది పగిలింది." ఆర్థర్ చెప్పాడు.

"అది అధికారికంగా నీ మొదటి కోరికా?"

"అవును. ఆ అద్దం రిపేర్ చెయ్." ఛాలెంజ్ చేస్తున్నట్లుగా ఆర్థర్ చెప్పాడు.

"సరే."

ఆ మాంత్రికుడు దానివంక చూసి చిన్న చిటెక వేయగానే బీటలు వారిన అద్దం అతుక్కోవడం చూసి ఎడ్నా అరిచింది.

"ఏమిటిది ఆర్థర్! నేను కలగంటున్నానా? ఇది మేజిక్ ట్రిక్‌లా ఉంది."

"లేదు ఎడ్నా. నువ్వు కలగనడం లేదు. నిజంగా బాగైంది. ఎలా చేసావు దీన్ని?" ఆర్థర్ ప్రశ్నించాడు.

"ఇంకా మీకు మూడు కోరికలు మిగిలి ఉన్నాయి." మాంత్రికుడు సూచించాడు.

ఆర్థర్ ఆనందంగా తన భార్యతో చెప్పాడు.

"మూడు కోరికలు ఎడ్నా. ఆలోచించు. మనకేం కావాలి? ఆలోచించు."

"నాకు భయంగా ఉంది." ఆమె చెప్పింది.

"ఆలోచించు ఎడ్నా. ఖరీదైన షాపింగ్? విదేశీ ప్రయాణాలు? మనం ఎన్నడూ వెళ్ళని దేశాలని చూడచ్చు. పేరిస్, రోమ్... ఓడ మీద ప్రపంచమంతా చుట్టి రావచ్చు."

"అందుకు మనకి డబ్బు కావాలి." ఆమె చెప్పింది.

"అవును. లక్ష డాలర్లు? రెండు లక్షల డాలర్లు? ఇక ఈ షాపులో కూర్చుని మన జీవితాన్ని వృథా చేయాల్సిన అవసరం లేదు." ఆర్థర్ ఉద్వేగంగా చెప్పాడు.

"ఇది సబబు కాదు. కష్టపడకుండా సంపాదించడంలో అపవిత్రత ఉంది." ఎడ్నా భయంగా చెప్పింది.

"ఎడ్నా. ఖరీదైన బట్టలు, బంగారు నగలు, అందమైన ఇల్లు. జీవితాంతం ఇక ఎలాంటి బాధలు ఉండవు. మనం ఏది కోరితే అది జరుగుతుంది. డబ్బు కోరదాం." ఆత్రంగా చెప్పాడు.

"డబ్బు? అది చాలా అతి తేలిక కోరిక. ఎంత కావాలి?" మాంత్రికుడు అడిగాడు.

"పది లక్షల డాలర్లు. మాకు కావలసింది పది లక్షల డాలర్లు."

"ఏ రూపంలో? బంగారమా? వెండా? షేర్లా? షేర్లలో పెరగడం, తరగడం ఉంటుంది. ప్లాటినం కొనేవాళ్ళు తక్కువమంది. డైమండ్స్ ధర ప్రస్తుతం స్థిరంగా ఉంటోంది." ఆ మాంత్రికుడు ప్రశ్నించాడు.

"కేష్. చెల్లే అమెరికన్ కరెన్సీ."

"ఏ నోట్లు?"

"ఏభైలు, వందలు, ఐదులు, పదులు." ఆర్థర్ ఆనందంగా చెప్పాడు.

"సేవింగ్స్ బేంక్‌లోనా? స్విస్ బేంక్‌లోనా?"

"ఇక్కడే, నేను ఇప్పుడే చూసేలా ఇవ్వు."

"నీకు లెక్కలు వచ్చుగా? ఇది నీ రెండో కోరిక." మాంత్రికుడు గుర్తు చేసాడు.

"నీకు ఇంగ్లీష్ వచ్చుగా? ఇది మా రెండో కోరిక." ఆర్థర్ చెప్పాడు.

"కానీ ముందుగా ఓ విషయం. దీని పరిణామాలకి, నాకూ సంబంధం లేదు. అడుగు! ఇవ్వబడుతుంది!" చెప్పి మాంత్రికుడు చిటికె వేసాడు.

తక్షణం ఆ గదిలో నోట్లు వర్షించసాగాయి. ఆర్థర్ నేల మీద నోట్లు అందుకుని గాల్లోకి ఎగరేస్తూ ఆనందంగా చెప్పాడు.

"ఎడ్నా. ఎడ్నా. ఇది వెయ్యి డాలర్ల నోటు... మొత్తం పది లక్షల డాలర్లు."

మాంత్రికుడు మాయమయ్యాడు.

"ఎడ్నా. మనం సెలబ్రేట్ చేసుకుందాం. రెస్టొరెంట్‌కి వెళదాం." ఆర్థర్ ఉత్సాహంగా చెప్పాడు.

"కానీ మనం ఇందాకే లంచ్ చేసాం." ఎడ్నా చెప్పింది.

"పోనీ పార్క్‌లో నడుద్దాం. లేదా బ్రాడ్వేలోని మ్యూజికల్ డ్రామాకి వెళ్దాం."

"మనం వెళ్తే ఈ డబ్బుని ఎవరైనా కొట్టేస్తే? ముందు దీన్ని బేంక్‌లో కడదాం." ఎడ్నా సూచించింది.

"మధ్యాహ్నం దాటింది. బేంక్ ఉండదు. మనం ఈ డబ్బుకి బందీలయ్యాం. మీ అన్నయ్యకి ఫోన్ చేసి వచ్చి డబ్బు తీసుకెళ్ళమను. అతనికి ఆపరేషన్‌కి డబ్బు అవసరం కదా? పేపర్ బాయ్, మాంసం కొట్టువాడు, ఫాదర్... అందర్నీ పిలు. అందికీ తలో కాస్త ఇద్దాం. మనం అప్పున్న వాళ్ళందరికీ ఫోన్ చేసి వచ్చి తీసుకెళ్ళమను. డ్రై క్లీనర్‌కి కూడా."

* * *

ఆర్థర్ వచ్చిన ఒక్కొక్కళ్ళకీ చేతికొచ్చినంత డబ్బుని పంచాడు. వాళ్ళంతా వెళ్ళాక సూట్‌లోని ఆఖరి అతన్ని అడిగాడు.

"నీకెంత కావాలి?"

"మీకింత డబ్బు ఎలా వచ్చింది? గుర్రప్పందేలా? లాటరీనా? అది నాకు అనవసరం. నేను ఇన్‌కంటేక్స్ ఆఫీస్ నించి వచ్చాను. మీరు చెల్లించాల్సిన మొత్తం లెక్క కట్టాలి."

"ఇన్‌కంటేక్సా?" ఎడ్నా ప్రశ్నించింది.

"అవును."

"దీన్ని నేను ఎదురు చూడలేదు. ఎంత కట్టాలో త్వరగా చెప్పండి. నేనూ నా భార్య యూరప్‌కి వెళ్ళాలని అనుకుంటున్నాం." ఆర్థర్ అడిగాడు.

"స్టేట్ ఇన్‌కంటేక్స్‌తో కలిపి తొమ్మిది లక్షల నలభై రెండు వేల ఆరు వందల డాలర్లు చెల్లించాలి. ముప్పై రోజుల్లో కట్టకపోతే ఐదు లక్షల పెనాల్టీ. బేంక్‌లో జమ చేసి చెక్ ద్వారా కట్టండి. ఇదిగో నోటీస్."

అతను వెళ్ళాక భార్యాభర్తలిద్దరూ డబ్బు లెక్క పెట్టి ఇన్‌కంటేక్స్ సొమ్ము పక్కన పెడితే డాలర్ మాత్రమే మిగిలింది.

"మనం మళ్ళీ మొదటికే వచ్చాం. చర్చి రిపేర్‌కి డబ్బివ్వడం సబబే. మనం పెట్రోల్ పోయించుకున్నప్పుడల్లా కారు టైర్లలోని గాలిని ఉచితంగా చెక్ చేసే వర్కర్‌కి వెయ్యి డాలర్లు ఇవ్వడమూ సబబే. ఈ వైన్ సీసాని ఇచ్చిన మిసెస్ గ్రామ్స్‌కి పది వేలు ఇవ్వడం కూడా సబబే. కానీ, మనకి మిగిలింది డాలరే." ఆర్థర్ బాధగా చెప్పాడు.

"మీ మూడో వరం మాటేమిటి?" అన్న కంఠం వినపడి చూస్తే ఆ మాంత్రికుడు కనిపించాడు.

"నాకు మళ్ళీ పది లక్షల డాలర్లు కావాలి. కానీ ఈసారి టేక్స్‌లు పోను." ఆర్థర్ కోరాడు.

"ఆర్థర్! మళ్ళీ డబ్బేనా? ఇంకేదైనా అడుగు. మనకి వచ్చిన గంటలో అవి తగలబడిపోవచ్చు." ఎడ్నా సూచించింది.

"జాగ్రత్త మిస్టర్ ఆర్థర్. ఆలోచించి కోరుకోండి." భూతం సూచించాడు.

"మా మూడో కోరిక ఇంకో పది కోరికలు. లేదా ఇరవై కోరికలు కావాలి." ఎడ్నా చెప్పింది.

"నువ్వు తెలివైనదానివి ఎడ్నా. కాని ఇంకొన్ని వరాలు కోరే వరం అనుమతించ బడదు." భూతం చెప్పింది.

ఏం కోరాలో వాళ్ళిద్దరూ కోపంగా చర్చించుకుంటూంటే మాంత్రికుడు చెప్పాడు.

"ఇలాంటి సందర్భంలో ప్రతీసారి మనుషుల ప్రవర్తన ఇలాగే ఉంటుంది."

"ఎడ్నా. ఏం కోరను? ఎలాంటి తప్పుడు ఫలితాలు రాకుండా ఉండేది ఏది?"

"అలాంటిదంటూ ఏమీ ఉండదు మిస్టర్ ఆర్థర్. ఉచితంగా వచ్చే దేనికైనా ఫలితాలు ఉంటాయి. ఫలితాలకి నా బాధ్యత లేదని ముందే చెప్పానుగా? కాబట్టి వాటిని మీరు అంగీకరించాలి. సహజమైన దాన్ని డిస్టర్బ్ చేస్తే కలిగేదాన్నే ఫలితం అంటారు. ఓ సరస్సులో రాయిని వేస్తే అలలు చుట్టూ వ్యాపిస్తాయి. రాయి ఎంత పెద్దదైతే, అలలు కూడా అంత పెద్దవి అవుతాయి."

"అధికారం. దేనికైనా బాస్ అయితే ఎదురు ఉండదు. నేత అవాలి. జీవితాంతం ఓ దేశానికి నాయకుడిగా మారితే చెడ్డ ఫలితాలు ఉండవు." ఆలోచించి ఆర్థర్ చెప్పాడు.

"ఓ కార్పొరేషన్‌కి ప్రెసిడెంట్ లాంటిదా?" మాంత్రికుడు అడిగాడు.

"అది దివాలా తీయచ్చు." ఎడ్నా అభ్యంతరం చెప్పింది.

"ఓ సిటీ మేయర్?" మళ్ళీ మాంత్రికుడు అడిగాడు.

"ఓట్లతో ప్రజలు బయటికి పంపచ్చు. 'నాకు ఏం కోరాలో అర్థమైంది. ఓ దేశానికి రాజు అవాలి. ప్రజాస్వామ్యం లేని దేశంలో ప్రజలు నేతని బయటికి పంపలేరు. ఓట్లతో అధికారం లోంచి దింపలేని ఓ దేశానికి నేను అధినేతని అవ్వాలి. అది ఓ పెద్ద ప్రఖ్యాత విదేశం అవ్వాలి. నేటి సమకాలీన దేశం తప్ప ప్రాచీన దేశం కాదు. నా జీవితకాలంలో అభివృద్ధి చెందిన దేశమై ఉండాలి. అది లక్షల మంది విద్యావేత్తలు, పరిశ్రమలు ఉన్న దేశమై ఉండాలి. దాని ఫలితం ఏమిటి?" ఆర్థర్ అడిగాడు.

"నేను చెప్పినట్లుగా ప్రతీ దానికి ఫలితం ఉంటుంది. అది మీరు అనుభవిస్తే కానీ తెలీదు. ఎలా ఉంటుందో నేను చెప్పలేను. కాని ఫలితం ఉంటుంది."

"నువ్వు చెప్పింది బావుంది ఆర్థర్. దాన్నే అడుగు." ఎడ్నా ఆనందంగా ప్రోత్సహించింది.

"నేను వర్ణించిన లాంటి దేశానికి వెంటనే నన్ను అధినేతని చెయ్యి." కోరాడు.

"మీరు అడిగిందే ఇవ్వబడుతోంది." మాంత్రికుడు పకపక నవ్వి చెప్పాడు. అతని నవ్వు ప్రతిధ్వనిస్తూనే ఉంది.

* * *

మర తుపాకులు కాలుస్తున్న శబ్దాలు, విమానం లోంచి వేసే బాంబులు శబ్దాలు అక్కడికి వినిపిస్తున్నాయి. అండర్ గ్రౌండ్ లోని గదిలో వంటరిగా కూర్చున్న ఆర్థర్ భయంతో వణికిపోతున్నాడు. మూడు రోజుల నించి అతను ఆ గదిలోంచి బయటికి వెళ్ళలేదు. తలుపు తెరచుకుని మిలటరీ యూనిఫాం లోని డాక్టర్ లోపలికి వచ్చి బల్ల మీద ద్రవం గల ఓ గ్లాస్‌ని ఉంచి చెప్పాడు.

"దీన్ని మీరు తాగగానే రుచి తెలియకుండానే మరణిస్తారు. ఇది సైనేడ్. తర్వాత మీది, మిసెస్ బ్రౌన్ శవాలని తగలబెట్టడానికి పెట్రోల్ బయట సిద్ధంగా ఉంది. హైల్ హిట్లర్." కుడి చేతిని ముందుకి చాపి చెప్పి వెళ్ళిపోయాడు.

ఇంకో రోజులో తన దగ్గరికి శత్రు సైనికులు వస్తారని, తన బెర్లిన్ నగరాన్ని నాలుగు వైపుల నించి శత్రుసైన్యం చుట్టు ముడుతోందని, తను పట్టుబడితే తీవ్రంగా అవమానింపబడతానని, అప్పటికే చాలామంది ఆత్మహత్యలకి తయారుగా ఉన్నారని హిట్లర్‌కి తెలుసు.

"నేను విషం తీసుకోను. నాకు జీవించాలని ఉంది. ఇదంతా ఎక్కడ మొదలైందో నేను తిరిగి ఆ సమయానికి చేరుకోవాలని కోరుకుంటున్నాను. నేను మళ్ళీ ఆర్థర్‌గా

మారాలనుకుంటున్నాను." దీనంగా ఏడుస్తూ హిట్లర్ రూపంలో ఉన్న ఆర్థర్ గొణుగుతూ బల్ల మీద ఉన్న విషం గ్లాసుని కోపంగా నెట్టాడు.

* * *

"ఓ ఆర్థర్. దీన్ని పగలగొట్టావు." ఎడ్నా చెప్పింది.

"దేన్ని పగలగొట్టాను?" షాప్‌లోని ఆర్థర్ అడిగాడు.

"మిసెస్ గ్రామ్స్ తెచ్చిన వైన్ బాటిల్‌ని." గాజు పెంకుల్ని ఊదుస్తూ ఎడ్నా చెప్పింది.

"ఓ! విషం గ్లాస్ కాదా? వైన్ బాటిల్‌నా?"

"నా నాలుగో కోరిక కూడా తీరి నేను మళ్ళీ ఇక్కడికి వచ్చాను. అతనేడి?" ఆర్థర్ అడిగాడు.

"ఇక్కడ ఎందుకుంటాడు? మీరు నాలుగు కోరికలు కోరుకున్నారుగా."

"అవును. నేను నాలుగు అవకాశాలని వృథా చేసుకున్నాను. కాని అతను మళ్ళీ ప్రత్యక్షం కాకూడదనే నేను కోరుకుంటున్నాను. మూడు తరాలనించి వచ్చిన ఈ దుకాణం మనకి ఉంది. మనిద్దరం ఒకరికి మరొకరం ఉన్నాం. ఇంక నేనే కోరికని కోరను. నాకా కొత్త జీవితం నచ్చలేదు. ఆర్థర్‌గా ఉండడమే నాకు బావుంది." ఆర్థర్ చెప్పాడు.

"మనం ఎక్కడ ఆరంభించామో అక్కడికే చేరుకున్నాం." ఎడ్నా నవ్వుతూ చెప్పింది.

"అంటే?"

"చూడండి. నా బూజు కర్ర తగిలి అద్దం మళ్ళీ పగిలింది. ఇప్పుడప్పుడే దాన్ని రిపేర్ చేయించలేం."

"అంటే మనం మళ్ళీ వైన్ బాటిల్ కొనని మొదటి దశకే చేరుకున్నాం." ఆర్థర్ పకపక నవ్వి చెప్పాడు.

ఆర్థర్ పగిలిన వైన్ బాటిల్ ముక్కలని వీధిలోని చెత్త బుట్టలో పడేసి వెనక్కి తిరిగాడు. అవి మళ్ళీ అతుక్కోవడం అతను గమనించలేదు.



# హంతకుడు ఎవరు?

**-సి బి గిల్‌ఫోర్డ్**

**ఒకో సారి కాలంలో ఎంత దూరం వెనక్కి ప్రయాణించినా సత్యం తెలీదు. ఒకో సారి తెలుస్తుంది.**

**తెల్లటి సిల్క్** గౌన్ తొడుక్కున్న ఓ దేవత తెల్లటి మబ్బుల మధ్య వెళ్ళి స్వర్గ ద్వారాన్ని తెరిచింది. తర్వాత వెనక్కి తిరిగి వచ్చి చేతిలో తెల్లటి పొడుగాటి ఈకతో ఓ బల్ల ముందు కూర్చున్న అధిదేవతతో చెప్పింది.

"మిస్టర్ అలెగ్జాండర్ పెన్ ఆర్లింగ్టన్ వచ్చారు."

భుజాన రెక్కలతో ఎడమ చేతిలో హార్ప్‌తో (ఓ వాయిద్య పరికరం) తెల్లటి మబ్బు మీద కూర్చుని ఉన్న అలెగ్జాండర్ గుమ్మంలోంచి తేలుతూ వారి ముందుకి వచ్చాడు.

"మిస్టర్ అలెగ్జాండర్. మీరు ఇక్కడికి రావడం నాకు ఆనందంగా ఉంది." అధిదేవత ఆహ్వానిస్తూ చెప్పాడు.

తర్వాత ఓ పెద్ద పుస్తకాన్ని తెరిచి అలెగ్జాండర్‌తో చెప్పాడు.

"నా పేరు విల్‌ఫ్రెడ్. నేను మీ పాపపుణ్యాల చిట్టా నమోదు చేసే దేవతని. ఏ ఆల్ఫాబెట్ నాకు కేటాయించబడింది."

అలెగ్జాండర్ అటు ఇటు తల తిప్పి చూస్తే వివిధ షెల్ఫ్‌ల నిండా అలాంటి అనేక చిట్టాలు కనిపించాయి.

"ఈ పుస్తకాలన్నీ అలెగ్జాండర్ అనే పేరుకి చెందిన వారివేనా?" అడిగాడు.

"కాదు. అలెగ్జాండర్ నించి అరబెల్లా దాకా."

అలెగ్జాండర్ ఆయన ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. అధిదేవత పుస్తకంలో రాసిన ఎంట్రీని చదివి అడిగాడు.

"అలెగ్జాండర్ పెన్. న్యూయార్క్. యునైటెట్ స్టేట్స్. వివాహితుడు. మీరు డిటెక్టివ్ కథా రచయిత అన్నమాట."

"అవును. బాగా పేరున్న."

"మరణకాలంలో మీ వయసు ఏభై రెండు. కారణం హత్య..."

"...హత్యా? నిజంగా?" అలెగ్జాండర్ తుళ్ళిపడి అడిగాడు.

"నీకది తెలీదా?" దేవత అడిగాడు.

"తెలీదు. నేను హార్ట్ ఎటాక్‌తో మరణించాను... అనుకుంటా. నేను నిద్రపోయాను. మెలకువ వచ్చాక ఇక్కడ ఉన్నాను. వీపులో కొద్దిగా నొప్పిగా అనిపిస్తోంది."

"అందుకు కారణం నువ్వు నీ బల్ల ముందు కూర్చుని ఉండగా, దంతపు పిడి గల కత్తితో పొడిచి చంపబడటం."

"అది నా లెటర్స్ ఓపెన్ చేసే కత్తి. నన్ను చంపింది ఎవరు?"

"ఆ సమాచారం ఇక్కడ నమోదు కాలేదు. ఇందులో కేవలం నీ జీవిత విశేషాలు మాత్రమే ఉంటాయి."

"హంతకుడు ఎవరో నాకు తెలియాలి. తెలియకుండా ఇక్కడ ఎలా జీవించగలను?"

"నీ హంతకుడి రికార్డ్ నా ముందుకి వచ్చినప్పుడు తెలుస్తుంది."

"కానీ అందుకు ఇంకో మార్గం లేదా? ఇంకెవరికైనా తెలిసి ఉండచ్చుగా?"

"నిజమే. కానీ మనం అంత పైకెళ్ళి అడగలేం." తలెత్తి పైకి చూస్తూ అధిదేవత చెప్పాడు.

"ఇది నాకు దుఃఖంగా ఉంది? స్లేట్ శాండర్స్ కలం పేరుతో నేను నూట పాతిక పైగా డిటెక్టివ్ నవలలని రాసాను. ఓ డజను భాషల్లో అవి ముద్రించబడ్డాయి. వాటి ఆధారంగా సినిమాలు, నాటకాలు కూడా వచ్చాయి. ఆ అపరాధ పరిశోధక రచయిత హత్య చేయబడ్డాక ఆ పని చేసింది ఎవరో తెలీకపోవడం నాకు బాధాకరం."

"కానీ స్వర్గంలో అంతా ఆనందంగా ఉండాలి. లేదా అది నేరం."

"నాకు చాలా విచారంగా ఉంది."

"కానీ అది ఇక్కడ తగదు."

"ఐనప్పటికీ నేను విషాదంగా ఉన్నాను."

విల్‌ఫ్రెడ్ దేవత కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పాడు.

"నీ జీవితంలోని ఆఖరి రోజుని నువ్వు మరో సారి జీవించే అవకాశం ఇస్తే నీ హంతకుడు ఎవరో కనుక్కోగలవా?"

"తప్పకుండా. కానీ మరో సారి జీవించే అవకాశం సాధ్యమా?" అలెగ్జాండర్ ఆశగా ప్రశ్నించాడు.

"ఇది కొంచెం అసాధారణమే అయినా అధిదేవతగా సమయం విషయంలో కొన్ని మార్పులు చేసే అధికారం నాకు ఉంది. సమయం అనేది భూమి మీదలా కాక ఇక్కడ

సాగదీయచ్చు. కుంచిచ్చుచ్చు. నీ జీవితంలోని ఆఖరి రోజులోని కొంత భాగం తిరిగి రిపీట్ అవుతుంది. అది నీకు సమ్మతమేనా?"

"తప్పకుండా. కానీ ఇదివరకు జరిగినట్లుగానే మార్పు లేకుండా అలాగే జరుగుతుందా?"

"హంతకుడు, హత్యలో మార్పు ఉండదు. కాకపోతే చిన్న చిన్న మార్పులు జరగచ్చు."

"నా జీవితంలోని ఇతరులకి ఇది మళ్ళీ జరుగుతోందనే సంగతి తెలుస్తుందా?"

"లేదు. ఆ విషయం నీక్కూడా తెలీదు. అర్థరాత్రి చంపబడుతున్నావు అన్న ఒక్క విషయమే నీకు గుర్తుంటుంది. నువ్వీ సారి మేలుకుని ఉంటే బావుటుంది. అందువల్ల ఆ హంతకుడు ఎవరో నీకు తెలుస్తుంది." అధిదేవత వివరించాడు.

"ఆ అవసరం ఉండదని మీకు హామీ ఇస్తున్నాను. నేను వెనక్కి వెళ్ళిన అరగంటలో వారెవరో కనిపెట్టగలను. ఎందుకంటే అది నా వృత్తి."

"సరే. ఇక్కడ కొంత చెరుపుతాను..." ఈకని అందుకుని ఇంకులో ముంచి, ఆ లావుపాటి పుస్తకంలోని ఓ మాటని అధిదేవత చెరపసాగాడు.

* * *

నిద్రపోతున్న అలెగ్జాండర్ ముక్కు దగ్గరికి ఓ కాఫీ కప్పు వచ్చింది. ఆ వాసనకి మెలకువ వచ్చిన అలెగ్జాండర్ కళ్ళు తెరవకుండానే చెప్పాడు.

"గుడ్మార్నింగ్ హనీ."

"గుడ్మార్నింగ్ బాస్." ఓ చైనీస్ సేవకుడు చెప్పాడు.

"టైమెంతయింది?" అలెగ్జాండర్ కళ్ళు తెరవకుండానే అడిగాడు.

"ఎప్పటిలానే పన్నెండు."

"నా భార్య ఏది?"

"గుర్రపుస్వారీకి వెళ్ళింది." చెప్తూ ఆ సేవకుడు బ్రేక్ఫాస్ట్ అమర్చిన ట్రేని అలెగ్జాండర్కి అందించాడు.

"ఒంటరిగానా?"

"లేదు. మిస్టర్ బెన్సన్తో."

"నాకో అతి విచిత్రమైన కల వచ్చింది. చాలా స్పష్టంగా జరిగినట్లుగా అనిపిస్తోంది..."

టెలిఫోన్ బెల్ మోగడంతో అలెగ్జాండర్ రిసీవర్ అందుకుని చెప్పాడు.

"హలో."

"అలెగ్జాండర్! అది కల కాదు."

"ఎవరు మీరు?"

"విల్‌ఫ్రెడ్."

"ఎక్కడి నించి ఫోన్ చేస్తున్నారు?"

"ఇది చాలా పిచ్చి ప్రశ్న. దీని గురించి ఎవరికీ చెప్పకు. లేదా నా దగ్గరకి తక్షణం వచ్చేస్తావు."

లైన్ కట్టయింది.

ఆ రోజు దినపత్రికని అందించి సేవకుడు అడిగాడు.

"ఇంకేమైనా కావాలా బాస్?"

ఎవరో తలుపు మీద కొట్టిన చప్పుడు వినిపించింది. సేవకుడు బయటికి వెళ్ళగానే, బట్టతల గల ఓ ఏభై ఏళ్ళ వ్యక్తి లోపలికి వచ్చి చెప్పాడు.

"గుడ్మార్నింగ్."

"మార్నింగ్ టాల్‌బర్ట్. ఏమిటి?"

"మీ పబ్లిషర్ ఫెంటన్ నించి ఈ ఉత్తరం వచ్చింది. దీన్ని మీరు వెంటనే చూడాలి."

"చదువు."

*డియర్ అలెక్స్,*

*మీ 'మర్డర్ ఆఫ్ ఏ మేనకిల్' నవలని చదివి నిరాశ చెందాము. రేపు వచ్చి దీని గురించి మీతో మాట్లాడుతాం. మీరు నవలా రచనలో బాగా అలసిపోయినట్లున్నారు. బావి ఎండినట్లుంది. మీరు కొంతకాలం విశ్రాంతి తీసుకుంటే మళ్ళీ ఊరచ్చు. తర్వాత దీన్ని దిద్దచ్చు.*

అలెగ్జాండర్ బిగ్గరగా నవ్వాడు.

"ఫెంటన్‌కి ఏం తెలీదు."

"అది నిజం కాదనుకుంటాను." టాల్‌బర్ట్ చెప్పాడు.

"అంటే నాలో రచనా సమర్ధత తగ్గుతోందని నువ్వు కూడా అనుకుంటున్నావా?"

"అవును. మీరు విశ్రాంతి తీసుకుంటే స్లేట్ శాండర్స్ పేరు మీద నేను రచనలు చేస్తాను."

"నువ్వు?!? నా అనుభవంలో ఇంతటి విచిత్రమైన మాటలు నేనింతదాకా వినలేదు. నువ్వు నా శైలిలో రాయగలవా? ఇలాంటి మూర్ఖుడ్ని నా దగ్గర ఉంచుకోవడం నాదే తప్పు. నాకింకా కోపం రాకమునుపే వెళ్ళిపో."

"కానీ మీరు రాసిన గత నాలుగు నవలలకి నేను ఎంత సహాయం అందించానో మీరు మర్చిపోవడం ఇంకా విచిత్రంగా ఉంది. ఒక్క చోట మాత్రమే కాదు. అనేక చోట్ల తిరగసాగాను."

"నిజంగా? ఈ క్షణమే నిన్ను ఉద్యోగం లోంచి తీసేస్తున్నాను. ఈ రోజు దాకా నీ జీతానికి చెక్ రాసి తీసుకురా. నేను సంతకం చేసాక బయటికి నడు. అర్థమైందా?" అలెగ్జాండర్ కోపంగా చెప్పాడు.

"అర్థమైంది." తలుపు తెరుచుకుని బయటికి వెళ్తూ టాల్‌బర్ట్ చెప్పాడు.

"ఒక్క నిమిషం టాల్‌బర్ట్. రేపు ఫెంటన్ ఇక్కడికి వచ్చినప్పుడు నాకేదైనా జరిగి నేను లేకపోతే స్లేట్ శాండర్స్ పేరుతో నవలలు రాయడానికి అతను నిన్ను అనుమతిస్తాడని అనుకుంటున్నావా?"

"తప్పకుండా. మూర్ఖుడైతే మాత్రమే అనుమతించడు."

"నిన్ను తేలికగా పట్టుకున్నాను టాల్‌బర్ట్. నీ మనసులో ఉన్నది నువ్వు చేయలేవు." స్థిరంగా చెప్పాడు.

"మీరు దేని గురించి మాట్లాడేది?" టాల్‌బర్ట్ ప్రశ్నించాడు.

"ఏం లేదు. గుడ్ బై."

"గుడ్ బై అలెగ్జాండర్." చెప్పి టాల్‌బర్ట్ కోపంగా తలుపు చప్పుడయ్యేలా మూసి వెళ్ళిపోయాడు.

అలెగ్జాండర్ పైకి చూసి నవ్వుతూ చెప్పాడు.

"అదీ! నాకు ఇందుకు ఎక్కువ టైం పట్టదని చెప్పానా?"

తర్వాత దినపత్రికని తెరిచి చదవసాగాడు.

* * *

కాలకృత్యాలు తీర్చుకుని తన రైటింగ్ గదిలోకి వచ్చిన అలెగ్జాండర్‌ని చూసి అక్కడ కూర్చున్న యువకుడు చెప్పాడు.

"హలో అంకుల్ అలెక్స్."

"హలో విల్సన్."

"మీతో నాకు పని ఉంది. మీరు రాయడం మొదలుపెట్టాక దాన్ని భంగ పరచకూడదని మీ కోసం వేచి ఉన్నాను. నాకు డబ్బవసరం ఉంది. ఐదు వందల డాలర్లు కావాలి."

"క్రితం సారి మన మధ్య ఇదే సందర్భంలో నేనేం చెప్పానో మళ్ళీ నా సమాధానం అదే అనుకో. నీకో నీడ, కడుపు నిండా భోజనం ఇస్తున్నాక ఇంక అవసరాలు ఏముంటాయి?" అలెగ్జాండర్ సిగరెట్ అంటించి అడిగాడు.

"కాని నాకు అప్పిచ్చిన వారు వేచి ఉండరు. నువ్వు మరణించే దాకా వేచి ఉండే కన్నా నాకు వచ్చే దాంట్లో కొంత ఇప్పుడే ఇవ్వచ్చుగా?" బల్ల మీది తెల్లటి దంతపు పిడి గల లెటర్ ఓపెనర్ అందుకుని దాని వంక చూస్తూ విల్సన్ అడిగాడు.

అలెగ్జాండర్ దాన్ని గమనించాడు.

"కేవలం నువ్వు నా రక్తసంబంధీకుడవనే నా విల్లులో నీకు కొంత ఆస్థి రాసాను. ఇప్పుడు తీసేయడానికి ఆలస్యమైపోయింది."

విల్సన్ చేతిలోని లెటర్ ఓపెనర్‌ని బల్ల మీద పెట్టి చెప్పాడు.

"ఈ రాత్రికల్లా నాకు డబ్బు అందకపోతే దాని కోసం నేనేదైనా తీవ్రమైన చర్య తీసుకోవాల్సి ఉంటుంది."

"ఓ! ఎంత తీవ్రమైందోయ్?" అలెగ్జాండర్ వ్యంగ్యంగా అడిగాడు.

"నాకు తెలీదు. కాని ఏం జరిగినా అందుకు బాధ్యత నాది కాదు."

'నా నవల్లో లాగే పరిస్థితి ఇంకాస్త విషమం అయింది.' అతను వెళ్ళాక అలెగ్జాండర్ అనుకున్నాడు.

ఓ వ్యక్తితో వస్తున్న తన భార్యని కిటికీ లోంచి చూసాడు. 'హలో అలెక్స్' అని ఆమె పలకరించినా అతను అన్యమనస్కంగా చేతిని ఊపాడు. తర్వాత సిగరెట్‌ని ఏష్ ట్రేలో ఆర్పి, లేచి తలుపు మూయబోతూ మరో కిటికీ లోంచి తన భార్యని ఆ వ్యక్తి చుంబించడం చూసాడు.

"బై. రాత్రికి మళ్ళీ కలుద్దాం." చెప్పి ఆమె తలుపు తెరుచుకుని లోపలికి వచ్చింది.

"హలో అలెక్స్." ఎదురుగా కనపడ్డ భర్తతో చెప్పింది.

"నువ్వు గుడ్ బై చెప్తే నాకు ఆనందంగా ఉంటుంది." కోపంగా చెప్పాడు.

"ఈ రోజుల్లో అందరూ అందర్నీ ముద్దు పెట్టుకుంటున్నారు. అది ఫ్రెండ్లీ కిస్ మాత్రమే. బెన్సన్‌తో నాకు ఎఫైర్ ఉందని అనుమానిస్తున్నావా?"

"లేదా? నా భార్యని పరాయి వ్యక్తి చేతుల్లో చూస్తే నాకెలా ఉంటుందో ఊహించలేవా?"

"బిజీగా ఉండే మిమ్మల్ని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన పరిస్థితి నాకెలా ఉంటుందో మీరూ ఊహించలేరా?"

"అంటే నేను నిన్ను నిర్లక్ష్యం చేస్తున్నానని ఆరోపిస్తున్నావా?"

"కాదంటారా?"

"ఈ రోజు నించి బెన్సన్ ఈ ఇంట్లోకి రాకూడదు. అర్థమైందా?"

"అర్థం లేని మాట. ఈ రాత్రి బెన్ నన్ను ఫెయిర్‌కి తీసుకెళ్తున్నాడు." చెప్పి ఆమె మెట్లెక్కి పైకి వెళ్ళిపోయింది.

బల్ల ముందు కూర్చున్న అలెగ్జాండర్ రైటింగ్ పేడ్‌లో రాసింది చదివాడు.

అనుమానితులు, కారణం అనే రెండు కాలమ్‌ల కింద నాలుగు పేర్లు రాసాడు.

టాల్‌బర్ట్ – డబ్బు, పేరు.

విల్సన్ – డబ్బు, భయం.

కరోల్ – ప్రేమ, డబ్బు.

బెన్సన్ – డబ్బు, ప్రేమ.

తనని చంపడానికి ప్రతీ వాళ్ళకీ ఓ కారణం ఉంది! తను వీళ్ళని ఇంతకాలం ఎంతగా నమ్మాడో? తను రాసిన మర్డర్ ఫర్ మనీ అనే నవలలో అలాంటి సందర్భం ఉందని గుర్తొచ్చి లేచి దాన్ని తెరిచి చూసాడు. కానీ తల అడ్డంగా ఊపి మళ్ళీ మూసేసాడు.

'ఈ అర్థరాత్రి ఈ గదిలో నా హత్య జరగడం తథ్యం. కాబట్టి ఇక్కడ హంతకుడు తప్పనిసరిగా ఉంటాడు. కెరోల్, బెన్సన్‌లు ఆ సమయానికి రారు. టాల్‌బర్ట్ వస్తాడేమో చూడాలి. అతను రాకపోతే నా ప్రియమైన మేనల్లుడు హంతకుడు అవుతాడు.'

ఇది చాలా సులువైన పరిష్కారం అన్న ఆలోచన వచ్చాక ఆనందపడ్డాడు.

* * *

ఆ రాత్రి ఉరుములతో కూడిన వర్షం వస్తోంది. అలెగ్జాండర్ తన గదిలో కూర్చుని సిగరెట్ తాగుతున్నాడు. చేతి గడియారం చూసుకుంటే టైం ఎనిమిదైంది.

ఎవరో తలుపు తెరుచుకుని ఇంట్లోకి వచ్చిన శబ్దం, 'మిస్టర్ అలెగ్జాండర్' అన్న పిలుపు వినిపించాయి. జవాబు రాకపోవడంతో టాల్‌బర్ట్ మెట్లెక్కి పైకి వెళ్ళడం అతను చూసాడు.

'అర్థమైంది. హంతకుడు టాల్‌బర్ట్. పన్నెండుకి ఇక్కడికి నన్ను చంపడానికి వస్తాడు' అలెగ్జాండర్ అనుకున్నాడు.

రాత్రి పదకొండున్నరకి బయట కారు ఆగింది. లేచి చూస్తే అతని భార్య కెరోల్, బెన్సన్‌లు నవ్వుతూ లోపలికి రావడం కనిపించింది.

"మీరింకా మేలుకునే ఉన్నారా?" ఎదురుపడ్డ భర్తని కెరోల్ అడిగింది.

"నేను నా బల్ల ముందు నిద్రపోతూంటానని భావించారా? ఈ విషయం ఇప్పుడే తేలుస్తాను. అంతా, మీరంతా నా గదిలోకి రండి." చెప్తూ కోపంగా బెల్ నొక్కాడు.

వచ్చిన చైనీస్ సేవకుడితో చెప్పాడు.

"నా మేనల్లుడు టాల్‌బర్ట్ కూడా పైన ఉన్నాడు. వెంటనే ఇక్కడికి తీసుకురా. త్వరగా. నేను దీని అంతు చూస్తాను."

* * *

సమయం పది నిముషాలు తక్కువ పన్నెండు. ఆ గదిలో కూర్చున్న నలుగురి వంక చూస్తూ అలెగ్జాండర్ చెప్పసాగాడు.

"నాకు చాలా తక్కువ వ్యవధి ఉంది. కొద్దిసేపట్లో ఎవరో నన్ను హత్య చేయబోతున్నారు. అది మీ నలుగురిలో ఒకరని నాకు గట్టిగా తెలుసు. అది ఎవరు అన్నది నాకు తెలియాలి. వ్యవధి లేదు. కాబట్టి ఎవరూ అడ్డు పడకుండా నా ప్రశ్నలకి జవాబులు చెప్పండి."

అంతా అతని వంక పిచ్చివాడ్ని చూసినట్లు చూడసాగారు. తన మేనల్లుడితో చెప్పాడు.

"విల్సన్! నువ్వు నిద్ర మొహంతో ఉన్నావు. రక్తసంబంధీకుడివి కాబట్టి నిన్ను పక్కన పెడతాను."

"అలాగే మామయ్యా. నేను నిన్ను ఎందుకు చంపుతాను?" ఆవలిస్తూ అడిగాడు.

"నా ఆస్థిలో మూడో వంతు కోసం."

"తప్పకుండా. అది నాకు ఇప్పుడు లభిస్తేనే ప్రయోజనం. కాకపోతే అందుకు నేను నిన్ను చంపను – అంటే, ఇంకో విధంగా దాన్ని సంపాదించగలిగితే."

అలెగ్జాండర్ టాల్‌బర్ట్ దగ్గరికి వెళ్ళి చెప్పాడు.

"నీ మీద నాకు అనుమానంగా ఉంది. నువ్వు ఈ రాత్రి ఎందుకు వచ్చావు?"

"నేనొకటి మర్చిపోయాను."

"ఏమిటది? చూపించు."

"అది నాకు కనపడలేదు."

"నేను అనుకున్న సమాధానమే. నా కలం పేరుతో రచనలు చేయాలనే పిచ్చి ఆలోచనతో నువ్వు నన్ను చంపాలనుకున్నావు కదా? నిజం చెప్పు." నిగ్గదీసాడు.

"మీ బుర్ర సరిగ్గా పని చేయడం లేదు."

"అలెక్స్! ఇదంతా ఏమిటి? మీరు సరిగానే ఉన్నారా?" కరోల్ ప్రశ్నించింది.

ఆమె దగ్గరికి వెళ్ళి చెప్పాడు.

"నిన్ను నేను విస్మరించలేదు. స్వంత భార్యే చంపడం... నిజాన్ని తెలుసుకుందాం. తెలీని ఏదో కారణం వల్ల నువ్వు ఈ మనిషి సైజు పురుగుతో అక్రమ సంబంధం పెట్టుకున్నావు. అక్రమ సంబంధం! నన్ను, నా డబ్బుని పోగొట్టుకోకుండా నువ్వు దాన్ని కొనసాగించలేవని తెలిసి నన్ను హత్య చేయాలనుకున్నావు. అందువల్ల నీ సమస్యలన్నీ పరిష్కరింపబడతాయి. అవునా?"

"అవి బుద్ధి లేని మాటలు." ఆమె కోపంగా చెప్పింది.

"నిజంగా? నువ్వు చెప్పిన టైం కన్నా ముందే ఎందుకు వచ్చావు?"

"మేము వెళ్ళిన నాటకం విసుగ్గా ఉంటే వచ్చేసాం."

"నిజమే. అది చాలా బోర్ కొట్టింది." బెన్సన్ చెప్పాడు.

బెన్సన్ దగ్గరికి నడుస్తూ అలెగ్జాండర్ చెప్పాడు.

"నిన్నింత దాకా పట్టించుకోలేదు. నీకు తృప్తి లేదు. నువ్వు కరోల్‌ని డబ్బుతో సహా పొందాలని అనుకుంటున్నావు. కాబట్టి ఆమె విధవరాలైతే నీకే లాభం."

"అలెక్స్." కరోల్ అడ్డు పడింది.

"అందువల్ల నువ్వు నన్ను హత్య చేయాలనుకున్నావు అని ఒప్పుకో."

"మిస్టర్ అలెక్స్! నేనింతదాకా అలా ఆలోచించలేదు. విన్నాక అది నాకు ఆకర్షణీయంగా అనిపిస్తోంది. మిమ్మల్ని హత్య చేస్తే నాకు ప్రయోజనమే." బెన్సన్ ఉత్సాహంగా చెప్పాడు.

"ఇది ముందుకు సాగడం లేదు. ఎవరు నన్ను చంపబోతున్నారో బయటపడాలి. అది నాకు తప్పక తెలియాలి." అలెగ్జాండర్ విసుగ్గా చెప్పాడు.

టెలిఫోన్ మోగింది. వెళ్ళి అలెగ్జాండర్ రిసీవర్ అందుకున్నాడు!

"అలెగ్జాండర్?"

"అవును. విల్‌ఫ్రెడ్. మీ కంఠాన్ని గుర్తు పట్టాను." చెప్పాడు.

"నీకింకో ఐదు నిమిషాల గడువు పెంచనా?"

"ఆ అవకాశం ఉందా?"

"ఉంది. ఆఖరి సంఘటనలో మాత్రం మార్పుండదు."

"సరే. థాంక్ యూ." రిసీవర్ పెట్టేసాడు.

"ఎవరది?" కరోల్ అడిగింది.

"విల్‌ఫ్రెడ్. స్వర్గంలోని నా అధిదేవత. నేను మరణించాను. అంటే ఓసారి మరణించాను. నేను ఇదివరకు ఓ సారి హత్య చేయబడ్డాను. అది ఎవరు చేసారో నాకు తెలీలేదు. విల్‌ఫ్రెడ్ అది తెలుసుకోడానికి నన్ను వెనక్కి పంపాడు. అతను చాలా దయగల దేవత. నన్ను చంపబోయేది ఎవరో నాకింకా తెలియలేదు. అందుకని మళ్ళీ ఆ సంఘటన జరిగేందుకు వ్యవధిని ఐదు నిమిషాలు పెంచాడు. ఇంతకంటే ఎక్కువ వివరించమని నన్ను అడక్కండి. మీకు అర్థం కాదు."

ఆ గదిలోని నలుగురూ అలెగ్జాండర్ వంక పిచ్చివాడిని చూసినట్లుగా చూసారు. అలెగ్జాండర్ టేబుల్ మీది దంతపు పిడి గల లెటర్ ఓపెనర్‌ని అందుకుని దాన్ని చూపిస్తూ చెప్పాడు.

"ఇంకొద్ది నిమిషాల్లో ఎవరో నన్ను దీంతో వీపు మీద పొడిచి చంపబోతున్నారు. ఈసారి ఆ పని చేసింది ఎవరో నేను తెలుసుకో దలచుకున్నాను. ఇదివరకు నిద్రలో ఉన్నాను. కాని ఇప్పుడు నేను మేలుకునే ఉన్నాను. కాబట్టి ఈసారి అది తెలుస్తుంది. మిగిలిన అంతా లేచి బయటికి వెళ్ళండి. హంతకుడు మాత్రం ఇక్కడ ఉంటే చాలు. ఎందుకంటే, ఇతరులు సాక్షులుగా ఉండగా వారా పని చేయరు."

కుర్చీలో కూర్చున్న అలెగ్జాండర్‌తో టాల్‌బర్ట్ చెప్పాడు.

"సర్! ఇంకా ఆలస్యం కాక మునుపే మీరు ఓ సైక్రియాట్రిస్ట్‌ని చూడటం మంచిది. మాలో ఒకరు మిమ్మల్ని చంపితే, మీరు ఎలా వెనక్కి తిరిగి వచ్చారు?"

"అది నేను వివరించలేను. టైం అయిపోతోంది. హంతకుడు తప్ప మిగతా వాళ్ళంతా దయచేసి బయటికి వెళ్తారా?"

బెన్సన్ లేచి చెప్పాడు.

"మీ మూర్ఖత్వాన్ని ఇంకో అడుగు ముందుకు తీసుకువెళ్తాను. అంతా ఇక్కడ ఉండగా మీ హత్య జరిగే మార్గం ఒకటుంది. ఇతరులకి తెలీకుండా అంతా ఇక్కడ

ఉండగానే హంతకుడు మిమ్మల్ని చంపచ్చు. స్లేట్ శాండర్స్ దీన్ని గురించి ఆలోచించక పోవడం విచిత్రం. నేను చేయాల్సిందల్లా...”

లైట్ స్విచ్‌ని ఆఫ్ చేసాడు. వెంటనే గదంతా చీకటి. అంతా లేచారు.

“బెన్సన్! వెంటనే లైట్ వెయ్. బెన్సన్...ఆఁ” అలెక్స్ భీకరంగా అరిచాడు.

* * *

“ఇక్కడ చిన్న తుడిచివేత.” చెప్తూ అధిదేవత ఈకతో తుడుస్తున్నాడు.

“నేను ఇంతసేపు చూసిందంతా మీరది తుడిచేంత సమయంలో జరిగిందంటారా?” అలెగ్జాండర్ ఆశ్చర్యంగా అడిగాడు.

“అవును. ఇందాక నేను చెప్పినట్లుగా భూమి మీద టైంకి, ఇక్కడి టైంకి ఎలాంటి సంబంధం లేదు.“ విల్‌ఫ్రెడ్ చెప్పాడు.

“నన్ను మళ్ళీ చంపాడు. కానీ హంతకుడు ఎవరో తెలీలేదు. బెన్సన్ లైట్ ఆఫ్ చేసాడు. కానీ ఇప్పుడు ఎవరైతే ఏమిటి అనిపిస్తోంది.”

“మంచిది.” అధిదేవత చెప్పాడు.

“వాళ్ళంతా నన్ను చంపాలనుకున్నారు కాబట్టి నేనెలాంటి మనిషినో నాకు అర్థమైంది.” అలెగ్జాండర్ నెమ్మదిగా చెప్పాడు.

“వాళ్ళు ఎలాంటి వాళ్ళో కూడా నీకు అర్థమై ఉండాలి. ఎందుకంటే మీరంతా సాధారణ మనుషులు. నిన్ను చంపిన హంతకుడు బెన్సన్‌ని గాఢంగా నమ్మి ఉండాలి. తను హత్య చేసే లోపల తిరిగి లైట్ వెయ్యడని హంతకుడికి రూఢీగా తెలిసి ఉండాలి.”

“నిజమే. వాళ్ళు ఇందులో భాగస్వాములై ఉండాలి. అందుకు ముందే పథకం వేసుకుని ఉండాలి... కెరోల్! తప్పకుండా ఇది కెరోల్ పనే. ఆమె పట్టుబడిందనే ఆశిస్తాను.”

“తక్కువ మందిని పట్టుకుంటూంటారు.” అధిదేవత చెప్పాడు.

“మీరు దేవతే కాకుండా మంచి డిటెక్టివ్ కూడా.” అలెగ్జాండర్ మెచ్చుకున్నాడు.

కొద్ది క్షణాలాగి అలెగ్జాండర్ అడిగాడు.

“నేను సాధారణ మనిషిని కదా? నేను ఇక్కడికి ఎలా రాగలిగాను?”

“డిటెక్టివ్ రచయితలంతా ఇక్కడికే వస్తారు.”

“ఎందుకని?”

“నాకూ తెలీదు. ఈసారి కలిసినప్పుడు అడగాలి.” పైకి చూస్తూ అధిదేవత చెప్పాడు.

# సహాయకారి

-మైక్ వైసెక్

**మనిషి మరణించాక కాని నిజ స్వరూపం తెలీదు.**

**"నా పేరు** ఎర్నెస్ట్ ఎపిల్‌వర్త్. నేను షేర్స్ బిజినెస్ చేస్తూంటాను. మీ గురించి నా మిత్రులు చెప్తే మీ సహాయం కోరి వచ్చాను."

క్లార్క్ అతని వంక చూసాడు. మధ్య వయస్కుడు. తెల్లబడుతున్న జుట్టు. సినిమా నటుడిలా ఉన్నాడు.

"నేను మీకేం సహాయం చేయగలను?" క్లార్క్ అడిగాడు.

"నేను ఎక్కువ డబ్బు సంపాదిస్తున్నాను." ఎర్నెస్ట్ చెప్పాడు.

"అదే మీ సమస్య అయితే దాని గురించి పూర్తిగా చెప్పండి." క్లార్క్ కోరాడు.

"నవంబర్ నించి నేను నా పెట్టుబడి మీద పది వేల శాతం సంపాదించాను."

"మనం ఏప్రిల్‌లో ఉన్నాం. అంటే గత ఆర్నెల్లుగా మీరు ప్రతీ నెల మీ డబ్బుకి రెట్టింపు ఆర్జిస్తున్నారా?" క్లార్క్ ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును."

"ఎలా?"

"షార్ట్ టర్మ్ ఫారెక్స్ ట్రేడింగ్."

"నేను కొంతకాలం రెహ్మేన్ బ్రదర్స్ ఫారెక్స్ కంపెనీలో పని చేసాను. ఈ వ్యాపారంలో అది సాధ్యం కాదుగా?" క్లార్క్ అనుమానంగా చూస్తూ అడిగాడు.

"నేడది నేరం అభివృద్ధి చెందిన పరిశ్రమే అయినా, నాది ఆ లైన్ కాదు. అంతా నిజాయితీతో కూడుకున్నదే." ఎర్నెస్ట్ హామీ ఇచ్చాడు.

"ఫారిన్ ఎక్స్‌ఛేంజ్ వ్యాపారంలో డబ్బు మదుపు పెట్టేకంటే, దానికి అగ్గిపుల్ల గీసి అంటించడం మంచిదని నా అభిప్రాయం. ఏ కరెన్సీలతో మీరు డీల్ చేస్తున్నారు?" క్లార్క్ అడిగాడు.

"చాలా. ఇప్పుడు నైజీరియన్ నైరాస్. ఒకప్పుడు స్యాట్స్, ఖతార్ రియాల్స్. ఇదివరకు చాలా చిన్న దేశాల కరెన్సీలలో పెట్టుబడి పెట్టాను. అనుమానంగా చూడకండి. లండన్‌లోని క్లియరింగ్ హౌస్ ద్వారా ఈ వ్యాపారాన్ని చేస్తున్నాను. ప్రతీ లావాదేవీని

నియమాల ప్రకారం ప్రభుత్వానికి తెలియచేసి, టేక్స్‌లు కూడా చెల్లిస్తున్నాను. ప్రతీ దానికి లెక్కుంది."

"ఐతే మీకు ఎవరో లోపలి సమాచారం అందిస్తున్నారన్నమాట?" క్లార్క్ ప్రశ్నించాడు.

"ఎవరో కాదు. ఏదో. అందుకే మీ సహాయం కోరి వచ్చాను. పేరా సైకాలజీ విషయంలో మీరు నమ్మ దగ్గవారని నా మిత్రులు చెప్పారు." ఎర్నెస్ట్ జవాబు చెప్పాడు.

"అర్థమైంది. ఊజా బోర్డు ద్వారానో లేక సియాన్స్ ద్వారానో. ఏ దెయ్యం మీకు ఆ సమాచారాన్ని ఇస్తోంది?" క్లార్క్ నవ్వుతూ ప్రశ్నించాడు.

"అతనెవరో తెలీదు. ఎప్పుడూ చూడలేదు." ఎర్నెస్ట్ చెప్పాడు.

"అతను ఎలా ఉంటాడు?"

"దెయ్యంలా. చొక్కా పీలికలై నెత్తి మీద, ఛాతీ మీద నెత్తురు మరకలు ఉంటాయి. అతని వెనక ఉన్న ఫర్నిచర్ కూడా అతని లోంచి లీలగా కనిపిస్తూంటుంది."

చాలామంది మరణించాక సరాసరి ఎక్కడికో వెళ్తారు. ఆ ప్రదేశం ఎవరికీ తెలీదు. కాని ఒక్కో సారి ఎవరికైనా ముఖ్యమైన, పూర్తి చేయని పనులుండి, మరణించడం నచ్చకపోతే వారి ఆత్మలు ఎక్కడికీ వెళ్ళకుండా జీవించి ఉన్న వారిని ఇబ్బంది పెడుతూంటాయి. సాధారణంగా అవి పగ తీర్చుకుంటాయి. భూమి మీది శత్రువులని ఏడిపించే వాటిని దెయ్యాలని పిలుస్తూంటారు. అలాంటి వాటిని వదిలించడానికి క్లార్క్‌ని చాలామంది ఆశ్రయిస్తూంటారు.

"నేనింత దాకా సహాయం చేసే దెయ్యం గురించి ఎన్నడూ వినలేదు. మీకెందుకు దాన్నించి సహాయం అందుతోంది?" క్లార్క్ కొద్దిగా ఆశ్చర్యంగా అడిగాడు.

"నాకు తెలీదు. తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. అతను నాకు డబ్బు సంపాదించి పెడుతున్నాడు. కాబట్టి ఎన్నడూ అడగలేదు. బాగా రాత్రయ్యాక, నేను వంటరిగా ఉన్నప్పుడు అతను నా ఆఫీస్‌లో కనిపిస్తూంటాడు."

"ఎంత తరచు?"

"మొదట్లో వారానికి ఒకటి రెండు సార్లు. ఇప్పుడు సోమవారం నించి గురువారం దాకా ప్రతీ రాత్రి కనిపించి, ఏ కరెన్సీ రేటు పెరుగుతుందో చెప్తున్నాడు. నేను మర్నాడు ఉదయం వాటిని కొని, సాయంత్రానికల్లా అమ్మేస్తాను."

"అతను మీతో ఎలా మాట్లాడుతాడు?" క్లార్క్ ప్రశ్నించాడు.

"అతను బహుశ చేతిలో పెన్నుతో మరణించి ఉంటాడు. తన షర్ట్ మీద రాసి చూపిస్తూంటాడు."

దెయ్యాల నియమాల్లో ఇదొకటని క్లార్క్‌కి తెలుసు. మరణించే సమయంలో ఒంటి మీద లేదా చేతిలో ఏముంటే వాటితోనే కనిపిస్తూంటారు. నర్స్‌ని పిలిచే బెల్ బటన్‌తో, లేదా శారీరక శ్రమ చేస్తూ హార్ట్ అటాక్‌తో మరణిస్తే చేతిలో ఆ బెల్‌తో, తోట పని చేస్తూ మరణిస్తే పారతో... ఇలా. ఆ దెయ్యం తాలూకు మనిషి ఆఫీసులో పని చేస్తూ మరణించి ఉంటాడని క్లార్క్ అనుకున్నాడు.

"మీ అఫీసులో ఎంతసేపు కనపడతాడు?"

"మొదటిసారి అరగంట. ఆ తర్వాత నించి నిమిషం మించి కనిపించడం లేదు. అతను దెయ్యం అని నమ్మడానికి నాకు కొంత సమయం పట్టింది. దెయ్యాలు పాటించే అనేక నియమాలని చెప్పాడు. మొదటిది, ఎవరితో అవసరమో వారికే కనపడడం. ఇతర దెయ్యాలతో సంబంధం పెట్టుకోకపోవడం. బాగా అవసరం ఉంటే తప్ప కనపడకపోవడం. మరణానంతర జీవితం గురించి ఎవరు అడిగినా 'సమయం వచ్చినప్పుడు తెలుస్తుంది' అని మాత్రమే చెప్పాలి. తన ఉనికి తెలియకుండా, అంటే అవసరం లేనప్పుడు కనపడకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలి. తాము భూమి మీదే ఉన్నా, భూమికి చెందినవాళ్ళు కాదన్న సంగతి గుర్తుంచుకోవాలి."

"ఇది సమర్థవంతమైన దెయ్యంలా ఉంది." క్లార్క్ చెప్పాడు.

"అవును. అది ఫారిన్ కరెన్సీ మీద ఇచ్చే ఏ టిప్‌లో ఇంత దాకా అబద్ధం లేదు. ఒక్క సారి కూడా పొరపాటు జరగలేదు."

"నా క్లయింట్స్‌లో చాలామంది దెయ్యాన్ని వదిలించుకోడానికి నా దగ్గరికి వస్తూంటారు. మీరు అందుకు రాకపోతే మరి మీ సమస్య ఏమిటి?" క్లార్క్ ప్రశ్నించాడు.

"నా లాయర్‌కి జరిగింది చెప్తే, ప్రభుత్వం నా మీద 'ఇన్‌సైటర్ ట్రేడింగ్' (మోస పూరిత సమాచారం సేకరించిన నేరం) ఆపాదించవచ్చని చెప్పాడు. కాబట్టి ఈ దెయ్యం ఎవరికి చెందిందో తెలుసుకోవాలని ఉంది."

క్లార్క్ అంతదాకా పగ, ప్రతీకారాలకి చెందిన కేసులనే చూసాడు. ఎర్నెస్ట్ ధనవంతుడు అవడమే, ఆ దెయ్యం ధ్యేయమై ఉండాలని తెలిసి ప్రశ్నించాడు.

"మిమ్మల్ని ప్రేమించినవాళ్ళు ఎవరైనా ఇటీవల హత్య చేయబడ్డారా? లేదా అసహజ మరణాన్ని పొందారా?"

"లేదు." అతను జవాబు చెప్పాడు.

"నేను ఒకసారి మీ ఆఫీస్‌కి వచ్చి ఆ దెయ్యాన్ని చూస్తాను."

"అలాగే." ఎర్నెస్ట్ ఒప్పుకున్నాడు.

* * *

ఆ రోజు సోమవారం.

ఆ రాత్రి ఎర్నెస్ట్‌ని కలవడానికి దెయ్యం వస్తుంది కాబట్టి భోజనం చేసాక క్లార్క్ ఫిఫ్త్ అవెన్యూలోని ఇరవైయ్యవ అంతస్థుకి చేరుకున్నాడు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సెక్యూరిటీలో ఉన్న ముగ్గురు గార్డ్‌లకి ఎర్నెస్ట్ ముందే చెప్పడంతో క్లార్క్‌ని లోపలికి అనుమతించారు.

ఎర్నెస్ట్ ఆఫీస్ ఓ మూల ఉంది. బల్ల మీది టేబుల్ లేంప్ వెలుగుతోంది. కిటికీ లోంచి నగరంలో వెలిగే దీపాలు కనిపిస్తున్నాయి.

"ఇతని పేరు జాక్ టిమ్స్." ఎర్నెస్ట్ ఓ కొత్త వ్యక్తిని పరిచయం చేసాడు.

ముప్పై ఆరేళ్ళ అతనితో కరచాలనం చేస్తూ క్లార్క్ చెప్పాడు.

"నైస్ టు మీట్ యూ."

"జాక్ నా వ్యాపారంలో చాలా పెద్ద మొత్తాన్ని పెట్టుబడి పెడుతున్నాడు."

"ఆరు కోట్ల డాలర్లు." జాక్ చెప్పాడు.

"ఆ దెయ్యం చెప్పినట్లుగా రేపు రేట్లు పెరుగుతాయో లేదో తెలుసుకోడానికి వచ్చాను." జాక్ చెప్పాడు.

వారిద్దరూ వ్యాపారం గురించి మాట్లాడుకుంటూంటే క్లార్క్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"మీకు ఇబ్బంది లేదుగా?" ఎర్నెస్ట్ ప్రశ్నించాడు.

"ఏ మాత్రం లేదు." క్లార్క్ జవాబు చెప్పాడు.

చేతి గడియారం వంక చూసుకుని ఎర్నెస్ట్ చెప్పాడు.

"ఇంక కొద్ది నిమిషాలే."

పుస్తకాల షెల్ఫ్ దగ్గర అకస్మాత్తుగా దెయ్యం ప్రత్యక్షమైంది. ఎర్నెస్ట్ చెప్పినట్లుగా చొక్కాకి, టైకి రక్తపు మరకలు. ఛాతీలో, ముక్కు మీద బుల్లెట్లు దిగాయి.

అతని మొహం గుర్తుపట్టేలా లేదు. ఆ దెయ్యం మిగిలిన ఇద్దర్ని చూసి కొద్దిగా ఉలిక్కిపడింది. అది క్రమేపీ వెలిసిపోతూ మాయమైపోతూంటే ఎర్నెస్ట్ గట్టిగా చెప్పాడు.

"వీళ్ళు పెట్టుబడి పెట్టేవాళ్ళు. అందువల్ల నా లాభం పెరుగుతుంది."

దెయ్యం మళ్ళీ మామూలుగా అయ్యింది.

"ఈ రోజు ఏం రికమెండ్ చేస్తావు?" ఎర్నెస్ట్ అడిగాడు.

దెయ్యం షర్ట్‌ని పైకెత్తింది. అక్కడ తుపాకీ గుండు రంధ్రం కనిపించింది. చొక్కా మీద ఏదో రాసి చూపించింది.

'ఫోరింట్స్? పెరుగుతుందా?" ఎర్నెస్ట్ అడిగాడు.

దెయ్యం అవునన్నట్లుగా తల ఊపింది.

"మంచిది."

* * *

మర్నాడు ఉదయం క్లార్క్ నిద్రలేవగానే కంప్యూటర్ ఆన్ చేసి ఫారిన్ ఎక్స్ఛేంజ్ రేట్లు చూపించే వెబ్ సైట్ లోకి వెళ్ళాడు. అప్పటికే రెండు గంటల నించి ఫారెక్స్ వ్యాపారం జరుగుతోంది. హంగేరియన్ ఫ్లోరింట్స్ ఐదు శాతం పెరిగింది. అంతదాకా ఎర్నెస్ట్ చెప్పింది పూర్తిగా నమ్మని క్లార్క్‌కి ఇంకా నమ్మకం కలగలేదు. కానీ నమ్మక తప్పని పరిస్థితి.
స్నానం చేస్తూ ఆ దెయ్యం ఎవరిదో గుర్తించే మార్గం గురించి ఆలోచించాడు. డేటా బేస్‌లోని పోస్ట్‌మార్టం రికార్డులు, పోలీస్ రిపోర్టులు మొదలైనవి చూడచ్చు. సమస్య ఏమిటంటే, నిత్యం చాలామంది మరణిస్తూంటారు. అందులో హింసతో మరణించే వారి సంఖ్య కూడా తక్కువ కాదు.

* * *

"ఆ పేరు నీకు గుర్తు లేదా? జాక్ టిమ్స్‌కి రేండల్ అనే భాగస్వామి ఉండేవాడు. వారిద్దరూ కలిసి పెట్టుబడి వ్యాపారాన్ని నడిపే వారు. గత సంవత్సరం రేండల్ బేంక్‌లోని మొత్తం సొమ్ముతో మాయమయ్యాడు." పోలీస్ డిటెక్టివ్ గాట్లింగ్ గంట తర్వాత క్లార్క్‌తో చెప్పాడు.

"ఎంత మొత్తం?" క్లార్క్ అడిగాడు.

"వంద అటు ఇటుగా ముప్పై లక్షల డాలర్లు."

"గుర్తొచ్చింది. అతన్ని మీరు ఇంతదాకా పట్టుకోలేదా?"

"లేదు. అంతకంటే, ఎక్కువ మొత్తాన్ని దొంగిలించిన వాళ్ళనే మేం పట్టుకోలేదు. ఆ విషయంలో ఇతను చిన్న చేప."

"జాక్ తన మొత్తం పెట్టుబడిని ఎర్నెస్ట్‌కి అప్పజెప్పబోతున్నాడు. కానీ ఎర్నెస్ట్ మోసకారి అని నాకు అనిపిస్తోంది. దెయ్యం సమాచారం ఇవ్వడం చట్టవిరుద్ధమో కాదో

నాకు తెలియదు. ఫ్రాడ్ స్క్వాడ్ ఎర్నెస్ట్‌ని పట్టుకునే లోగా నువ్వే అతని మోసాన్ని తెలుసుకోవడం మంచిది.” క్లార్క్ చెప్పాడు.

అక్కడి నించి క్లార్క్ జాక్ ఆఫీస్‌కి వెళ్ళాడు. అది ఎర్నెస్ట్ ఆఫీస్‌కి సమీపంలో ఉంది. బుల్లెట్ ప్రూఫ్ లిమజిన్‌లో బాడీ గార్డుల మధ్య జాక్ ఆఫీస్ లోకి వచ్చాడు.

“ఆ దెయ్యం ఎవరిది?” క్లార్క్ ప్రశ్నించాడు.

“మాయమైన నా భాగస్వామి రేండల్ దెయ్యం.” జాక్ చెప్పాడు.

“నా అనుమానమూ అదే. మనుషులు మాయమై ఎవరికీ కనపడకుండా జీవించడం అరుదు. అది రేండల్ దెయ్యం అని మీకెలా తెలుసు?”

“అతను నా దగ్గరికీ వచ్చాడు.” జాక్ జవాబు చెప్పాడు.

“ఎప్పుడు?” క్లార్క్ ఆశ్చర్యంగా అడిగాడు.

“రెండు రోజుల క్రితం. అర్ధరాత్రి. అవి ఆఫీస్ అవర్స్‌లో కనబడవా?” జాక్ చిరుకోపంగా ప్రశించాడు.

“ ఏం చెప్పాడు?”

“రేండల్‌ని కిడ్నాప్ చేసి, చిత్రహింసకి గురి చేసి, బేంక్ పాస్‌వర్డ్ తెలుసుకుని తుపాకీతో కాల్చి హడ్సన్ నదిలో పడేసారు. అతనికి ఇంకా కోపంగా ఉంది. కానీ తన కిడ్నాపర్స్ మొహాలకి తొడుగు ఉండడంతో వారెవరో తెలీలేదు. రేండల్ దొంగ అని, ఏ ఫిజీ ద్వీపానికో పారిపోయి నివసిస్తున్నాడని అంతా భావించడం అతనికి ఇబ్బందిగా ఉంది అని చెప్పాడు.” జాక్ చెప్పాడు.

“రేండల్ నిన్ను ఎర్నెస్ట్ దగ్గరికి పంపాడా?”

“అవును. ఎర్నెస్ట్ సంపాదన గురించి విచారించాను. అది రేండల్ చెప్పినట్లుగా నిజాయితీతో కూడింది.”

“ఇదంతా రేండల్ దెయ్యం మీకెలా చెప్పింది?”

“నిన్న రాత్రి లానే. షర్ట్ మీద రాసి.”

“ఆ టిప్‌ని మీకే ఇవ్వకుండా ఎర్నెస్ట్ దగ్గరికి ఎందుకు పంపినట్లు?” క్లార్క్ అడిగాడు.

“నా వ్యాపారం మీద ఐఆర్ఎస్ ఏజెంట్లకి అనుమానం రాకూడదని. వారు ఇప్పటికే ఎర్నెస్ట్ మీద ఓ కన్నేసి ఉంచారు.”

“రేండల్ దెయ్యానికి రేపటి ధరల గురించి ఎలా తెలుసు?” క్లార్క్ ప్రశ్నించాడు.

“మరణానంతరం కానీ అది మనకి అర్థం కాదుట.”

"ఫోరింట్స్ వ్యాపారంలో మీకు ఎంత లాభం వచ్చింది?" క్లార్క్ అడిగాడు.

"నాకు నమ్మకం కలగక పెట్టుబడి పెట్టలేదు. ఇప్పుడు కలిగింది. ఇక మీదట పెట్టుబడి పెడతాను." జాక్ చెప్పాడు.

* * *

క్లార్క్ ఎర్నెస్ట్ ఆఫీస్‌కి వెళ్ళేసరికే బయట పోలీసులు అమర్చిన పసుపుపచ్చ రిబ్బన్, పోలీస్ కార్లు, టి.వి.వాహనాలు, ఓ పెద్ద గుంపు కనిపించాయి. డిటెక్టివ్ గాట్లింగ్ పేరు చెప్పి క్లార్క్ లోపలికి వెళ్ళాడు.

లాబీలో ఫోరెన్సిక్ టెక్నీషియన్స్‌తో మాట్లాడే గాట్లింగ్‌ని అడిగాడు.

"ఏం జరిగింది? ఎలా జరిగింది?"

"సి.సి టివి కెమెరాలో అంతా రికార్డయింది. జాక్ టిమ్స్ అరుస్తూ ఎర్నెస్ట్ ఆఫీసులోకి వెళ్ళి మెషీన్ గన్‌తో పదకొండు గుళ్ళు పేల్చాడు. అదృష్టవశాత్తూ ఎర్నెస్ట్ తృటిలో తప్పించుకున్నాడు. జాక్‌ని అదుపు లోకి తీసుకున్నాం. జాక్ డబ్బు మొత్తం ఒక్క పెన్నీ కూడా లేకుండా పోయింది. దాని పేరు రింగెట్ అనుకుంటా. ఆసియాలోని ఏదో దేశానికి చెందిన డబ్బు. నాకు పూర్తి వివరాలు తెలియవు కానీ, జాక్ మొత్తం పోగొట్టుకున్నాడు. కొద్ది రోజులుగా రేండల్ అనే దెయ్యం న్యూయార్క్‌లోని చాలామంది ఫారెక్స్ వ్యాపారస్థులకి కనిపించి పెరిగే కరెన్సీలని సూచిస్తోంది. ఈ విషయం ఒకరి నించి మరొకరు రహస్యంగా ఉంచారు." గాట్లింగ్ చెప్పాడు.

"పిరమిడ్ స్కామ్ లాంటిదా?" క్లార్క్ ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. కానీ ఇటీవలి కాలంలో ఇలాంటిది నేను వినలేదు."

"రేండల్ ఎర్నెస్ట్‌ని నమ్మించి మోసం చేసాడా?" క్లార్క్ అడిగాడు.

"ఎర్నెస్ట్‌ని కాదు. అతని టార్గెట్ జాక్. ఎర్నెస్ట్ పెన్నీ కూడా పోగొట్టుకోలేదు." గాట్లింగ్ చెప్పాడు.

"జాక్ ఎందుకు నష్టపోయాడు?" క్లార్క్ ప్రశ్నించాడు.

"ఎందుకంటే, జాక్ హంతకుల్ని నియమించి తన భాగస్వామి రేండల్‌ని కిడ్నాప్ చేయించి చంపించాడు. ఇంకో ప్రపంచానికి వెళ్ళాకే రేండల్‌కి జరిగింది అర్థమైంది. జాక్‌ని దరిద్రుడ్ని చేయడానికి రేండల్ ఆడిన నాటకం ఇది. జాక్‌కి ఆ దెయ్యం రేండల్‌ది అని తెలిసినా, రేండల్‌ని తనే చంపించాడని అతనికి తెలియదు అనుకున్నాడు. జాక్‌కి మలేషియన్ రింగెట్ మీద పెట్టుబడి పెట్టమని ఎర్నెస్ట్ ద్వారా చెప్పాడు. మొత్తం పోయింది."

"దెయ్యాలకి పగ ఉంటుందని తెలుసు. కానీ, మేథస్సు కూడా ఉంటుందని నాకు తెలీదు." క్లార్క్ చెప్పాడు.

"ఆ విషయం నువ్వు తెలుసుకోవాలంటే, షుమారు 40-50 ఏళ్ళు ఆగాలి." గాట్లింగ్ నవ్వాడు.

"జాక్‌నే ఎన్నుకుని చెప్పచ్చుగా? రేండల్ మధ్యలో ఎర్నెస్ట్‌ని ఎందుకు వాడుకున్నాడు?"

"నమ్మడని. ఎర్నెస్ట్‌కి వచ్చిన లాభాల గురించి పరిశోధించాక తన మాట నమ్ముతాడని. రేండల్ చచ్చి సాధించాడు." గాట్లింగ్ చెప్పాడు.



# ఎక్స్-20

**-రిచర్డ్ మేథ్‌సన్**

**చాలా రహస్యాలు అంతరిక్షంలో మరుగున ఉన్నాయి.**

**అమెరికన్ మిలటరీ** బేస్‌లోని ఆ హాస్పిటల్ లోకి వచ్చిన యూనిఫాం లోని కల్నల్ ఫోర్బ్స్ చేతిలో ఆ రోజు దినపత్రిక ఉంది. ఆందోళనగా ఉన్న అతన్ని నర్స్ ప్రశ్నించింది.

"కల్నల్ ఫోర్బ్స్. ఏమిటి సంగతి?"

"కల్నల్ గార్ట్‌ని డిశ్చార్జ్ చేసారా?" అతను అడిగాడు.

"లేదు. రూం నంబర్ పదిహేను." నర్స్ చెప్పింది.

అతను సరాసరి రూం నంబర్ పదిహేను తలుపు తెరచుకుని లోపలకి వెళ్ళాడు. మంచం మీద పడుకుని ఉన్న కల్నల్ గార్ట్‌ని పలకరించాడు.

"ఇవాళ ఎలా ఉన్నావు?"

"బావున్నాను. నువ్వు అదృష్టవంతుడివి. నిన్న ఉదయమే నిన్ను డిశ్చార్జి చేసారు."

"ఇందులోని సమాచారం నిజమేనా? చదివి చెప్పు." కల్నల్ ఫోర్బ్స్ తన చేతిలోని దినపత్రికని ఇచ్చాడు.

గార్ట్ మొదటి పేజీలోని ఆ వార్తని చదివాడు. కల్నల్ ఫోర్బ్స్, కల్నల్ గార్ట్ ఫొటోతో పాటు వార్తలో ఇలా ఉంది.

*మార్స్ మీదకి మనిషిని పంపే ప్రయత్నంలో భాగంగా ఎక్స్-20 అనే అంతరిక్ష నౌకని అమెరికన్ మిలటరీ బేస్ నించి ప్రయోగించారు. అది ఇరవై నాలుగు గంటలు రాడార్ స్క్రీన్ మీంచి మాయం అయిందని పాఠకులకి తెలుసు. నాలుగు రోజుల తర్వాత ఆ నౌక నెవేడా లోని ఓ ఎడారిలో కూలింది. అందులో ప్రయాణించిన ఇద్దరు క్షేమంగా ఉన్నారు.*

"మనం ఇద్దరం కాదు. ఆ నౌకలో ముగ్గురం వెళ్ళాం. నిన్న నన్నే కాదు. కల్నల్ హేరింగ్టన్‌ని కూడా డిశ్చార్జి చేసారు." కల్నల్ ఫోర్బ్స్ ఆందోళనగా చెప్పాడు.

"కల్నల్ హేరింగ్టన్? అతను ఎవరు?" వెంటనే గార్ట్ ప్రశ్నించాడు.

"మూర్ఖుడిలా మాట్లాడక. మనం ముగ్గురం కలిసి కదా ఎక్స్-20 అంతరిక్ష నౌకలో అంతరిక్షం లోకి వెళ్ళి వచ్చాం."

"ముగ్గురం కాదు. మనం ఇద్దరమేగా వెళ్ళింది?" గార్ట్ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"నీకు అంతే గుర్తుందా? మనతో వచ్చిన కల్నల్ హేరింగ్టన్ నాకు పదిహేనేళ్ళుగా మిత్రుడు. నీకు ఐదేళ్ళుగా. ఐనా మనతో కలిసి ఆరు రోజుల ఒకే నౌకలో ప్రయాణించిన హేరింగ్టన్‌ని మర్చిపోయావా?" ఆవేదన, ఆందోళన కల్నల్ ఫోర్బ్స్ కంఠంలో ధ్వనించాయి.

"అసలు మనతో వస్తేగా నాకు గుర్తుండటానికి. నువ్వేదో భ్రమకి గురైనట్లున్నావు ఫోర్బ్స్. వెంటనే సైకియాట్రిస్ట్‌ని కలవడం మంచిది." గార్ట్ నిటారుగా లేచి కూర్చుని చెప్పాడు.

"నీకు ఇదేం గుర్తు లేదా? ఈ గదిలోని మూడు బెడ్స్‌లో మనం ముగ్గురం..."

కల్నల్ ఫోర్బ్స్ చెప్పడం ఆపేసాడు. ఆ గదిలో చూస్తే రెండు బెడ్స్ మాత్రమే కనిపించాయి.

"మీ ఇద్దర్నీ డిశ్చార్జ్ చేసాడని మాట వరసకి నమ్ముతాను. మరి అతను ఏడీ?" గార్ట్ అడిగాడు.

"నిన్న రాత్రి మా ఇద్దర్నీ డిశ్చార్జ్ చేసాక మేము ఓ బార్‌కి వెళ్ళాం. బార్ టెండర్ మమ్మల్ని దినపత్రికలోని ఫొటో చూసి గుర్తు పట్టాడు. మాకు ఉచితంగా బీర్‌ని ఇస్తానని, సెలబ్రిటీలు తన బార్‌కి అరుదుగా వస్తారని చెప్పాడు. హేరింగ్టన్ చేతిలోని బీర్ గ్లాస్ కింద పడి పగిలింది. అతను అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడని గ్రహించి ఏమయిందని అడిగితే 'తను భూమికి చెందిన మనిషిని కానని అనిపిస్తోందని, పైన ఏదో లేదా ఎవరో పొరపాటు చేసారని అనిపిస్తోందని' చెప్పాడు. తన తల్లితండ్రులకి ఫోన్ చేయడానికి పబ్లిక్ ఫోన్ బూత్‌లోకి వెళ్ళి నిమిషం తర్వాత నన్ను అర్జెంట్‌గా రమ్మని పిలిచాడు. వెళ్తే ఆందోళనగా 'నా తల్లి తనకి హేరింగ్టన్ అనే కొడుకే లేదని అన్నదని, తన తండ్రి నన్ను పిచ్చాసుపత్రికి వెళ్ళమని చెప్పారని, తనకి అంతా అయోమయంగా ఉందని ఏడుస్తూ చెప్పాడు. వాళ్ళు ప్రాక్టికల్ జోక్ వేస్తున్నారని, బీర్ తాగి తేరుకోమని చెప్పాను. నేను వెనక్కి తిరిగి బార్ కౌంటర్‌కి చేరుకున్నాను. ఓ టేబిల్ మీది ఈ దినపత్రికని చూస్తే మనిద్దరి ఫొటోలు మాత్రమే కనిపించాయి. బార్ టెండర్ కూడా నేను ఒక్కడినే వచ్చానని, కూడా ఎవరూ రాలేదని చెప్పాడు! చూస్తే హేరింగ్టన్ మాయం అయ్యాడు. సరాసరి ఇక్కడికి వచ్చాను. నాకు చాలా భయంగా ఉంది."

"మనిద్దరమే వెళ్ళింది. అంతరిక్షంలో ప్రయాణం వల్ల నీకు చిత్తభ్రమ కలిగినట్లుంది. నువ్వు సైకియాట్రిస్ట్‌ని కలవడం మంచిది."

వెంటనే కల్నల్ ఫోర్బ్స్ ఎయిర్‌ఫోర్స్ హెడ్‌క్వార్టర్స్‌కి ఫోన్ చేసి మేజర్ ఏండర్సన్‌తో మాట్లాడాడు.

“సర్! అంతరిక్ష నౌకలో ఎంతమంది ప్రయాణించాం?” అడిగాడు.

“ఇద్దరు. నువ్వు, కల్నల్ గార్టర్. దేనికా అనుమానం వచ్చింది?” ఏండర్సన్ అడిగాడు.

“ముగ్గురం కదా వెళ్ళింది? కల్నల్ హేరింగ్టన్ కూడా మాతో వచ్చాడు.”

“హేరింగ్టన్? అసలా పేరే నేను ఎప్పుడూ వినలేదు.”

“నన్ను మూర్ఖుడ్ని చేయకండి. మీ ప్రాక్టికల్ జోక్‌ని దయచేసి ఆపండి. హేరింగ్టన్ మీ కింద ఆరేళ్ళుగా పని చేస్తున్నాడు.”

“నువ్వు వెంటనే సైకియాట్రిస్ట్‌కి రిపోర్ట్ చేయి. ఇది నా ఆజ్ఞ.” ఏండర్సన్ కంఠం వినిపించింది.

రిసీవర్ పెట్టేసాడు. కొద్ది నిమిషాల తర్వాత కల్నల్ ఫోర్బ్స్ తన తలని పట్టుకుని చెప్పాడు.

“ఎందుకో నాకు కూడా హేరింగ్టన్‌కి కలిగిన భావనే కలుగుతోంది. నేను ఈ భూమికి చెందిన వాడిని కాను. పైన ఏదో లేదా ఎవరో పొరపాటు చేసారని అనిపిస్తోంది.”

కల్నల్ ఫోర్బ్స్ ఆ గదిలోంచి బయటకి వెళ్ళాడు. వెంటనే కల్నల్ గార్ట్ మంచం దిగి ‘నర్స్! నర్స్!’ అని పిలుస్తూ బయటకి వెళ్ళాడు. నర్స్ అతన్ని చూసి గట్టిగా చెప్పింది.

“మీరు బయటకి ఎందుకు వస్తున్నారు? మంచం దిగకూడదని డాక్టర్ చెప్పారుగా?”

“కల్నల్ ఫోర్బ్స్‌ని చూస్తే నాకు భయంగా ఉంది. అతన్ని సైకియాట్రిస్ట్ దగ్గరకి తీసుకెళ్ళండి.” అర్థించాడు.

“కల్నల్ ఫోర్బ్స్? ఎవరతను?” ఆ గదిలోకి రాకమునుపు ఫోర్బ్స్‌తో మాట్లాడిన నర్స్ అడిగింది.

“నాతో పాటు అడ్మిట్ అయిన...” కల్నల్ గార్ట్ తల తిప్పి చూస్తే ఆ గదిలో తన ఒక్క మంచమే కనిపించింది.

వెంటనే ఫోర్బ్స్ తెచ్చిన దినపత్రికని తెరచి చూసాడు. అందులో అంతరిక్షంలోకి వెళ్ళిన తన ఫొటో మాత్రమే కనిపించింది!

నర్స్ అతని మొహంలోని అయోమయాన్ని చూసి డాక్టర్ కోసం మెట్లెక్కి వేగంగా పైకి వెళ్ళింది.

కల్నల్ గార్ట్‌కి అకస్మాత్తుగా 'తను ఈ భూమికి చెందిన వాడిని కాను' అని ఇందాక హేరింగ్టన్ చెప్పిన భావన అనుభవంలోకి వచ్చింది. భయంతో ముడుచుకు పోయాడు.

నిమిషం తర్వాత ఆ గదిలోకి డాక్టర్‌తో వచ్చిన నర్స్ చెప్పింది.


"ఈ గది నాలుగు రోజులుగా ఖాళీగా ఉంది సర్."

ఆ గదిని చూసి డాక్టర్ చెప్పాడు.

"మలేరియా రోగులకి ఈ గది సరిపోతుంది. ఇందులో కొన్ని బెడ్స్ వేయించు."

ఆ గదిలో దినపత్రిక కూడా లేదు!

అంతే కాదు. అమెరికా పంపిన ఎక్స్-20 నౌక గురించిన ఏ వివరాలు అందుబాటులో లేవు. ఎక్స్-20 అంతరిక్ష నౌకని ఉంచిన హేంగర్ కూడా ఖాళీగా ఉంది.



# చావుకళ

**-రాడ్ సెర్లింగ్**

**మృత్యువు ముందే తన రాకని తెలియచేస్తే? అది మంచిదా? చెడ్డదా?**

**1945.** అమెరికాకి జపాన్‌తో యుద్ధం జరుగుతున్న రోజులవి.

ఫిలిప్పీన్స్‌లోని ఓ అడవిలో కొంత భాగం చదును చేసి, అమెరికన్ మిలటరీ కంపెనీ తన స్థావరంగా చేసుకుంది. సమీపంలో యుద్ధం ముగిసాక, యు.ఎస్ ఆర్మీకి చెందిన ఇన్‌ఫాంట్రీ ప్లటూన్ సైనికులని తరలించే ట్రక్స్ ఆ స్థావరానికి చేరుకుంటున్నాయి. గాయపడ్డ వారిని మిలటరీ కేంప్ ఆఫీస్‌కి తరలిస్తున్నారు.

ఓ ట్రక్ లోంచి ఆఖరుగా దిగిన లెఫ్ట్‌నెంట్ ఫిజ్ కెప్టెన్‌కి సిగరెట్ ఇస్తూ చెప్పాడు.

"మనల్ని బ్రిడ్జిని స్వాధీనం చేసుకోమన్నారు. ఎందుకో నాకు అర్థం కాలేదు. జపనీస్ నేవల్ గన్స్‌తో ప్రతీ మూడు నిముషాలకోసారి ఆ బ్రిడ్జి వైపు తుపాకీలని కాలుస్తున్నారు. ఐనా స్వాధీనం అయింది."

"ఈ రోజు ఎంతమందిని మనం పోగొట్టుకున్నాం?" కెప్టెన్ జేమ్స్ అడిగాడు.

"నలుగురు మరణించారు. పది నించి పన్నెండు మంది గాయపడ్డారు. హెర్బర్ట్, మోర్గాన్, లీవీ, ఫిల్. ఆ నలుగురి వయసు ఇరవై ఒకటి లోపే..."

"ఫిజ్. నువ్వు మంచి ఆఫీసర్‌వి. ఐనా నిన్నేదో బాధిస్తోందని కొద్ది రోజులుగా గమనిస్తున్నాను. ఏమిటది? నాతో పంచుకోవచ్చుగా?" కెప్టెన్ జేమ్స్ అడిగాడు.

ఫిజ్ సిగరెట్ ఓ దమ్ము తాగి, జేబులోంచి ఓ కాగితం తీసి జేమ్స్‌కి ఇచ్చాడు. దాన్ని చదివి జేమ్స్ చెప్పాడు.

"అరె! ఇవి ఇవాళ మరణించిన నలుగురి పేర్లు!"

"అవును. వీరంతా పదమూడు జనవరి 1945న ఫిలిప్పీన్స్‌లోని లుజాన్‌లో యుద్ధంలో మరణించినవారు." ఫిజ్ చెప్పాడు.

"ఐతే?" జేమ్స్ విభ్రాంతిగా చూస్తూ అడిగాడు.

"నాకేమైందో చెప్పనా? ఆ పేర్లని నేను మనం వెళ్ళక మునుపు నిన్న రాసాను." ఫిజ్ నెమ్మదిగా చెప్పాడు.

"అసలు ఎందుకు రాసావు?"

"నేను వెళ్ళబోయే వారి ఆయుధాలని తణిఖీ చేసేప్పుడు వారి మొహాలు చూసాను. ఆ నలుగురి మొహాల్లో... అలా నలభై నాలుగు మంది మొహాలు చూసాను. ఆ నలుగురి మొహాల్లో వెలుగులాంటి ఓ ప్రత్యేకత కనిపించింది. నేను మీకు వివరించలేను. నిజానికి వివరణ లేదు. నేను వాళ్ళ మొహాల్లోకి చూడగానే ఈ రోజు వాళ్ళ జీవితంలోని ఆఖరి రోజని నాకు తెలిసింది. నాకు ఎలాంటి అనుమానం లేకుండా రూఢీగా తెలిసింది." ఫిజ్ బాధపడుతూ చెప్పాడు.

"ఇది నమ్మశక్యంగా లేదు."

"నిన్న కూడా ఇలాగే జరిగింది. దాంతో నిన్న రాత్రి నేను సరిగ్గా నిద్రపోలేదు. నాకు అలా కనపడ్డ వాళ్ళు నిజంగా పోతారా అనే ఆలోచనే. నేను ప్లటూన్ లోని సైనికులని చూసినప్పుడల్లా ఎవరు తిరిగి రారో వారి మొహంలో కనపడే కాంతి వల్ల తెలిసిపోతోంది."

"ఫిజ్! నీకు ఇది ఎప్పటి నించి జరుగుతోంది? ఇది రాసింది నిన్న మనం వెళ్ళేప్పుడేనా? ట్రక్‌లో ఇవాళ మనం వెనక్కి వస్తున్నప్పుడు కాదా?" కెప్టెన్ జేమ్స్ ప్రశ్నించాడు.

"నిన్న. ఒట్టు పెట్టి చెప్తున్నాను. నిన్న ఉదయం నేను ఆ పేర్లు ఇక్కడ ట్రక్ ఎక్కే ముందు రాసాను."

జేమ్స్ ఆలోచనగా ఫిజ్ వంక చూసాడు.

* * *

కెప్టెన్ జేమ్స్ చెప్పింది విని మిలటరీ మెడికల్ ఆఫీసర్ గంథర్ కొన్ని కాగితాలు తిరగేసి చెప్పాడు.

"ఫిజ్ యుద్ధంలో ఎప్పుడూ గాయపడలేదు. యుద్ధంలో సైనికులకి కలిగే మానసిక వత్తిడి అతనికి కలిగిన సూచనలు లేవు. అందువల్ల ఈ వింత ఆలోచనలు అతనికి ఎందుకు వస్తున్నాయో చెప్పడం కష్టం. ఐనా అతన్ని నేను పరీక్షించడం మంచిది."

"మీరు పరీక్షించడం నాకు ఆనందమే. అతను చెప్పింది నేను నమ్మాను. మీరు కూడా నమ్ముతారు. అతను మంచివాడు. మేం అమెరికాలో ఉండగానే నాకు అతను పరిచయం. మనకి ఉన్న మంచి ఆఫీసర్లలో అతనొకడు." జేమ్స్ చెప్పాడు.

"నేను చేయగలిగేది చేస్తాను. అతను ఇప్పుడు వార్డ్‌లోనే ఉన్నాడు. అతని ప్లటూన్‌లోని గాయపడ్డ ఒకర్ని చూడడానికి వచ్చాడు." గంథర్ చెప్పాడు.

* * *

వార్డ్‌లోని గాయపడ్డ సైనికుడు స్మిటీ ఫిజ్‌తో చెప్పాడు.

"నేను బానే ఉన్నాను లెఫ్టినెంట్. మిగిలినవాళ్ళు ఎలా ఉన్నారు?"

"అంతా బానే ఉన్నారు. పోర్కీ చేతి వేళ్ళకి గ్రనేడ్ ముక్కలు తగిలి గాయమైంది."

"పోర్కీ అదృష్టవంతుడు."

"అవును. నువ్వు కూడా. నీకు ఆ గాయం మానగానే డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్ళిపోతావు." లెఫ్టినెంట్ ఫిజ్ చెప్పాడు.

"నిజమే."

"నీకేమైనా అవసరం ఉందా? చదవడానికి ఏమైనా కావాలా?"

"చదవడానికి ఉన్నాయి."

"ఓ కే స్మిటీ. జాగ్రత్తగా ఉండు."

వెళ్తున్న ఫిజ్‌తో స్మిటీ వెనక నించి చెప్పాడు.

"థాంక్స్ ఫర్ కమింగ్ లెఫ్టినెంట్."

"గుడ్ బై స్మిటీ." చెప్తూ స్మిటీ వంక చూస్తూండిపోయాడు.

అకస్మాత్తుగా అతని మొహం వెలుగుతో నిండిపోవడం ఫిజ్ గమనించాడు. ఆ వత్తిడికి ఫిజ్ కాళ్ళు వణికి కింద పడిపోయాడు. అతన్ని ఓ సైనికుడు లేపుతూ అడిగాడు.

"ఏమైంది? మీరు కులాసానేనా?"

"ఆ."

చూస్తే స్మిటీ తల వాలిపోయి ఉంది. ఆ సైనికుడు అతని మణికట్టుని పట్టుకుని చూసి చెప్పాడు.

"నాడి కొట్టుకోవడం లేదు. స్మిటీ ఎంత త్వరగా పోయాడో?"

ఫిజ్ మౌనంగా బయటికి నడిచాడు.

జేమ్స్ నిస్సహాయంగా నడుస్తున్న ఫిజ్‌ని పలకరించాడు.

"హలో ఫిజ్."

"నేను స్మిటీని చూడడానికి వచ్చాను. అతనికేం కాదని డాక్టర్ చెప్పాడు. కాని అతని మొహంలో నాకా వెలుగు కనిపించింది. ఓ నిమిషం తర్వాత స్మిటీ మరణించాడు."

"ఇదివరకటిలా నేనా?"

"ఇదివరకటి లానే. తమాషా వెలుగు. చూడగానే నాకు అర్థమైంది. దీని గురించి నేను వివరించలేను." ఫిజ్ బాధగా చెప్పాడు.

వార్డ్ వైపు వెళ్తున్న డాక్టర్ గంథర్‌తో ఇందాకటి సైనికుడు చెప్పాడు.

"బెడ్ ఫైవ్‌లో స్మిటీ ఇప్పుడే పోయాడు డాక్టర్."

"నేను పరీక్షిస్తాను." గంథర్ చెప్పాడు.

"పరీక్షించడానికి శవం తప్ప ఇంకేమీ లేదు. అతని మొహం చూసాక, అతను మరణిస్తాడని నాకు తెలిసింది." ఆ మాటలు విన్న ఫిజ్ చెప్పాడు.

"అది నీకు ముందే తెలిసిందా లెఫ్టినెంట్?" గంథర్ అడిగాడు.

"అవును. నిన్న ఇలాగే నలుగురి గురించి తెలిసింది."

"అది చిత్రంగా లేదూ?" గంథర్ అడిగాడు.

"లేదు. యుద్ధంలో పాల్గొన్న ముప్ఫై రోజులకి ఒక్కరూ మరణించక పోతే అది చిత్రం. ఇరవై ఐదు మైళ్ళు నడిచాక కాళ్ళకి పుళ్ళు పడక పోతే అది చిత్రం. ఇది చిత్రం కాదు. పీడ కల. మనుషుల మొహాల్లో మృత్యువుని చూడగల వెధవ ఆఫీసర్‌ని నేను."

"కాదు. మీరు మానసిక వత్తిడితో బాధపడే ఆఫీసర్." గంథర్ చెప్పాడు.

"ఐదుగురి విషయంలో అది నిజమైంది డాక్టర్. నేను నిజం చెప్తున్నానని తెలుసుకోడానికి ఇంకా ఎన్ని కాకతాళీయాలు మీకు కావాలి? మిలటరీలో బోధించని ఓ నైపుణ్యం నాకు అబ్బిందని మీరెందుకు నమ్మరు? నా కళ్ళని పొడిచేసుకోవాలని అనిపిస్తోంది. దయచేసే నేను చూడకుండా ఏదైనా చేయండి డాక్టర్. అందువల్ల ఎవరి మొహాలని చూడను." ఫిజ్ బాధగా, కోపంగా చెప్పాడు.

* * *

కెప్టెన్ జేమ్స్ ఆ రాత్రి మేప్ చూపిస్తూ చెప్పాడు.

"మనం ఈ పాయింట్ నించి దాడి చేస్తున్నాం. బేకర్, ఛార్లీ దీనికి నాయకులు. తూర్పులోని ఈ పాయింట్ దగ్గర ఫిలిప్పినో గెరిల్లాలు పడవలో నదిని దాటుతారు. జపనీస్ తుపాకులు అటు వైపు మళ్ళగానే మనం వంతెన దాటి వెళ్ళగలుగుతాం. చిన్న తుపాకులు మాత్రమే పేలతాయి. మనం ఇంకో ఇరవై రెండు నిమిషాల్లో బయలుదేరతాం. ఈలోగా ప్రతీ వారూ తలో అమ్యునిషన్ బెల్ట్, ఐదు గ్రనేడ్లు, ఐదు అమ్యూనిషన్ పెట్టెలు తీసుకోండి. గుడ్ లక్."

దాన్ని విన్న ముగ్గురు బయటికి నడిచారు.

"నా ప్లటూన్ వాళ్ళని కూడా తీసుకెళ్తున్నావా కెప్టెన్?" ఫిజ్ అడిగాడు.

"ఇంకా అనుకోలేదు..."

జేమ్స్ మొహంలో అకస్మాత్తుగా కన్పించిన వెలుగుని ఫిజ్ విభ్రాంతిగా చూసాడు.

"ఏమైంది ఫిజ్?" జేమ్స్ ప్రశ్నించాడు.

"జేమ్స్! మీరు వెళ్ళకండి." ఫిజ్ కోరాడు.

"ఎందుకని?"

"మీ మొహంలో కూడా ఆ వెలుగు చూసాను. మీరు వెళ్తే వెనక్కి తిరిగి రారు."

"ఫిజ్. ఇంకో పావుగంటే ఉంది. నీ ప్లటూన్‌ని సిద్ధం చెయ్."

"జేమ్స్. దయచేసి నా మాట వినండి..."

"నేను చెప్పినట్లు విను. మనం వెనక్కి తిరిగి వచ్చాక డ్రింక్స్ తీసుకుంటూ ఈ విషయం మాట్లాడదాం. ఒకటి రెండు కాకతాళీయాలు జరిగి ఉండచ్చు. ఆ మాయ లోంచి నువ్వు బయటపడాలి. ట్రక్ దగ్గర మనం కలుద్దాం."

"కెప్టెన్! మనం కలిసి తాగలేం. ఎందుకంటే మీరు వెనక్కి తిరిగి రావడం లేదు." చెప్పి ఫిజ్ అక్కడి నించి వెళ్ళిపోయాడు.

దూరంగా పేలుళ్ళు వినిపిస్తున్నాయి. జేమ్స్ తన రివాల్వర్‌ని లోడ్ చేసుకుని పర్స్ తెరిచి తన కుటుంబసభ్యుల ఫొటోలని, ఓ బంగారు ఉంగరాన్ని చూసి దాన్ని టేబుల్ మీద ఉంచాడు.

ఫిజ్ అటెన్షన్‌లో నిలబడ్డ తన ప్లటూన్ సభ్యులని చూస్తూ నడుస్తూంటే ఒకడు ఆతృతగా అడిగాడు.

"మీరు ఎవరు వెనక్కి తిరిగి రారో చెప్పగలరని అంతా అంటున్నారు. అది నిజమేనా?"

ఫిజ్ జవాబు చెప్పకుండా ముందుకి నడిచాడు.

"ఈ వదంతిని ఎవరో ఆరంభించారు. దీన్ని నమ్మకండి. ఈ కంపెనీలో మైండ్ రీడర్ ఎవరూ లేరు. లెఫ్టినెంట్ ఫిజ్ గెరాల్డ్‌తో సహా." అక్కడికి వచ్చిన జేమ్స్ గట్టిగా చెప్పాడు.

"నిజమేనా లెఫ్టినెంట్?" ఇద్దరు అడిగారు.

అంతా అతని సమాధానం కోసం అంతా ఎదురు చూసారు.

"అది నిజమే." ఫిజ్ అయిష్టంగా అబద్ధం చెప్పాడు.

"పదండి బయలుదేరుదాం. అందరూ ట్రక్కులు ఎక్కండి." కెప్టెన్ జేమ్స్ అరిచాడు.

రెండు ట్రక్కులు సైనికులతో బయలు దేరాయి.

* * *

కొద్ది గంటల తర్వాత ఆ రెండు ట్రక్కులు వెనక్కి వచ్చాయి. అందులోంచి సైనికులంతా దిగారు. ఓ ఆఫీసర్ వచ్చిన వారి అటెండెన్స్‌ని తీసుకోసాగాడు. ఫిజ్ మేప్ ఉన్న గుడారంలోకి వెళ్ళాడు. అతనికి టేబుల్ మీద జేమ్స్ ఉంచిన ఫొటోలు, ఉంగరం కనిపించాయి. జేమ్స్ డాగ్ టేగ్‌ని (పేరు, ప్లటూన్ నంబర్, సైనికుడి నంబర్ మొదలైన వివరాలు గల సైనికులు ధరించే పతకం) తీసి వాటి పక్కన ఉంచాడు. మరణించిన సైనికుల డాగ్ టేగ్‌ని తీసుకురావడం ఆనవాయితీ. జనరల్ వచ్చి చెప్పాడు.

"మీరు విజయంతో వచ్చినందుకు అభినందించడానికి వచ్చాను."

"థాంక్ యూ సర్."

"ఆ గెరిల్లాలు మనం అనుకున్నట్లే సమయానికి నదిని దాటారు. అది మన అదృష్టం. పొంచి ఉన్నవాళ్ళు కాల్చారు కదా?"

"అవును సర్. ఓ మనిషిని పోగొట్టుకున్నాం."

డాగ్ టేగ్‌ని అందుకుని పేరు చదివి జనరల్ చెప్పాడు.

"అయ్యో! ఇతను మంచి మనిషి. మీ ఇద్దరూ మంచి మిత్రులు కదా?"

"అవును."

వారి కుటుంబ సభ్యుల ఫొటోలని చూస్తూ జనరల్ చెప్పాడు.

"ఏడేళ్ళ ఆనందకరమైన వైవాహిక జీవితం అంతమైంది. ఇద్దరు కొడుకులు. యుద్ధం చాలా చెడ్డది."

జనరల్ బయటికి వెళ్ళాడు. డాక్టర్ గంథర్ వచ్చి చెప్పాడు.

"ఫిజ్. నువ్వు డివిజన్‌కి వెళ్ళి రిపోర్టు చేయాలి. నిన్ను వాళ్ళు పరీక్షిస్తారు. నీకు ఒకటి రెండు వారాల సెలవు మంచిది. కాబట్టి నీ వస్తువులన్నీ వెంటనే సర్దుకో."

"థాంక్ యూ డాక్టర్."

ఫిజ్ తన గుడారం లోని వస్తువులన్నిటినీ సర్దుకుంటుంటే అద్దం కనిపించింది. అందులో తన మొహంలో ఆ ప్రత్యేక వెలుగుని చూసాడు!

"జీప్ సిద్ధంగా ఉంది సార్. మీరు ఎప్పుడు బయలు దేరదామంటే అప్పుడు డివిజన్‌కి వెళ్దాం." ఓ సైనికుడు చెప్పాడు.

అతను తన మాటలు వినలేదని గ్రహించిన సైనికుడు పిలిచాడు.

"లెఫ్టినెంట్ ఫిజ్."

"ఏమిటి?" ఉలిక్కి పడి అడిగాడు.

"ఇది మీ సంచీనా? దీన్ని జీప్‌లో పెట్టమంటారా?"

"యస్. థాంక్ యూ వెరీ మచ్."

"మీరు ఎప్పుడు వెళ్దామంటే అప్పుడు నేను సిద్ధం." చెప్పి అతను బేగ్‌తో వెళ్ళిపోయాడు.

కింద పడి విరిగి మూడు ముక్కలైన అద్దంలో ఫిజ్ మొహం ప్రతిబింబం కనిపించింది. అతను జీప్‌లో కూర్చోగానే డ్రైవర్ చెప్పాడు.

"రోడ్డులో కుదుపులు ఎక్కువ సార్. కానీ నడవడం కంటే ఇదే మంచిది."

"నువ్వు డివిజన్‌కి వెళ్తున్నావా?" ఒకరు డ్రైవర్ని అడిగారు.

"అవును. యుద్ధరంగానికి ఎంత దూరంగా వెళ్తే నాకంత బావుంటుంది."

"కెవియర్ రోడ్డు మీంచి వెళ్తున్నావా?" అతను అడిగాడు.

"అవును. బ్రిడ్జి ఎక్కి దాటాక కదా హైవే."

"ఇక్కడ నించి మైలు దూరంలో రోడ్డు మధ్య కొన్ని మైన్స్‌ని ఇంజనీర్స్ కనుగొన్నారు. ఇంకా వాటిని వారు తొలగించలేదు. కాబట్టి రోడ్డు మధ్య కాక పక్కగా వెళ్ళు. లెఫ్టినెంట్ విషయంలో జాగ్రత్తగా ఉండు."

"అమెరికన్ సైన్యంలో అత్యంత జాగ్రత్తపరుడైన డ్రైవర్ దీన్ని నడుపుతాడు. మనం నాలుగ్గంటలు జీప్‌లో వెళ్ళాల్సి ఉంది." డ్రైవర్ నవ్వుతూ చెప్పాడు.

ఫిజ్ డ్రైవర్ వంక చూసాడు. అతని మొహంలో కూడా వెలుగు కనపడింది.

"జీప్‌లో నాలుగ్గంటలా? నాకు అనుమానమే." ఫిజ్ చెప్పాడు.

జీప్ బయలు దేరింది.

కేంప్‌లోని గాయపడ్డ సైనికుడు ఒక్క చేత్తో మౌత్ ఆర్గన్ వాయిస్తూంటే, కొందరు ఇళ్ళ నించి వచ్చిన ఉత్తరాలని చదువుకుంటున్నారు. అక్కడ వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంది. అకస్మాత్తుగా వాళ్ళకి పెద్ద పేలుడు శబ్దం వినిపించింది.

"పిడుగుపాటా?" మౌత్ ఆర్గాన్ వాయించే సైనికుడు అడిగాడు.

"కాదనుకుంటాను. పేలుడులా వినిపించింది. లేదా పిడుగుపాటే అయి ఉంటుంది." ఓ సైనికుడు జవాబు చెప్పాడు.

అతను తిరిగి మౌత్ ఆర్గన్‌ని వాయించసాగాడు. అమెరికన్ ఆర్మీలోని లెఫ్టినెంట్ ఫిజ్ గెరాల్డ్ చరిత్ర సమాప్తమైంది అని అరగంట తర్వాత వారికి తెలిసింది.

# అదృష్టదేవత

**-రాబర్ట్ బ్లాక్**

**అదృష్టానికి ఓ అధి దేవత ఉందని ప్రతీ సంస్కృతీ అనాదిగా నమ్ముతోంది.**

**"అదృష్టం! ప్రపంచంలో** అన్నిటికీ ఆధారం అదే. ఐదేళ్ళ క్రితం నేను ఇక్కడి యూనివర్సిటీలో గౌరవనీయమైన ప్రొఫెసర్ని. ఈ రోజు అదృష్టదేవత చిన్న చూపు వల్ల..." తాగి ఉన్న ప్రొఫెసర్ ఎక్కిళ్ళు రావడంతో ఆగాడు.

"మీరేం చెప్తున్నారో నాకు తెలుసు." ఫ్రాంక్ చెప్పాడు.

ప్రొఫెసర్ జేబులోని అర్ధ డాలర్ బిళ్ళ తీసి గాల్లోకి విసిరేసి పట్టుకుని అడిగాడు.

"అచ్చా? బొమ్మా? దీన్ని టేబుల్ మీద పడేస్తే, ఎటు వైపు పడుతుందో ఎవరు చెప్పగలరు? నేను చెప్పలేను. నువ్వూ చెప్పలేవు. వెయిటర్ కూడా చెప్పలేడు. మేథమెటీషియన్ ఏదైనా పడే అవకాశం సగం సగం అని చెప్తాడు. ఇదే విశ్వ రహస్యం. అదృష్టం మనకి ఏం తెస్తుందో ముందుగా ఊహించలేం."

ఆయన నాణేన్ని కింద పడేస్తే అది ఓసారి ఎగిరి అంచు మీద నిలబడింది. ప్రొఫెసర్ నవ్వి చెప్పాడు.

"అదృష్టం! మన చుట్టూ అది పని చేస్తూ, మన జీవితాలని శాసిస్తోంది. బూత్ తుపాకీ పేల్చినప్పుడు లింకన్, బూట్ లేస్ కట్టుకోడానికి వంగి ఉంటే? తన నావలో తిరుగుబాటు జరిగినప్పుడు కొలంబస్‌కి పక్షులు కనిపించకపోతే? మనమంతా ఫార్చునా దేవతకి బాధితులం. రోమన్స్ అదృష్టదేవతని ఫార్చునా పేరుతో పిలిచేవాళ్ళు. పూర్వీకులు ఈ అదృష్టదేవత ప్రాముఖ్యతని గ్రహించారు. ప్రతీ జూన్ ఇరవై నాలుగున ఆమె గౌరవార్థం ఓ ఉత్సవాన్ని జరిపేవారు. ఇద్దరికి చెరో వంద డాలర్లు ఇచ్చి, కొంత భూమి కొనిస్తే, ఆర్నెల్ల తర్వాత ఒకడు ఆకలి బాధకి చచ్చి కనిపించాడు. మరొకడి భూమిలో ఆయిల్ పడి పది లక్షల డాలర్లు సంపాదించాడు. వీధిలో నడిచే వ్యక్తికి బాగా డబ్బున్న పర్స్ కనిపిస్తే, మరో వ్యక్తి నెత్తి మీద ఊడిన ఇటుక రాయి పడచ్చు. అదృష్టదేవతకి చాంచల్యం ఎక్కువ. ఎవరికి తెలుసు? ఆ చాంచల్యం వల్లే ఆమె దృక్పథం మారి నీకు సంపద ఆనందాన్ని ఇవ్వచ్చు."

"ఇది పిచ్చి." ఫ్రేంక్ చెప్పాడు.

"నువ్వు హేతువాదంతో మాట్లాడుతున్నావు. అదృష్టాన్ని ఆకర్షించే రహస్యం తెలుసుకోగలిగితే నేను ఇంకేమీ కోరను. అదృష్టదేవత స్త్రీ కాబట్టి అర్థం చేసుకోవడం కష్టం."

"నా అదృష్టాన్ని మార్చే ఓ ఆడది తారసపడినా బావుండు." ఫ్రేంక్ గొణిగాడు.

అతను లేచి రౌలెట్ గదిలోకి వెళ్ళాడు. ఆ గది రద్దీగా ఉంది. అతనికి ఎర్రటి ఈవెనింగ్ డ్రస్‌లోని ఒక యువతి కనిపించింది. ఆమె ఒంటి రంగు పాలరాతిలా తెల్లగా, జుట్టు రంగు బొగ్గులా నల్లగా ఉంది. ఫ్రేంక్ పక్క నించి వెళ్తూ ఆమె అతన్ని చూసి నవ్వింది. ఫ్రేంక్ చాలా కాలం తర్వాత ఓ ఆడదాని ఆకర్షణలో పడ్డాడు. ఆమెని అనుపసరించాడు. ఆమె ఆ గది లోంచి బయటికి వచ్చి ఇంకో గదిలోకి వెళ్ళింది. అది ఇంకా పెద్ద గది. ఆ గది లోని మూడు పెద్ద రౌలెట్ టేబుల్స్, నాలుగు పూల్ టేబుల్స్ ముందు దాదాపు ఏభై మంది దాకా ఉన్నారు. సిగరెట్ పొగ గదంతా అలుముకుని ఉంది. చక్రం తిరిగే శబ్దం తప్ప గదంతా నిశ్శబ్దంగా ఉంది.

ఫ్రేంక్ ఆమెని అనుసరించి ఓ రౌలెట్ టేబుల్ దగ్గరికి వెళ్ళాడు. ఖరీదైన దుస్తులు ధరించిన ధనవంతులు దాని చుట్టూ కనిపించారు. ఓ వైపు తక్కువ చిప్స్, మరో వైపు ఎక్కువ చిప్స్ ఉన్నాయి. చక్రం తిరగడం ఆగాక ఓ దొంతర లోంచి చిప్స్ మరో దొంతరలోకి వెళ్తున్నాయి. కొందరి చిప్స్ వెయ్యి డాలర్ల పైనే ఉండి ఉంటాయని ఫ్రేంక్ అనుకున్నాడు. తెల్ల చిప్స్ ఒక డాలర్. ఎరుపు పది డాలర్లు. నీలం రంగు చిప్స్ ఇరవై డాలర్లు.

గెలుస్తున్నా, ఓడిపోతున్నా అందరి మొహాల్లో ఎక్సైట్‌మెంట్ కనిపిస్తోంది. ప్రతీ వారు చక్రం తిరిగినప్పుడల్లా అది ఏ సంఖ్య మీద ఆగుతుందా అని ఆసక్తిగా చూస్తున్నారు.

ఫ్రేంక్ ఆమె వైపు చూసాడు. ఆమె కూడా అతనిలా ఆట వైపు చూస్తోంది. కానీ ఆమెలో ఎలాంటి ఎక్సైట్‌మెంట్ లేదు. ఆమె అక్కడ ఉన్న అందరికన్నా అందగత్తె అయినా విగ్రహంలా కదలకుండా నిలబడి చూస్తున్న ఆమెని ఎవరూ గమనించడం లేదు. అసలు ఆమె అక్కడ ఉన్న స్పృహే కొందరిలో లేదు. ఆమెని చూస్తూంటే ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడతారో ముందే తెలిసినట్లుగా ఉంది. తన దగ్గర కనీసం ఓ చిప్ మిగిలి ఉంటే బావుండేది అని ఫ్రేంక్ అనుకున్నాడు.

అకస్మాత్తుగా ఆమె ఫ్రేంక్ వంక చూసింది. తర్వాత అతని పాదాల వైపు చూసింది. అతను కూడా ఆమె చూసిన వైపు చూస్తే తన కాళ్ళ మధ్య ఓ నీలం రంగు చిప్ కనిపించింది. ఎవరో పారేసుకున్న దాన్ని అతను వంగి తీసుకున్నాడు. దాన్ని ఇరవై డాలర్లకి మార్చుకోవచ్చు.

"లేడీస్ అండ్ జెంటిల్‌మేన్. మీ పందేలు కాయండి." కేషియర్ గట్టిగా చెప్పాడు.

ఇరవై డాలర్లు దొరకడం అదృష్టం. ఆ అదృష్టం కొనసాగితే అది నలభై అవచ్చు. ఎరుపు రంగు మీద పెట్టాలా? నలుపా?

మళ్ళీ ఆమె వైపు చూసాడు. ఆమెది ఎర్ర డ్రెస్ కాబట్టి ఎరుపు మీద ఉంచాలా? ఆమె కళ్ళు జుట్టు నల్ల రంగు కాబట్టి నలుపు మీద ఉంచాడు. ఐతే ఆ చిప్ అతని చేతిలోంచి దొర్లి నంబర్ ముప్పై మూడు మీద ఆగింది. అతను దాన్ని నలుపు మీదకి జరపడానికి వంగాడు. కానీ ఉద్యోగి అప్పటికే చక్రాన్ని తిప్పేసాడు. తన అదృష్టం చేజారిందని ఫ్రేంక్ భావించాడు. చక్రంతో బాటు అందులోని వెండి బాల్ గుండ్రంగా తిరిగి తిరిగి ఆగింది.

"ముప్పై మూడు బ్లాక్." కేషియర్ బాల్ ఆగిన వైపు చూసి చెప్పాడు.

తను గెలిచాడు!

ఫ్రేంక్ వైపు బల్ల మీది చిప్స్‌ని కేషియర్ తోసాడు. ఎర్ర దుస్తుల్లోని ఆమె అతన్ని చూసి నవ్వింది. ఆ విధంగా ఫ్రేంక్ అదృష్టం ఆరంభమైంది. ఈసారి సగం చిప్స్‌ని ఎరుపు మీద ఉంచాడు. మళ్ళీ గెలిచాడు. మరో సారి ఎరుపు మీద పందెం కాసాడు. మళ్ళీ గెలిచాడు. వరుసగా మూడు సార్లు!

ఎర్ర గౌనులోని ఆమె ఆ టేబుల్ నించి వెళ్ళిపోవడంతో ఫ్రేంక్ తన చిప్స్‌ని తీసుకుని కేషియర్‌కి ఇచ్చాడు. కేషియర్ అతనికి మూడు వేల నాలుగు వందల ఇరవై డాలర్లు ఇచ్చాడు. వాటిని జేబులో ఉంచుకుని రద్దీగా ఉన్న మనుషుల మధ్య ఆమె ఎక్కడుందో తెలుసుకోడానికి వేగంగా నడిచాడు. ఆమెకి కొంత ఇచ్చి థాంక్స్ చెప్పాలని కూడా అనిపించింది. తలుపు లోంచి బయటికి వెళ్తున్న ఆమెని చూసి గట్టిగా అరిచాడు.

"ఆగండి. ఒక్క నిమిషం."

"ఎవర్ని?" తలుపు తెరిచిన ఉద్యోగి అడిగాడు.

"ఇందులోంచి బయటికి వెళ్ళిన ఆమెని."

"ఎవరూ వెళ్ళలేదే?" అతను ఆశ్చర్యంగా చెప్పాడు.

ఫ్రేంక్ వేగంగా బయటికి వెళ్ళాడు. ఆమె తాజా గాలి కోసం నిలబడిందని గ్రహించి చెప్పాడు.

"థాంక్స్! మీరు నాకు అదృష్టాన్ని తెచ్చారు."

ఆమె మౌనంగా నవ్వింది.

"ఇది మీ వంతు." కొన్ని నోట్లని ఆమె వైపు చాపి చెప్పాడు.

ఆమె తీసుకోలేదు.

"తీసుకోండి. మీకు చెవుడా? తీసుకోండి."

బహుశా ఆమె ధనవంతురాలై ఉండచ్చు, తనిచ్చేది చిన్న మొత్తం అవచ్చు అనుకున్నాడు. ఐతే ఆమె ఒంటి మీద ఉంగరాలు కానీ, ఆభరణాలు కానీ లేవు. ఆమె కదలగానే ఆమెని అనుసరించాడు. ఆమె ఆశ్చర్యంగా అతను బస చేసిన హోటల్‌లోకే వెళ్ళింది. అతని మురికి గదిలోకి అతన్ని అనుసరించింది.

అప్పటికే ఫ్రేంక్‌కి ఇరవై నాలుగ్గంటలుగా నిద్రలేదు. తరచూ ఆల్కహాల్ కూడా తాగుతున్నాడు. కూర్చోకుండా టేబుల్స్ దగ్గర నిలబడే చూస్తున్నాడు. దాంతో అతను నిద్రని ఆపుకోలేకపోయాడు. ఎంత ప్రయత్నించినా మెలకువగా ఉండలేకపోయాడు.

* * *

రాత్రంతా అతను ఆమె ఒళ్ళో తల పెట్టుకుని నిద్రపోయి ఉంటాడు. ఆమె నిద్రపోకుండా అలా కూర్చుని ఉండి ఉంటుంది. ఎందుకంటే, ఉదయం అతనికి మెలకువ వచ్చినప్పుడు ఆమె అతన్ని చూసి నవ్వింది. అతను గడ్డం గీసుకుని స్నానం చేసి వేరే దుస్తులు తొడుక్కునే దాకా అతని వంక నవ్వుతూ చూస్తూనే ఉంది. ఆమెని పలకరించినా జవాబు చెప్పలేదు. నవ్వుతూ అతని కోసం వేచి ఉంది. అతను కోటు తొడుక్కుని, టోపీ పెట్టుకుని ఆమెతో చెప్పాడు.

"పద. నాకు ఆకలిగా ఉంది."

ఎప్పటిలా ఫ్రేంక్ డాలర్ లంచ్ హాల్‌లోకి వెళ్ళబోయి, తన జేబులో మూడు వేలు ఉన్నాయని గుర్తొచ్చి మెయిన్ రోడ్ లోని ఖరీదైన రెస్టరెంట్‌కి వెళ్ళాలనుకున్నాడు. కానీ తన వంటి మీది దస్తులని చూస్తే లోపలికి అనుమతించరు అనిపించింది.

"ఒక్క నిమిషం. నేను షాపింగ్ చేయాలి." ఆమెతో చెప్పాడు.

ఆమె నవ్వి అతన్ని అనుసరించింది. అతని పాతిక డాలర్ల టోపీతో సహా రెడీమేడ్ దుస్తులు, కొత్త బూట్లని నూట ముప్ఫై డాలర్లకి కొన్నాడు. సేల్స్‌మేన్ అతనితో మర్యాదగా ప్రవర్తించాడు. కానీ ఆమెని పట్టించుకోలేదు. తర్వాత రెస్టరెంట్ లోని వెయిటర్ కూడా ఒకే మెనూ కార్డుని ఒకే గ్లాసులో నీళ్ళని ఇచ్చాడు తప్ప ఆమెని పట్టించుకోలేదని గుర్తించాడు. ఆమెకి మెనూ కార్డుని ఇవ్వబోతే 'ఏం తినను' అన్నట్లుగా తలని అడ్డంగా ఊపింది. దాంతో అతను ఒక్కడే తిన్నాడు. మాట్లాడని, నిద్రపోని, తినని ఆమె తన

దగ్గరే ఉంది. తన జేబులో మూడు వేల డాలర్ల దాకా ఉన్నాయి. ఇప్పుడేం చేయాలి? ఆమె తనకి అదృష్టాన్ని తెచ్చింది. ఆమె అతన్ని చూసి నవ్వింది. ఫ్రేంక్ ఈసారి నవ్వలేదు.

లేచి రెస్టరెంట్ లోంచి బయటికి వెళ్తూంటే ఆమె అతన్ని అనుసరించింది. సాధారణంగా ఉదయం పార్క్ లోని బెంచ్ దగ్గరికి వెళ్తూంటాడు. కానీ ఆ రోజు ఆ పార్కుని దాటి అవతలికి వెళ్ళాలనుకున్నాడు. ఆమె అతని చేతిని పట్టుకుని ఆపింది. చూస్తే ఆమె ఓ షాపు పేరుని చదువుతోంది. అక్మే మెటల్ ప్రొడక్ట్స్ కంపెనీ. దాని కిటికీకి వేలాడే ఇంకో బోర్డుని కూడా ఆమె చూపిస్తోంది. 'మెన్ వాంటెడ్'

అతను ఇంకో అడుగు వేయబోతే ఆమె అతన్ని ఆపింది. చేత్తో ఆ బోర్డునే చూపించింది. ఆమె ఉద్దేశం ఏమిటి? వెళ్ళి ఉద్యోగం అడగమనా? అడగచ్చు. తను ఉద్యోగం చేసింది ఆ పరిశ్రమలోనే. కానీ ఆమెకి అది ఎలా తెలుసు? తన జేబులో అంత డబ్బుండగా తను ఉద్యోగంలో చేరతాడని ఎలా అనుకుంది? ఫ్రేంక్ తల అడ్డంగా ఊపాడు.

ఆమె గట్టిగా అతని చేతిని పట్టుకుని నవ్వుతూనే ఉంది.

"సరే. ప్రయత్నం చేస్తాను. నువ్వు ఇక్కడే ఉండు."

ఆమె తల ఊపి తలుపు బయట ఆగిపోయింది.

ఆ షాప్ లోని ఒకతను ఫ్రేంక్‌ని చూసి అడిగాడు.

"నువ్వు మెకానిక్‌వా? మెటల్ వర్కర్‌వా?"

"కోర్ మేకర్." ఫ్రేంక్ యాంత్రికంగా చెప్పాడు.

"ఐతే అప్లికేషన్‌ని నింపు. ఆర్డర్ ఉంది. అనుభవం గల వర్కర్స్ ఈ ఊళ్ళో దొరకరని మా బాస్ ఏడుస్తున్నాడు."

తనకి తెలియకుండానే అతను ఇచ్చిన పెన్ను, అప్లికేషన్ ఫాంలని అందుకున్నాడు.

అకస్మాత్తుగా ఆ షాప్‌లోకి ఇద్దరు ముఖాలకి ముసుగుతో వచ్చి రివాల్వర్స్ చూపించి అరిచారు.

"చేతులెత్తండి. కదలకండి."

అంతా చేతులెత్తారు.

"వెంటనే గోడ వైపు ముఖం పెట్టి నించోండి."

ఫ్రేంక్ తన ముందు గోడకీ, తనకీ అడ్డుగా ఉన్న ఇనుప తీగల చెత్త డబ్బాని చూసుకోకుండా కాలితో తన్నాడు. అది వెళ్ళి ఓ దొంగ చేతికి తగిలింది. అదే సమయంలో బేలన్స్ తప్పిన ఫ్రేంక్ కింద పడబోతూ ఊతం కోసం చాపిన చెయ్యి సమీపం లోని

ఇంకో దొంగ మెడని పట్టుకుంది. మొదటి దొంగ చేతిలోంచి జారిపడ్డ రివాల్వర్ కాళ్ళ దగ్గర కనపడగానే వంగి అందుకున్నాడు. రివాల్వర్ పిడితో ఇద్దరు దొంగల నెత్తి మీద బాదాడు. షాప్‌లోని ఉద్యోగి అలారం బటన్‌ని నొక్కాడు.

తర్వాతి అరగంట అక్కడ పోలీసులతో, పత్రికా విలేఖరులతో హడావిడిగా గడిచింది. అప్లికేషన్ నింపాల్సిన అవసరం లేకుండా మర్నాటి నించి ఉద్యోగంలో చేరమని అక్కడికి వచ్చిన దాని యజమాని ఫ్రేంక్‌ని కోరాడు. ఫ్రేంక్ బయటికి వెళ్ళాడు. అతని కోసం వేచి ఉన్న ఆమె అతన్ని చూసి నవ్వింది.

ఇందాక ప్రొఫెసర్ చెప్పినట్లు అంతా అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది. రౌలెట్ చక్రం తను పందెం కాసిన స్థానంలో ఆగడం, వేస్ట్ బాస్కెట్‌ని తన్నడం, తను ఆ దొంగ మెడని పట్టుకోవడం, ఉద్యోగం రావడం అంతా అదృష్టం వల్లే జరిగింది అనుకున్నాడు.

ఆమె నవ్వి నడుస్తూ తనని అనుసరించమని సైగ చేసింది. అతను ఓ సూట్ కేస్‌ని కొనుక్కుని ఫర్నిష్డ్ సింగిల్ బెడ్ రూం హోటల్ గదిని నెలకి రెండు వందల డాలర్లకి అద్దెకి తీసుకున్నాడు. బెల్ బాయ్ ఆమెని పలకరించనే లేదు. వాడికి అర డాలర్ టిప్ ఇచ్చి మంచం మీద కూర్చున్నాడు. ఆమె నిశ్చలంగా నిలబడి నవ్వుతూ అతని వంకే చూడసాగింది. పాల రాతి నించి చెక్కిన విగ్రహంలా కనురెప్పలు కూడా ఆర్పడం లేదు.

"ఇక్కడే ఉండు. నేను వెళ్ళి పేపర్ కొని తెస్తాను."

ఆమె నవ్వింది తప్ప అతన్ని ఆపలేదు. హోటల్ బార్‌లోకి వెళ్ళి విస్కీని ఆర్డర్ చేసాడు. అది రుచిగా ఉంది. మరో పెగ్ కూడా తీసుకున్నాడు.

మూడో పెగ్ తాగాక కానీ అతని ఆ ఎర్ర దుస్తుల్లోని ఆమె అదృష్టదేవత అన్నది తట్టలేదు. కానీ ప్రొఫెసర్ చెప్పినట్లు నిజంగా అదృష్టదేవతలు ఉంటారా? ఆయన చెప్పినట్లు కొందరు ఏది చేపట్టినా విజయమే. కొందరికి అపజయమే. అదృష్టదేవత తన పక్షాన ఉంది. మరో పెగ్ తాగుతూ తనకి ఏమేమి కావాలో ఆలోచించాడు. రోల్స్ రాయిస్ కార్లు, అడవిలో ఇల్లు, చేపలు పట్టడానికి ప్రైవేట్ సరస్సు, బంగారు జుట్టు గల ప్రేయసి. ఎదురుగా సన్నగా, పొడుగ్గా ఉన్న బంగారు జుట్టు యువతి నోట్లో సిగరెట్‌తో కనిపించింది. బహుశా అదృష్టదేవతే ఈమెని కావాలని తన కోరిక తెలిసి పంపిందేమో! అంతే అయుంటుంది.

"మీరు నాతో కలిసి తాగుతారా?" ముందుకి వంగి మర్యాదగా అడిగాడు.

ఆమె అంగీకరించింది. ఆమె పేరు మార్గాట్. మార్గరెట్ కాదు. మార్గాట్. టి సైలెంట్. మార్గో అనాలి.

గదిలోని అదృష్టదేవత ఏమీ తినలేదు అని గుర్తొచ్చింది. బహుశా అదృష్టం ఏమీ ఖర్చు చేయకుండా ఉచితంగా వస్తుందేమో? తనని అదృష్టం ఎలా వరించిందో ఫ్రేంక్ ఉత్సాహంగా మార్గోకి చెప్పాడు. తన గదికి ఆమెని ఆహ్వానించాడు. వెయిటర్ సగం మిగిలిన బాటిల్ని కవర్లో వేసిచ్చాడు. అతను తూలుతూండడంతో ఆమె దాన్ని పట్టుకుంది. తలుపు తెరిచి లోపలికి వెళ్ళబోయే ముందు ఆమెని బయట ఉండమని లోపలికి వెళ్ళాడు. ఎర్ర గౌన్లోని ఆమె ఇంకా ఉంది. అతన్ని చూసి నవ్వింది. తను వెళ్ళినప్పటి నించి ఆమె అంగుళం కూడా కదల్లేదని గ్రహించాడు.

"థాంక్స్! ఇంక నువ్వు వెళ్ళు. లేదా ఆమె నిన్ను చూస్తుంది. మాకు ఏకాంతం కావాలి. అర్థమైందా?"

ఆమె విననట్లుగా అలాగే కూర్చుంది. అతను ఆమెని బలవంతంగా పైకెత్తి తలుపులోంచి బయటికి తోసాడు. ఓ విగ్రహాన్ని బయటికి నెడుతున్నట్లుగా అతనికి అనిపించింది. ఆమె అతని వంక మామూలుగా చూసింది. కానీ ఈసారి నవ్వలేదు. అతను చిన్నగా నవ్వి తోస్తూ చెప్పాడు.

"వెళ్ళు. రేపు ఉదయం మళ్ళీ రా."

ఆమె వెళ్ళిపోయింది.

మార్గో లోపలకి వస్తూ అడిగింది.

"ఎవరితో మాట్లాడుతున్నావు? నీలో నువ్వా?" అతను జవాబు చెప్పలేదు.

తను పిచ్చివాడు అనుకోకూడదని తను గెల్చుకున్న డబ్బు కట్టలని చూపించాడు. ఆరు పెగ్గులు తాగడంతో అతను ఆ రాత్రి కూడా మెలకువగా ఉండలేకపోయాడు.

* * *

ఫ్రేంక్కి ఉదయం మెలకువ వచ్చింది.

మార్గో లేదు! డబ్బూ లేదు! సూట్ కేస్ కూడా లేదు.

నేల మీద పడి ఉన్న కోటు జేబులో డాలర్ ముప్పై ఐదు సెంట్లు మాత్రం కనిపించాయి.

"మీరు తక్షణం గదిని ఖాళీ చేయాలి. గత రాత్రి మీరు పక్క గదిలోని వాళ్ళని బాగా డిస్టర్బ్ చేసారు." హోటల్ మేనేజర్ ఫోన్ చేసి చెప్పాడు.

"ఐతే నాకు రిఫండ్ ఇవ్వండి."

"పోలీసుల్ని పిలుస్తాను. జైలు పక్షి పోలీసుల్ని చూడదల్చుకోడు." మేనేజర్ అసహనంగా చెప్పాడు.

హేంగోవర్‌తో తల పగులుతూంటే ఫ్రేంక్ గదిలోంచి కిందకి వెళ్ళాడు. టీ పాయ్ మీది దినపత్రికలో 'దొంగతనాన్ని నివారించిన మాజీ ఖైదీ' అనే హెడ్ లైన్ కనిపించింది. ఓ పత్రికా విలేఖరి పాత దినపత్రికలు తిరగేసి ఈ సంగతి కనుక్కున్నాడు. ఇంక తనకి ఉద్యోగం ఉండదని గ్రహించాడు. ఉన్నదంతా మార్గో దోచుకెళ్ళింది. అదృష్టం తన వైపుంటే మళ్ళీ ఇవాళ కూడా కొంత గెలుచుకో గలడు.

కానీ అదృష్టదేవత వెళ్ళిపోయింది!

ఫ్రేంక్ మేనేజర్ దగ్గరికి వెళ్ళి గత రాత్రి ఎర్ర దుస్తుల్లోని ఆమె ఎటు వెళ్ళిందో చూసారా అని అడిగాడు. ఆమెని ఫ్రేంక్ తప్ప ఎవరూ చూడకపోవడంతో అంతా అతన్ని పిచ్చివాడిగా భావించారు. ఆమె మొదట కలిసిన బార్‌కి, తనతో తిరిగిన ప్రతీ ప్రదేశానికి వెళ్ళి చూసాడు. ఎవరూ ఆమెని చూడలేదని చెప్పారు.

ప్రొఫెసర్ ఆమెని ఏమని చెప్పాడు? ఫార్చునా. చంచలమైన దేవత. చాంచల్యం ఆమెలో కాదు. తనలోనే ఉంది. ఛ! ఓ బంగారు జుట్టు గల దొంగ వ్యామోహంలో పడి ఆమెని పంపించేసాడు.

ఫ్రేంక్ ఆ రోజంతా అన్ని వీధులూ ఎర్ర గౌనులోని ఆమె కోసం వెదికాడు. ఎక్కడా కనపడలేదు. చీకటి పడే సమయానికి అతని కాళ్ళు అలసటతో నొప్పులుగా ఉన్నాయి. అతను నీరసంగా నడుస్తూంటే కొద్ది దూరంలోని ఓ తలుపు లోంచి ఎవరో వస్తూ కనపడ్డారు. ఆమె ఎర్ర గౌనులోని అదృష్టదేవతలా తోచింది. ఆమె వెంట పరిగెత్తుకెళ్ళాడు.

ఆమె మార్గో. తన డబ్బుతో జూదం ఆడి పోగొట్టుకుని బయటికి వచ్చింది. అతన్ని చూసి పారిపోబోయింది.

* * *

ప్రొఫెసర్ మళ్ళీ తారసపడగానే ఫ్రేంక్ ఫార్చునా గురించి గబగబ చెప్పాడు.

"మీరే అదృష్టదేవత గురించి నాకు చెప్పారు." ఫ్రేంక్ చెప్పాడు.

"నేనేం చెప్పలేదే? అదంతా నీ భ్రమ. మనసులో ఉంది, బాగా నమ్మింది నిజంలా మనసు భ్రమింపచేస్తుంది." తాగి లేని ప్రొఫెసర్ చెప్పాడు.

"కానీ..."

"ఆ రాత్రి తాగి ఏం వాగానో నాకు గుర్తు లేదు." ప్రొఫెసర్ గ్లాస్‌ని కిందపెట్టి తలుపు గుమ్మం వైపు చూస్తూ చెప్పాడు.

"ఒక్క క్షణం. ఆమె ఎవర్ని పిలుస్తోంది?"

"అక్కడ ఎవరూ లేరు." ఫ్రేంక్ అటు వైపు చూసి చెప్పాడు.

"ఐతే నన్నే పిలుస్తోంది." చెప్పి ప్రొఫెసర్ బార్ స్టూల్ మీంచి దిగి తూలుతూ తలుపు వైపు నడిచాడు.

ఓ నిమిషం పాటు ఆయన ఎవరితోనో మాట్లాడుతున్నట్లుగా చేతులు, పెదవులు కదలడం చూసాడు. తర్వాత సరే అన్నట్లుగా తల ఊపి తలుపు తెరిచి పట్టుకున్నాడు. తర్వాత ఆమెతో కలిసి బయటికి నడిచాడు. బహుశా ఎర్ర గౌనులోని ఆమె ఉండచ్చు. అందుకనే తనకి కనపడలేదు. కొత్త మిత్రుడికి ఆమె సహకరించచ్చు. మనిషి నించి మనిషికి జలుబు అంటినట్లుగా తన నించి భ్రమ ఆయనకీ అంటుకుని ఉండచ్చు. ఇదంతా తమ ఊహే అయుండచ్చు. ఫ్రేంక్ అంతా భ్రమ అనే నమ్మాడు. ఐతే ఏది నమ్మాలో అతనికి ఓ పట్టాన బోధపడలేదు.

తలుపు తెరుచుకుని యూనిఫాంలోని పోలీసులు వచ్చి చెప్పేదాకా ఫ్రేంక్ తను బంగారు జుట్టు గల మార్గోని చంపడం భ్రమే అని భావించాడు.



# అమ్మ చేసిన బొమ్మలు

**-టైలర్ మేక్ కేఫెత్రీ**

**అధికారం అంటే మనిషికి ఇష్టం. అంతా తమని చూసి భయపడాలనే కోరిక అందరిలో ఉంటుంది. నియంతలకి ఆ కోరిక తీరుతుంది.**

**మరొకరికి కూడా.**

**మా అమ్మ** మరణించిన నెలకి నేను బేస్‌మెంట్‌లోకి వెళ్ళి వాటి వంక చూసాను. అవన్నీ బొమ్మలు. బట్టలతో మా అమ్మ చేసిన బొమ్మలు. ఆవిడ తన జీవితకాలంలో చేసిన బొమ్మలవి. వాటిని లెక్కపెట్టాను. రెండు వందల అరవై ఒకటి.

మా అమ్మ ఆ బొమ్మలని చేయడం నా ఊహ తెలిసినప్పటి నించి చూస్తున్నాను. మా అమ్మని అందరూ గౌరవంగా చూడటం, ఆవిడతో తక్కువగా మాట్లాడటం, లేదా అసలు సంబంధమే పెట్టుకోకుండా దూర దూరంగా ఉండటం కూడా నాకు బుద్ధి తెలిసినప్పటి నించి చూస్తున్నాను. మా అమ్మ జీవించి ఉన్నంతకాలం రోజుకో సారైనా బేస్‌మెంట్‌లోకి వచ్చి ఆ బొమ్మల వంక తృప్తిగా చూసుకునేది.

సన్నగా, బలహీనంగా, ఎలాంటి ఆర్థిక శక్తి లేకుండా ఉన్న మా అమ్మని చూసి అంతా ఎందుకు భయపడతారో నా చిన్నప్పుడు నాకు తెలిసేది కాదు. ఆవిడని ఆ ప్రశ్న వేస్తే బదులుగా నవ్వేసేది. ఒకో సారి తను చేసే బొమ్మని చూపించేది. పెరిగి పెద్దయ్యే దాకా మా అమ్మకి అంతా ఎందుకు భయపడతారో నాకు నిగూఢంగానే ఉంది.

ఎనభై రెండేళ్ళు ఆరోగ్యంగా జీవించాక ఆవిడ అకస్మాత్తుగా గుండాగి మరణించింది. రాత్రి పడుకుంది. పొద్దున్న లేవలేదు. ఆవిడ ప్రాణం అంత తేలిగ్గా పోయింది.

ఓ రోజు మా అమ్మ ఓ కొత్త బొమ్మని చేసింది.

"నాన్న." దాన్ని చూపించి చెప్పింది.

"నేను అడుకుంటాను. ఇవ్వు." కోరాను.

"ష్! ఆడడానికి కాదిది."

నేను చూస్తూండగానే దాని కాళ్ళు పట్టుకుని తలకిందులుగా చేసి నేల కేసి కోపంగా బాదింది. దాని తల పగిలి లోపలి కొవ్వు బయటికి రావడంతో నేను కెవ్వున అరిచాను.

"ఏం లేదు. ఏం లేదు." ముప్ఫై ఏళ్ళ క్రితం ఐదేళ్ళ నన్ను అమ్మ సముదాయించింది.

కొద్ది సేపటికే నాన్న పని చేసే ఫేక్టరీ మేనేజర్ నించి ఫోన్ వచ్చింది. నిచ్చెన మీంచి మా నాన్న కింద పడ్డాడట. ఇంటి బయటికి వచ్చి అమ్మ పెద్దగా ఏడవసాగింది. అమ్మ ఎందుకేడుస్తోందో తెలీక నేను కూడా ఏడవసాగాను. నాన్నకేమైందో నాకు తెలీదు. ఆయన శవపేటికని తప్ప మళ్ళీ నాన్నని చూడలేదు. పెద్దయ్యాక నాకు తెలిసింది, నాన్న ఫేక్టరీలో బల్బ్ మారుస్తూ నిచ్చెన మీంచి కింద పడి తల పగిలి మరణించాడని.

వారం తర్వాత అమ్మ నాకు తలంటి పోసి చెప్పింది.

"ఇంక ఏడుపు ఒద్దు. నాన్నకి ఫేక్టరీలో ఓ కొత్త గర్ల్ ఫ్రెండ్ ఉంది. అందుకే నిచ్చెన మీంచి జారిపడ్డారు. నాన్న మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోవాలని అనుకున్నాను. కాబట్టి ఆ పనే జరిగింది."

మా నాన్న మరణానికి, అమ్మ చేసిన ఆ బొమ్మకీ మధ్య గల సంబంధం నాకా వయసులో ఇప్పుడు తెలిసినంత స్పష్టంగా తెలీదు. అనేక సార్లు అమ్మ కొవ్వొత్తుల్లోని కొవ్వుతో బొమ్మలని చేసి వాటికి బట్టలని చుట్టడం చూసాను. వాటిలో మేకులు ఎలా దిగాయో మాత్రం నాకు తెలిసేది కాదు. అమ్మని అడిగితే 'ష్. వాటిని నువ్వు తీయకూడదు. ప్రమాదం' అని చెప్పేది. అప్పటి నించే అనుకుంటా బొమ్మల అలమరకి అమ్మ తాళం వేయడం ఆరంభించింది. ఆ తాళం చెవి సదా ఆవిడ బొడ్లోనే ఉండేది. నేను ఒంటరిగా బేస్‌మెంట్‌కి వెళ్ళి ఆడుకోడానికి అనుమతించేది కాదు. పనుంటే తనతోనే తీసుకెళ్ళేది.

నేను జూనియర్ హైస్కూల్లో ఉండగా నా తోటి విద్యార్థులు, టీచర్లు కూడా నేనంటే భయపడేవారు. నన్ను ఎవరూ ఏడిపించడం, ఎగతాళి చేయడం చేసేవారు కాదు. నాకు ఆప్తమిత్రులంటూ అంతదాకా ఏర్పడకపోవడానికి కారణం మా అమ్మ చేసే బొమ్మలే అని నాకు జూనియర్ స్కూల్ రోజుల్లోనే అర్థం అయింది. అందుకే పధ్నాలుగో ఏట మిగిలిన సహాధ్యాయులకి లాగా నాకు బాయ్ ఫ్రెండ్స్ ఎవరూ ఏర్పడలేదు. నేనోసారి ఇంట్లో ఏడుస్తూంటే అమ్మ కారణం అడిగింది.

"నాతో స్నేహం చేస్తావా అని నేను జేమ్స్‌ని అడిగితే చెయ్యనన్నాడు. 'మీ అమ్మ బొమ్మలని చేస్తుంది' అని కూడా అన్నాడు."

వారం తర్వాత జేమ్స్ క్లాసులో కడుపునొప్పి బాధకి ఏడుస్తూ అకస్మాత్తుగా దొర్లేవాడు. ఇంటి దగ్గర మాత్రం ఆ బాధ వచ్చేది కాదుట. డాక్టర్లు చాలా ఎక్స్ రేలు తీసి భౌతికంగా ఎలాంటి లోపం లేదని చెప్పారు.

అతను మా స్కూల్‌ని మధ్యలోనే మానేసాడు. తర్వాత ఎక్కడికి వెళ్ళాడో, ఏమయ్యాడో నాకు తెలీదు.

నా పదిహేడో ఏట ఓ రోజు అమ్మని అడిగాను.

“అమ్మా! ఇంక నువ్వు ఆ బొమ్మలని చెయ్యడం మానెయ్.”

“పిచ్చిదానా! ఇది ఓ వరం. అందరికీ రాదు. కావాలంటే నీకూ నేర్పుతాను.” నవ్వుతూ చెప్పింది.

నా ఇరవై ఒకటో ఏట, ఇరవై ఐదో ఏట, ఇరవై ఏడో ఏట, మళ్ళీ ఇరవై తొమ్మిదో ఏట అమ్మ నాకు ఆ విద్యని నేర్పుతానని బతిమాలింది. అది తనతోనే అంతరించి పోకూడదని వాపోయింది. కాని నేను దానికి అంగీకరించలేదు.

“అది ఇతరులకి కీడు చేయడమేగా?’ అని నేనంటే, ‘కాదే పిచ్చిదానా. ఇతరులని మన దారిలోకి తెచ్చుకునే విద్య ఇది. నేను దీన్ని ఉపయోగించకూడదని అనుకుంటే దేవుడు అసలు ఈ విద్యని నాకు ఇచ్చేవాడే కాడు.” చెప్పింది.

మా అమ్మని ఇబ్బంది పెట్టిన, కోపం తెప్పించిన ప్రతీవారూ ఏదో ఓ అంతు తెలీని అనారోగ్యంతో బాధపడేవారు. తల నొప్పి, కీళ్ళ నొప్పి, పక్షవాతం, కంటి చూపు లేదా ఆకలి మందగించడం, దురదలు... కాని డాక్టర్లు మాత్రం పరీక్షించి వారికి అంతా సవ్యంగానే ఉందని పేర్కొనేవారు.

క్లింట్ నన్ను ప్రేమించాడు. మా మధ్య మూడు నెలలు డేటింగ్ జరిగాక అతనికి ఎలీజా నచ్చడంతో చెప్పాడు.

“సారీ. మనం విడిపోతున్నాం.”

“దేనికి? నిజంగా ఎలీజానే కారణమా?” అడిగాను.

“అవును. అదీ కాక మీ అమ్మ...” ఆపేసాడు.

* * *

నేను విచారంగా ఉండటం అమ్మ ఇట్టే పసికట్టగలదు. ‘దేనికి?’ అని వేధిస్తే చివరికి జరిగింది చెప్పక తప్పలేదు. నేను కాలేజీ నించి తిరిగి వచ్చాక అమ్మ దగ్గర కొవ్వొత్తులని, కొత్త బొమ్మని చేయడాన్ని చూసాను.

“ఏమిటి? ఏం చేస్తున్నావ్?” విభ్రాంతిగా అడిగాను.


జవాబు చెప్పలేదు.

“దయచేసి క్లింట్‌ని ఏం చేయకు. అతన్ని నేను తప్పు పట్టడం లేదు.”

అమ్మ నా వంక చూసిన చూపులో 'నువ్వింత్తి అమాయకురాలివి' అన్న భావన నాకు కనిపించింది. అమ్మ నా మాట వినదని నాకు తెలుసు.

ఆ రాత్రి బాత్ రూంలోని అమ్మ తెల్ల మాత్రలని తీసేసి ఆ స్థానంలో లేత పసుపు రంగు కొత్త మాత్రలని ఉంచాను. ఆ తర్వాత మూడు రోజులకే అమ్మ బలహీనపడిపోయింది. నాలుగో రాత్రి అమ్మకి ఆఖరి రాత్రి అయింది. తల్లి మరణిస్తే ఓ కూతురు ఏడ్చేట్లుగా వారం పాటు నేను దుఃఖించాను. కాని సరిగ్గా వారం తర్వాత తలంటి పోసుకుని మామూలు మనిషిని అయ్యాను–మా నాన్న పోయినప్పటి లానే.

బేస్‌మెంట్ అలమరలోని ఆ రెండు వందల అరవై ఒక్క బొమ్మలని పడవలో తీసుకెళ్ళి సముద్రం మధ్యలో వదిలి వచ్చాను. ఆ తర్వాత మా ఊళ్ళోని చాలామంది అంతుపట్టని రోగాలు చేత్తో తీసేసినట్లుగా మాయం అయ్యాయి. 'ఈ రహస్యం తెలిస్తే అవిడని ఏనాడో చంపేసే వాళ్ళం కదా?' అని ఒకరిద్దరు అనుకున్నారన్న సంగతి నా చెవి దాకా వచ్చింది. అందుకు వాళ్ళని నేను తప్పు పట్టను. నాకు ఇంకాస్త ముందుగా తెలిస్తే బహుశా నేను అదే పనిని చేసి ఉండేదాన్ని. వారి అనుభవం నా అనుభవం కాదు కదా?



# వెంటనే రా

**-రిచర్డ్ హార్డ్‌విక్**

**దెయ్యాలకి కూడా మనుషుల్లో ఉండే లాంటి భావాలే ఉంటాయా?**

**జీవించి ఉన్నప్పుడు** మార్తా ఏడమ్‌సన్ వింతమనిషి. మనుషులని తబ్బిబ్బు పెట్టడం ఆమెకి సరదాగా ఉండేది. అనేక మంది మీద వింత వింత ప్రాక్టికల్ జోక్స్ వేసి కొందరికి దూరమైంది కూడా. ఐనా ఆమె బుద్ధి తెచ్చుకుని అలాంటివి కట్టి పెట్టకుండా అనేకమందికి శతృవు అయింది. తన భర్త చార్లీని అనేక సార్లు ఆమె ప్రాక్టికల్ జోక్స్‌తో ఏడిపించింది.

* * *

తన భార్య మరణించిన దాదాపు నెల తర్వాత మార్తా భర్త చార్లీ ఏడమ్‌సన్ తన మిత్రుడు హెన్రీ దగ్గరకి వచ్చాడు. అతని మొహం చూసి వెంటనే హెన్రీ అడిగాడు.

"ఏం జరిగింది మిత్రమా?"

"హెన్రీ! నీకు మా పెళ్ళయినప్పటి నించి మార్తా తెలుసు. ఆమెకి ఏవైనా వింత శక్తులు ఉన్నాయని నువ్వు అనుకుంటున్నావా? ఆ విషయం నీకు తెలుసా?" ప్రశ్నించాడు.

"వింత శక్తులంటే? ఎలాంటివి? నాకు అర్థం కాలేదు." హెన్రీ సంచీలోంచి పొగాకుని తీసి దాన్ని పైప్‌లో నింపుతూ అడిగాడు.

"మరణానంతర జీవితం ఉంటుందని నువ్వు నమ్ముతావా?"

"నమ్ముతాను. ఇంతకీ నువ్వు చెప్పదలచుకుంది ఏమిటి?"

చార్లీ తన జేబులోంచి ఓ గులాబి రంగు కవర్ని తీసి హెన్రీ చేతిలో ఉంచి చెప్పాడు.

"నాకు మార్తా చేతి రాత ఎలా ఉంటుందో తెలీకపోతే ఇది ఎవరో ప్రాక్టికల్ జోకర్ పని అని అనుకునే వాడిని."

హెన్రీ పైప్‌ని అంటించడం మాని, అగ్గి పుల్లని ఏష్ట్రేలో పడేసి కవరు మీద రాసింది చదివి చెప్పాడు.

"ఇది నీ చిరునామా."

"అవును. అందులోని ఉత్తరం చదువు."

హెన్రీ అందులోంచి ఓ లేత గులాబీ రంగు కాగితాన్ని తీసి, దాని మీద రాసింది బయటకి చదివాడు.

*డియర్ చార్లెస్,*

*నా సమాధి సౌకర్యంగా ఉంది. థాంక్స్. కాని నువ్వు కూడా ఇక్కడ నాతో ఉంటే బావుండేది.*

*నీ,*

*మార్తా*

హెన్రీ ఆ ఉత్తరాన్ని తన ఒళ్ళో ఉంచుకుని పళ్ళ మధ్య పట్టుకున్న పైప్‌ని వెలిగించి చెప్పాడు.

"మార్తా నాకు నలభై ఏడేళ్ళుగా తెలుసు. ఇది ఆమె చేతి రాతలానే ఉంది. ఈ ఉత్తరం నీకు ఎలా వచ్చింది?"

"ఇవాళ ఉదయం నా మెయిల్ బాక్స్‌లో ఉంది. దాని మీది పోస్టల్ ముద్రని చూడు. నిన్న ఇక్కడే బిన్స్‌విల్‌లో ఇది పోస్ట్ చేయబడింది."

"ఇది ప్రాక్టికల్ జోక్. ఎవరో నీ మీద జుగుప్స కలిగించే ప్రాక్టికల్ జోక్‌ని వేసారు."

వెంటనే చార్లీ తల అడ్డంగా ఊపుతూ చెప్పాడు.

"కాని అది మార్తా చేతి రాత. ఇంకెవరో రాసింది కాదు."

"ఫోర్జరీ అనే మాటని నువ్వు ఎప్పుడూ వినలేదా? ఈ ఊళ్ళోని ఎవరో దుర్మార్గులు నిన్ను భయపెట్టడానికి దీన్ని రాసి పోస్ట్ చేసారు. కొందరు మార్తాని నువ్వే చంపావని అనుమానిస్తున్నారు కూడా." హెన్రీ చెప్పాడు.

"కారు రోడ్ మీంచి పదడుగుల కిందకి గోతిలోకి మళ్ళడంతో మార్తా అందులోంచి కింద పడి మరణించింది."

"అధికారిక డెత్ సర్టిఫికెట్‌లో ఉన్నదే నువ్వు చెప్పింది. ప్రమాదవశాత్తు జరిగిన మరణం అది అని అధికారులు నమ్ముతున్నారు కాని అంతా కాదు."

చార్లీ ఆ ఉత్తరాన్ని తన జేబులో ఉంచుకుని చెప్పాడు.

"అక్కడికి మొదటగా వచ్చింది నువ్వే హెన్రీ. అందరికీ నీ మీద నమ్మకం ఉంది. నువ్వు కోర్టులో అది ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా, నీ సాక్ష్యాన్ని చెప్పావు కూడా. అదే కారులో నేను స్పృహ లేకుండా పడి ఉన్నాను. ఐనా నేను ఆమెని చంపుతానని ఎవరైనా ఎందుకు అనుకుంటున్నారు?" చార్లీ అడిగాడు.

"నీ ఒంటి మీద గల సూట్ లాంటి సూట్ ఈ ఊళ్ళో ఎంత మంది వేసుకో గలుగుతున్నారు? దాని ఖరీదు కనీసం రెండు వందల ఏభై డాలర్లు ఉంటుంది."

"నిజానికి మూడు వందలు."

"నీ వాచీ కూడా చాలా ఖరీదైంది."

"మార్తాని డబ్బు కోసం చంపానని అంతా అనుకుంటున్నారన్న మాట?"

హెన్రీ ఆ ఉత్తరాన్ని చేతిరాతల నిపుణుడికి చూపించమని సలహా ఇచ్చాడు.

* * *

మూడు రోజుల తర్వాత చార్లీ నించి ఫోన్ రావడంతో హెన్రీ అతని ఇంటికి వెళ్ళాడు. ఆందోళనగా ఉన్న చార్లీ చెప్పాడు.

"నేను చెక్ స్టబ్స్ మీద, సరుకుల జాబితాలోంచి, ఉత్తరాల్లోంచి మార్తా చేతి రాతని తీసి చేతిరాత నిపుణుడికి ఇచ్చాను. ఆ ఉత్తరంలోని చేతి రాత మార్తాదే అని అతను చెప్తున్నాడు."

"మార్తా నించి నీకు ఇంకో ఉత్తరం వచ్చింది. లోపలకి వస్తూ ఈ ఉత్తరం నీ మెయిల్ బాక్స్ లోంచి తెచ్చాను." హెన్రీ ఓ కవర్ ఇచ్చి చెప్పాడు.

కవర్ మీది చేతిరాతని చూసి భయంగా తలాడించి దాన్ని చింపి ఓ కాగితం తీసి ఛార్లీ బయటకి చదివాడు.

*ఛార్లెస్ డియర్,*

*దయచేసి ఏమైనా చెయ్యి. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి నేను నీళ్ళల్లో తేలుతున్నాను. శవ పేటిక లోపలి అందమైన సిల్క్ లైనింగ్, నా నీలం రంగు ఆర్గండీ గౌన్ తడిసిపోయి చలి వేస్తోంది. దయచేసి వెంటనే ఆ ఏర్పాటు చూడు. మిస్టర్ ఫెన్‌విక్ అందరికన్నా తక్కువ తీసుకునే మంచి ప్లంబర్.*

నీ,

మార్తా

* * *

మొదట్లో ఆ ఉత్తరాలని మార్తా ముందే రాసి ఎవరి చేతో పోస్ట్ చేయిస్తోంది అని ఛార్లీ నమ్మాడు. కాని ఆమె మరణించాక జరిగిన సంఘటనలు కూడా ఆ ఉత్తరాల్లో ఉండటంతో వాటిని ముందుగా రాసే అవకాశం లేదని ఛార్లీకి అర్థం అయింది. దాంతో అతనిలో భయాందోళనలు అధికం అయాయి.

ఆ రాత్రి ఛార్లీ ఎప్పటికన్నా ఎక్కువ ఓడ్కా తాగి పడుకున్నాడని హెన్రీకి మర్నాడు ఫోన్ చేసాక తెలిసింది.

హెన్రీ వెంటనే ఛార్లీ ఇంటికి వచ్చాడు. తను బ్రేక్‌ఫాస్ట్ చేస్తానని ముందుకి వచ్చినా ఛార్లీ ఆకలిగా లేదని నిరాకరించాడు.

"ఛార్లీ! నువ్వు పోలీసులకి ఈ ఉత్తరాల గురించి ఫిర్యాదు చేయచ్చుగా? వీటిని ఎవరు రాస్తున్నారో వాళ్ళు కనిపెడతారు." హెన్రీ సూచించాడు.

"ఏమని? సమాధి నించి మరణించిన నా భార్య నాకు ఉత్తరాలు రాస్తోందనా? ఇది పేపర్లో రాస్తే నా గురించి తెలిసి అంతా నవ్వరూ. వాళ్ళు దాన్ని ఎలా పరిశోధిస్తారు?"

ఛార్లీ ఆ రోజు ఉదయం కూడా మళ్ళీ తాగాడు. ఆ తర్వాత రాత్రుళ్ళే కాక, పగలు కూడా తాగసాగాడు.

* * *

అతని మూడు వందల డాలర్ల సూట్ త్వరలోనే పిగిలిపోయింది. పోస్ట్‌మేన్ ఉత్తరాలు తెచ్చే సమయంలో ఛార్లీ మేలుకుని ఉంటే భయంతో వణికి పోయేవాడు.

ఒకో రోజు మార్తా నించి ఉత్తరం వచ్చేది కాదు. ఆ రోజు ఎంతో రిలీఫ్‌గా ఫీలయ్యేవాడు. ఒక్కోరోజు గులాబి రంగు కవర్ వచ్చేది. దాన్ని వణికే వేళ్ళతో విప్పి చదివేవాడు. లోకం అంతా ఛార్లీనే తనని చంపాడని భావించడం తనకి బాధని కలిగిస్తోందనో, కారు ప్రమాదంలో తన తల కారు బయటి నేల మీద గల రాయికి కొట్టుకుని, కపాలం పగిలి మరణించినప్పటి నించి తను ఛార్లీ సాహచర్యం కోసం ఎంతగానో ఎదురు చూస్తోందనో... ఇలా ఏదో ఒకటి ఆ ఉత్తరంలో ఉండేది. ప్రతీ ఉత్తరం చివర 'త్వరగా రా. ఇవాళే రావచ్చుగా' అనే అభ్యర్ధన కూడా ఉండేది.

హెన్రీ నిత్యం వచ్చి తన మిత్రుడ్ని చూసి వెళ్ళేవాడు.

"ఆ ఉత్తరాలన్నీ ఎందుకు చదువుతావు? తెరవకుండా కాల్చేయ్."

"అమ్మో! అప్పుడు మార్తానే సమాధిలోంచి బయటకి రావచ్చు."

"అదీ నిజమే. ఈ ఉత్తరాలు రాసే అతీంద్రియ శక్తి మార్తాకి ఉంటే, సమాధి లోంచి బయటకి వచ్చే శక్తి కూడా ఆమెకి ఉండి తీరుతుంది." హెన్రీ ఒప్పుకున్నాడు.

ఓ రోజు ఛార్లీ చెప్పాడు.

"మిత్రమా! నాకంటే నీకే మార్తా ఏడాది ముందు నించి తెలుసు. మీ ఇద్దరూ ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. కాని నేను వచ్చాక మార్తా నాతో ప్రేమలో పడింది. అందుకు నా ప్రోద్బలం ఉందని నువ్వు చాలా కాలం నమ్మి, అలిగి నాతో మాట్లాడలేదు కూడా. కాని అది నిజం కాదు. నన్ను పెళ్ళి చేసుకోమనిఆమెని నేను ప్రోత్సహించలేదు.

మార్తా నిజంగా ప్రేమించింది నన్నే. నువ్వు నిన్ను ప్రేమించిందని కేవలం భ్రమ పడ్డావు. ఈ సంగతి నీకు మార్తా, ఆమె తండ్రి కూడా చాలాసార్లు చెప్పారు కూడా. కాని నువ్వు అది నమ్మలేదు. నీకు మార్తా నాకన్నా ముందు నించే తెలుసు. మార్తా నాకు ఇలాంటి ఉత్తరాలు ఎందుకు రాస్తోందో చెప్పగలవా?"

హెన్రీ పైప్‌లో పొగాకుని కూరి, దాన్ని అంటించుకుని కొద్దిసేపు ఆలోచిస్తూ పైప్‌ని తాగాడు. తర్వాత దాని నుసిని ఏష్‌ట్రేలో విదిలించి చెప్పాడు.

"చెప్పగలను. బహుశ మార్తాకి నువ్వే ఆమెని చంపావనే అనుమానం కలిగి ఉండాలి. ఓ సారి సమాధి దగ్గరకి వెళ్ళి అది నిజమైతే తప్పు ఒప్పుకో. లేదా అది ఆమె అపోహ అని చెప్పు. జవాబు రాయమను. దాంతో ఆమె ఆత్మకి శాంతి కలగచ్చు."

"ఐతే నా వెంట నువ్వూ రా."

ఛార్లీ అప్పటికప్పుడు హెన్రీ వెంట మార్తా సమాధి దగ్గరకి వెళ్ళి అతను సూచించినట్లుగా చేసాడు.

మర్నాడు పోస్ట్‌మేన్ తెచ్చిన ఓ గులాబి రంగు కవర్ని తెరిచే ధైర్యం లేక హెన్రీ వచ్చే దాకా ఆగాడు. హెన్రీ దాన్ని చింపి బయటకి చదివాడు.

*డార్లింగ్ ఛార్లీ,*

*నేను ఎలా పోయానన్నది కాదు సమస్య. నువ్వు నా పక్కన లేవన్నదే నా సమస్య. డార్లింగ్. ఇవాళే వచ్చేయ్. బిరబిర, చరచర నా కౌగిల్లోకి వచ్చేయ్.*

*నీ,*

*మార్తా*

ఛార్లీ మొహం వెంటనే పాలిపోయింది. తక్షణం ఓడ్కా బాటిల్‌ని తెరచి గటగటా కొంత తాగి చెప్పాడు.

"మార్తా నన్ను పిలుస్తోంది. నేను వెళ్ళక తప్పదులా ఉంది."

* * *

హెన్రీ డబ్లిన్ వెళ్ళడంతో మూడు రోజుల దాకా ఛార్లీ దగ్గరకి వెళ్ళలేదు. తన వ్యాపార పని ముగించుకుని తిరిగి వచ్చేప్పటికి ఛార్లీ సగం మత్తులో, సగం స్పృహలో ఉన్నాడు. అతని పక్కన పడి ఉన్న మూడు గులాబీ రంగు కవర్లలోని ఉత్తరాలని హెన్రీ చదివాడు.

'వెంటనే రా!'

రెండో ఉత్తరంలోని లేత గులాబీ రంగు కాగితం మీద ఇలా రాసి ఉంది.

'తక్షణం రా!'

ఆఖరి ఉత్తరం వచ్చిన కవర్ మీద ఎర్ర రంగుతో రాసి ఉంది.

'ఆఖరి హెచ్చరిక' ఉత్తరంలో ఇలా ఉంది.

'నేడే రా! లేదా...'

"మార్తాకి కోపం వచ్చినట్లుంది." హెన్రీ సీరియస్‌గా చెప్పాడు.

ఛార్లీ ఇంకొంచెం ఓడ్కాని తాగి అలమరలోని తన పిస్తోలుని జేబులో ఉంచుకుని తూలుతూ బయటకి నడిచాడు. హెన్రీ అతన్ని అనుసరించకుండా ఆలోచిస్తూ అక్కడే కూర్చున్నాడు.

గంట తర్వాత అతనికి తెలిసింది, ఛార్లీ మార్తా సమాధి ముందు పిస్తోలుతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని. వెంటనే హెన్రీ మొహంలో చిన్న చిరునవ్వు–సాధించానన్న భావన గల చిన్న చిరునవ్వు– తళుక్కుమంది. మార్తా విరహాన్ని భరించలేక ఛార్లీ ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్థులంతా భావించారు. మార్తా నించి ఛార్లీకి వచ్చిన ఉత్తరాల గురించి ఒక్క హెన్రీకి తప్ప ఇంకెవరికీ తెలీదని అతనికి తెలుసు. లేదా ఈ సరికే ఆ విషయం గ్రామంలో గుప్పుమనేది. ఆ తర్వాత హెన్రీకి నలభై ఏడేళ్ళుగా తను ప్రాక్టీస్ చేసిన మార్తా చేతిరాతని మళ్ళీ ఎన్నడూ ఉపయోగించాల్సిన అవసరం లేకపోయింది.

* * *

ఛార్లీ మరణించిన పదో రోజు హెన్రీకి తన మెయిల్ బాక్స్‌లో ఓ గులాబి రంగు కవర్ కనిపించింది. దాని మీది మార్తా చేతి రాతని చూసి హెన్రీ ఆశ్చర్యంగా ఆ కవర్ని విప్పి అందులోని ఉత్తరాన్ని బయటకి తీసి చదివాడు.

*డియర్ హెన్రీ,*

*మా ఇద్దరికీ విసుగ్గా ఉంది. నువ్వూ వెంటనే మా దగ్గరకి రారాదు?*

*నీ,*

*ఛార్లీ*

అది ఛార్లీ చేతిరాతగా హెన్రీ గుర్తించాడు! అంతే కాదు. దాని కింద ఉన్న సంతకం మార్తాది. తను తప్ప ఇంకెవరూ దాన్ని ఫోర్జరీ చేయలేరని హెన్రీకి తెలుసు!

# పీడ కల

**-జాన్ ఎస్ గ్లాస్‌బి**

**అందరికీ తప్పనిసరిగా వచ్చే ఈ అనుభవం ఒకొక్కరికి ఒకో విధంగా వస్తూంటుంది. కాని ఎవరి అనుభవం వారిదే.**

**షీలా కర్బీకి** అకస్మాత్తుగా భయంతో మెలకువ వచ్చింది. ఆమెకి ఆ కాటేజ్‌లో దిగాక ఆ పీడ కల రావడం రెండో సారి. ప్రతీ సారి కలలో ఓ చిన్న పిల్లవాడి మొహం కనిపిస్తుంది. దూరం నించే నవ్వుతూ చూస్తూ కనిపిస్తాడు. ఆ కలలో స్మశానంలో తెరిచి ఉన్న ఓ చిన్న శవపేటిక ఖాళీగా కనిపిస్తుంది. తర్వాత కొద్ది దూరంలో కొండ మీది రోజ్ కాటేజ్‌లో ఆ పిల్లవాడి మొహం కనపించడం కూడా ఆ కలలో ఓ భాగం.

రచయిత్రి అయిన షీలా కొద్ది రోజుల క్రితమే ఓ కొత్త నవల రాయడానికి ఓ కాటేజ్‌ని అద్దెకి తీసుకుని అందులో దిగింది. వచ్చిన రోజే పక్క గది లోంచో, పై నించో ఓ చిన్న పిల్ల పరిగెత్తుతున్న శబ్దం అనేక సార్లు వినిపించింది. లేచి వెళ్ళి ఎన్ని సార్లు వాళ్ళ కోసం వెదికినా ఎవరూ కనపడలేదు!

ఆ సాయంత్రం సమీపంలోని బార్లో ఒకరిద్దరు ఆమె రోజ్ కాటేజ్‌లో ఉంటోందని తెలిసి చెప్పారు.

"మీరున్న కాటేజ్ పేరు రోజ్ కాటేజ్. అందులో అరవై ఏళ్ళ క్రితం ఓ దంపతులు, వారి ఏడేళ్ళ కొడుకు తిమోతీ ఉండేవారు. తోటి పిల్లలతో ఆడుకోడానికి వాడ్ని బయటికి పంపేవారు కాదు. ఓ సారి నిమోనియా వచ్చి వాడు పోయాడు. కొండ కింద స్మశానంలో వాడి శవాన్ని పాతిపెట్టారు. వాడు దెయ్యమై కాటేజ్‌లో, తోటలో తిరుగుతున్నాడు అని ప్రతీతి. తల్లితండ్రులు బయటికి పంపలేదు కాబట్టి ఈ రెండు చోట్లు వదిలి వాడు బయటకి రాడని ఆ కాటేజ్ యజమాని మీకు చెప్పాడా?"

"లేదు. కాని మీరు ఈ రాత్రి ఈ సంగతి నాకు చెప్పకుండా ఉండాల్సింది. నేను ఒంటరిగా ఆ కాటేజ్‌లో ఉంటున్నానని మీకు తెలీదా?"

బార్ నించి తిరిగి రోజ్ కాటేజ్‌లోకి వెళ్తున్నప్పుడు షీలా గుండె దడదడలాడింది. ఆ రాత్రి నిద్ర మాత్ర వేసుకుని నిద్రపోయింది.

* * *

మర్నాడు ఉదయం ఆ సెమిట్రీకి వెళ్ళి చూసింది. ఓ సమాధి రాయి మీద 'తిమోతీ వైనల్ 1932-39' అని రాసి ఉండడం గమనించింది.

ఆ రోజు నవల్లోని రెండో అధ్యాయాన్ని పూర్తి చేసింది. ఒకటి రెండు సార్లు బయట నించి గ్లాస్ డోర్ మీద ఎవరో కొట్టిన శబ్దం వినిపించింది. వెళ్ళి తలుపు తెరిచి చూస్తే ఎవరూ లేరు.

"రోజ్ కాటేజ్‌లో తిమోతీ దెయ్యం ఉందని మీరు నమ్ముతున్నారా?" మర్నాడు రాత్రి షీలా బార్‌లో బార్ టెండర్ని అడిగింది.

"నా నమ్మకం అలా ఉంచండి. మీరు అందులో ఉంటున్నారు కాబట్టి ఆ విషయం మీరే చెప్పాలి."

"నాకు కొన్ని వింత అనుభవాలు అయ్యాయనే చెప్పాలి."

"ఈ ప్రపంచంలో కొన్నిటిలో వేలు పెట్టకుండా విస్మరించడం మంచిది. బతికున్న వాళ్ళకి దెయ్యాలు కనపడవు అని గట్టిగా చెప్పగలను. అవి మనల్ని స్పర్శించలేవు కూడా. చప్పుళ్ళని పట్టించుకోక పోతే అవి ఏ హానీ చేయలేవు. కాబట్టి ఆ పిల్ల దెయ్యం గురించి మీరు భయపడకండి." అతను నవ్వుతూ చెప్పాడు.

షీలా బార్లోంచి బయటికి వచ్చేసరికి సన్నగా వర్షం పడుతోంది.

"నా సైకిల్‌ని తీసుకెళ్ళండి. కాటేజ్‌కి త్వరగా వెళ్ళచ్చు. నాకు రెయిన్ కోట్ ఉంది. రేపు ఇవ్వచ్చు." దెయ్యం గురించి చెప్పిన కస్టమర్ ఆమెని చూసి చెప్పాడు.

షీలా థాంక్స్ చెప్పి సైకిల్ ఎక్కి వర్షంలో రోజ్ కాటేజ్ వైపు బయలు దేరింది. ఉరుములు, మెరుపులతో వాతావరణం బీభత్సంగా ఉంది. చెట్ల కొమ్మలు గాలికి విరిగి పడుతున్న శబ్దం లోయలోంచి వినిపించింది. గాలి వెనక నించి తోస్తూండడంతో కొండ మీదకి సైకిల్‌ని తొక్కడానికి ఆమె ఇబ్బంది పడలేదు.

ఇంటికి చేరుకుని సైకిల్ దిగి, దానికి స్టాండ్ వేసి తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళి లైట్ స్విచ్ ఆన్ చేసింది.

ఎదురుగా నిలబడి ఉన్న ఏడేళ్ళ కుర్రాడ్ని చూసి ఉలిక్కి పడింది. వాడు ఆమె వంకే చూస్తూ సన్నగా నవ్వాడు.

"తిమోతీ? నువ్వు తిమోతీవా?" ఆమె గొంతు పెగుల్చుకుని అడిగింది.

నవ్వుతూ అవునన్నట్లుగా తల ఊపాడు. తర్వాత దగ్గరికి వచ్చి చనువుగా ఆమె చేతిని పట్టుకున్నాడు.

'నువ్వు దెయ్యానివి. ఐనా కనపడుతున్నావే? నువ్వు నన్ను స్మర్శించలేవు.' అందామనుకుంది. కానీ గొంతు పెగల్లేదు.

వాడు ఆమెని బయటికి గేట్ వైపు లాక్కువెళ్ళాడు. తిమోతీ గేట్ దాటి రోడ్డు మీదికి వెళ్ళడం చూసి ఆమె ఆశ్చర్యపోయింది. అరవై ఏళ్ళుగా ఆ తోట దాటని తిమోతీ ఎందుకు బయటికి వెళ్తున్నట్లు? బయట పెద్ద ఓక్ వృక్షం పక్కన నిలబడి త్వరగా రమ్మని వాడు సైగ చేస్తున్నాడు. ఆసక్తితో గేటు దగ్గరికి వచ్చి చూసింది.

కూలిన ఓక్ వృక్షం కింద వంకర్లు పోయిన సైకిల్–దాని పక్కనే చాలా పరిచయం ఉన్న ఓ శరీరం కనిపించాయి.

వర్షం కళ్ళల్లో పడుతున్నా ఆ ముఖంలోని కళ్ళు తెరుచుకునే చూస్తున్నాయి.



# ఎవరది?

**-బ్రూస్ సి ఫిక్స్**

**కొన్ని అనుభవించితే తప్ప నమ్మలేనివి అయి ఉంటాయి.**

**జోన్, డేవిడ్** సినిమా హాల్ నించి జోన్ అపార్ట్‌మెంట్‌కి చేరుకునేసరికి రాత్రి పదకొండున్నర అయింది. జోన్ తనని లోపలికి డ్రింక్‌కి ఆహ్వానిస్తుందని డేవిడ్ ఎదురు చూసాడు. కాని ఆమె గుమ్మం దగ్గరే చుంబించి గుడ్ నైట్ చెప్పింది.

'తెలివైన పిల్ల' అనుకున్నాడు. ఆమె తన అపార్టుమెంట్ లోకి వెళ్ళాక, కిటికీ తలుపు తెరిచి చేతిని ఊపింది. డేవిడ్ బదులుగా చేతిని ఊపి, తన ఇంటికి బయలుదేరాడు.

అతను దుస్తులు మార్చుకుని పడుకోగానే ఫోన్ మోగింది. జోన్ నించి.

"నేను పిచ్చిదాన్ని అని నువ్వు అనుకోకపోతే నీతో కొద్ది సేపు మాట్లాడాలి."

డేవిడ్ అంగీకరించాడు.

"నేను ఇంట్లోకి వచ్చినప్పటి నించి నన్ను ఎవరో గమనిస్తున్నారు."

"అది సహజమే. కిటికీ కర్టెన్స్‌ని మూసెయ్." సలహా ఇచ్చాడు.

"బయటి నించి కాదు. నువ్వు నవ్వనంటే మొదటి నించీ చెప్తాను."

"చెప్పు."

"నిన్ను చూసి చెయ్యి ఊపి కర్టెన్స్ వేసాక నా వెనక నించి నన్ను ఎవరో గమనిస్తున్నారనే భావన నాలో తీవ్రంగా కలిగింది. నేను చటుక్కున వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ లేరు. వంట గదిలోకి టీ కలుపుకోడానికి వెళ్తూంటే అదే భావన. చూస్తే ఎవరూ లేరు. నువ్వు నమ్మవు కానీ ఇక్కడ నన్ను ఎవరో చూస్తున్నారు."

"ఐతే నేను వస్తాను."

"వద్దు. నా అపార్ట్‌మెంట్ మొత్తం వెదికినా ఎవరూ లేరు. కిటికీలకి ఉన్న ఇనప ఊచలు వంచబడి లేవు. ఇంకేదైనా సలహా ఇవ్వు." జోన్ నిరాకరించింది.

"నువ్విప్పుడు ఎక్కడ ఉన్నావు?"

"ముందు గదిలో. భయం వేసి తలుపులన్నీ మూసి ముందు గదిలోకి వచ్చాను. కానీ ఖచ్చితంగా ఇక్కడ ఎవరో ఉండి నన్ను చూస్తున్నారు అని నాకు స్పష్టంగా తెలుసు."

"కర్టెన్స్ వెనుక, వార్డ్ రోబ్‌లో..."

"చూస్తాను. ఒక్క నిమిషం."

కొద్ది క్షణాల తర్వాత జోన్ చెప్పింది.

"ఎవరూ లేరు. కాని వెదికే నా వెనకే ఎవరో ఉన్నారు! నేను చటుక్కున వెనక్కి తిరిగితే వాళ్ళూ తిరుగుతున్నారు అనిపిస్తోంది." జోన్ కంఠం భయంగా వినిపించింది.

"ఐతే జాగ్రత్తగా విను. వెంటనే డ్రెస్ చేసుకో. టెలిఫోన్ రిసీవర్‌ని డిస్కనెక్ట్ చేయకుండా టేబుల్ మీద ఉంచు. తర్వాత చప్పుడయ్యేలా తలుపు వేసి, తాళం వేసి మా ఇంటి వైపు నడు. సగం దారిలో నేను నీకు ఎదురవుతాను. అర్థమైందా?"

"అయింది. నేను డ్రస్ చేసుకుని బయలుదేరుతాను."

డేవిడ్‌కి రిసీవర్ టేబిల్ మీద పెట్టిన చప్పుడు, ఆమె అడుగులు చప్పుడు వినిపించాయి. ఎందుకనో జోన్‌కి మానసిక అస్థిరత వచ్చిందని డేవిడ్ భావించాడు. మర్నాడు ఆమెని డాక్టర్ దగ్గరికి వెళ్ళమని సలహా ఇవ్వాలని కూడా అనుకున్నాడు.

"డార్లింగ్. బయలుదేరుతున్నాను." జోన్ కంఠం మళ్ళీ వినిపించింది.

"లైట్లు ఆర్పకు. ఫోన్ రిసీవర్ టేబిల్ మీద పెట్టి బయలుదేరు."

"అలాగే."

డేవిడ్ రిసీవర్‌ని టేబిల్ మీద పెట్టిన చప్పుడు విన్నాడు. తర్వాత తలుపు మూసిన శబ్దం కూడా వినిపించింది. రిసీవర్ని ఎవరో ఎత్తిన భావన డేవిడ్‌కి కలిగింది.

"హలో ఎవరది?" అడిగాడు.

అవతలి నించి ఎలాంటి సమాధానం లేదు.

* * *

జోన్ ఆ రాత్రి డేవిడ్ సింగిల్ బెడ్ రూం అపార్ట్‌మెంట్లో గడిపింది. అతను ముందు గదిలో సోఫా మీద పడుకున్నాడు.

మర్నాడు ఉదయం డేవిడ్, జోన్‌లు ఆమె అపార్ట్‌మెంట్‌కి వచ్చి చూస్తే, వేసిన తాళం వేసినట్లుగానే ఉంది. రిసీవర్ బల్ల మీద కాక ఫోన్ క్రెడిల్ మీద ఉంది! లైట్లు ఆర్పి ఉన్నాయి!!

వారెవరైనా వారికి ఏం కావాలి? వారా? లేదా అదా? ఇద్దరికీ బోధపడలేదు.

చేరిన నాలుగో రోజుకే జోన్ ఆ అపార్ట్‌మెంట్‌ని ఖాళీ చేసేసింది.

.

# మిస్టర్ డెత్

**-మోరిస్ హైర్ష్‌మెన్**

**మనింటి ముందు మృత్యువు వచ్చి నిలబడి, ఇంట్లోని ఒకరి కోసం వేచి చూస్తోందని తెలిస్తే ఎలా ఉంటుంది?**

**ఎడ్డీ భార్య** చెప్పింది విని ఇన్‌స్పెక్టర్ రాయ్‌వర్త్ ఆశ్చర్యపోయాడు.

"అది నేను నమ్మను. అతీంద్రియ శక్తిని మీ వారు నమ్ముతారని కూడా నేను భావించడం లేదు."

"కాని అది నిజం. అతనికి ప్రజలు పెట్టిన ముద్దు పేరు మిస్టర్ డెత్. అతను డాక్టర్ ఆర్ బకుల్ ఇంటి ముందు మొన్న రాత్రంతా నిలబడ్డాడు. నిన్న ఉదయం డాక్టర్ ఆర్ బకుల్ మరణించాడు!"

"అది కాకతాళీయం అయి ఉండచ్చుగా?" రాయ్‌వర్త్ అడిగాడు.

"దేన్ని కాకతాళీయం అంటారు? ఒక సారి లేదా రెండు సార్లు జరిగిన దాన్ని. అదే పనిగా జరిగే వాటిని కాకతాళీయం అనరు. అతీంద్రియ శక్తి అంటారు." ఎడ్డీ భార్య చెప్పింది.

"ఇందాక మీరు చెప్పింది మరో సారి చెప్పండి." మూఢ నమ్మకాలు లేని రాయ్‌వర్త్ అడిగాడు.

"అతని పేరు ఎవరికీ తెలీదు. అతన్ని ఐదారు నెలల క్రితం మొదటిసారిగా గుర్తించారు. నగర మేయర్ ఇంటి ముందు రాత్రంతా అతను నిలబడి ఉన్నాడు. కూతురి జ్వరం పెరగడంతో మేయర్ అర్ధరాత్రి డాక్టర్ దగ్గరకి ఓ సారి, మందులు కొనడానికి మరో సారి వెళ్ళి వచ్చాడు. రెండు సార్లూ తన ఇంటి ముందు నిలబడి తదేకంగా తన ఇంటినే చూస్తున్న అతన్ని మేయర్ గమనించాడు. మేయర్ కూతురు మర్నాడు మరణించింది. అతను ఏ ఇంటి ముందు రాత్రంతా నిలబడితే ఆ ఇంట్లోని ఒకరు పోతారన్న విషయం మేయర్‌కి అప్పుడు తెలీదు. ఆ తర్వాత అతను మరో ఇద్దరి ఇళ్ళ ముందు రాత్రులు నిలబడి చూడటం, ఆ ఇంట్లోని వాళ్ళు మరణించడం జరిగాక అతనికి ఉన్న ఈ అతీంద్రియ శక్తి గురించి ప్రజలకి తెలిసింది. దాంతో అతనికి మిస్టర్ డెత్ అనే పేరు పెట్టారు."

"మీరు చెప్పేది నాకు ఎంత మాత్రం నమ్మశక్యంగా లేదు. ఓ ఇంటి ముందు చీకట్లో నిలబడి, చీకటి లాంటి మృత్యువుని ఆ ఇంట్లోకి ప్రవేశపెట్టే శక్తి ఏ మనిషికీ ఉందని నేను అనుకోను." రాయ్‌వర్త్ దాన్ని ఖండించాడు.

"కాని జరిగిన వాస్తవాలని మీరు ఎలా విస్మరించగలరు? డాక్టర్ ఆర్ బకుల్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నాడు. అంతకు ముందు రోజే గోల్ఫ్ ఆటలో నైన్త్ హోల్‌ని సాధించాడు. అతని కుటుంబ సభ్యులంతా ఆరోగ్యంగానే ఉన్నారు. కాని మిస్టర్ డెత్ వారి ఇంటి ముందు రాత్రంతా నించున్నాక మర్నాడు ఆ డాక్టర్ మరణించడానికి మీరు ఇంకేదైనా వివరణని ఇవ్వగలరా?" ఎడ్డీ భార్య అడిగింది.

దానికి రాయ్‌వర్త్ దగ్గర సమాధానం లేదు.

"అతనికి ఆ శక్తి ఎలా వచ్చిందని ప్రజల ఊహ?" అడిగాడు.

"గ్రే ఎలా సాధించాడో మరి?"

"గ్రే?"

"అతనికి ప్రజలు పెట్టిన మరో పేరు గ్రే. అతని వంటి మీద ఎప్పుడూ గ్రే రంగు దుస్తులు ఉంటాయి. కాబట్టి ప్రజలు ఆ పేరు పెట్టారు. అతన్ని ఎందరు అతని పేరు అడిగినా నవ్వుతాడు తప్ప జవాబు చెప్పడు."

ఎడ్డీ భార్య చెప్పిన విషయాలని రాయ్‌వర్త్ కొద్ది సేపు మౌనంగా ఆలోచిస్తూండిపోయాడు.

"మిసెస్ కల్ఫ్ ఇంటి ఎదురుగా అతను నించుంటే ఆవిడ మరణించిందని అన్నారు. కాని ఆవిడ అరోటిక్ అన్యూరిజంతో చాలా కాలంగా బాధపడే దీర్ఘ రోగి. మీరు చెప్పిన వారిలో చాలా మంది దీర్ఘ రోగులు కాబట్టి మరణించారు అని అనుకోవచ్చు. గ్రే లేదా మిస్టర్ డెత్ వారి ఇళ్ళ ముందు కనపడితే, ఆ రాత్రంతా అతను తమ ఇంటిని చూస్తూ నిలబడ్డాడని వారు భ్రమించి ఉండచ్చుగా? అదీ కాక వారి మరణానికి అతన్ని బాధ్యుడ్ని చేసి, ఇప్పుడు మీ ఇంటి ముందు నిలబడ్డ అతన్ని అరెస్ట్ చేయమంటున్నారు. అందుకు తగిన భౌతిక సాక్ష్యం లేదు." షెరీఫ్ రాయ్‌వర్త్ చెప్పాడు.

"కాని నా భర్త రోగి. ఓపెన్ హార్ట్ సర్జరి జరిగింది. అతన్ని అక్కడ నించి వెళ్ళమని చెప్పండి." ఆమె అర్థించింది.

రాయ్‌వర్త్ కిటికీ లోంచి బయటకి చూసాడు. ఓ పొడుగాటి నల్లటి వ్యక్తి బూడిద రంగు ఓవర్ కోట్ వేసుకుని ఉన్నాడు. అదే రంగు షర్ట్, పేంట్, సాక్స్ కూడా వేసుకున్నాడు.

అతను బయట నిశ్శబ్దంగా నిలబడి ఇటే చూస్తున్నాడు. అతని మొహంలో ఏ భావాలు కనిపించడం లేదు.

"లాయిటరింగ్ నేరం మీద అరెస్ట్ చేయచ్చు. కాని ఫైన్ కట్టి వెంటనే బయటకి వచ్చేస్తాడు." రాయ్‌వర్త్ చెప్పాడు.

ఆమె తన భర్తకి ఆరెంజి రంగు మందు బిళ్ళని ఇచ్చి చెప్పింది.

"మా వారు దీర్ఘ రోగి. కిటికీ లోంచి మిస్టర్ డెత్‌ని చూసి తను ఈ రాత్రికి మరణిస్తానని భయపడుతున్నారు. అందుకని మీకు ఫోన్ చేసాను. అతను ఇక్కడ ఈ రాత్రి నిలబడకుండా మీరే ఏదో చేయాలి. అందుకు తగ్గ అధికారం మీకు ఉంది."

"కాని అది పరిమితమైంది. ఈ రాత్రికి లాకప్‌లో ఉంచగలను. కాని రేపు ఫైన్ కట్టి విడుదలయ్యాక మళ్ళీ రేపు రాత్రి ఇక్కడికి వస్తే? ప్రతీ రాత్రి అతన్ని అరెస్ట్ చేయడం వ్యక్తి స్వేచ్ఛని హరించినట్లని జడ్జి తప్పక అభిప్రాయపడతాడు. ఇది శాశ్వత పరిష్కారం కాదు."

"అప్పటికీ మా వారితో చెప్పాను, 'అతడ్ని ఉండనివ్వండి, రేపు మీకు ఏం కాదు. అతను మిస్టర్ డెత్ కాదని, ఆ మూఢ నమ్మకాన్ని మనం బద్దలు కొడదాం' అని. కాని తను పోవచ్చని మా వారికి భయం."

"ఎవరి ప్రాణాల మీదకి వస్తే వారికి భయం కలగడం సహజం." ఇన్‌స్పెక్టర్ రాయ్‌వర్త్ ఒప్పుకున్నాడు.

"మరి దారేమిటి?"

"అదే ఆలోచిస్తున్నాను. అసలు మీరు అతన్ని పట్టించుకోక పోవడం శ్రేయస్కరం."

"అతను ఊడూ నేర్చుకున్నాడని మా వారికి అనుమానం. అతను నల్ల జాతి వ్యక్తి. ఆఫ్రికాలోని వారికి ఊడూ విద్య తెలుసు. అతీంద్రియ శక్తిని ఉపయోగించి వారు తమ శతృవులని, ప్రత్యర్థులని చంపుతూంటారు."

"నిజమే. అలాంటి సినిమాలు నేను కొన్ని చూసాను." రాయ్‌వర్త్ ఒప్పుకున్నాడు.

"ఒకో సారి మిస్టర్ డెత్ ఆకలేసో, మరే కారణంగానో తను నిలబడ్డ ఇంటి ముందు తెల్లవారే దాకా ఉండకుండా మధ్యలో వెళ్ళిపోతూండటం కూడా జరుగుతూంటుంది. అప్పుడు ఆ ఇంట్లోని వాళ్ళకి ఏం జరగదు."

"అతను మిమ్మల్ని డబ్బేమైనా అడిగాడా?" రాయ్‌వర్త్ అడిగాడు.

"దేనికి?" ఎడ్డీ భార్య అడిగింది.

"మీ ఇంటి ముందు నిలబడకుండా ఉండడానికి. అతను డబ్బు అడిగితే రెండేళ్ళు జైలు శిక్ష పడే నేరం అది."

"లేదు. అసలు అతను మాతో మాట్లాడనే లేదు."

"నేను అనుకోవడం ఒక ఇంటి ముందు నిలబడకుండా ఉండటానికి డబ్బు అడిగే వ్యాపారం త్వరలో మొదలు పెడతాడు. ఎంత మంది ఎంత దాకా ఇస్తారో నేను ఊహించగలను. ఆ సంగతి గోప్యంగా ఉంచమని బెదిరిస్తే చాలా మంది బయటకి చెప్పరు కూడా. ఇంట్లోని వారికి ఈ నమ్మకం ఎంత గాఢంగా ఉంటే అంత ఎక్కువ అతనికి రాల్తుంది. జరగబోయేది అదే అని నా నమ్మకం. లేకపోతే అతను కొన్ని రాత్రులని ఎందుకిలా వృధా చేసుకుంటాడు?" వృత్తిపరమైన అనుభవంతో మిస్టర్ డెత్‌లోని నేర కోణాన్ని ఊహించి రాయ్‌వర్త్ చెప్పాడు.

"కావచ్చు. కాని ఇంతదాకా మమ్మల్ని కాని, ఎవర్నీ కాని అతను డబ్బు అడగలేదు. లేదా మీరు అన్నట్లు ఎవరైనా ఇచ్చినా ఆ సంగతి గోప్యంగా ఉంచుతూండచ్చు. కాని మీరు మాత్రం అతను ఈ రాత్రి మా ఇంటి వంక చూస్తూ అక్కడ నిలబడకుండా తగిన చర్య తీసుకోవాలి." ఆమె అభ్యర్ధించింది.

"అలాగే. మా పై అధికారులతో చర్చిస్తాను. ఏదైనా పరిష్కారం దొరుకుతుందని నేను అనుకోను. మీ వారికి శతృవులు ఎవరైనా ఉన్నారా?"

"ఏం?"

"అడిగాను."

"ఆయన చేసే వ్యాపారంలో పోటీ మనస్థత్వం గల అనేక మంది ఉన్నారు. బ్రాడ్‌ఫోర్డ్ తనకి రావాల్సిన ప్రభుత్వ టెండర్లన్నీ మా వారికే వస్తున్నాయని బాధపడుతూంటాడు."

రాయ్‌వర్త్ ఎడ్డీ భార్య దగ్గర శెలవ తీసుకుని బయటకి వెళ్ళాడు. మిస్టర్ గ్రే దగ్గర ఆగి అడిగాడు.

"మీ పేరు?"

బదులుగా అతను చిరునవ్వు నవ్వాడు తప్ప జవాబు చెప్పలేదు.

* * *

తన ప్రత్యర్ధి ఎడ్డీ ఇంటి ముందు మిస్టర్ డెత్ నిలబడి ఉండటం గురించి ఆ రాత్రి పదకొండుకి బ్రాడ్‌ఫోర్ట్‌కి ఓ ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వైపు నించి చెప్పేది శ్రద్ధగా విన్నాడు. తర్వాత ఉత్సాహంగా చెప్పాడు.

"అలాగే. ఈ సమాచారానికి థాంక్స్."

బ్రాడ్‌ఫోర్డ్ వెంటనే టివిని ఆఫ్ చేసి, బట్టలు మార్చుకున్నాడు.

"ఎక్కడికి?" అతని భార్య అడిగింది.

"అర్జెంట్ పని పడింది."

బ్రాడ్‌ఫోర్డ్ కారెక్కి సరాసరి ఎడ్డీ ఇంటి ప్రాంతానికి చేరుకున్నాడు. కొద్ది దూరంలో కారు ఆపి కాలి నడకన అక్కడికి చేరుకున్నాడు. రెండు చేతులని గ్రే ఓవర్ కోట్‌లో ఉంచుకుని ఎడ్డీ ఇంటి వైపే చూస్తూ నిలబడ్డ మిస్టర్ డెత్ అతని కంట పడ్డాడు. బ్రాడ్‌ఫోర్డ్ అతని దగ్గరకి వెళ్ళి పలకరించాడు.

"హలో."

అతను తల తిప్పి బ్రాడ్‌ఫోర్డ్ వంక చూసాడు.

"ఈ రాత్రి నువ్వు ఈ ఇంటి ముందు నించి వెళ్ళక. అలా వెళ్ళకపోతే, ఎడ్డీ రేపు మరణిస్తే నీకు రేపు వెయ్యి డాలర్లు ఇస్తాను." చెప్పాడు.

ఆ మాటలు విన్న అతను తక్షణం గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోసాగాడు. బ్రాడ్‌ఫోర్డ్ అతన్ని ఎంత బతిమాలినా అతను అక్కడ ఉండకుండా వెళ్ళిపోయాడు.

వెంటనే బ్రాడ్‌ఫోర్డ్ ఇన్‌స్పెక్టర్ రాయ్‌వర్త్‌కి ఫోన్ చేసి జరిగింది చెప్పాడు.

"మీరు ఊహించినట్లే జరిగింది. మిస్టర్ మర్డర్ ఎడ్డీ ఇంటి ముందు నించి వెళ్ళిపోయాడు."

ఇన్‌స్పెక్టర్ రాయ్‌వర్త్ రిసీవర్ పెట్టేసి తన ఎదురుగా ఉన్న ఫండమెంటల్స్ ఆఫ్ ఊడూ అనే పుస్తకాన్ని చూసాడు. అందులో అతను ఎర్ర రంగు ఇంకుతో అండర్ లైన్ చేసిన వాక్యాన్ని మళ్ళీ చదవాడు.

ఊడూలోని ప్రధాన నియమం డబ్బు తీసుకుని ఎవరికైనా హాని చేయదలచుకుంటే, అలా చేసే హాని దాన్ని చేసిన వారికి ఇరవై నాలుగు గంటల్లోగా వచ్చి తాకుతుంది. కేవలం పగతో మాత్రమే ఊడూని ప్రయోగించాలి.

ఈ సారి రాయ్‌వర్త్‌కి వచ్చిన ఫోన్ ఎడ్డీ భార్య నించి. ఆవిడ సంతోషంగా చెప్పింది.

"థాంక్స్ ఇన్‌స్పెక్టర్. మిస్టర్ మర్డర్ వెళ్ళిపోయాడు. బ్రాడ్‌ఫోర్డ్ జరిగింది ఇప్పుడే ఫోన్ చేసి చెప్పాడు."

# అవసరమైనవి అమ్మబడును

**-లూయిస్ పాడ్జెట్**

**మనకేది కావాలో ముందే తెలిస్తే? అప్పుడు అది మేలు చేస్తుందా? లేదా చెరుపు చేస్తుందా?**

**అర్థరాత్రి కావస్తోంది.** న్యూయార్క్ నగరంలో ఓ బార్‌లో విచారంగా కూర్చున్న ఫ్రెడ్‌ని బార్ టెండర్ అడిగాడు.

"ఇంకోటి కావాలా?"

"చాలు."

"మేమిక్కడ లిక్కర్ అమ్ముతాం తప్ప ప్రదేశాన్ని అద్దెకి ఇవ్వం." చెప్పి బార్ టెండర్ అతని వంక కోపంగా చూసి వెళ్ళాడు.

ఫ్రెడ్ వంటరివాడు. తాగుబోతు. నేర స్వభావం గలవాడు. అర్థం లేని, జీవితంలో ఒక్క విజయం లేని, అపజయాలతో నిండిన ముప్పై ఆరేళ్ళ వ్యక్తి. అప్పుల్లోంచి బయట పడడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆ బార్ లోకి వచ్చిన ఓ ముసలతను తన ఛాతీకి కట్టుకున్న ట్రేలో గల రకరకాల వస్తువులని కస్టమర్స్‌కి అమ్మే ప్రయత్నం చేయసాగాడు. ఓ యువతి ఆయన్ని అడిగింది.

"అగ్గిపెట్టె ఉందా?"

ఆయన ఆమె కళ్ళల్లోకి కొద్ది క్షణాలు తదేకంగా చూసి చెప్పాడు.

"మీకు కావలసింది అగ్గిపెట్టె కాదు మిస్. ఇది అని నాకు తెలుసు."

ఆయన ట్రేలోంచి తీసి ఇచ్చిన సీసాని చూసి అడిగింది.

"ఏమిటిది?"

"క్లీనింగ్ లోషన్. ఎలాంటి మరకలనైనా తొలగిస్తుందని హామీ. మీకు కావలసింది ఇదే."

ఆమె దాన్ని కొన్నది. దీన్ని ఫ్రెడ్ గమనించాడు. బార్ టెండర్‌కి ఎడమ చేత్తో డబ్బు చెల్లించిన లెఫ్టీ ఆ వృద్ధుడు తన దగ్గరికి రాగానే అడిగాడు.

"ఏమున్నాయి తాతా?"

"చాలా. మీక్కావలసినవి చాలా ఉన్నాయి."

"నాకేం ఉపయోగిస్తాయి తాతా?" లెఫ్టీ అడిగాడు.

"షూ లేస్‌లు. లేదా అగ్గిపెట్టె."

"ఒద్దు. అవి నాకు అవసరం లేదు. నాక్కావలసింది నీ దగ్గర లేదు." లెఫ్టీ చెప్పాడు.

"నీకేం కావాలో చెప్పు లెఫ్టీ. ప్రతీ రాత్రి ఈయన ఇక్కడికి వచ్చి ఎవరికేం కావాలో అవి అమ్ముతూంటాడు." బార్ టెండర్ చెప్పాడు.

"నీకేం కావాలి?" ఆ ముసలాయన అడిగాడు.

"ఓ కొత్త ఎడమ చేయి." లెఫ్టీ చెప్పాడు.

"లెఫ్టీ కొంతకాలం బేస్‌బాల్ ఆటలో ఛాంపియన్. ఓ సారి కింద పడినప్పుడు ఎడమ చెయ్యి బలహీనపడింది. వారానికి ఏడు రాత్రులు ఇక్కడికి వస్తూంటాడు. మళ్ళీ బేస్‌బాల్ ఆటని వృత్తిగా చేసుకోవాలని ఆనకుంటున్నాడు." బార్ టెండర్ సానుభూతిగా చెప్పాడు.

"అందుకు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి." ముసలాయన చెప్పాడు.

"బేస్‌బాల్‌కి ప్రత్యామ్నాయమా? సరే. షూ లేసెస్ ఇవ్వు తాతా." లెఫ్టీ కోరాడు.

"నీకేం కావాలో నాకు తెలుసు." చెప్పి ఆ ముసలాయన ట్రేలోంచి ఓ కాగితం ముక్క తీసి లెఫ్టీకి అందించాడు.

ఫ్రెడ్ వీళ్ళనే గమనిస్తున్నాడు.

"ఇది పెన్సిల్వేనియాలోని స్క్రాంటన్‌కి బస్ టికెట్. అక్కడ ఏముంది తాతా?" లెఫ్టీ దాన్ని చదివి నవ్వి అడిగాడు.

"ఏమో? ఎవరికి తెలుసు?"

"బొగ్గు గనులు. స్క్రాంటన్‌లో ఉన్నవి అవే. ఆ చేత్తో నువ్వు బేస్‌బాల్ ఆడలేవు. కానీ గనులు తవ్వగలవేమో?" బార్ టెండర్ నవ్వుతూ చెప్పాడు.

పబ్లిక్ టెలిఫోన్ మోగింది. అది లెఫ్టీకి. అతను దాని కేబిన్ గాజు తలుపు వేయడంతో అతను ఫోన్‌లో మాట్లాడేది ఎవరికీ వినపడలేదు.

"డబ్బున్న అంకుల్ పోయాడా?" బయటకి వచ్చిన లెఫ్టీ మొహంలోని ఆనందాన్ని గమనించిన బార్ టెండర్ అడిగాడు.

"ఆశ్చర్యం! నా బేస్‌బాల్ మేనేజర్ గత మూడు వారాలుగా నా కోసం వెదుకుతున్నాడట. బేస్‌బాల్ ఆటని నేర్పే కోచ్ ఉద్యోగం నా కోసం సిద్ధంగా ఉంది. స్క్రాంటన్, పెన్సిల్వేనియాలో!" లెఫ్టీ ఉత్సాహంగా చెప్పాడు.

తన చేతిలోని టిక్కెట్‌ని చూసి అడిగాడు.

"నన్ను బస్‌లో రమ్మన్నాడు. ఇది నీకు ఎలా తెలుసు తాతా?"

"కాకతళీయం. లేదా నీ అదృష్టం. ప్రశ్నలు దేనికి? నీకు కావలసింది లభించింది. కాబట్టి దాన్ని తీసుకో."

"నాకు అర్థం కావడంలేదు... నాకున్నది ఇదొకటే కోటు. ఇక్కడ మరకలు పడింది. ఈ మరకలతో ఇంటర్వ్యూకి వెళ్తే... నేను షేవ్ చేసుకోవాలి."

ఇందాకటి యువతి లేచి లెఫ్టీ దగ్గరికి వచ్చి చెప్పింది.

"ఎక్స్‌క్యూజ్ మీ. వద్దనుకున్నా మీ సంభాషణ వినపడింది. ఇది మీ మరకలకి పనికొచ్చే లోషన్. ప్రయత్నించనా?" చెప్పి దాన్ని మరకల మీద రుద్ది చెప్పింది.

"ఆరగానే మరకలు పోతాయి."

"మీరిక్కడ దీంతో ఉండడం నా అదృష్టం." లెఫ్టీ చెప్పాడు.

"అదృష్టం కాదు. ఆ ముసలాయన..."

ఇద్దరూ తల తిప్పి చూస్తే ఆయన తలుపు తెరచుకుని బయటికి వెళ్తున్నాడు.

తన ట్రేలోని సామాను సర్దుకుంటున్న ఆయన బార్‌లోంచి తన వెనక్కి వచ్చి నిలబడ్డ వ్యక్తిని భయంగా చూసాడు. తర్వాత కొద్దిగా వణికే కంఠంతో అడిగాడు.

"మీకేమైనా కావాలా? షూ లేసెస్?"

"నాకు అదే అవసరమా?" ఫ్రెడ్ కఠినంగా చూస్తూ అడిగాడు.

"అది నిర్ణయించాల్సింది మీరు. షూ లేసెస్. కాకపోతే అగ్గిపెట్టె?"

"కమాన్! నాకేం కావాలో చెప్పు ముసలాడా. ఈ రాత్రికి నాకేం కావాలి?" ఆయన్ని గట్టిగా పట్టుకుని ఊపుతూ క్రోధంగా అడిగాడు.

ముసలాయన ఓ కత్తెరని తీసిచ్చాడు.

"ఇదేంటి? జోకా? నీ సామానంతా చిందర వందర చేస్తాను."

"మీకు కావలసింది ఇదే. నిజంగా ఇదే." ముసలాయన చెప్పాడు.

ఫ్రెడ్ దాన్ని తీసుకుని తన హోటల్‌కి వెళ్ళి రిసెప్షనిస్ట్ నించి తాళం చెవి తీసుకున్నాడు. లిఫ్ట్ తలుపు తెరచుకుని లోపలికి వెళ్ళి మూస్తూంటే, అతని మెడ చుట్టూ ఉన్న స్కార్ఫ్ అంచు తలుపు మధ్య చిక్కుకోవడం అతను గమనించలేదు. లిఫ్ట్ కదిలాక, అతని మెడ చుట్టూ స్కార్ఫ్ బిగుసుకుంటూండడంతో కత్తెర గుర్తొచ్చి దాంతో కత్తిరించి ఆ అపాయం లోంచి తప్పించుకున్నాడు.

* * *

ముసలాయన తలుపు తెరచుకుని తన అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించాడు. లైట్ వేయగానే ఎదురుగా కుర్చీలో కూర్చుని ఉన్న ఫ్రెడ్‌ని గమనించి భయంగా చేతిలోని పెట్టెని జారవిడవడంతో సామానంతా చిందరవందరైంది.

"మీకు కావలసింది ఇందాకే ఇచ్చాను. మళ్ళీ ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు?" వాటిని ఏరుతూ అడిగాడు.

"ఈ రాత్రి నాకు అవసరమైందే ఇచ్చావు. ఇంకా వీటిలో ఏమున్నాయి? క్రిస్టల్ బాల్? మంత్రదండం?" లేచి వెళ్ళి నేల మీది సామానుని బూటు కాలితో తన్నుతూ అడిగాడు.

ముసలాయన జవాబు చెప్పలేదు.

"నువ్వు భవిష్యత్తులోకి చూడగలవు కదా? బుద్ధిహీనుడా! దాన్ని చిల్లర నాణేల కోసం వినియోగిస్తున్నావు. నీకిప్పుడు ఓ మంచి భాగస్వామి ఏర్పడ్డాడు."

"నాకు భాగస్వామి అవసరం లేదు. నాకున్న నైపుణ్యంతో నేను తృప్తిగా జీవిస్తున్నాను. దాన్ని నేను అవసరమైన మేరకే ఉపయోగించాలి."

"క్లీనింగ్ లోషన్ మీద, బస్ టిక్కెట్ల మీదానా? నీది చిల్లర బుద్ధి తాతా. కానీ నీ భాగస్వామి దాంతో తేలిగ్గా తృప్తి చెందడు."

"అతన్ని ఏది సంతృప్తి పరుస్తుంది?" ముసలాయన అడిగాడు.

"ఏం సంతృప్తి పరుస్తుందా? ఖరీదైన స్కార్ఫ్‌ని కప్పుకున్న భుజాలు. ఖరీదైన దుకాణాల్లో అమ్మే విలాసాలు. డబ్బు. ఏ సమ్మోహనశక్తిని ఉపయోగిస్తావో, ఏం చేస్తావో కానీ రేపు నాకేం అవసరమో అదివ్వు. బుధవారం నాకేం అవసరం? త్వరగా." కోపంగా అరిచాడు.

ముసలాయన అయిష్టంగా జేబులోంచి పెన్ తీసిచ్చాడు.

"పెన్నా? జోక్ చేస్తున్నావా?" మూత తీసి చూసాడు.

"ఇది కారుతోంది. కారే పెన్ను... అరె! దీనిలోని సిరా చుక్క రేపు మొదటి గుర్రం రేస్‌లోని స్టేంచ్ సోల్జర్ అనే గుర్రం ముందు పడిందే? నాక్కావలసింది ఇదే. కారే పెన్ను." చెప్పి ఫ్రెడ్ ఆనందంగా వెళ్ళిపోయాడు.

* * *

మర్నాడు అతను ఆ రేసులో రెండు వందల నలభై డాలర్లు గెలుచుకున్నాడు.

వెంటనే ఫ్రెడ్ దినపత్రికలోని మర్నాటి రేస్‌ని తెరిచి పెన్ కేప్‌ని తీసాడు. అయితే అది కారడం లేదు. విదిల్చితే చుక్క కూడా పడలేదు. పూర్తిగా ఎండిపోయింది.

* * *

బార్ బయట ఆ ముసలాయన ఎప్పటిలా అమ్ముతున్నాడు.

"ముసలాడా! నీ పేరేమిటి?" ఫ్రెడ్ వచ్చి అడిగాడు.

"పెడాట్." ఆయన అయిష్టంగా చెప్పాడు.

"నువ్విచ్చిన పెన్ పని చేయడం లేదు. ఇంక్ రావడం లేదు. రేపు రేస్‌లో ఏ గుర్రం గెలుస్తుందో చెప్పు."

"నాకు తెలీదు. మీరు ఏది అవసరమో, అదే మీ దగ్గరికి వస్తుంది. వెళ్ళండి. ఈ రాత్రి మీకేం అవసరం లేదు. కాబట్టి మీకేమీ అమ్మను." ఆ ముసలాయన చెప్పాడు.

"పెడాట్! నాకేది కావాలో అది నువ్వు రోజూ ఇస్తుండాలి. అది ఏదన్నది నాకు అనవసరం. నా ప్రాణాలని కాపాడే కత్తెర, డబ్బిచ్చే కారే పెన్ను... ఏదైనా సరే. రోజూ ఇస్తూండాలి. అది ఆగకూడదు. నేను నా నాలుగో ఏట నించి మంచివాడిని కాదు."

"కానీ అది ఆగాలి. ఇప్పుడే ఆగాలి." ఆ ముసలాయన చెప్పాడు.

"ఎందుకు?"

"ఎందుకంటే మీరు కోరుకునేవి నేను సరఫరా చేయలేను."

"ఏమిటది?"

"శాంతి. నిన్ను చూసి నువ్వే నవ్వుకునే శక్తి. అవీ నీకు కావలసినవి. వాటిని ఇవ్వగలిగే శక్తి నాకు లేదు."

ఫ్రెడ్ ఆ ముసలాయన చొక్కా కాలర్ పట్టకుని కోపంగా చెప్పాడు.

"నా కళ్ళల్లోకి లోతుగా చూసి నాకేం అవసరమో చెప్పు... ఏం? చూస్తున్నావా?"

పెడాట్ తన సామాను వంక చూసాడు. ఫ్రెడ్ వాటిని తడిమి ఓ పెట్టెని అందుకున్నాడు.

"ఒద్దు. దాన్ని తెరవద్దు." పెడాట్ చెప్పాడు.

దాన్ని తెరిచి అందులోని బూట్లని తీసుకుని ఫ్రెడ్ వెంటనే వాటిని తొడుక్కున్నాడు.

"ఇవి కొద్దిగా టైట్‌గా ఉన్నాయి. కాళ్ళు జారుతున్నాయి. కానీ నాకు కావలసింది ఇవే కదా? వీటితో నేను నడిస్తే నాకేం కావాలో అవి కనిపిస్తాయి కదా? చెప్పు ముసలాడా."

"సహనం! నీకు కావలసింది సహనం మిస్టర్ ఫ్రెడ్." పెడాట్ చెప్పాడు.

"నేను నీ ఎముకలు విరగ్గొడతాను. మర్యాదగా చెప్పు. నాకు కావలసినవి ఇవేనా?"

"నీకు కావలసింది అవే అని నేను నీకు చెప్పలేదు. నిజానికి ఆ బూట్లు ఈ రాత్రికి నాకు అవసరం." పెడాట్ భయంగా చెప్పాడు.

ఫ్రెడ్ కోపంగా ఆయన వైపు అడుగులు వేస్తూంటే ఆయన వెనక్కి నడిచాడు. సరిగ్గా ఆ సమయంలో రోడ్డు మీది నీళ్ళకి బూట్లు జారి నిలదొక్కుకోలేక పోతున్న ఫ్రెడ్‌ని ఓ కారు వచ్చి గుద్దింది.

"మిస్టర్ ఫ్రెడ్. బార్ బయట నేను నీ కళ్ళల్లో చూసింది మరణం. నా మరణం. నువ్వు నన్ను చంపబోయావు. కాబట్టి నీకు ఈ రాత్రికి అవసరమైనవి జారే బూట్లు. కాబట్టి అవి నిన్నే చేరాయి." పెడాట్ ఫ్రెడ్‌కి చెప్పాడు.

వెంటనే ఫ్రెడ్ తల వాల్చేసాడు.

ఫ్రెడ్ అరుపుకి ఓ ఇంట్లోంచి బయటికి వచ్చిన దంపతులు ఆ ముసలాయన్ని అడిగారు.

"ఏం జరిగింది? మీరు చూసారా?"

"ఇతన్ని ఓ కారు గుద్ది వెళ్ళిపోవడం చూసాను... మీరేమైనా కొంటారా సార్? షూ లేసెస్, అగ్గిపెట్టెలు. ఏదైనా?"

"జోక్ చేస్తున్నావా ముసలాయనా? ఈ రాత్రికి నాకు ఏం అవసరం? అవెందుకు?" ఇంటాయన చెప్పాడు.

"సర్! మీకేం కావాలో నేను చెప్తాను... ఇది మీకు అవసరం. ఈ రాత్రి దీనికి ధర లేదు." ఓ దువ్వెనని అందించి ముసలాయన వెళ్ళిపోయాడు.

"పిచ్చివాడిలా ఉన్నాడు." అతని భార్య చెప్పింది.

"అవును. ఇంత రాత్రి దువ్వెన ఇచ్చి, అది నాకు అవసరమని ఎందుకంటాడు?"

ఇద్దరూ ఫ్రెడ్ చుట్టూ గుమిగూడిన వారి దగ్గరికి వెళ్ళారు. ప్రెస్ రిపోర్టర్ అతనితో చెప్పాడు.

"మీరు గొప్ప గోల్ఫ్ ఆటగాడు కదా? కదలకుండా ఉంటే మీ ఇద్దరి ఫోటో తీసుకుంటాను."

వెంటనే ఆమె జుట్టుని సవరించుకుంటూంటే అతను జేబులోంచి దువ్వెన తీసి చెదిరిపోయిన జుట్టుని దువ్వుకున్నాడు.

అంబులెన్స్‌లో ఫ్రెడ్ దేహాన్ని తీసుకువెళ్ళిపోయారు.

# దిద్దుబాటు

**- నెడ్ షెరిన్**

దెయ్యం అనగానే భయం దేనికి?

**ఐర్లండ్‌లో దయ్యాల** మీద నమ్మకం అధికం. ప్రతీ ఊళ్ళోని ప్రతీ నాలుగో ఇంట్లో దయ్యాలు సంచరిస్తాయని చెప్పి పర్యాటకులని *డబ్లిన్ బై నైట్* అనే టూర్‌కి తీసుకెళ్ళి అలాంటి కొన్ని ఇళ్ళని అర్ధరాత్రి ఒంటిగంట దాకా చూపిస్తూంటారు. 1942లో జర్మన్స్ బాంబింగ్ చేసిన ఓ ఇంట్లో మరణించినవారు దయ్యాలై తిరుగుతున్నారని, తగలబడ్డ స్కూల్లో మరణించిన పిల్లలు చదివే పాఠాలు రాత్రుళ్ళు వినిపిస్తాయని, ఓ శవాన్ని పాతిపెట్టిన ఇంటి తోటలో రాత్రుళ్ళు తోట పని పరికరాల చప్పుళ్ళు వినిపిస్తాయని... ఇలాంటి ఎన్నో కథలని నేను విన్నాను.

నేను ఐర్లండ్‌లో పుట్టకపోయినా, మూడేళ్ళుగా అక్కడ జీవిస్తూండటంతో ఎన్నో దయ్యాల కథలని విన్నాను. స్కాట్‌లాండ్‌కి చెందిన నేను వాటిని కథలుగానే భావించాను తప్ప నిజమని ఎన్నడూ నమ్మలేదు.

నేను ఓ స్త్రీని చంపేదాకా, అంటే బ్రిడ్జెట్‌తో పరిచయం అయే దాకా దయ్యాలు ఉంటాయని నాకు తెలీదు. 'దయ్యాలు నిజంగా ఉన్నాయి, అన్ని దెయ్యాలు చెడ్డవి కావు, వాటిలో కొన్ని మంచివి కూడా ఉంటాయి' అనే నా అనుభవాన్ని మీతో పంచుకోడానికి జరిగింది జరిగినట్లు చెప్తున్నాను.

నేను ఓ స్త్రీని చంపానని చెప్పాను కదా? అందులో అనుమానం లేదు. ఆమె నా మీదకి బఠాణీల డబ్బాని విసిరి ఉండకపోతే ఆమె మరణించేది కాదు. సూపర్ మార్కెట్‌ని మూసేసే సమయంలో తమ పని గంటలు అవడంతో మిగిలిన కేషియర్లు, సిబ్బంది వెళ్ళిపోయారు. నేను ట్రాలీలో ఇంకా కొన్ని వస్తువులని వేసుకుంటూండటం ఎర్రటి యూనిఫాం లోని ఓ స్త్రీ గమనించింది.

"సర్! ఇంకాసేపట్లో సూపర్ మార్కెట్‌ని మూసేస్తాం. దయచేసి ఇంతవరకూ బిల్ చేయించుకోండి." ఆమె నా దగ్గరకి వచ్చి చెప్పింది.

నేను వెంటనే ఆమె చెప్పినట్లుగానే చెకిన్ కౌంటర్స్ వైపు నడిచాను. ఆఖరి నిమిషంలో షాపింగ్ చేసిన ఓ ఏడెనిమిది మంది కస్టమర్లు కౌంటర్ల ముందు నిలబడి

బిల్ చేయించుకుంటున్నారు. ఆఖరి కస్టమర్ కూడా బిల్‌ని చెల్లించి బయటకి వెళ్ళేదాకా నేను క్యూలో నించోకుండా నాకు కావాల్సినవి అక్కడ నించో వస్తువు, ఇక్కడ నించో వస్తువు తీసి నా ట్రాలీలో వేసుకోసాగాను. బబుల్ గమ్‌ని నమిలే ఆ కేషియర్ మాత్రం నా వంక నిర్లక్ష్యంగా చూస్తోంది. నేను ఆమె వైపు నడుస్తూ బయటకి చూసాను. ఎదురుగా విశాల ఆవరణలో నేను వచ్చిన కారు తప్ప ఇంకో కారు లేదు. అంటే నేను, ఆ ఇద్దరు ఉద్యోగస్థులు మాత్రమే సూపర్ మార్కెట్‌లో ఉన్నాం. ఇందాక నన్ను పలకరించిన ఎర్ర దుస్తుల్లోని నలభై ఏళ్ళ ఆమె వచ్చి నాతో చెప్పింది.

"దయచేసి త్వరగా మీ పని పూర్తి చేసుకోండి. కేషియర్ మీ కోసం ఎదురు చూస్తోంది."

నేను నా ట్రాలీని పక్కకి జరిపి జేబులోంచి పిస్తోలుని తీసి చెప్పాను.

"దయచేసి మీ దగ్గర ఉన్న నగదు మొత్తం నాకు ఇవ్వండి."

నా మాటలకి ఆ ఇద్దరు మహిళల్లో తక్షణ స్పందన ఏదీ లేదు. కాని కొద్ది క్షణాల తర్వాత మధ్య వయస్కురాలి మొహం చూసి ఏదో చెయ్యబోతోందని గ్రహించి వారించాను.

"సాహసం చేస్తే చావు తప్పదు."

నా హెచ్చరికని ఆమె పట్టించుకోలేదు. నా ట్రాలీ లోని బఠాణీల డబ్బాని అందుకుని నా మీదకి విసిరింది. అది వచ్చి అది నా కుడి ముంజేతిని తాకింది. తక్షణం నా ప్రమేయం లేకుండా నా కుడి చేతి చూపుడు వేలు ట్రిగర్‌ని నొక్కింది. ఆ మధ్య వయస్కురాలు వెంటనే నేలకూలింది. కేషియర్‌కి భయంతో స్పృహ తప్పింది. నేను అనుకోని ఈ పరిణామానికి చిన్నగా నిట్టూర్చి నా పిస్తోలుని మళ్ళీ జేబులో ఉంచుకుని బయట ఆగి ఉన్న నా కారు వైపు వేగంగా నడిచాను.

ట్రాఫిక్ పల్చగా ఉంది. నేను కార్లో సరాసరి హార్బర్ బ్రిడ్జ్‌కి చేరుకున్నాను. ఇంజన్ ఆఫ్ చేయకుండా నేను కారు దిగి ఆ బ్రిడ్జ్ రైలింగ్ మీంచి పిస్తోలుని సాధ్యమైనంత వేగంగా సముద్రం లోకి విసిరేసాను. తర్వాత నా పెట్టుడు గడ్డాన్ని, మీసాన్ని, విగ్‌ని కూడా. మళ్ళీ కారెక్కి మా ఇంటికి కొద్ది దూరంలో దాన్ని ఆపి మా ఇంటి అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌కి చేరుకున్నాను.

నాలుగో అంతస్థులోని నా అపార్ట్‌మెంట్‌లో నా కోటు, టోపీ, గ్లవ్స్‌ని విప్పదీసి ఓ పెగ్ విస్కీ తాగుతూ కూర్చున్నాను. నా కారు లైసెన్స్ నంబర్‌ని ఎవరైనా గమనించినా నాకు ఇబ్బంది లేదు. దాన్ని నేను దొంగిలించాను. కాని నా కారుని ఎవరైనా అనుసరించి

ఉంటారా? అకస్మాత్తుగా నాకు పోలీస్ కారు సైరన్ వినిపించింది. నేను ఏమైతే అది అవనీ అన్నట్లుగా లేవలేదు. కాని ఆ పోలీస్ పెట్రోల్ కారు ఆగకుండా మా అపార్ట్‌మెంట్ భవంతి పక్క నించి ముందుకు సాగింది. నాకు బాగా అలసటగా అనిపించింది.

హత్య చేయడం వల్ల మానసికంగా ఏర్పడ్డ అలసట అది. నేను దుస్తులు మార్చుకుని మర్ఫీ బెడ్‌ని గోడ లోంచి బయటకి లాగి దాని మీద పడుకున్నాను. నాకు త్వరగా నిద్ర పట్టదు అనుకున్నా కాని వెంటనే నిద్ర పట్టేసింది.

* * *

దూరంగా చర్చి బెల్ రెండు గంటలు కొట్టడంతో నాకు మెళకువ వచ్చింది. కళ్ళు తెరవక పోయినా నేనా గదిలో ఒంటరిగా లేనన్న భావన నాకు కలిగింది. దాంతో కళ్ళు తెరిచి చూసాను. ఎర్రటి దుస్తుల్లోని ఆమె నా కాళ్ళ దగ్గర నిలబడి నా వంక కోపంగా చూస్తోంది. ఆమెకి తగిలిన బుల్లెట్ గాయం, నెత్తుటి మరకలు నాకు కనిపించలేదు. అది పీడ కల అని భావించాను. ఆమె నా వంకే చూస్తూ చెప్పింది.

"నువ్వు ఆలివర్ విల్సన్‌వి. నా పేరు బ్రిడ్జెట్ ఓ కీఫ్. కొద్ది గంటల క్రితం నువ్వు నన్ను హత్య చేసావు. అవునా?"

"అవుననుకుంటాను." బలహీనంగా చెప్పాను.

"నీ గడ్డం, మీసాలు ఏమయ్యాయి?"

"అవి పెట్టుడివి."

"ఆలివర్. నువ్వు నన్ను హత్య చేసావు." ఆమె కఠినంగా చూస్తూ చెప్పింది.

"అది ప్రమాదవశాత్తు జరిగింది. నేను మీ సూపర్ మార్కెట్ లోకి వచ్చినప్పుడు ఎవర్నీ చంపాలన్న ఆలోచన నాకు లేదు."

"అలాంటప్పుడు గుళ్ళు నింపిన పిస్తోలుతో ఎందుకు వచ్చావు?"

"అది సైకాలజీకి సంబంధించినది. నా పిస్తోలు ఖాళీగా ఉంటే నేను చేసే పనిలో నాకు పూర్తి నమ్మకం ఉండదు."

"నేను మరణించాను. నువ్వు జీవించే ఉన్నావు. పైగా హత్యా నేరానికి పట్టుబడలేదు. నువ్వు పోలీసుల దగ్గరకి వెళ్ళి నీ నేరాన్ని అంగీకరించు. అలా దిద్దుబాటు చేసుకో."

నేను తల అడ్డంగా ఊపుతూ చెప్పాను.

"నాకు జైలు జీవితం చాలా కష్టంగా ఉంటుంది."

ఆమె క్రోధంగా నవ్వి చెప్పింది.

"అలా అయితే నువ్వు వాళ్ళకి లొంగేదాకా నిన్ను పట్టి పీడిస్తూంటాను. నువ్వు ఎక్కడికి వెళ్ళినా నేను నీ వెంటే ఉంటాను... నాలుగు దిక్కుల చివర్లకి పారిపోయినా సరే."

"మేడం. నేను బాగా అలసిపోయి ఉన్నాను. నాకు విశ్రాంతి కావాలి. నేను గాఢ నిద్ర పోబోతున్నాను. నువ్వు మాయమై పో."

నేను కళ్ళు మూసుకున్నాను. కొద్ది సేపటికి కుడి కన్ను ఓరగా తెరిచి చూస్తే ఏదో ఆలోచిస్తూ, ఏం చేయాలో తోచనట్లుగా ఆమె అక్కడే నిలబడి ఉండటం కనపడింది. మరో ఐదు నిమిషాల తర్వాత మళ్ళీ చూస్తే ఆమె లేదు.

* * *

మర్నాడు ఉదయం పది దాకా నేను గాఢ నిద్ర పోయాను. మళ్ళీ కళ్ళు తెరిచి చూస్తే నా కాళ్ళ దగ్గర కూర్చున్న బ్రిడ్జెట్ ఓ కీఫ్ నా లైబ్రరీ పుస్తకం అట్ట వంక దీక్షగా చూస్తూ కనిపించింది. అది పీడ కల కాదు అని తెలిసాక నాకు కొద్దిగా వణుకు పుట్టింది. నేను కలగనడం లేదు. ఊహిస్తున్నానా?

ఆమె వంక కాసేపు చూసి అడిగాను.

"ఆ పుస్తకం అట్ట వంక ఎందుకు చూస్తున్నావు?"

"నేను అట్ట వంక చూడటం లేదు. ఆ పుస్తకం చదువుతున్నాను. పేజీ నంబర్ నూట రెండులో ఉన్నాను. నేను పుస్తకాలని తెరవలేను. పేజీలని తిప్పలేను. కాని ఒకో పేజీలోది చదవగలను. వెనక వైపు పేజీలని కూడా."

"నువ్వు నన్ను పీడించడానికే వచ్చావా?" చిన్నగా నిట్టూర్చి అడిగాను.

"ముందుగా నన్నీ అధ్యాయం పూర్తి చేయనీ."

నేను బాత్ రూంలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాను. ఆమె నన్ను అనుసరించలేదు. కాలకృత్యాలు తీర్చుకుని, మొహం కడుక్కున్నాక నేను బెడ్ రూంలోకి వచ్చి మర్ఫీ బెడ్‌ని మళ్ళీ గోడలోకి నెట్టేసాను. బ్రిడ్జెట్ ఆ అధ్యాయాన్ని పూర్తి చేసి గది వంక చూసి అడిగింది.

"నువ్వు దొంగతనంలో ఎక్కువ సంపాదించినట్లు లేదు. లేకపోతే ఇలాంటి దరిద్రపు అపార్ట్‌మెంట్‌లో ఎందుకు అద్దెకి ఉంటావు?"

ఆమె కళ్ళు నా వెనక గల గోడలోంచి దూసుకుపోయినట్లుగా చూడసాగాయి.

"నువ్వు బయటే తింటావనుకుంటాను. సింక్‌లో అంట్ల గిన్నెలు లేవు?" ప్రశ్నించింది.

అది పీడకలలో లేక ఊహో కాని దానికి శుభం పలికే ప్రయత్నం చేసాను.

"మేడం. నేను మీ భర్తకి సంసార సుఖాన్ని పోగొట్టి ఉంటే అందుకు సారీ. తల్లి నించి పిల్లల్ని వేరు చేస్తే క్షంతవ్యుణ్ణి. కాని నేను పోలీస్‌లకి లొంగిపోదలచుకోలేదు. మీరు దయచేసి వెళ్ళండి."

"నాకున్న ఒకే బంధువు ఎడింబరో లోని నా అక్క కూతురు ఏనీ. నువ్వు బ్రేక్‌ఫాస్ట్ కోసం బయటకి వెళ్తున్నావు అనుకుంటా?" ఆమె అడిగింది.

"బ్రేక్‌ఫాస్ట్ చేసే టైం దాటింది కాబట్టి ఈ రోజు బ్రేక్‌ఫాస్ట్ చెయ్యను."

"అదేమిటి? బ్రేక్‌ఫాస్ట్ తప్పక తినాలి. దాని వల్ల రోజంతా చురుగ్గా ఉంటావు."

నేను  నేను కోటు, టోపి, గ్లవ్స్‌లని ధరించి, నా అపార్ట్‌మెంట్ లోని లైబ్రరీ పుస్తకాలన్నీ వెదికి తీసుకున్నాను. ఆ ఆరూ మిస్టరీ నవలలే.

"ఎక్కడికి వెళ్తున్నావు?" ఆమె అడిగింది.

"లైబ్రరీలో ఈ పుస్తకాలని తిరిగి ఇవ్వడానికి."

ఆమె వాటి వంక చూసి ప్రశ్నించింది.

"ఎంత దాకా చదివావో గుర్తుంచుకోడానికి నువ్వు పేజీల మధ్య కాగితం ముక్కలని ఉంచుతూంటావా?"

"అవును."

"అంటే నువ్వు ఈ పుస్తకాల్లో దేన్నీ పూర్తిగా చదవలేదు. మరెందుకు ఇచ్చేస్తున్నావు?"

"వీటిని ఇవ్వాల్సిన తారీకు దాటిపోయింది కనుక."

"అబద్ధం. వాటిని పదహారో తారీకు ఇవ్వాలి. ఇవాళ పధ్నాలుగే."

"మేడం. నేను ఏ విషయంలోనూ ఆఖరి నిమిషం దాకా ఆగను. అంతేకాక ఈ నవలలు చాలా విసుగ్గా ఉన్నాయి. కాబట్టి వీటిని పూర్తి చేయదలచుకోలేదు."

నేను అపార్ట్‌మెంట్ తలుపుని మూస్తూంటే బ్రిడ్జెట్ నన్ను అనుసరించింది.

"బయట చాలా చల్లగా ఉంది. మీ ఎర్ర కాటన్ యూనిఫాం చలిని ఆపలేదు."

"నాకు వాతావరణం గురించిన బాధ  ఉండదు. నువ్వు తప్ప నన్నెవరూ చూడలేరు. నా మాటలు వినలేరు. కాబట్టి నేను నీ పక్కన ఉన్నందుకు నువ్వు ఇబ్బంది పడద్దు."

మేము సమీపంలోని లైబ్రరీకి నడిచి వెళ్తూంటే చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తం, పశ్చాత్తాపం, దిద్దుబాటు గురించి, ముఖ్యంగా తన హత్య గురించి  బ్రిడ్జెట్ ప్రవచనం చెప్పసాగింది. లైబ్రరీలో నేను పుస్తకాలు ఇచ్చేసి బయటకి వెళ్తూంటే బ్రిడ్జెట్ అడిగింది.

"నువ్వు కొత్త పుస్తకాలని తీసుకోలేదే? లైబ్రరీలో రెండు షెల్ఫ్‌ల నిండా కొత్తగా వచ్చిన మిస్టరీ నవలలు చాలా ఉన్నాయి."

"వాటిని నేను నిశ్శబ్దంగా, ప్రశాంతంగా చదివే అవకాశం నువ్వు నాకు ఇవ్వవని."

నాలో నేను మాట్లాడుకోవడం గమనించి లైబ్రేరియన్ నా వంక నివ్వెరపోతూ చూసింది. నేను ఆ భవంతి లోంచి బయటకి వెళ్తూంటే బ్రిడ్జెట్ నన్ను అనుసరించింది.

"చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తం గురించి ఇందాక నీతో చెప్పాను." ఆమె చెప్పింది.

నేను దీర్ఘంగా నిట్టూర్చాను.

"నేను రక్తమాంసాలు కల శరీర ధారిని కాదు. కాబట్టి ఎవర్నీ గొంతు పిసికి చంపలేను. మెట్ల మీంచో, కొండ శిఖరం మీంచో తోసి చంపలేను. నాకున్న ఏకైక ఆయుధం ఒక్కటే. నా కంఠం. దాన్ని ఉపయోగించ దలచుకున్నాను. నీకు పిచ్చెక్కే దాకా లేదా పోలీస్ స్టేషన్‌కి వెళ్ళే దాకా నువ్వు నాతో ఇలా మాట్లాడుతూనే ఉంటాను."

"అది మాట్లాడటం కాదు. పీడించడం. సతాయించడం."

"నేను చేయబోయేది సరిగ్గా అదే. అలా నీకు పిచ్చెక్కినట్లుగా చేయడమే నా లక్ష్యం."

వాతావరణం బావుండటంతో, నా అపార్ట్‌మెంట్‌లో కాలక్షేపానికి ఏదీ లేకపోవడంతో నేను చాలా దూరం నడవ దలిచాను. ఓ సిటీ పార్క్ లోకి బ్రిడ్జెట్ నన్ను అనుసరించి మనస్సాక్షి గురించి, ఎవరి చర్యలకి వారు బాధ్యత వహించడం గురించి, దిద్దుబాటు గురించి ఉపన్యాసం చెప్పింది.

* * *

మర్నాడు మధ్యాహ్నానికల్లా నాకు బ్రిడ్జెట్ వయసు నలభై ఒకటి అని, ఏకైక సంతానం అని, తన తల్లి తండ్రులని తనే చూసుకునేదని, ఆమె తండ్రి ఏడేళ్ళ క్రితం, తల్లి ఏడాది క్రితం పోయారని, ఆ సూపర్ మార్కెట్‌లో ఆమె ఇరవై రెండేళ్ళుగా పని చేస్తోందని, గత ఏడేళ్ళుగా అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తూ ఆర్నెల్ల క్రితమే మేనేజర్‌గా ప్రమోషన్ పొందిందని తెలిసింది. ఆ కంపెనీనే ఆమెకి ఎర్రటి జాకెట్‌ని ఇచ్చింది. దొంగతనం ఆపాలని ఆ బఠాణీల డబ్బాని నా మీదకి విసిరేసింది.

మేము మధ్యాహ్నం రెండుకి నా అపార్ట్‌మెంట్‌కి చేరుకున్నాము. నేను ఓ పాత దినపత్రికని తీసుకుని చదువుతున్నట్లు నటిస్తూంటే ఆమె మాట్లాడుతూనే ఉంది. చిరాకేసి నేను ఆమె వంక చూస్తూ అడిగాను.

"నేను నిజంగా పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి గత రాత్రి నిన్ను చంపానని చెప్తే ఏం జరగచ్చని ఊహిస్తున్నావా?"

"నిన్ను అరెస్ట్ చేస్తారు."

"కాని నేను నిన్ను చంపానని వాళ్ళు కోర్ట్‌లో ఋజువు చేయలేరుగా?"

"వాళ్ళకి ఋజువేం కావాలి? నువ్వే నేరం ఒప్పుకుంటున్నావుగా?"

"అదొక్కటే సరిపోదు. మన ఊళ్ళో ఓ హత్య జరిగాక మానసిక జాడ్యం కారణంగా దాదాపు అరడజను మంది పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి తామే ఆ పని చేసామని చెప్తూంటారు. ఇప్పటికే కొందరు ఆ పని చేసి ఉన్నా నాకు ఆశ్చర్యం కలగదు."

"ఎల్లీ నిన్ను గుర్తుపడుతుంది. ఆ సమయంలో ఆమె చెకౌట్ కౌంటర్లో ఉంది."

"కాని నేను మారువేషంలో ఉన్నాను."

"నీ పిస్తోలుని పోలీసులకి ఇస్తే అది ఋజువు అవుతుందిగా? దాన్ని ఇంకోసారి పేల్చి రెండు గుళ్ళని పోల్చి చూస్తారు." ఆలోచించి సూచించింది.

"దురదుష్టవశాత్తు నేనా ఆయుధాన్ని సముద్రంలోకి గిరాట్టేసాను. బహుశ అది నీళ్ళల్లో అరవై అడుగుల లోతున బురదలో కూరుకుపోయి ఉంటుంది. నా మాట నమ్మి వాళ్ళు దాని కోసం వెదికే ప్రయత్నం చేస్తారనుకోను."

"నీ ట్రాలీ మీద, అందులో నువ్వు వేసిన సామాను మీద నీ వేలిముద్రలు పోలీసులకి లభించి ఉంటాయి కదా?"

"నేను పట్టుబడకూడదని గ్లవ్స్ ధరించాను."

"నీకు పోలీసులు లై డిటెక్టర్ టెస్ట్‌ని చేయచ్చుగా?" ఆమె ఆలోచించి చెప్పింది.

"వాళ్ళకి గట్టి అనుమానం కలిగితే తప్ప లై డిటెక్టర్ పరీక్షని ఎవరికీ నిర్వహించరు."

"నువ్వు అన్నిటికీ అన్నీ చెప్తున్నావు. జైల్‌కి వెళ్ళే మార్గం ఏదైనా ఆలోచిస్తే నీకే తడుతుంది."

బ్రిడ్జెట్ ఎన్ని విఘ్నాలు ఎదురైనా పట్టుదలగా నేను పట్టుపడే విషయంలో ఏదైనా చేయడం మీద లెక్చర్ ఇవ్వసాగింది. చివరకి అది ఆమె ఏడాది క్రితం దర్శించిన లండన్ నగర ట్రిప్ మీదకి మళ్ళింది. మృదువైన ఆమె కంఠ ధ్వనికి నాకు నిద్ర పట్టింది. మెళకువ వచ్చాక నేను లేచి చూసేసరికి బ్రిడ్జెట్ లేదు. నేను డ్రస్ చేసుకుని కోటు, హేట్ ధరించి ఆమె వచ్చే లోగా అపార్ట్‌మెంట్ లోంచి బయటకి వచ్చాను. చాలా దూరం నడిచి హార్బర్ బ్రిడ్జ్‌కి చేరుకున్నాను. నా జేబులో మిగిలి ఉన్న ఆఖరి మూడు పెన్నీలని తీసాను.

వాటితో ఈ రోజుల్లో ఏదీ కొనలేం. వాటిని సముద్రంలోకి విసిరేసాను. నా కోట్‌ని విప్పి నాలుగు మడతలు వేసి కింద ఉంచాను. టోపీని కూడా తీసి కోట్ కింద ఉంచాను. ఎదురుగా సముద్రం బదులు చీకటి కనిపిస్తోంది. నేను రైలింగ్ మీదకి సగం ఎక్కాక బ్రిడ్జెట్ కంఠం కఠినంగా వినిపించింది.

"ఆలివర్! నువ్వేం చేయబోతున్నావో నాకు అర్థమైంది. దిగి నీ కోటు ధరించి టోపీని పెట్టుకో."

"పేదరికంతో నేను జీవించలేను. నేను చేసిన మొదటి దొంగతనం ప్రయత్నం నీ వల్ల బెడిసికొట్టింది." నేను కోపంగా చెప్పాను.

"ఐ యాం సారీ. కాని నువ్వు నా వెంట రావాలి." బ్రిడ్జెట్ అర్థించింది.

* * *

మేమిద్దరం సూపర్ మార్కెట్‌లోకి వెళ్ళేసరికి ఎనిమిది నలభై అయింది. నేను ఎక్కడ దాక్కోవచ్చో బ్రిడ్జెట్ నాకు చూపించింది. రాత్రి తొమ్మిదిన్నరకి అక్కడ సిబ్బంది ఎవరూ లేరని చెప్పి బ్రిడ్జెట్ నన్ను మేనేజర్ గదిలోని ఐరన్ సేఫ్ దగ్గరకి తీసుకెళ్ళింది.

"నిన్ను పీడించాలని అనుకునే ముందు నీ గురించి నేను కొంత తెలుసుకుని ఉండాల్సింది. నీ డబ్బుని దొంగిలించి నీ అక్క కోస్టారికా పారిపోయింది. నీకు ఉద్యోగం చేసే నైపుణ్యం లేదు. బిచ్చం ఎత్తుకునేందుకు నీ అభిజాత్యం అడ్డొస్తోంది. అందుకని నువ్వు దొంగతనం చేద్దామని అనుకున్నావు. లైబ్రరీ పుస్తకాలు చదవకుండా తిరిగి ఇస్తున్నప్పుడే నువ్వేం చేయదలచుకున్నావో నేను గ్రహించాల్సింది. ఐరన్ సేఫ్ కాంబినేషన్ నంబర్ చెప్తా విను."

మేము సూపర్ మార్కెట్‌లోంచి బయటకి వచ్చేప్పుడు నా దగ్గర ఓ నెలకి సరిపడే పచారి సామాను, నా జేబుల నిండా డబ్బు ఉన్నాయి.

"నువ్వు నా అపార్ట్‌మెంట్ లోకి మారు. అప్పుడు అద్దె బాధ తప్పుతుంది. కాని నా విల్లు ప్రకారం ఆ అపార్ట్ మెంట్ నా తర్వాత నా అక్క కూతురు ఏనీకి చెందుతుంది. ఆమె నీకు చక్కని జోడి. మీ ఇద్దరికీ పెళ్ళయితే నీకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది ఉండదు. నా ఆస్థి, ఆమె ఆస్థితో మీ ఇద్దరూ హాయిగా జీవించచ్చు. ఏనీతో నువ్వు డేటింగ్ చెయ్. ఆమెని ఎలా ఆకట్టుకోవాలో నేను నీకు చెప్తాను... ముందు అన్నం తిను. మంచి ఆకలి మీద ఉన్నావు."

"ఏనీకి నువ్వు నా మీద మంచి ఇంప్రెషన్ కలిగేలా ఏదైనా చెప్పచ్చుగా?"

బ్రిడ్జెట్ చిన్నగా నవ్వి చెప్పింది.

"ఎవరి మీద పగో వారికి మాత్రమే నేను కనపడగలను. వినపడగలను. నీ మీద ద్వేషం పోయి సానుభూతి ఏర్పడింది కాబట్టి నీకు నేను ఇక కనపడకపోవచ్చు కూడా."

చాలా సేపు బ్రిడ్జెట్ ఏనీని నేను ఎలా ఆకట్టుకోవాలో చెప్తూనే ఉంది. ఆ తర్వాత ఆమె మళ్ళీ నాకు కనపడలేదు.

నాలుగు నెలల తర్వాత జరిగిన మా పెళ్ళిని ఆమె అదృశ్యంగా చూసి ఉంటుందనే నేను ఆశిస్తాను.

బ్రిడ్జెట్ కోరుకున్నట్లుగా చివరకి దిద్దుబాటు జరిగింది.

**మీ ఇంటికే మల్లాది రచనలు తెప్పించుకోండి**

చాలామంది పాఠకులు తమ ఊళ్ళో లిపి ప్రచురణలు లభ్యం కావడం లేదని ఫోన్స్ చేస్తున్నారు. మీ పుస్తకాల షాపు వారు మీకు కావాల్సిన మల్లాది రచనలని తెప్పించకపోతే, మమ్మల్ని ఈ కింది ఫోన్ నంబర్‌కి ఫోన్ చేసి/వాట్స్‌యాప్ ద్వారా సంప్రదించండి. వాటి ధరని యం ఓ చేసినా లేదా ఆన్ లైన్ బేంకింగ్ చెల్లింపు జరిపినా, వాటిని రిజిస్టర్డ్ బుక్ పోస్ట్‌లో మీ చిరునామాకి పంపగలం.

లిపి పబ్లికేషన్స్, గాంధి నగర్, హైద్రాబాద్ 500 080

**98490 22344**

## స్టాక్‌లో ఉన్న **మల్లాది వెంకట కృష్ణమూర్తి** రచనలు

| | | | |
|---|---|---|---|
| **ఆధ్యాత్మిక రచనలు** | **రూ.** | 12. అందమైన జీవితం | 120 |
| 1. ఆరాధన | 100 | 13. నత్తలొస్తున్నాయి... | 110 |
| 2. ప్రేరణ | 100 | | |
| 3. భజగోవిందం | 120 | **కథలు** | |
| 4. ఓ మై గాడ్ | 120 | 14. మినీ క్రైమ్ కథలు | 120 |
| 5. ఆధ్యాత్మిక చిన్న కథలు | 70 | 15. పరాయి సిరా | 120 |
| | | 16. మర్డర్ స్టోరీస్ | 120 |
| **ఆధ్యాత్మిక నవలలు** | | | |
| 6. పరంజ్యోతి | 120 | **ఇతరాలు** | |
| 7. విధాత | 120 | 17. అమెరికాలో మరోసారి | 150 |
| **సాంఘిక నవలలు** | | 18. ట్రావెలాగ్ | |
| 8. పున్నమి | 110 | ఈస్టర్న్ యూరప్ | 150 |
| 9. నిన్నటి పున్నమి | 100 | 19. టిఫిన్ వెరైటీస్ | 30 |
| 10. రేపటి కొడుకు | 50 | 20. వంటల పుస్తకం | 30 |
| 11. మిసెస్ పరాంకుశం | 50 | 21. జరిగిన కథ | 120 |

**ఇంకా...**

**మన్మథ బాణాలు (అనువాద కథల సంపుటి) రూ. 125/-**

**హార్ట్ టచింగ్ స్టోరీస్ (అనువాద కథల సంపుటి) రూ. 125/-**

**దొంగాట (నవల-మలి ముద్రణ) రూ. 160/-**

పై జాబితాలో కావాల్సిన పుస్తకాలకి మనీ ఆర్డర్/ బేంక్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పైకం పంపితే, మా ఖర్చుతో రిజిస్టర్డ్ బుక్ పోస్ట్ ద్వారా కోరినవి పంపుతాం.. వివరాలకి ఈ కింది సెల్ నంబర్‌కి ఫోన్ చేయండి.

**Lipi Publications**

**Gandhi Nagar, Hyderabad - 500 080**

Cell Number / Whatsapp **98490 22344**